C

జూడీ-లక్ష్మీ

నయోమీ మిచిసన్

నేషనల్ బుక్ ట్రస్ట్ పుస్తకము

C1

YDRO1C363

౧

నేషనల్ బుక్ ట్రస్ట్ పుస్తకము

జూడీ - లక్ష్మి

నయోమీ మిచిసన్

అనువాదము :

వేమరాజు భానుమూర్తి

భారత ప్రభుత్వం
సమాచార, రేడియో మంత్రిత్వ శాఖ
ప్రచురణ విభాగము

ఆగస్టు 1962 (శ్రావణ 1884)
August 1962 (Sravana 1884)

(Published by arrangement with the Author)

రూ. 1.50 లు
Rs. 1.50 nP.

JUDY AND LAKSHMI
by
Naomi Mitchison
(Telugu)

© Naomi Mitchison, 1959

PUBLISHED BY THE DIRECTOR, PUBLICATIONS DIVISION, DELHI-6
AND PRINTED AT SRI VENKATESWARA PRESS, BOSE ROAD, TENALI

నా మనుమలకు, వారి మిత్రులకు,
మద్రాసులో మా ఇరుగు పొరుగువారికి,
ముఖ్యంగా "పాపు"
(అలమేలు సంజీవి)కి

V

విషయసూచిక

1.	మద్రాసులో జూడి	....	....	1
2.	కంచెలో కంత	....	....	13
3.	వటవిటపి నీడలో	....	....	27
4.	స్వాతంత్ర్యదినం	....	....	44
5.	కంజీవరం	....	....	55
6.	దీపావళి	....	....	65
7.	వానలు	....	....	74
8.	వరదలు	....	....	85
9.	జాతీయాభివృద్ధి విస్తరణ ప్రణాళికలు		....	95
10.	పొన్నేరిలో లక్ష్మి	....	....	108
11.	జూడీ - లక్ష్మి	....	....	115
12.	క్రిస్మసు - సంక్రాంతి	....	....	127
13.	ఉత్తరాది	....	....	138
14.	వీడ్కోలుకాదు	....	....	150

1. మద్రాసులో జూడీ.

రాత్రి అంతా ఇలకోళ్ల రొద చిరుగంటల సవ్వడివలె ఎడతెగకుండా వినబడుతూనేవుంది. జూడీగనుక ఆ నిశిరాత్రివేళ మేల్కొని, పరచుకోవడానికి చల్లని దుప్పటికోసం ప్రక్కకు తిరిగినట్టయితే కిటికీకి కట్టిన దోమతెర తెరలోనుంచి మసక మసకగా కనిపించే ఆ దృశ్యాన్ని చూసి ఉండేదే. ముఖ్యంగా ఆ పెద్ద కిటికీ తెరలోనుంచి, పగలు ఎర్రగా రక్తపు ముద్దవలెనూ, రాత్రిపూట నల్లనల్లగానూ కనుపించే బోగన్ విల్లా పూలగుత్తులను తప్పకుండా చూసి ఉండేది. ఇలకోళ్ళు కూస్తూనే ఉన్నాయి. అడపాదడపా ఎక్కడో ఒకచోట, ఏదోఒక కుక్క మొరుగుతూనే ఉంది. మధ్యమధ్య ఇళ్ళకు కాపలాకాసే గూర్ఖా దొంగలనూ, బహుశా పాములనూ బెదరగొట్టడం కోసం ఇనుప పొన్ను బిగించిన దుడ్డుకర్రతో నేలను తట్టుతూ, టకటకమని చప్పుడు చేసుకుంటూ గస్తీ తిరుగుతున్నాడు. ఇంతలో తెల్లవార వచ్చింది. నక్షత్రాలు వెలవెలపోతుండగా దిక్కులు తెలతెల వారుతున్నాయి. కాకులు లేచి కావుకావుమంటూ ఈ చెట్టుమీదనుంచి ఆ చెట్టుమీదకు, ఆ చెట్టుమీద నుంచి దీనిమీదకు, ఆ కొమ్మనుంచి ఈ కొమ్మమీదకువచ్చి వాలుతున్నాయి. ఆ వెనుక మైనాలు వచ్చాయి. ఒక్కొక్కసారి వాటికంటె అందమైన పక్షులుకూడా వస్తూవుంటాయి. ఇంతలో తెల్లగా తెల్లవారింది.

ఆ తరువాత ఇంకొక గంటకుగాని జూడీ లేవలేదు. లేచి "అబ్బ, ఈ పొద్దున ఎంత బాగాఉంది" అని తనలో తాను అనుకుంది. అదే కనుక ఇంగ్లండులో అయితే ఆ పొద్దు నిజంగానే ఆహ్లాదకరంగా ఉండేది. కాని ఇది ఇంగ్లండు కాదుగా! ఇది మరి మద్రాసు. ఇక్కడ రోజంతా వేడిగాల్పులు వీస్తూనే ఉంటాయి. ఉక్క తెకతెక లాడిస్తుంది. పాపం

జూడీ రొప్పుకుంటూ, చెమటలు కక్కుకుంటూ బడికి వెళ్ళుతుంది. ఎండకూ, ఉక్కకూ తట్టుకోలేక మధ్యాహ్నంపూట కునుకుపాట్లు పడుతూ ఉంటుంది. అందుకోసమే ఇంటి దగ్గర చేయవలసినదని చెప్పిన లెక్కలు వగైరా అభ్యాసవ్యాసంగం అంతా పొద్దునే చల్లబాటునచేసి ముగించుకుంటుంది. సాయంత్రంపూట బడినుంచి బాగా అలసిపోయి వస్తుందికదా, అందుకని. అయితే బెన్ మాత్రం అప్పుడప్పుడు అడ్డం వస్తూనే వుంటాడు. వాణ్ణి ఆయా అదుపులో పెట్టనేలేదు. పెట్టనేలేదు అనడంకంటె పెట్టదు అనడమే సమంజసం. బెన్‌కు వడసారం మూడేళ్ళు నిండలేదు. అయితేనేమి, వాడు ఆయా మేరీని చెవులుపట్టుకుని ఆడిస్తాడు. వాడు ఏంచేయమంటే అది చేసేస్తుంది. వాడు వట్టి అల్లరి పిల్లవాడు. ఎప్పుడూ ఏదో కొంటెపనులే చేస్తుంటాడు. ఒక్కొక్క రోజున పొద్దున్నే లేచి జూడీ ఇంగ్లండులో చదువుకుంటున్న తమ పెద్ద అన్న జాన్‌కు ఉత్తరం వ్రాస్తూ వుంటుంది. జాన్‌కూడా చెల్లెలికి తరచు ఉత్తరాలు వ్రాస్తూనే వుంటాడు. కాళ్ళు, చేతులు, కొంకర్లుపోయే చలిగాలిలో తను కాలిబంతి ఎలా ఆడవలసి వచ్చిందో, ఎప్పుడూ మరొక ఉన్ని బనీను తొడుక్కొని ఎలా తిరగవలసి వస్తోందో వ్రాసేవాడు. వాడి ఉత్తరాలనిండా ఇలాంటి విషయాలే చాలా వుండేవి. అవి అన్నీ చాలా అసంబద్ధమైనవిగా కనబడేవి. జూడీ వాళ్ళ నాన్నగారు వైద్యం చేసేవారు. వాళ్ళ అమ్మ ఏవేవో సంఘ సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొనేది. ఆ పని అంతా ఏదో దుఃఖగాథను తలపింపచేస్తూ ఉండేది. వాళ్ళనాన్నగారు రోజూ పెందలాడే ఆస్పత్రికి వెళ్ళేవారు. వాళ్ళ అమ్మ జూడీని వెంటబెట్టుకొని వెళ్ళి బడిలో దిగబెట్టి, అక్కడనుంచి తాను పనిచేసే సంక్షేమకేంద్రానికి వెళ్ళేది. జబ్బులను గురించీ, మందు మాకులను గురించీ, చాలా కబుర్లు వద్దన్నా, జూడీ చెవిలో పడుతూనే

ఉండేవి. ఒక్కొక్కసారి వాటిని విని ఎంతో చింతించేది కూడాను. మిగతా వేళల్లో దాని ధ్యాస అంతా బడినిగురించే.

సాధారణంగా వాళ్ళు బడి వదలిన తరువాత క్లబ్బుకు వెళ్ళి అక్కడ కొలనులో ఈతలాడేవారు. జూడీకి మునగడం, ఈదడం చాలా చేతనైంది. బెన్ మాత్రం నవ్వుతూ, కేరింతాలాడుతూ, కాళ్ళు చేతులు తపతపలాడిస్తూ చేపలా ఈదేవాడు. మూడేళ్ల వయస్సులో జూడీకి ఈతరానేరాదు. ఆ వయస్సప్పుడు ఇంగ్లండులో ఉండేది. అక్కడ అసహ్యంగా ఉండే ఒక చిన్న నీళ్ళగుంట ఇంట్లోనే ఉండేది. తప్పితే వేసవి సెలవులలో అలలతో అస్తమానం అల్లకల్లోలంగా ఉండే సముద్రంలోనైనా ఈదవలసి వచ్చేది. అంతేకాని చుట్టూ పెద్దపెద్ద చెట్లతో అందంగా ఉండే ఈతకొలను ఏమీ ఉండేది కాదు. నీలాకాశం క్రింద పైకి ముత్యాల జల్లులను ఎగజిమ్మే జలధారలూ ఉండేవి కాదు. నిమ్మకాయరసం పిండిన వేపుడు ముక్కలూ ఉండేవికావు. స్నానంచేసి తడి ఆర్పుకుంటూ, హాయిగా కూర్చొనే సమయంలో నోరారా తినడానికి మంచుగడ్డలూ అందుబాటులో ఉండేవికావు.

ఒక్కొక్కసారి వాళ్ళంతా మద్రాసులో ఇలియట్స్ బీచికివెళ్లేవారు. అక్కడ సముద్రం ఒడ్డున వాళ్ళకో తాటాకులతో వేసిన పర్ణశాల ఉండేది. అయితేనేం వేసవిలో ఎండకు ఇసుక బాగా కాలి చుర్రుమంటూ ఉండేది. కాలు నేలమోపితే బొబ్బలెక్కిపోయేవి. అక్కడ మంచు దొరకదు కాని తియ్యగా, రుచిగా, తాపోపశమనంగా ఉండే లేత కొబ్బరి నీళ్ళు, పాలమీగడవంటి లేతకొబ్బరీ చాలా దొరికేవి. కొబ్బరి బొండాలు చూడడానికి ఎరుపుడాలు తిరిగిన బంగారపు ముద్దలవలె ఉండేవి. ఇవి ఇంగ్లండులో దొరికే ముసురు గోధుమ

రంగు మోటు కొబ్బరికాయలకంటె భిన్నమైనవి. నిజమే మరి. భారతీయులకు, ఆంగ్లేయులకు పైకి చూడడానికి ఎంత తేడా ఉంటుంది!

భారతీయులకూ, ఆంగ్లేయులకూ నిజంగానే ఎందునా పోలిక లేదని జూడీ అప్పుడప్పుడు అనుకుంటూ ఉండేది. తనబడిలో తన సహాధ్యాయులలో చాలామంది భారతీయ బాలికలే. అయితే వారితో మాట్లాడడం ఆమెకు అంత సులభమైన పనిగా అనిపించేదికాదు. వారిలో కొంతమందికి కేవలం సినిమాతారలంటే ఎంతో మోజు. లేదా జూడీకి నచ్చని కబుర్లేవో ఎంతో ముచ్చటగా చెప్పుకునేవారు. అందుచేత జూడీ వారి సంభాషణములలో పాల్గొనేదేలేదు. ఒక్కొక్కసారి వాళ్ళు ఎవరి ఇంట్లోనో పెళ్ళిగురించి మాట్లాడుకునేవారు. ఇదంతా వట్టి పోచుకోలు ఊకదంపు బాతాకాని అని జూడీ భావించేది. ఇంతకీ వాళ్ళందరికీ జాతకాలంటే ఇంత పట్టింపు దేనికో జూడీకి అర్థమయ్యేదే కాదు. ఇంతకు మరొకరి ప్రమేయం లేకుండా తనమేనత్త మార్గరెట్ వలె వాళ్ళు తమలో తాము పెళ్ళి ఎందుకు చేసికోలేరు? ఈ మధ్య పొరుగువారి ఇంట్లో పెళ్ళి అయినప్పుడు రెండు జట్లు, రెండు రాత్రిళ్లు వరసగా తెరపిలేకుండా ఏవేవో వాయిద్యాలు వాయిస్తూనే ఉన్నారు. వెధవది. అప్పుడు పరీక్షలు జరుగుతున్నాయికూడాను! అనుకునేది జూడీ.

బడిలో కొన్ని సంగతులు జూడీకి అసలు అర్థమయ్యేవేకాదు. అందులో ఒకటి నిర్బంధంగా హిందీ నేర్చుకోవడం. మొదట్లో హిందీని ఎందుకు నేర్చుకోవాలో వివరిస్తూ ఉపాధ్యాయుడు పెద్ద ఉపన్యాస మిచ్చారు. "భారతావని అంతా ఒకటే దేశం. దేశమంతకూ ఒకే భాష ఉండటం అవసరం. పైగా ఇంగ్లీషు విదేశభాష కనుక దానికి మన దేశంలో స్థానంలేదు. దీనిని ఎవ్వరూ కాదనలేరు. రాదు. హిందీ అధి

కొర భాష. దానికి తల్లి సంస్కృతభాష. ఈ సంస్కృతం అతి ప్రాచీనభాష. మన వేదాలూ, స్మృతులూ, సర్వ పురాణ వాఙ్మయమంతా సంస్కృతభాషలోనే ఉంది. భారతీయ సంస్కృతికీ, నాగరికతకూ ఈ పురాణవాఙ్మయమే పెన్నిధానం. భారతదేశ చరిత్రనూ, జీవన విధానాన్ని, ఆలోచనా రీతులను అర్థంచేసుకోవాలంటే మీరు హిందీని నేర్చుకోవాలి''. ఇది ఆయన ప్రసంగ సారాంశం. అయితే మద్రాసులో ఎవ్వరూ సాధారణంగా హిందీలో మాట్లాడుకోరు. వాళ్ళంతా ఎప్పుడూ అరవంలోనే మాట్లాడుకుంటూ ఉంటారు. అలాగే బళ్లోపిల్లలందరూ అరవంలోనే మాట్లాడుకుంటూ ఉంటారు. ఆడుకునేటప్పుడు అరవమే మాట్లాడు కుంటారు. జూడీకి కూడా కొంచెం అరవం అబ్బింది. అదైనా అంతబాగా రాలేదు. నిజానికి ఆ హిందీకంటె ఈ అరవమే ఆ పిల్లకు బాగా వచ్చేది. కాని హిందీని ఎందుకుబోధిస్తున్నారో దానికి అర్థమైనట్లే ఉంది.

ఇంట్లో పనివాళ్ళతో వచ్చీరాని అరవమే మాట్లాడేది. మా ఇంట్లో వంటకూ వడ్డనకూ జార్జి అనే పనివాడున్నాడు. వీడికి నల్లటి బొద్దుమీసాలు ఉండేవి. తనకి ఇంగ్లీషు బాగా వచ్చునని, చక్కగా మాట్లాడ గలనని వాడికో అహంభావం. అయితే చాలాసార్లు వాడు చెప్పదలచుకున్న దేమిటో ఎంతసేపు విన్నా ఏమీ అర్థమయ్యేదికాదు. పైగా మనం చెప్పేదేమిటో వాడు అర్థం చేసుకోదలచనప్పుడు వాడితో మాట్లాడ్డి ఏం ప్రయోజనం? మా ఇంట్లో వాడికి సాయం మరో పని మనిషి ఉంది. ఇది బట్టలు ఉతుకుతుంది. చూడ చక్కనిది. చెవులకు చక్రాలు కుట్టించుకుంది. ముక్కులకు రాళ్ళ పుడకలు పెట్టుకునేది. మొత్తానికి ఇవన్నీ పెట్టుకున్నప్పుడు ఇంకా అందంగా ఉండేది. వాళ్ళిద్దరూ కాకమరొక తోటమాలికూడా ఉన్నాడు. తోటంతా తుడిచి బాగు

చేయడం, రాలిన ఎండుటాకులను పండుటాకులను ఎత్తి పారబోయడం, మొక్కలకు నీరుపోయడం, కుండీలలో రకరకాల మొక్కలు పెంచడం వీడివంతు. వీడు పెద్దపెద్ద సూర్యకాంతపు పువ్వులనీ, బంతిపూలనీ చక్కగా పూయించేవాడు. చంద్రకాంతపు మొక్కలనీ ఎర్ర కలువలనీ, నీలి గోరింటలనీ, కనకాంబరాలనీ, ముద్ద మందారాలను చక్కగా పూయించేవాడు; గోబీ పువ్వులనూ, బెండకాయలనూ, గుమ్మడికాయలనూ, బూడిద గుమ్మడికాయలనూ, ఆనపకాయలనూ, పొట్లకాయలను, చిక్కుళ్ళనూ, బీరకాయలనూ, దొడ్డిలోనే కాపించే వాడు. వాడి చేతిమీదుగా మొక్క పెడితే ఏపుగా ఎదిగేది. తమ తోటకూ, పొరుగు ఇంటికీ మధ్య సరిహద్దు పొడుగునా వాడు అనేక రంగుల గోరింట మొక్కల వరసలను పెంచాడు. అవి ఎర్రవీ, నీలంవీ, పచ్చవీ అనేక రంగులలో పూలుపూసేవి. వాటికీ, పెళ్ళివారింటికీ మధ్య సున్నంతో కట్టిన గోడ అడ్డం. వాటిని మధ్య రెండో వైపున అక్షింతల పువ్వుల మొక్కలకంచె ఉంది. ఒత్తుగా దట్టంగా పెరిగిన ఆ కంచె మీద పచ్చని అక్షింతల పువ్వులు దట్టంగా పూసేవి. మత్తుగా గుప్పున వాసన కొట్టేవి. తోటలో ఇవికాక ఒక మామిడి మొక్క, బాదంచెట్టు మరికొన్ని గుబురు మొక్కలుకూడా ఉన్నాయి. ఆతోట అంతలోనూ చేమంతి పూల మొక్కలంటే మాలికి ప్రాణం. మద్రాసులో వాటినీ పెంచడం కష్టం. కాని అవి లేకపోతే తోటకు నిండుతనం ఉండదు!!

జూడీ అప్పుడప్పుడు తోటమాలికి సాయంచేసేది. ముఖ్యంగా మొక్కలకు నీళ్లుపెట్టేది. మాలి వానలు కురుస్తున్న పుడుతప్ప ప్రతిరోజు మొక్కలకు నీళ్లు పోయవలసిఉంది. అయినప్పటికీ వేసవిలో పచ్చిక ఎండిపోయి అసహ్యంగా ఉండేది. అంగులో ఒక మూలకూడా ఇంగ్లం డులో ఉండే పచ్చిక జయళ్ళవలె నవనవలాడుతూ ఉండేది కాదు.

అందులో మా ఇంటి తోట విశేష మేమంటే, రకరకాల పక్షులు బిలబిల లాడుతూ అక్కడికే వచ్చేవి. మైనాలు, ఎగురుతుంటే తెల్లగాను, చూడ డానికి నిగనిగ మెరసిపోతూ నల్లగా ఉండేపక్షులు, బూడిద నీలంలో ఉండే బుల్ బుల్ పక్షులు, కంటికి కనబడనంత వేగంగా రెక్కలను అల్లల్లాడించుకొంటూ ఎగిరిపోయే చిన్నపక్షులు ఎన్నో వచ్చేవి. చూడ డానికి వికారంగా ఉండే ముసలి కాకులు ఎత్తుకుపోవడానికి ఏమైనా దొరుకు తాయేమోనన్న ఆశతో అస్తమానం వసారాలగట్టుమీద కిటికీ బద్దెలమీద వాలి పొంచిచూస్తూ ఉండేవి.

బయటరోడ్డుమీద ఎద్దుల బళ్లు కటకట చప్పుడు చేసుకుంటూ పోతున్నాయి. మేకలు ముందుకాళ్లు దడి మొక్కలమీద ఆన్చి మోరలు పైకెత్తి అవ్వలి వైపున ఉన్న చివుళ్ళను నోటితో అందుకోవ డానికి ప్రయత్నించేవి. కాని మోటారుకారులు, లారీలుకూడా వస్తూ పోతూ ఉండేవి. అప్పుడప్పుడు రిక్షాలు తిరుగుతూ ఉండేవి. బక్క చిక్కిన బడుగు మనిషి తూలుకుంటూ అడుగులు తడబడుతూ లాక్కు పోతుండే రిక్షాఎక్కి వెళ్ళడానికి జూడీ ఎప్పుడూ ఇష్టపడేదే కాదు. కాని జూడీ బడిలో ఆడపిల్లలు కొందరు ఎప్పుడూ రిక్షాలు ఎక్కి ఇళ్లకు వెళ్ళేవాళ్లు. ఈ మద్రాసులో బస్సులుకూడా లండన్‌లోవాని వలె చక్కగా, అందంగా, కూర్చోవడానికి సుఖంగా, చల్లగా, హాయిగా ఉంటే ఎంతబాగుండును, అనుకునేది జూడీ అస్తమానం. కాని అవి అలా లేవు మరి !

శీతాకాలంలో అయితే కొంత మెరుగుగా ఉండేది. వేసవి అంత పాడుగా ఉండేదికాదు. అయితేనేమి ? శీతాకాలం అంతా కొన్ని వారాలకు మించేది కాదు. అప్పుడైనా ఇంగ్లండులో వేసవికాలంలో బాగా వేడిగా ఉన్నరోజున ఎలా ఉండేదో అలా ఉండేది. అదే

ఇక్కడి వాళ్ళకి చాలా చలిగా ఉన్నట్టు అనిపించేది. అంత చలిలో చన్నీళ్లస్నానం చేయకూడదనేవారు. మోటారుకారు పైభాగాన్ని ముట్టుకొని ఎవళ్లూ వళ్లుకాచుకునేవారేకాదు. శీతకాలంలో, వారాంతంలో వారు ఎక్కడికైనా విలాసయాత్రలకు వెళ్లేవారు. ఒకసారి వాళ్లు మహాబలిపురం వెళ్లారు. అక్కడ రాతి ఏనుగులు, సంగులు ఎండలో అనేక శతాబ్దాలుగా అలాగే నిశ్చలంగా, ప్రశాంతంగా, వాతావరణపు రాయిడులకు తట్టుకుంటూ నిలిచి ఉండేవి. అగాధ నీల జలధి తరంగాలు ఒడ్డునఉన్న తెల్లరాళ్ళ గుట్టలను ఒరుసుకొని తిరిగిపోతూ ఉండేచోట సముద్రతీరాన ఒక ప్రాచీన దేవాలయం ఉంది. అక్కడ ఒక చిన్న కొండమీద ఏకొండశిలలో ఋషులను, వారిని కనిపెట్టుతున్న వనదేవతలను, కోతులను రుద్రాక్షపిల్లిని, సాధువులైన ఏనుగుల సమూహాన్ని మలచారు. ఇంక ఒక శిలాఫలకంమీద మలచిన గోవర్ధనోద్ధరణం నిజంగా కమనీయ శిల్పకళాఖండమే. వడివడిగా కురిసే రాళ్లవాననుంచి భీతులై బెంబేలు పడిపోతున్న గోపాలకులనూ, నిర్భీతంగా నిలుచున్న గోవులనూ కాపాడటంకోసం కృష్ణుడు గోవర్ధనగిరిని ఎత్తాడు.

వారు వేదాంతాంగల్ వెళ్ళి అక్కడి కులాయ నిలయాన్ని సందర్శించారు. అక్కడి చెట్లన్నీ కొక్కిరాయిల గూళ్ళతో నిండి ఉన్నాయి. ఆ తరువాత వారు అప్పుడప్పుడు కొన్నికొన్ని దేవాలయాలను సందర్శించడానికి వెళ్లారు. అయితే ఎండ ఎక్కిన కొలదీ కారును నడపటం కష్టమైపోయేది. త్వరగా అలసిపోయేవాళ్ళు. ఒక శనివారం నాడు వారు ప్రజలందరికి ఎక్స్‌రే తీసే వైద్య బృందంతో సరిసర గ్రామానికి వెళ్లారు. అక్కడ జాడీ ఆ వైద్యులకు సాయంగా పేర్ల జాబితాలను సరిచూచింది. ప్రజలలో ఎంతమందికి క్షయ వ్యాధి కలదో తెలుసుకోవడం కోసమే ఈ కార్యక్రమం ప్రారంభించబడింది. ఆ తరు

వాత క్షయ రోగులందరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి పంపుతారు. అందువల్ల వారికి తిరిగి పూర్ణారోగ్యం చేకూరుతుందనే ఆశ. ఆనాడు అక్కడకు వచ్చిన ప్రజలలో ఒక్కొక్కన సన్నని వాళ్లు చాలామంది ఉన్నారు. వారికి అనేక రకాలుగా మార్చుకుతినడానికి ఒక్క బియ్యం తప్ప మరేమీ లేవనీ, వారికి కనక త్రాగడానికి పాలు పుష్కలంగా ఇప్పటికంటె హెచ్చుగా దొరికితే, పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉండదనీ జూడీ తల్లి చెప్పింది. ఒకరోజున మనమందరం కలిసి జాతీయ సమాజ వికాస విస్తరణ కేంద్రాలకు వెళ్ళి అక్కడ ఏంజరుగుతుందో చూచి వద్దామని జూడీ తల్లి అంది.

"అంటే అదేమిటి ?" అంది జూడీ.

"ఇది చాలా ముఖ్య కార్యక్రమం. ఇందువల్ల లక్షలాది భారతీయులు నివసిస్తూ, పంటలు పండించే గ్రామాల అభివృద్ధికి ఎంతో దోహదం కలుగుతుంది. వ్యవసాయాన్ని అభివృద్ధిచేయడానికి, ప్రజలు మరింత సార్థకమైన, ప్రయోజనకరమైన జీవితం సాగించేటట్లు చూడడానికి భారత ప్రభుత్వం కృషిచేస్తోంది. వ్యవసాయాభివృద్ధి అంటే మంచిమంచి పంటలు, రకరకాలైనవి పండించడం, మేలిరకం పశుగణాభివృద్ధి, పోషణ వగైరా అన్నమాట.

లఘుపరిశ్రమలద్వారా వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు తోడుగా కొంత అదనపు ఆదాయాన్ని సంపాదించి మరింత సుఖజీవనం సాగించేటట్లు ప్రభుత్వం ప్రజలను ప్రోత్సహిస్తున్నది. గ్రామాలలో తయారైన నూలు బట్టలను, తెరలను, దుప్పట్లనూ కంబళ్ళనూ మనం ఎలా కొనేవాళ్ళమో మీకు తెలుసు కదా అంది.

"అవును" అంది జూడీ. అయితే ఇంగ్లండు నుంచి స్విట్జర్లాండ్ నుంచీ దిగుమతి అయిన నూలు బట్టలు చాలా అందమైనవి, నాజూకైనవి

ఉండగా మఱతక స్వదేశీ బట్టలు దేనికి ? అని జూడీ అప్పుడప్పుడు అను కునేది. తను తొడుక్కునే గౌనులు వగైరా దుస్తులన్నింటిని ఆవిదేశీ గుడ్డలతోనే కుట్టించుకుంటే బాగా ఉండేదనుకునేది.

"భారతదేశంలో ఉన్న మన మందరం భారత ప్రభుత్వం తల పెట్టిన దేశాభివృద్ధి కార్యక్రమానికి సహాయం చేయవలసి ఉంది. దేశంలో పేదప్రజల స్థితి గతులను కొంచెం చక్కబరచడం కోసం పంచవర్ష ప్రణాళికలను ప్రారంభించింది. రెండవపంచవర్ష ప్రణాళికలో వారి పరిస్థితి కొంత మెరుగు కావచ్చు. అదనంగా ఉత్పత్తి అయ్యే సంపదలో అధికభాగం నిరుపేదలకు, స్వల్పభాగం సంపన్నులకూ చేరు తుంది. నిజానికి నెహ్రూవంటి నిజమైన ప్రజానాయకులు వాంఛించేది అదే. అయితే స్వార్థపరులైనవారు కొంతమంది ఎప్పుడూ ఉంటూనే ఉంటారు."

తల్లి ఆలోచనలన్నీ తనకు తెలుసుననే జూడీ అనుకుంది. తమకు హాయిగా కాలక్షేపం అయిపోతున్నంతవరకు దేశంలో ఏం జరుగు తున్నదో పట్టించుకోని "పెద్దవారు" ఒకరిద్దరితో తన తల్లి తీవ్రంగా వాదించేది. "బహుశా అమ్మ చెప్పేదే నిజంకావచ్చు. కాని తన కెందుకీ కంఠశోష?" అనుకునేది జూడీ. ఒకరోజు తన సహాధ్యాయిని — అంతమంచిది కాదనుకోండి — తండ్రితో తన తల్లి గట్టిగా తగవు లాడింది. నిజానికి అందులో అంతగా పట్టించుకోవలసిం దేముంది ?

బడికి సెలవులు ఇవ్వగానే అందరూ కలిసి పర్వత విశ్రాంతి కేంద్రానికి వెళ్లారు. కాని జూడీని, బెన్‌నూ ఆయాను తోడిచ్చి అక్కడేవున్న మిత్రులందరికి వాళ్లను అప్పచెప్పి వెళ్ళిపోయారు. ఈ మిత్రులకు ఒక అబ్బాయి ఉన్నాడు. వాడికి పాత తపాలా బిళ్ళలు పోగుచేయడం ఒక్కటే చెప్పుకోదగ్గ సరదా. అందుచేత వాతావరణం

చల్లగా హాయిగా ఉన్నప్పటికీ కాలక్షేపం అయ్యేదికాదు. సాయం త్రంవేళ ఊలు బనీను వేసుకుని తిరగడానికి సరిపడేంత చల్లగా ఉండేది. రాత్రిళ్ళు ఉన్ని కంబళ్ళు కప్పుకుంటేనేగాని చలికి తట్టుకోలేక పోయే వారు. అంతేకాదు, పరుగెత్తడానికీ, ఆటలాడటానికీ వీలుగా చల్లగా హాయిగా ఉండేది. మద్రాసులో ఉన్నప్పుడు ఎవ్వరికీ ఇలాంటి వాటి విూదకు దృష్టిపోయేదేకాదు.

అయితేనేమి, జూడీ తన పదకొండవ పుట్టినరోజు పండుగనాడు చాలా సంతోషకరమైన పని చేసింది. ఆరోజున కొన్ని పుస్తకాలు బహుమానం వచ్చినప్పటికీ, ఆలాంటి దేవో తలపెట్టి ఉండక పోయి నట్లైతే కాలక్షేపం అయ్యేదేకాదు. ఆరోజున జూడీ తపాలాబిళ్లలు పోగుచేసే తన మిత్రుడితో కలిసి వేటకోసం ప్రత్యేకించిన పరిసరా రణ్యాలకు వెళ్లింది. అక్కడ వాళ్లిద్దరూ ఒక పెంపుడు ఏనుగుపై ఎక్కి అనేక గంటలసేపు అడవిఅంతా తిరిగారు. ఆ ఏనుగు మహా బలిపురంలోని ఏనుగువలె చూడచక్కనిది. సాధువైనది. దోవలో అడ్డంగా ఉన్న చెట్లకొమ్మ లన్నింటిని తెలివిగా తొండంతో ఎప్పటి కప్పుడు విరిచి పారవేసేది. లేకపోతే ఆ కొమ్మలు తగిలి పిల్లలు పడి పోయేవాళ్ళే. దూరాన వాళ్లకి అడవి ఏనుగులగుంపు ఒకటి కనబడింది. అవి నిలువెత్తు గరికదుబ్బులతో కడుపునింపుకుంటున్నాయి. అవి ఆ గరిక దుబ్బులను పెరికి తొండంపైకెత్తి అటూ, ఇటూ ఆడించేవి. అవి చూడడానికి పెద్ద నీడవలె, కొండమబ్బువలె, సాధువులవలె కనబడేవి కాని వెళ్ళిపో దలచుకున్నప్పుడు మాత్రం వాటిల్లో ఒకటి హుషారు కొలది ఏదో ఒకచెట్టును పెళపెళా విరిచేసేది. ఆ ప్రాంతంలో ప్రజలు ఏనుగుల బారినుండి తమ పంటలను కాపాడుకోవడంకోసం చేంచుట్టూ లోతుగా గోతులను త్రవ్వవలసి వచ్చేది. ఆ సమయంలో జూడీకి

జంతుప్రదర్శనశాలల్లో బందీలుగా ఉన్న ఏనుగుల సంగతే జ్ఞాపకం వచ్చేది. వాటికి పాపం ఇష్టంవచ్చినట్టు తిరగడానికీ తినడానికీ, ఆడడానికీ స్వేచ్ఛ లేదుకదా అనుకొనేది. ఆ తరువాత వాళ్లు ఒక అడవి దున్నను చూచారు. పిమ్మట వాళ్లకు, పొట్టిపొదల మధ్య, వెదుళ్లమధ్య నల్లని పెద్ద జంతువు కదులుతున్నట్టు కనిపించింది. తీరాచూస్తే అది ఎలుగు బంటి. తపాలాబిళ్ళలు పోగుచేయడమే సరదాగా పెట్టుకున్న ఆకుర్ర వాడు సైతం ఎలుగుబంటి అంటే ఎంతో ఆసక్తిని ప్రదర్శించాడు. ఇంకా కొన్ని జంతువులు వస్తే బాగుండునని జూడీ అనుకుంది. అయితే కోతులకూ, ఉడతలకూ అక్కడ లోటేమీ లేదనుకోండి. కాని భారత దేశంనిండా వింతజంతువులు ఎన్నో ఉండి ఉండాలి. అయితే వాటిని ఎవ్వరూ ఇంతవరకూ చూడకపోవడం నిజంగానే సిగ్గుచేటుగా ఉంది. అప్పటినుంచీ ప్రతిరోజూ రాత్రి పడుకోబోయేముందు జూడీ ఏనుగులను గురించే ఆలోచించేది.

2. కంచెలో కంత

అక్షింత పువ్వుల మొక్కల కంచెకు ఆవలి వైపున ఉన్న పొరుగు వారంటే బెన్‌కు సదభిప్రాయమే ఉంది. కాని జూడీకి మాత్రం అలా కాదు. వారంటే ఆమెకు అంత అభిమానమూ లేదు. వాళ్ల తోట అంత తీర్చిదిద్దినట్టుగానూ ఉండేదికాదు. వాళ్ళ ఆవు తోట అంతా త్రొక్కి వేసేది. వాళ్ళకి ఎనిమిదేళ్ళ దొకత్తె, ఏడేళ్ళ దొకత్తె ఇద్దరు ఆడపిల్లలూ, ఒక చంటిపిల్లవాడూ ఉన్నారు. వాడి పేరు రామకృష్ణ. అంత చిన్నవాడికి, ఇంత పెద్దపేరు ఏమిటా అనిపించేది. కాని ఇంట్లో అందరికీ వాడంటే ఎంతో ముద్దు. భలేవాడని అంటూ ఉంటారు. వాణ్ణి అస్తమానం అక్కలు ఎత్తుకుని వ్రేలాడదీస్తూనే ఉంటారు. ఈడుకు మించిన బరువు అయినప్పటికీ సరదాగా మోస్తూనే ఉంటారు. జూడీకి ఈ ఇద్దరు పిల్లలలోను చిన్నదంటే ఆపేక్ష ఎక్కువ. దాని పేరు వారంటి. బంతులాడడమన్నా, బొంగరాలు త్రిప్పడమన్నా గెంతడమన్నా దానికి చాలా సరదా. జూడీ అస్తమానం దానితో ఆ ఇంటిని గురించి ఇంగ్లీషులోనే మాట్లాడేది. అదికూడ ఇంగ్లీషు ఇట్టే నేర్చుకుంది. అది జూడీకి ఆరవపాటలు ఎన్నో నేర్పింది. నేర్పుతూ నేర్పుతూ మధ్యలో ఫకాలుమని పగలబడి నవ్వేది. వాళ్ళ నాయన గారికి ప్రభుత్వ కార్యాలయంలో ఏదో పని. ఎప్పుడూ ఎంతో చింతా క్రాంతుడుగా ఉన్నట్టు కనబడుతూ ఉండేవాడు.

ఈమధ్య తమ ఇంట్లో పెళ్లిచేసిన పొరుగు కుటుంబీకులు సంపన్నులు. వాళ్లకో పెద్ద మోటారుకారు ఉంది. వాళ్ళ అబ్బాయి చదువుకుంటున్నాడు. మోటారుసైకిలు ఎక్కి మెరుపులా దూసుకు పోతూ ఉంటాడు. వాళ్లకి ఒక్కత్తే ఆడపిల్ల. దానికే మొన్న పెళ్లి అయింది.

మరి ఇరుగు పొరుగున ఉన్న ఇతరుల మాటేమిటి ?

దొడ్డివైపున సూర్యకాంతపు మొక్కల వరుసకు వెనుకను ఉన్న ఇంటిలోని వారినిగురించే జూడీ తరచు ఆలోచించేది. మాఇంటి డాబా మీదనుంచి చూస్తే వారి తోట అంతా కనబడుతుంది. అది చూడ చక్కనిదే ననిపించేది. ఆ ఇంటి ఇల్లాలు స్వయంగా తోటవిషయమై శ్రద్ధవహించేది. వాళ్ల వసారానిండా పువ్వుల మొక్కల కుండీలు చాలా ఉండేవి. ఆవిడ ప్రొద్దుటే లేచి పూలు కోసుకోడానికి తోట లోకి వచ్చేది. ఆవిడ ముదురాకుపచ్చ, లేతనీలం, నారింజ, వంగపండు ఆకాశనీలం, అరటిపువ్వురంగు ఒకటేమిటి ముద్దునుసు రంగుచీరలుకట్టేది. అవి అన్నీ బంగారు జరీఅంచు చీరలే. ఆవిడ కట్టుకున్నప్పుడు అంచు మిలమిలా మెరిసేపోయేది. తోటలో అప్పుడప్పుడు ఎవరో పిల్లలు జూడీకి కనబడేవారు. అయితే వాళ్లు ఆవిడ పిల్లలే ఏమో తెలియదు.

ఈ భారతీయుల ఇళ్ళల్లో చుట్టాలు, పక్కాలు మిత్రులు ఎప్పుడూ చాలా మంది ఉంటూ ఉంటారు కాబోలును అనుకునేది జూడీ. ఒక్కొక్కసారి చాల గందరగోళంగా కనబడేది. జూడీ అప్పుడప్పుడు ఒక సహాధ్యాయిని ఇంటికి వెళ్ళి తేనీటిని సేవించివచ్చేది. అయితే ఆయింటిలో ఉన్న పిల్లలందరు తన మిత్రురాలికి తమ్ముల్లో, అన్నలో, అక్కలో, చెల్లెల్లో కాక ఇతర సమీప బంధువులో లేక వారిలో ఒక పిల్ల ఆయా కూతురేమో కూడా ఎన్నడూ తెలుసుకోలేదు!

జూడీ సహాధ్యాయిలలో కొందరు చెన్నపట్టణం ఊరు మధ్యనే అయినప్పటికీ చెట్టు చేమలతో కలకలలాడుతూ ఉండే తోటలమధ్య కట్టిన పెద్ద భవంతులలో నివసించేవారు. ముందుగా కొంచెం మసక మసకగా, చీకటి గుయ్యారంలా, చిందర వందరగా ఉన్నట్టుండే ఒక పెద్దగదిలోనుంచి లోపలికి వెళ్ళగానే ఒక పెద్ద పెంకుటి వసారా కన బడుతుంది. నిజానికి అది పెద్ద దొడ్డివలె ఉంటుంది. అక్కడ

అందరూ అన్నిపనులూ చేస్తూ ఉంటారు. వంటచేయడం, బట్టలుతకడం, గిన్నెలు తోమడం, పిల్లలను ఆడించడం, పూలు గుత్తులు కట్టడం, దండలు గుచ్చడం అన్నీ అక్కడే. కోడిపెట్టలూ, మేకలూ ఉంటాయి. ఆవుల సంగతి సరేసరి. ఒకటి రెండు బర్రెలు పడుకొని ఉంటాయి. వయస్సు వచ్చిన వాళ్ళంతా నాన్నలు, పిన్నమ్మలూ లేకపోతే తాతలు, అవ్వలు. తరచుగా ప్రతి కుటుంబములోను ఒక ముసలవ్వకూడా ఉంటూ ఉంటుంది. ఈమెను చూస్తే అందరికీ హడలే. ఇలాంటి చోట్లకు వెళ్ళడం సరదాగానే ఉంటుంది. కాని ఇవన్నీ పూర్వోత్రపు కొంపలు. జూడీ మిత్రులలో చాలామంది విడిగా ఉండే చిన్నచిన్న ఇళ్ళల్లోనో లేక మేడలమీదో ఉండేవాళ్ళు. అయితే వేసవిలో ఇవి తెక తెక ఉడికించేవి.

వేసవికాలపు సెలవులకు పర్వత విశ్రాంతి కేంద్రాలకు వెళ్లి తిరిగి రాగానే తన బడిలో ఇతర ఆంగ్ల బాలికలు ఎవ్వరూ ఉండేవారే కాదు. ఒకరిద్దరు ఉన్నా వాళ్లు జూడీకంటే చిన్నవాళ్లు. జూడీకిప్పుడు పదకొండేండ్లు. దాని ఈడువాళ్ళంతా పర్వత విశ్రాంతి కేంద్రాలలోని పాఠశాలలలో చేరారు. లేదా వారి తల్లిదండ్రులు ఇండియానుంచి స్వదేశాలకు తిరిగి వెళ్లిపోయారు. జూడీ, వాళ్ల కుటుంబం ఇంకొక సంవత్సరానికి గాని స్వదేశం వెళ్లడానికి లేదు. అప్పుడే వాళ్ల పెద్ద అన్నయ్యా జాన్‌ను చూడగలగడం. నిజానికి భారతదేశంలో ఉండటం ఒక విధంగా సరదాగానే ఉంది. కానీ ఈదేశం భారతీయులదేశం. ఫ్రెంచివారు, జర్మనులు, ఆఫ్రికనులు తమకు ఎలాంటి విదేశీయులో బ్రిటిష్ వారుసైతం ఆదేశానికి అలాంటి విదేశీయులే. బహుశా భారతీయులొక్కరికే ఇంగ్లీషువారంటే కొంత అభిమానం ఇంకా ఉందని చెప్పాలి. ఇప్పటి కింకా దుకాణాలలోనూ, రోడ్డు మొగలలోను ఆంగ్లంలోనే

పేరు పలకలు ఉన్నాయి. జూడీ వాళ్ళ నాన్నగారు ఇంగ్లీషు దినపత్రిక అయిన "ది హిందూ"ను రోజూ చదివేవారు. బొమ్మలు బాగా వేసే ఆదివారంనాడు తప్ప మిగతా రోజులలో ఈపత్రికను చూడడం అంత సరదాగా ఉండదని జూడీ అభిప్రాయం. కాని పెద్దవారికి ఇలాంటి పత్రికలంటేనే చాలా ఇష్టం.

ఇక్కడ పైవారికి చాలా సంగతులు ఒక్కపట్టున అంతసులభంగా అర్థంకావు. మాటవరసకి బ్రాహ్మల సంగతే చూడండి. పూర్వ కాలంలో అందరినీ వారే అనుశాసించేవా రనిపిస్తుంది. వారెంత పవిత్రు లంటే, మామూలు పనులేవీ వారు చేయరు. అంతేకాదు. క్రింది కులాలలో పుట్టినవారిని వారు పొరబాటునైనా తాకరు. ఆనాడు అధమ వర్ణులూ, అవర్ణులుగా పేర్కొనబడి అస్పృశ్యులుగా పరిగణించ బడిన నేటి హరిజనులకు బ్రాహ్మణులంటే పడదు. వారు తమంతవారు తామని అనుకుంటున్నారు. అలాగే ప్రవర్తిస్తున్నారు కూడాను. ఒకొక్కసారి కక్షలు ప్రబలి తలలు తెగనరుకొంటున్నారు.

సూర్యకాంతపు మొక్కల కంచెకు అవ్వలివైపున ఇంట్లోఉన్న పొరుగువారిని గురించి జూడీ ఒకరోజు పొద్దున్నే వాళ్ళ నాన్నగారిని అడిగింది. వారు బ్రాహ్మణులని ఆయన చెప్పారు. ఆ ఇంటి యజ మాని సంస్కృత పండితుడు. హిందువులు కానివారిని ఏమిచేయ దలచు కున్నారో, లేక వారని ఏమిచేయాలో ఆయనకు తెలియదు.

వారు అంతగా పూర్వాచార పరాయణులైతే బహుశా నిన్నూ నన్నూ ఇంట్లోకి రానివ్వరేమో అనుకోవాలి. వారి దృష్టిలో మనం హరిజనులవంటి వాళ్ళం. మన రాకవల్ల తమ ఇల్లు మైలపడిపోయిందని వారు భావించినా భావించవచ్చు.

"చూడగా వారిదంతా ఎక్కడా అర్థం పర్థంలేని పద్ధతిలో ఉందే!" అంది జూడీ.

"నిజమే! కొన్నివిధాల చూస్తే మనం అనాచార పరులమేమరి. మురికిగానూ ఉంటాం. మనం ఇళ్ళల్లోకూడా బయట తిరిగివచ్చిన పాదరక్షలతోనే తిరుగుతూ ఉంటాము. జూడీ, నీకాళ్ళ చెప్పులుచూడు. ఎంతగా దుమ్ముకొట్టుకొనిపోయి ఉన్నాయో! పైగా మనం వళ్ళు రుద్దుకున్న సబ్బు కలిసిన మురికినీళ్ళలో పడుకునే స్నానం చేస్తాం. మనం మాంసం తింటాం. మాంసం అంటే ఏమిటి? చనిపోయిన జంతువులదే కదా." అన్నారు ఆయన.

"కాయగూరలతో వండిన శాకపాకాలు, వంకాయలు, రామములక్కాయలు, పెరుగు, పప్పులు, కొబ్బరి, అప్పడాలు, అప్పుడప్పుడు కోడికూర దొరుకుతూఉంటే మరెప్పుడూ మాంసం తినకుండా ఉండగలను. అలా ఉండడం నాకుకూడా ఇష్టమే."

"కోడికూర మాత్రం మాంసంకూర కాదా?" అన్నారు జూడీ తండ్రి. అలాగే గ్రుడ్లున్నూ. అచ్చమైన బ్రాహ్మణులు గుడ్లు కూడా తినరు."

"ఓహో! అందుచేతనే కొబోలు బహుశా వారు నన్ను తమ ఇంట్లోకి రానివ్వరు" అనుకుంది జూడీ. ఆలోచించినకొలదీ కంచెకు అవ్వలి వైపున ఉన్న బ్రాహ్మణుల ఇంటిలో అంతా ఎలా ఉంటుందో నన్న కుతూహలం ఆమెలో ఎక్కువై పోయింది. తనమిత్రులు చాలా మంది ఇళ్లు లోపలిభాగం అట్టహాసం లేకుండా నిరాడంబరముగా ఉండేది. గోడలకు లేతనీలమో, చందనమో, మరేదో గులాబీరంగో కలిపి వెల్ల వేసేవారు. గోడలకు కొన్ని ఛాయాచిత్రాలు, ఒక క్యాలండరు, రెండుమూడు రంగుల పటాలూ తగిలించేవారు. ఈ పటాలన్నింటిలోకి బాలకృష్ణునివి ఎంతో ఆకర్షణీయంగా ఉండేవి. ఒక్కొక్కసారి గోపికలతో రాసక్రీడలు సలుపుతున్నట్టు, ఇంకొకసారి తల్లితో దోబూచు

లాడుతున్నట్టు ఉండేవి. ఏమైనా నిజమైన బాలునివలె సంతోషంగా సరదాగా అల్లరిచేస్తూఉన్నట్టు ఉండేవాడు. మిగతా ఎవ్వరెవ్వరో దేవుళ్లవీ, దేవతలవీ పటాలుండేవి కాని వాటిని చూస్తేనే భయంవేసేది. బహుశా ఈ పెద్దఇంటిలో ఇంకా పెద్దపెద్ద పటాలుంటాయేమో ? వాళ్లకి రేడియో ఉంటుందా ? ఇంతకీ ఆ ఇంట్లో ఆవిడ ఇంగ్లీషు మాట్లాడుతుందా?

వేసవి కాలంలో మాలీ రోజూ చాలాసేపు మొక్కలకు నీళ్లు పోస్తూనే ఉండేవాడు. బడినుంచి తిరిగి వచ్చిన తరువాత జూడీకి ఈ మొక్కలకు నీళ్లు పోయడంలో సాయం చేయడం అంటే అంతగా ఇష్టం ఉండేది కాదు. బడినుంచి రాగానే నీటి జల్లు క్రింద కూర్చొని హాయిగా స్నానం చేయడం, పంకా క్రింద కూర్చొని గ్లాసు తరువాత గ్లాసు నిమ్మనీరు తాగడం అంతే. ఇంకేమి చేసేదికాదు. మాలి ఒక చోట ఎర్రగులాబులు మడి వేసి పెంచాడు. అవి ఎర్రగా చక్కగా పెరిగాయి. వాటిని చూసుకుని వాడు ఎప్పుడు మురిసిపోయేవాడు. ఈ మద్రాసులో కూడా ఇవి ఇంత చక్కగా, ఏపుగా లండన్‌లోవలె పెరగడం ఆశ్చర్యంగా ఉందే, అనుకుంది జూడీ.

ఇంతలో ఒక మేక లోపలికి వచ్చింది. వాటిని తిందామని నోటితో అందుకోబోతుంది. మాలీ వంటవాడు ఇద్దరూ మేకను తోలడం కోసం కేకలు వేస్తూ దానికేసే పరిగెత్తారు. దానిమీద చెప్పు విసిరారు. తప్పించుకు పారిపోవాలనే ఆగుర్దాలో, ఆభయంలో మేక కంచెను దాట బోయి సూర్యకాంతపు మొక్కల కంచెకు సగంలో పడిపోయింది. ఆబరువుకి సూర్యకాంతపు మొక్కల వరుసలో సగం విరిగింది. "అయ్యో, దీనిని మళ్లి సరిచెయ్యడానికి ఎన్నిరోజులు పట్టుతుందో ? విరిగినంత మేరా తిరిగి కొమ్మలు పెరగాలి

కదా'' అనుకుంది జూడీ తల్లి. ఈ ఎండాకాలంలో కష్టపడి పనిచెయ్యడానికి ఎవరు ఇష్టపడతారు? ఎండాకాలం ఒక్క దొరలకే కాదు. భారతీయులకు సైతం దుర్భరంగానే ఉంటుంది. పైగా వారికి పంకాలు, హిమయంత్రాల వంటివి తక్కువగా ఉంటాయి కూడాను.

మర్నాడు శుక్రవారం. మరి రెండురోజులవరకు బడిలేదు. అయితే నేమి? ఇంటిదగ్గర చేసుకు రావడానికి చాలా పని యిచ్చారు. జూడీ చరిత్ర పుస్తకం తీసి చదవడం మొదలుపెట్టింది. కాని ఏం లాభం? చదివినదంతా ఈ చెవిలోనుంచి లోపల ప్రవేశించి రెండో చెవిలోనుంచి బయటకు పోయింది! ఇంతలో ఆయా రోదన వినబడింది. దేనికో అనుకుంది. బహుశా ఏపామైనా, ఏమైనా కరవలేదు కదా! ఏమో? కరచి ఉంటుంది? బట్టలుతికే వానికి కూడా ఏడవడం మొదలు పెట్టింది. జూడీ ఒక్క ఉదుటను లేచింది. ఏమిటర్రా! ఎందుకు ఏడుస్తున్నారు అని అడిగింది. బెన్ కనబడడం లేదు అన్నారు. వాడు ఇప్పటిదాకా తోటలో ఆడుకుంటూనే ఉన్నాడు. ఇంతలో ఏమై పోయాడు? ఎక్కడికి పోయాడని? జూడీ ఎండకు మండిపోతున్న రోడ్డుమీదకు పరుగెత్తుకువెళ్ళి చూసింది. చూస్తే ఏముంది? అక్కడ ఏమీ లేదు. బెన్ లేడు. ఇంతలో కంచె మూల జ్ఞాపకం వచ్చింది. అక్కడ కొన్ని పువ్వులు పాదాలక్రిందపడి నలిగినట్టు ఉన్నాయి! వెంటనే కుర్చీ ఎక్కి కంచెమీదుగా అటుకేసి చూసింది. అందమైన ఆ ఇంటి తోటలో బెన్ ఉన్నాడు. తనకు కనిపించాడు. ఆ ఇంటి ఆవిడ చేతిని పట్టుకొని నవ్వుతున్నాడు. ఆవిడ తెల్లని జరీ అంచుల చీరకట్టుకుంది. ఆవిడ చెవులనున్న వజ్రాల దుద్దుల్లో ఎండపడి తళుక్కున మెరిశాయి. ఆవిడ తన తోటలో ఒక మామిడిచెట్టుకేసి వ్రేలితో చూపించి బెన్‌కు ఏమిటో చెప్పింది. వాడు గబగబా బుర్ర

ఆడించాడు. వాడు ఆసమయములో పొట్టి నీలంలాగు తొడుక్కున్నాడు. కాళ్ళకు చెప్పులు లేవు. వాడికి చెప్పులు తొడుక్కునే అలవాటేలేదు. ఈ సరికి వాడి అరికాళ్లు బాగా దళసరెక్కిపోయి ఉంటాయి. ఎండలో దుమ్ములో, చెప్పులులేకుండా తిరిగినా వాడికికాళ్ళు కాలవనుకుంటాను !

ఆ ఇంటి ఆవిడ ఒక మామిడి పండును అందుకొని కోసింది. ఎంత అందంగా ఉంది! పోతపోసిన బంగారపు ముద్దవలె, పసిమిరంగులో మిస మిసలాడుతోంది. ఆవిడ తనచీర కొంగున కట్టిన బుల్లిచాకును బయటకు తీసింది. దానితో ఆ మామిడిపండును ముక్కలుగా కోసింది. బెన్ ఎంతో ఆశతో ముఖమంతా కళ్లుచేసుకొని ముందువంగిఆవిడ చెక్కుతూ ఉంటే దానికేసే చూస్తున్నాడు. లేత పసుపుపచ్చని పండురసం ధారలు కట్టి వాడి కడుపులోకి ప్రవహించింది. ఇక్కడ ఆయా కంగారుపడి పోతోంది. అందుకని వాణ్ణి పిలుచుకు రావడానికి వెళ్ళాలనుకుంది జూడీ. అక్కడికి వెళ్ళాలంటే తను దూరడానికి చాలినంత కంతఉంది. ఆ సమయములో జూడీ చేతులులేని నూలుగౌను తొడుక్కుంది. వీపులో చాలభాగం అనాచ్ఛాదంగా ఉంది. వంటి రంగుతో పోల్చి చూచి నప్పుడు ఆమె తల తెల్లగా సుధాధవళితంగా ఉంది. మెల్లగా కంచెకు అటుచివర పెరిగిన అరటి మొక్కల క్రిందనుంచి జాగ్రత్తగా, దూరి ముందుకు వచ్చింది. వారివైపునుంచి వచ్చినప్పుడు కనబడదు. కాని ఆ మూల అందమైన పూలమొక్క ఒకటి గుబురుగా పెరిగింది. దాని ఆకులు ఎర్రగా, రక్తపు, రంగులో సొంపుగా, అందంగా ఉన్నాయి. ఆ ఇంటి ఇల్లాలిని చూడగానే జూడీ తన రెండుచేతులూ జోడించి వినయ వినిమితయై మెల్లగా నమస్కారం చేసింది. ఆవిడా ప్రతినమస్కారం చేసింది. ఆవిడ చేతికి ఉంగరాలున్నాయి. అందులో ఒకదానికి అంద మైన పలక రవ్వను పొదిగారు. అంతలో ఆవిడే ఆపేక్షగా, ఆశగా,

సన్నగా, చిన్నగా పలకరించింది. "మీరు మాఇంటికి వస్తారేమోనని చూస్తూ ఉన్నాను." అంది.

"అలాగా! నాకు తెలియదే!" అంది జూడీ. "నేను అను కున్నాను కదా........." అని ఏమో చెప్పబోయింది. కాని ఆ చెప్పదలచిన దేమిటో అంతలోనే మరచిపోయింది. ఆవిడే అందుకుంది. "మీయింటి డాబామీద ఉండగా మిమ్మల్ని చూశాను. అక్కడకంటె ఇక్కడ చల్లగా ఉంది కదూ?"

జూడీ తనజోళ్లు విడిచి, కాలివేళ్ళతో క్రిందనున్న తడిపచ్చికను తాకి చూచింది. "చాలా బాగుంది" అంది.

తమ ఇంటిలోనుంచి చూస్తే కనపించనివి చాలా ఉన్నాయి. ఆ ఇంటిచుట్టూ చెన్నంగి కొబ్బరి మొక్కలు దడికట్టినట్టుగా ఉన్నాయి. ఈ కొబ్బరిచెట్లు అట్టే ఎత్తు ఎదగవు. వాటినిండా పసిమి మిసిమి కలిసిన గోధుమరంగు కొబ్బరి బొండాల గుత్తులు వ్రేలాడుతున్నాయి. కొబ్బరి పంట నిత్యపంట. ఏటికేడాదీ గుత్తులు దిగుతూనే ఉంటాయి. ముప్పొ టగా ముదిరిన గెలలను దింపుతూఉంటారు. అక్కడ ఒకచిన్న తాటాకు పాక ఒకటుంది. దానిమీద ఆనపపాదులు, పుచ్చపాదులు, దోసపాదులు ఉన్నాయి. దానిముందు ఒక ఆవును కట్టారు. ఆ సమయంలో దానిని శుభ్రమైన బట్టలు కట్టుకున్న మనిషి ఒకడు పాలు పిండుతున్నాడు. మునివ్రేళ్ళను నేలకు ఆన్చి, మడిమలు పైకెత్తి, పిక్కలు బిగబట్టి గెండు మోకాళ్ళమధ్య తెల్లగా మెరసిపోతుండే చెంబును కదలకుండా కట్టు దిట్టంగా పెట్టుకుని జుమ్మ జుమ్మనేటట్టు ధారలు ధారలుగా పాలు పిండుతున్నాడు. ఆవుప్రక్కనే దూడనూ కట్టారు. తమకు కావల సిన పాలు పిండుకున్న తరువాత మిగతాపాలు అన్నింటినీ దూడకే వదలి వేస్తారు. ఆవూ, దూడా రెండూకూడా అందంగా తెల్లగా మెరిసి

పోతూ ఉన్నాయి. కాని మద్రాసు వీధులలో తిరుగాడుతూఉండే ఆవులకంటె కొంచెం చిక్కినట్టుగా ఉన్నాయి. ఈ నడి వేసవిలో పాపం వాటికి పచ్చిక ఎక్కడ దొరుకుతుంది? రోజంతా వట్టి వరిగడ్డితోనే పొట్టనింపుకోవాలి. కాని వాళ్ళ ఆవుకు అలాంటిఅవస్థలేదు. మంచి రకం మాగబెట్టిన పచ్చికతోబాటు తోటలో చెట్ల ఆకులుకూడా కోసి వేస్తూఉంటారు. ఇంతలో పాలుపిండటం ముగిసింది. ఆవిడ ఆవుదగ్గరకు వెళ్లి దానిని నిమిరింది. ఆవు తన దూడను నాకడం ఆపి ఆవిడవంక తిరిగి తన చల్లని కళ్ళతో మెల్లగా చూచింది.

బెన్ మామిడిపండు అంతా తినేశాడు. కాని వాడి మూతి అంతా పేశం అంటుకుంది. నిజంచెప్పాలంటే వాడివళ్లు అంతా జిగురు పూసినట్టు అయిపోయింది. ఆ మూల నీళ్ళపంపు ఒకటుంది. "నేను కడగనా ఏమిటి?" అంది జాడీ అనిశ్చితంగా.

ఆవిడ నవ్వింది. "నిజమే,మీతమ్ముడు మా ఇంటికి ఒక పర్వ దినాన వచ్చాడు. శుక్రవారం ఎంతమంచిరోజని? ఎలాంటి పర్వమో నీకు తెలుసా?" అంది ఆవిడ. అవును అన్నట్టుగా జాడీ తల ఆడించింది. బడిలో తన సహాధ్యాయినులందరూ అలాగే అంటారు మరి. బెన్‌ను కొంచెం కడిగి తన గౌను చివరలో తుడిచింది.

"ఇప్పుడు మనం కొస్తకాఫీ త్రాగుదాం! రండి-" అంది ఆవిడ. జాడీ కొంత సంకోచించింది. తన దుస్తుల కేసి ఒకసారి చూచుకుంది. ఇంతకంటె కొంచెం మంచి బట్టలు తొడుక్కునివచ్చి ఉంటే బాగుండు ననుకుంది. కాని తనబట్టల సంగతీ, తను ఎలా ఉన్నదీ, ఆవిడకు పట్టనట్లేఉంది. ఆవిడ వాళ్ళు ఇద్దరినీ వసారాలోకి తీసుకు వెళ్ళింది. ఆవెళ్లేటప్పుడు వాళ్ళుదక్షిణాదిని, హిందూ గృహిణులందరూ గుమ్మాల ముందు వరిపిండితో రోజూవేసే ముగ్గుకు దాటి మరీవెళ్ళారు. వెళ్ళే

టప్పుడు ఆవిడ తన కాలిజోళ్ళు దూరంగా వదలి వెళ్ళిన సంగతిని జూడీ గమనించింది. భారతీయులు ధరించే చెప్పుల జోళ్ళను తొడుక్కోవ డమూ తేలికే. వదలడమూ తేలికే. ఎలాగైనా కట్టుకునే వాటి కంటె చాలానయం. వాటికి బొటన వేలికి ఒక ఉంగటం ఉంటుంది అంతే. ఆవిడ చెప్పులు జరీ పటకాలతో చాలా అందంగా ఉన్నాయి.

వసారా నిండా హాయిగా కూర్చోడానికి వీలైన పేము కుర్చీలు, చిన్న చిన్న బల్లలు చాలా ఉన్నాయి. ఆవిడ చల్లగా, కొంచెం వెలుతురు తక్కువగా ఉండే లోపలి గదిలోనుంచి ఎవ్వరినో పిలిచింది. మరుక్షణంలో నౌకరు ఒక పళ్ళెంలో కాఫీ గ్లాసులు పెట్టుకొని వచ్చాడు. అంటే తాము కాఫీ త్రాగే పాత్రలతోనే మేము కూడా త్రాగవచ్చునన్నమాట. ఈ విషయమై ఆవిడకు 'అంత పట్టింపు లేనట్టుగా ఉంది. ఈ సంగతి తెలియగానే జూడీకి ఎంతో బరువు వదలి పోయినట్టు, తెరపినపడ్డట్టు అనిపించింది. స్వాదు యోగ్యమూ, మనోహరమూ అయిన కాఫీ సువాసనతో కలిసి ఆవిడ తలలో తురుముకున్న తెల్లని, పచ్చని పువ్వులు వెదజల్లిన పరిమళాన్ని కూడా జూడీ ఆఘ్రాణించింది. వసారాలో నేల అంతా ఎంతో చక్కగా తుడిచి మెరుగు పెట్టినట్టు చాలా శుభ్రంగా ఉంది. కుండీలలోని మొక్కల ఆకులేవీ కూడా బయటలేవు. జూడీ అటూ, ఇటూ కలయమాస్తుండడాన్ని ఆవిడ గమనించింది. "శుక్రవారం ఎంత చక్కని రోజు!" అంది ఆవిడ ప్రతీదీ ఎంతో శుభ్రంగా పరిశుభ్రంగా ఉంటుంది. శుక్రవారంనాడు నేను ఎంతో పొద్దున్నే లేస్తాను. ఈ పరిశుభ్రతను గురించి ఆలోచిస్తూఉంటే నాకు బలేసరదాగా, హాయిగా ఉంటుంది.

"అందుకు మీరేం చేస్తారు ?" అంది జూడీ మెల్లగా.

"నేనా! నేను తలంటి పోసుకుంటాను. ఎంత బాగుంటుంది! వంటికి చాలామంచిది. ఎంతో హాయిగా, శుభ్రంగా ఉంటుంది. ఆరోజున నావేళ్లు, గోళ్ళు, జుట్టూ అన్నీ శుభ్రం చేసుకుంటాను. తరువాత పూజ గదిలో అన్నింటినీ నిగనిగ మెరిసేటట్టు తోమేస్తాను. ఒకరోజున మిమ్మల్ని అందరినీ తీసుకువెళ్ళి నా దేవతార్చన మందిరంలో మెరసిపోతూండే దేవుళ్ళు అందరినీ మీకు చూపిస్తాను. నేను వారిని పుష్పాలతో అర్చిస్తాను."

"అలాగా! మీరు పువ్వులు కోసుకుంటూ ఉండగా నేను చూశాను" అంది జూడీ. "ఎందుకో? మీరు ఆ పువ్వులను అంత జాగ్రత్తగా ఏరి కోస్తారు? అని అనుకుంటూ ఉండేదాన్ని."

"నిజమే! నీవు చెప్పినట్టు నేను పువ్వులను జాగ్రత్తగా శ్రద్ధగా ఏరిఏరి కోసుకుంటాను. ప్రతి పువ్వుకీ ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంది. అర్థంవుంది. అయితే మీకు ఎవ్వరికైనా ఇంకొస్త కాఫీ కావాలా? మీ పేరు?"

"నా పేరు జూడీ. వాడిపేరు బెన్. అంటే ముద్దుకు పొట్టిగా అలా పిలుస్తాము. అసలు పేరు బెంజమిన్. "బెంజమిన్" అదేదో చిత్రమైనపేరు అన్నట్టుగా నవ్వుతూ ఆవిడ అంది. "నేనూ విన్నాను. బెంజమిన్ అనేపేరుతో మాదేశంలో ఒక ఘనవైద్యుడున్నాడు." చాలా పంచదారవేసి పానకంలా తయారుచేసిన కాఫీని ఆవిడ మాగిన్నెలలోకి మరికొంత వంచింది. ఇంతలో నౌకరు కరకరలాడుతూఉండే చిట్టిగారెలు తెచ్చిపెట్టాడు. జూడీకి వాటి రుచి అంతుపట్టలేదు. బెన్ మాత్రం హాయిగా కూర్చొని నెమ్మదిగా కరకర లాడించడం మొదలు పెట్టాడు.

ఆవిడ చెప్పుకుపోతోంది. "శుక్రవారంనాడు మాత్రం ప్రతిదీ పరిశుభ్రంగా ఉండాలి. పువ్వులా తోమాలి. మెరిసిపోతూ ఉండాలి."

ఇంతలో జూడీకంటె కొంచెం పెద్దదైన అమ్మాయి ఇంట్లోనుంచి పరుగెత్తుకువచ్చి జూడీకి దగ్గరగా ఎదురుగా నిలబడింది. ఆ పిల్ల ఊదా రంగు చుక్కల చీర కట్టుకుంది. తలలో అప్పుడే కోసిన పువ్వులు తురుముకుంది. "హల్లో" అంది జూడీకేసిచూసి. "ఓ! నువ్వా? దేనికి?" అంది జూడీ. ఆవిడ ఈ ఇద్దరినీ చూసింది. ఇద్దరికేసీ చూసింది. "నీకు లక్ష్మి తెలుసా? మీ ఇద్దరికీ పూర్వపరిచయం ఉందన్నమాట!" అంది.

"ఓ!" అంది జూడీ. "లక్ష్మిని తెలుసు. బాగా పాడుతుంది కూడాను. అయితే ఇక్కడ ఉన్నట్టుమాత్రం తెలీదు."

ఆవిడ నవ్వింది. లక్ష్మి జూడీకి వివరించి చెప్పింది. "అప్పు డప్పుడు మా అమ్మణి పాటీగారింటికివచ్చి ఉంటూఉంటాను." అంటూ ఆవిడ చేయిపట్టుకుంది. "గోడ అవతల ఎవ్వరో ఉంటున్నారనే కాని అది మీరని నాకు లేదు."

"అసలు బెన్నే కంచెలోనుంచి దూరివచ్చాడు" జూడీ చెప్పడం మొదలుపెట్టింది. ఇంకా ఏదో చెప్పబోతోంది. ఇంతలో బెన్‌కు ఏమి జ్ఞాపకం వచ్చిందో, తాము కొత్తచోట ఉన్నామనుకున్నాడో ఏమో ఆయా కావాలంటూ కూర్చున్నాడు. వాణ్ణి కనుక ఇప్పుడు ఒక్కనిము షంలో తీసుకు వెళ్ళకపోతే రాగం లంకించుకుంటాడని జూడీకి తెలుసు. వెంటనే లేచి నిలబడి సెలవు తీసుకోబోతోంది. ఇంతలో ఒకాయన ఎవ్వరో వసారాలోకి వచ్చారు. ఆయనే బహుశా ఆవిడ భర్తా, లక్ష్మి తాతగారూ అయి ఉండవచ్చునని జూడీ భావించింది. ఆయన చేతిలో

అట్టలూడిన పాతపుస్తకాలు రెండు ఉన్నాయి. ఆయన జుట్టు ముందు పొట్టిగా కత్తిరించబడింది. వెనుకవైపున మాత్రం చాలా పొడుగుగా ఉంది. ఆయన లక్ష్మికేసిచూసి నవ్వాడు. జూడీకేసి వాత్సల్యపూరితంగా, అదేదో పుస్తకంలో బొమ్మని చూసినట్టు చూశాడు. జూడీ నమస్కారం పెట్టింది. కాని బెన్ మాత్రం గోనుపట్టుకు గుంజుతూనే ఉన్నాడు. వెంటనే వెళ్ళడం మంచిదనుకుంది.

లక్ష్మి వాళ్ళతో బాటు కంచెవరకూ వచ్చింది. నిజానికి జూడీకి లక్ష్మిఅంటె పక్క బెదురు ఎక్కువ. లక్ష్మి చాలాబాగా పాడుతుంది పైగా తన ఈడుకుమించిన వాళ్ళమధ్య ఎప్పుడూ తిరుగుతూ ఉంటుంది. వాళ్ళకి ఒకరికొకరు బాగా తెలుసు. అందరూ ఆటలలో బాగా చేయి తిరిగినవాళ్లు. వాళ్లు ఎవళ్లూకూడా జూడీబడికి వెళ్లనేలేదు. అంతలో లక్ష్మి అంది. "జూడీ కంచె విరగగొట్టకు!"

3. వటవిటపి నీడలో

లక్ష్మి వాళ్ళ బామ్మ గారింట కొన్నిరోజులే ఉంది. అయితేనేం, దాని ప్రభావం కనబడడం మొదలైంది. జూడీ బడిని గురించీ, ఇతర విషయాలను గురించీ అంతగా ఆలోచించడం మానివేసింది. ఏపని అయినా వెంటనే చేయడానికి ఉద్యుక్తురాలవుతోంది. ఇండియాలో ఇంతవరకు ఉన్నది చాలదన్నట్టుగా మరికొంతకాలం ఉంటే బాగుండు ననుకుంటోంది. లక్ష్మికి సినిమా తారలంటే మోజు. ఆమెకు ప్రతి పని చూడడం కంటె స్వయంగా చేయడమంటే చాల సరదా. ఆమె నీళ్ళలో మునిగి పోతున్న వాళ్ళని రక్షించగలగు. మునిగి చక్కగా ఈదుతుంది. ఇలియట్ బీచ్‌లో విరిగి తిరిగి పోతుండే అలల మీదుగా చక్కగా దూసుకుపోతూ ఈదింది. తమ పాఠ్యగ్రంథంలోలేని అనేక విశేషాంశాలు ముఖ్యంగా భారతచరిత్రలో ఒడలు గగుర్పొడిపించగల అనేక ముఖ్యఘట్టాలు ఆమెకు కొట్టినపిండి. అన్నింటిని మించి ఆమె చాలా అందంగా ఉంటుంది. సాధారణంగా జూడీ ఎవ్వరిని మెచ్చుకోదు. మెచ్చుకోవడం దాని స్వభావము కాదు. అయితే లక్ష్మి సంగతి వేరు. గాజులు తొడుక్కుంటున్నా, లేక వయ్యారంగా నృత్యం చేస్తున్నట్టు పదముద్రలు ప్రదర్శిస్తున్నా వనమయూరిని చూచినట్టుంటుంది. కొన్ని కొన్ని సమయాలలో లక్ష్మి జూడీ తలలో పువ్వులు తురుముతూ ఉంటుంది. తరచుగా చక్కని, చిక్కని వికసించిన గులాబీలను అలంకరిస్తుంది. అవి అన్నీ పూర్తిగా వాడి పోయి రేకులన్నీ రాలి పోయేవరకు జూడీ వాటిని తన తలలోనే ఉంచుకునేది.

కంచె అవతలి ఇంటివారు తమతో ఇంత స్నేహంగా ఉండడం జూడీ తల్లికి మొదట్లో కొంచెం ఆశ్చర్యమే కలిగించింది. అయితే జూడీ, బెన్, ఇద్దరూ అక్కడ అల్లరిచేసి చీకాకు కలిగించనంత వరకు

అంతా బాగానే ఉండవచ్చుననుకుంది. "జూడీ! బహుశా ఇంకొక వర్ణానికి చెందిన వాళ్ళం కావచ్చు. ఏమాట కామాటే అనుకోవాలి. చాలామంది భారతీయులు మనమంటే విశేషమైన ఆదరాభిమానాలనే ప్రదర్శిస్తున్నారు. బహుశా గతంలో జరిగిన కొన్ని సంఘటనల దృష్ట్యా చూస్తే మనలను వారు మన అర్హతలను మించి ఆదరిస్తున్నారేమో అనిపిస్తుంది." అంది వాళ్ల అమ్మ. ఇంతలో వాళ్ళ నాన్నగారు మాటల్లో మాట కలిపారు.

"మనతో బాటు, మనం ఈదేశానికి మంచి సంగతులు ఎన్నో తెచ్చాం. ముఖ్యంగా ఆధునిక విజ్ఞానం, వైద్యవిధానం, నిజాయితీ, వేళతప్పకుండా ప్రతీపని చేయడం వగైరా ఎన్నింటినో శుభసాంప్రదాయాలను ప్రవేశ పెట్టాం." జూడీకి ఇదంతా కంఠతావచ్చు. భారతదేశంలో బ్రిటిషువారి ఉనికి మంచిచెడ్డలను గురించి అమ్మా, నాన్నా తరచు ఎలా వాదించుకుంటూ ఉంటారో జూడీకి తెలుసు. ఒక్కొక్కసారి బడిలోకూడ ఈ విషయమై చర్చ బయలుదేరుతుంది. అలాంటప్పుడు తన సహాధ్యాయినులైన భారతీయ బాలికలందరూ, పాశ్చాత్యదేశాలనుంచి ముఖ్యంగా ఇంగ్లండు, స్కాట్లండులనుంచి లభించిన సత్సంప్రదాయాలను, ఉత్తమ లక్షణాలను పూర్తిగా మరచిపోయినట్లు మాట్లాడినప్పుడేమి, అవి అన్ని భారతదేశంలోనే పూర్వంనుంచి పాదుకొని ఉన్నట్లు మాట్లాడినప్పుడేమి జూడీకి చిర్రెత్తుకువచ్చేది. అలాగే గంటల తరబడి పాటలతో, ఆటలతో విసుగెత్తించే తమదేశపు చెత్త సినిమాలన్నీ అమెరికావాటికంటె మంచివని అన్నప్పుడల్లా జూడీకి వళ్లు మండిపోయేది. వీటన్నిటిని గురించి వీళ్ళు ఇలా అవాకులు చెవాకులు ప్రేలకుండా ఉంటే ఎంత బాగుండును? అనుకునేది జూడీ. ఇవన్నీ చెరగని చరిత్ర సత్యాలు. వీటిని గురించి ఎవరేమనుకుంటే

నేమిటి ? ఎవరు ఎన్నివిధాల మాట్లాడినా అవి మారవు. నిజమే యూరోపియనులు భారతీయులవంటివారు కారు. భారతీయులు సరే సరి. మావంటివారు కాదు. ఆ సంగతి గుర్తించకుండా మరెవ్వరో అయినట్టు ప్రవర్తించడం ఏమిబాగుంటుంది ? ఒకళ్ళకంటె ఇంకొకళ్ళు ఉత్తములని భావించడం వట్టి వెంగలితనం. అందుచేత వాటిని గురించి మన కిన్ని ఆలోచనలు దేనికి ? అనుకునేది. లక్ష్మి తండ్రి కుమార్ ఒక ఇంజనీరని నాన్నగారు చెప్పగా వింది. "బ్రాహ్మణులకు అంత సులభసాధ్యం కాకపోయినప్పటికీ అతనిని యూరప్‌కు వెళ్ళనివ్వవలసింది" అన్నారు జూడీ తండ్రి ఒకసారి. "అప్పుడు ఆయన పోర పాటున తినకూడనివి తినవచ్చు. అప్పుడు అంతా మరికి అనిపించవచ్చు. తప్పదు." అన్నారు ఆయన.

"ఇంజనీరంటే" అంది జూడీ. ఒక నదికి అడ్డంగా పెద్ద ఆనకట్ట కట్టుతున్నారు. ఆ పనిలో ఆయన సహాయకుడుగా పనిచేస్తున్నారు. ఆయనను గురించి మంచి మాటలే విన్నాను. మంచి పనివాడని, నిజాయితీకలవాడని, పెదమనిషిఅనీ, నికార్సైనవాడనీ విన్నాను" అన్నారు నాన్నగారు.

"నికార్సైనవాడు" అన్నమాట వింటూనే జూడీ మనస్సులో ఎంత చిత్రమైనమాట అనుకుంది. హఠాత్తుగా ఆమెకు నిబ్బరం నిజాయితీ లేనివాడెవ్వడో ఆ పరిసరాలలో తిరుగుతున్నట్టు అనిపించేది. అయితే లక్ష్మి తండ్రిని గురించి తన తండ్రి అభిప్రాయ మేమిటో జూడీకి తెలుసు. ఆయన లంచాలు పుచ్చుకోడనీ, బాగా కష్టపడి పనిచేస్తాడనీ, సాధారణంగా సెలవులుపెట్టి పని ఎగకొట్టడనీ, అన్నింటిని మించి నికార్సైనవాడనీ నిజాయితీ పరుడని అభిప్రాయం. ఇలాంటి వాళ్ళంటే తన తండ్రికి ఎంతో ఇష్టమని జూడీకి తెలుసు. నిజాయితీ

పరులంటే జాన్‌కి ఇష్టమే. క్రిందటి ఉత్తరంలో వాడు అంతా క్రికెట్‌ను గురించే వ్రాశాడు. బంతిని గురితప్పకుండా ఎలా కొట్టాలో వ్రాశాడు. బ్యాట్‌ను సరిగా పట్టుకోకపోతే బంతి ఎలాగురి తప్పుతుందో బొమ్మలుగీచి పంపించాడు. క్షేత్ర గణితంలో లెక్కలవలె ఈ బొమ్మలు విసుగుగా కనిపించేవి. పైగా అది అంతా చదువుతూ ఉంటే దారుణంగా కోపం వచ్చేది!

మద్రాసులో అప్పుడప్పుడు సాయంత్రంపూట క్రికెట్ ఆటల పోటీలు జరిగేవి. దాన్ని చూడడం కోసం పాపం వాళ్ళంతా మండు టెండలో చెమటలు కక్కుకుంటూ, రొప్పుకుంటూ పరుగెత్తేవారు. అది నిజంగా హాస్యాస్పదమైన దృశ్యం. వేసవిలో ఏదో ఒక నీడకు చేరుకుని, మామిడిపండు తింటూ నిలబడాలనిపించేది. అడయార్‌లో ఊడల మర్రి నీడక్రింద ఆడుకోవడం అంటే జూడీకి చాలా ఇష్టం. అది ఈ నాటిదా? చాలా ఏళ్ళనాటిది. దానిని బాగా పెంచి జాగ్రత్తగా పోషించుకుంటూ వస్తున్నారు. అందుచేత దాని కొమ్మలు నలుమూలలకూ బాగా విస్తరించి నేలలోకి ఊడలు దించాయి. కొంత కాలం అయ్యేసరికి ఈ ఊడలు బాగా ఊరి మరో చెట్టు కాండంలాగా తయారయ్యేవి. రోడ్డువారఉన్న మర్రిచెట్లుకూడా ఊడలు దించేవి. కాని, కొంచెం కిందకుదిగి అందుబాటులోకి రాగానే మేకలో, ఆవులో నమిలివేసేవి. కాని అడయార్‌లో మర్రి మాత్రం అలాకాదు. ఏటేటా అది విస్తరిస్తూనే ఉంది. దాని కొమ్మలు కొత్తఊడలు దించుతూనే ఉన్నాయి. వాటికి దాపుగా వెదురు స్తంభాలు మోపారు. పలక తోరణాలు బిగించారు. ఈ ఊడలవెంట కొన్నిపాకులు, లతలు ఎగ ప్రాకాయి. ఎప్పుడూ వందలకొలది పక్షులువచ్చి వాలుతూ ఉండేవి. ఉడతలు ఆకులమధ్యనుంచి కొమ్మలమీదుగా తలక్రిందుగా పాకి

పోతుండేవి. వాళ్ళ అమ్మ కనుక జూడీని అక్కడ వదలిపెట్టి "హోమ్ వర్క్" చేసుకోమని చెప్పినా లాభం లేకపోయేది.

మర్రిచెట్టునీడను కూర్చోవడం చాలామందికి ఇష్టమే! అసలు వచ్చిన చిక్కే ఇది. భారతదేశంలో ప్రతిచోట ఇంతమంది జనం లేకుండా ఉంటేనా! అనుకునేది జూడీ. వీళ్ళ మొహాలు బక్కచిక్కి వేలాడుతున్నట్టు ఉంటే కాళ్లుచేతులు మాచిమాచి విసుగెత్తి పోతోంది. ఇంక బిచ్చగాళ్ల సంగతి చెప్పనే అక్కరలేదు. మౌంట్ రోడ్డులో ఏదైనా దుకాణంలో అడుగు పెట్టుదామనుకుంటే చాలు. అనేకమంది బిచ్చగాళ్లు "అమ్మా బిచ్చం, అయ్యా బిచ్చం. తల్లీతండ్రీలేరు. ధర్మప్రభువులు నాయనా! ధర్మతల్లులు! తల్లీబిచ్చం" అంటూ ఆక్రోశిస్తారు. అసలు ఎవరు దొరుకుతారా అని ఆతృతగా వేచి ఉంటారు. వాళ్ళ మాటలు నిజమేనేమో? కావేమో? ఎవ్వరికీ తెలియదు. ఎంత దుర్భరమైన దృశ్యం అది. "ఇలాంటివాళ్ళకి ఎప్పుడూ ఎవ్వరూ ఒక్కదమ్మిడీ అయినా ధర్మం చేయకూడదు. అలాచేస్తే వాళ్లని ప్రోత్సహించినట్లు అవుతుంది." అంది జూడీ తల్లి. అయినప్పటికీ పసిపాపను ప్రదర్శించి అడుక్కుతినే అనాథకు ఆవిడ ఎప్పుడూ ఎంతో కొంత ధర్మంచేస్తూనే ఉంటుంది. అలాగే బెన్‌తో కలసి బయటకు వెళ్లినప్పుడుకూడా ఆవిడ ధర్మం చేస్తుంది.

"నేను మన బెన్‌కు అన్నీ కొంటున్నప్పుడు వాళ్ళకు తినడానికి ఏమీలేదన్న ఆలోచనే అదోలా ఉంటుంది." అనేది జూడీతో. అయితే జూడీ ఆమాటను నమ్మేదికాదు. వాళ్ళందరికీ ఇళ్ళదగ్గర తినడానికి ఎంతో కొంత ఉండకపోదు అనుకునేది.

ఇలా ఉండగా ఒకరోజున బట్టలుతికే వాసికితో కలిసి జూడీ వాళ్ళ ఇంటికి వెళ్ళింది. అది మద్రాసులో కాస్త ఖాళీగా ఉన్న ప్రతి

చోటా కనబడే వెదురు తడకల దడి కట్టుకుని తాటాకు కప్పు వేసుకున్న మట్టి ఇల్లు. వానికి ఇల్లు ఎంతో అందంగా శుభ్రంగా ఉంది. అయితే అందులో ఇతర సామాను ఏమీ లేదు. వానికితో బాటు ఆమె తల్లీ, ఆమె ఇద్దరు పిల్లలూ అందులో ఉంటున్నారు. కాని ఆపిల్లలు మాత్రం సిగ్గుచేత కాబోలు జాడీతో ఏమీ మాట్లాడలేదు. వాళ్ళు ఉన్నవ టిల్లో చాలామంది బట్టలు తొడుక్కున్నారు. అందులో చిన్నపిల్ల తొడుక్కున్నది జాడీకి చాలనందున ఇచ్చివేసిన దుస్తులతో తయారుచేసింది. గ్రామంలో ప్రజలు వంట చేసుకుంటున్నారు. స్నానం చేస్తున్నారు. బట్టలు ఉతుక్కుంటున్నారు. అయితే అక్కడా బిచ్చగాళ్ళున్నారు. వాళ్ళు అక్కడక్కడ కొంచెం అన్నం, కొంచెం పప్పు అడుక్కుని పొట్టపోసుకుంటూ ఉంటారు. కనుక వాళ్ళకి స్వంత ఇల్లు అంటూ ఏమీ లేవన్నమాట!

అయితేనేమి? బిచ్చగాళ్ళంటే జాడీకి అసహ్యం. అడయార్ మర్రిచెట్టుకు గల మరో ఆకర్షణ ఏమిటంటె అక్కడ బిచ్చగాళ్ళు అసలే లేకపోవడం. ఒకరోజున జాడీఒక పుస్తకం పట్టుకుని కూర్చుంది. కూర్చుంది అన్నమాటేకాని చిట్టచివరి చిటారుకొమ్మల మధ్య రెక్కలు తప తప లాడిస్తున్న అందమైన ముదురురంగు పక్షిని దేనినో చూడడానికి ప్రయత్నిస్తోంది. బాగా కనబడితే బాగుండును అనుకుంది. ఇంతలో లక్ష్మి నర్తకి దుస్తులు ధరించి అక్కడకు పరుగెత్తుకు వచ్చింది. మడమల దగ్గర బిగుతుగా ఉండేటట్టుగా పైన చిన్న ఊదాచీర మడచి కట్టిన ఆకుపచ్చని నూలు పైజమా తొడుక్కుంది. జాడీని పట్టుకుని అడిగింది. "వచ్చి నృత్యం చూడు" అని ఆహ్వానించింది. అంటూనే జాడీని చేతితో పట్టుకుని నృత్యశిక్షణ తరగతులు నిర్వహించబడుతున్న కళాక్షేత్రం తోట లోకి తీసుకుపోయింది. అది అంతా ఎంతో గందరగోళంగా ఉంది.

బడిలో చదువుకోవడమే కాకుండా లక్ష్మి ఎప్పుడూ ఏదో ఒకటి చేస్తూ ఉండడాన్ని జూడీ గమనిస్తూనే ఉంది. నిజానికి లక్ష్మికి ఎన్నో సంగతులు తెలుసు. ఎన్నో విద్యలు వచ్చు. అయినా బడి అంత ప్రధానమైనట్టు కనబడలేదు.

తుంగచాపలు పరచిన పెద్ద హాలులో ఒకమూల హాయిగా కూర్చోబెట్టి నృత్యం చూడమని లక్ష్మి పురమాయించింది. ఆ హాలు ఎంతో శుభ్రంగా ఉంది. పువ్వులతో చక్కగా అలంకరించబడింది. దీపాల వెలుతురులో మిలమిల మెరిసి పోతోంది. అక్కడ పది పన్నెండుమంది పిల్లలు అందరూ లక్ష్మివలెనే ఒకరకం గుడ్డలు ధరించారు. పైన చిన్న చీరలు, వోణీ బిగించారు. తలనిండా పూలు తురుము కున్నారు. ముఖ్యంగా జడమొదట్లో చక్కని పరిమళం వెదజల్లే పూల దండలు పెట్టుకున్నారు. పైన కప్పునుంచి వేలాడే రంగుతాళ్ళను ఒక్కొక్కరు ఒక్కొక్కటి పట్టుకున్నారు. వారందరూ లయబద్ధంగా తాళానికి అనుగుణంగా పదముద్రలు వేస్తూ ఈ రంగుతాళ్ళను జడగా అల్లారు. మూడు తీగలవీణ, పుస్తకంవలె ఉండే చిన్న హార్మనీ శ్రుతిగా వారు నృత్యం చేశారు. ఇంతలో లక్ష్మి "గ్రామీణనృత్యం" అంది. ఈ కోలాటం చూస్తూ ఉంటే ఇంగ్లండులో ఆరుబయట పచ్చిక మైదానాలలో చేసే "మేపోల్" నృత్యం జ్ఞాపకం వచ్చింది. అయితే ఇప్పుడు 'మేపోల్స్' లేనేలేవు.

"ఇంతలో లక్ష్మి చీర బిగించుకుంటూ, ఇప్పుడు నేను భరతనాట్యం అభ్యసించ బోతున్నాను" అంది. భరతనాట్యం అంటే భారతదేశపు నాట్యం అన్న మాట. దీనిని దేవదాసీలు దేవాలయాలలో మాత్రమే ప్రదర్శించేవారు. ఇప్పుడుమాత్రం అందరిదీని. జూడీ! ఈ

నాటికీ అది ఒకరకం ప్రార్థన మాత్రమే. అయితే బహుశా ఆనంద స్తోత్రం అన్నా కావచ్చు. నువ్వే చూస్తావుగా.''

అంతట వారు ఇరువురున్నూ కలిసి ఒక చిన్న గదిలోకి వెళ్లారు. బూడిద కొట్టుకున్న చెప్పులతో ఎవ్వరున్నూ ఆగదిలోకి ఎప్పుడూ రాలేదు. కనుక నేల నున్నగా, పరిశుభ్రంగా మెరిసి పోతోంది. సంగీత మేళాలేదు కాని ఉపాధ్యాయుడుమాత్రం పాట పాడాడు. చేతులతో తాళం వేశాడు. లేదా ఒక చిన్న కొయ్యముక్కతో దరువువేసేవాడు. మొదటి నృత్యం కేవలం శరీరాన్ని నృత్యం చేయడానికి వీలుగా తీర్చి దిద్దినటువంటిది. కీళ్ళను, వేళ్ళను నరాలను సన్నద్ధం చేయడానికి ఉద్దే శింప బడింది. దానిని చూస్తున్నంతసేపు లక్ష్మి తన కళ్ళ ఎదుటనే పూర్తిగా మారిపోతున్నట్లు జూడీకి అనిపించింది. రెండవ నృత్యం హావభావములకు అనుగుణంగా అంగవిన్యాస, కరవిన్యాస, పదవిన్యాసా లను ప్రదర్శించునట్టిది. ఆమె కన్నులు, మెడ అన్నివైపులకు అలవోకగా కదలిపోతున్నాయి. ఆమె కరపల్లవములు పాములవలె జరజర పాకి పోతున్నవి. ఆమె మోకాళ్లు, పిరుదులు సాగిపోయాయి. వేళ్లు దోన్నెలైనాయి. పువ్వులైనాయి. సమస్తజంతుజాలమున్నూ అయ్యాయి. ఒక పట్టున అర్థంకాని లయలో ప్రతిమెట్టుకూ ఒక అర్థముంది. ఒక్కొక్కప్పుడు ఎంతో మార్దవం ఒలికించుతుంది. అంతలోనే నృత్యంలో ఒక పులినో, మకిదేనినో ఎదుర్కొన్నట్టు ఒక విధమైన కర్కశత్వాన్నీ, కాఠిన్యాన్ని ప్రదర్శించుతుంది.

నేలమీద కూర్చుండి దీనినంతా చూస్తున్న జూడీకి ఎంతో ఆశ్చర్యం కలిగింది. ఇంత ప్రతిభాశాలిని అయిన లక్ష్మిని అసలు తాను ఎరుగుదునా అన్న సంశయం కూడా వచ్చింది. ఇంతలో పాట

ముగిసింది. లక్ష్మి తన జుట్టును వెనక్కి సవరించుకుంది. ఆమెకు చెమటపట్టింది. మామూలు లక్ష్మి అయింది.

"ఒకరోజున నేను నిజంగానే నృత్యం చేయ గలుగుదును కదా అనుకుంది. అప్పుడు నేను చాలా అద్భుతంగా ఉంటాను" అంది జూడీ కొంచెం భ్రమసిపోతూ.

"దానికేమి! మేము నీకు నేర్పుతాము" అంది లక్ష్మి. ఆ నాటికి నృత్యం పాఠాలు, అభ్యాసం ముగిసిన తరువాత లక్ష్మి, ఆమె మిత్రులు జూడీకి నృత్యం నేర్పడం ప్రారంభించారు. అయితే పాపం జూడీకి ఆపాఠాలు వంటపట్టనే లేదు. పాటకు అనుగుణంగా ఏమి చేయవలెనో ఆమెకు తెలియనే లేదు. ఆమె చేతులు, పాదాలు, వారి వాటితో పోల్చి చూచినప్పుడు మోటుగా ఉన్నట్లు ఉన్నాయి. అయినప్పటికి జూడీ అనేకసార్లు వచ్చి నృత్యాన్ని తిలకించింది. కథక్ నృత్యం ఎంతో అద్భుతంగా ఉంది. ఇది ఉత్తరాదివారి నృత్యం. క్షణక్షణానికి మారిపోయే తబలా నాదానికి అనుగుణంగా కాళ్ళకు గజ్జెలు కట్టుకుని పదవిన్యాసాలతో ఉత్సాహపూరితంగా నృత్యం చేయవలసిన ఫణితి దీనిది. చిన్నపిల్లలు ముందుగా దీనినే నేర్చుకుంటారు. వీరు కాళ్ళకు గజ్జెలుకట్టుకుని పదముద్రలు వేస్తుండగా గుర్రపు పిల్లలు గంతులు వేస్తున్నట్టుంటుంది. వీరు హస్తవిన్యాసాలు నేర్చుకుంటున్నప్పుడు చూస్తే సైనికుల కవాతు, వ్యాయామశిక్షణ జ్ఞాపకానికి వస్తుంది. ఇది అంతా నేర్చుకోవడం చాలా తేలిక అని జూడీ అనుకుంది కాని, మొత్తానికి అలా కాదు.

ఒకసారి వచ్చి జూడీ నృత్యం నేర్చుకుంటున్న మగపిల్లలు కొంద రిని చూసింది. వారు కథకళిని అభ్యసిస్తున్నారు. ఈ నృత్యం సగం

నటన. నర్తకులు ముఖానికి ముదురు, ఎరుపు, ఆకుపచ్చ, నలుపు రంగులు పూసుకుని బరువైన పెద్దదుస్తులు తొడుక్కొని వేషధారణ చేస్తారు. ఈ పిల్లలు మాత్రం అభ్యాసానికి తెల్లని పైజమాలు తొడుక్కున్నారు. ఆడపిల్లలవలెనే వీరుకూడా పట్టి కాళ్ళతోనే వచ్చారు. మొదటినుంచి చివరవరకు ఒక గాయకుడు వారు చేయుచున్న నృత్యానికి సంబంధించిన కథను గేయ ఫణతిలో ఉచ్ఛైస్వనమున రాగయుక్తంగా చెప్పుతూనే ఉన్నాడు. ఆ కథ వానర రాజైన హనుమంతునిది. ఆయన స్వయంగా అవతార పురుషుడు. యువకులైన వనపాలకులతో యుద్ధంచేసి, వారిని గుర్తించి చివరకు తన్ను బంధింప నిస్తాడు. కుప్పిగంతులతో హస్తనేత్ర విన్యాసాలతో బాణాలు ఎక్కుపెట్టుతూ ఈటెలను విసురుతూ ఒకరి నొకరు పరిహసించుకుంటూ ఆ బాలురు ఆ కథనంతనీ ప్రదర్శించారు. అదంతా చూస్తుంటే మన కళ్ళఎదుటనే వారునిజంగా, నిజమైన బాణాలు ఎక్కుపెట్టినట్లు ఈటెలు విసిరినట్లు, కాలిక్రింద నేల విచ్చిపోయినట్లు అనిపించుతుంది. చెమటలు కక్కుతూ హనుమంతుని వేషమును ధరించిన బాలనర్తకుడు ముందుకు దుమికినప్పుడు, సరిగా నిలదొక్కుకుని నిలబడి నప్పుడు శరీరమును వణికించినప్పుడు భగవంతుడే ఈ రూపంలో ప్రత్యక్షం అయినట్లు అనిపించుతుంది. "అద్భుతం, అద్భుతం" అనుకుంది జూడి. తన్ను తాను విస్మరించి మరొకరుగా మారిపోవడం ఎంత గొప్ప విశేషం అనుకుంది.

ఒక ఆదివారం రోజున వారంతా కలిసి మోటారుకారులో కోటకు వెళ్ళారు. అక్కడ చూడడానికి ఆహ్లాదకరంగా ఉండే పెద్ద ప్రభుత్వ సచివాలయం ఉన్నది. అక్కడే మద్రాసు అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాలు జరుగుతూ ఉంటాయి. అయితే ఆదివారం నాడు అక్కడ ఎవ్వరూ ఉండరు. ఒక్కటో రెండో మోటారుకార్లు ఉంటే ఉండ

వచ్చు. స్తంభాలు, వసారాలూ, తెల్లరంగుతో అందంగా హుందాగా ఉండే కిటికీల వరసలతో కూడిన ఎత్తైన భవనాల నీడలతో, దానివెనుక నున్న మైదానం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. అక్కడ ఉన్నవి చాలావరకు బారకీసులే. అయితే వాటిని ఉపయోగిస్తున్న సైన్యం వాటిని ఎంతో పరిశుభ్రంగా మూడ నుచ్చటగా తీర్చి దిద్దిపెట్టింది. ఇత్తడి గుబ్బలకు రోజూ మెరుగు పెట్టేవారు, పాతకాలపు రాతి ఫిరంగులకు నల్ల మెరుగు దిద్దేవారు. తెల్లని వృత్తాలమధ్య అమర్చేవారు. ఈత, తాడి, పోక, కొబ్బరి వగైరా మొక్కల ఆకులు అడ్డదిడ్డంగా పెరిగితే వాటినికూడా తీర్చి దిద్దినట్టు కత్తిరించేవారు. సెయింట్ జార్జి కోట ఆవరణలో ఒకచక్కని పురాతన వస్తుప్రదర్శనశాల ఒకటి ఉండేది. దానిముందు సముద్రం కేసి అద్భుతంగా అమర్చిన పాతకాలపు లోహపు శతఘ్నులు కొన్ని ఉన్నాయి. శీతకాలంలో జూడీ పాత గోడలపైకి ఎగబ్రాకి నడవడానికి ఎంతో కుతూహల పడేది. ఇప్పుడు మాత్రం వీలులేదు. ఇప్పుడు రాతిమీద చేయివేస్తే చుర్రుమంటుంది.

బస్తీలో ఇంకొక వస్తు ప్రదర్శనశాల ఉంది. కాని అక్కడ గుంపులు ఎక్కువ. అయినా అక్కడ ప్రదర్శించబడిన నమూనా గ్రామాలు అంటే బెన్‌కు చాలా ఇష్టం. ఆయాకు అక్కడ చల్లని చెట్ల నీడ అన్నా, ఆ నీడక్రిందకు చేరే ఇతర ఆయాలన్నా మరుక్కువ ఎక్కువ. ఆయా బెన్‌కు ఎప్పుడూ చిన్న కథలు చెప్పేది. ఆ చెప్పడం ఇంగ్లీషులో మొదలు పెట్టేది. నాలుగైదు మాటలు అయ్యేసరికి అప్రయత్నంగానే కథ అంతా తమిళంలోకి మళ్ళిపోయేది. అయితే బెన్‌కు ఈ కథలన్నీ ఎలాగో అలాగ అర్థం అయ్యేవి. అందుకనే జూడీ ఇతరులు వాడికి చక్కని ఇంగ్లీషులో చెప్పే కథలవలెనే, ఆయా చెప్పేవి నచ్చేవి.

కళాక్షేత్రంలో నృత్యం చూసిన తరువాత జూడీ శివుని తాండవ

మూర్తులన్నింటినీ, నటరాజ భంగిమలుగా అర్థం చేసుకోవడం మొదలు పెట్టింది. ఆ భంగిమం పద, హస్తముద్రలు, అంగుళి విన్యాసాలు, సామాన్యులకు ఏవో అనిపించినా శరీరాన్ని తూలకుండా నిలపడం కోసం అవసరమని గ్రహించుకో గలిగింది. ఒకరోజున తనూ లక్ష్మి మ్యూజియంలో ఈ నటరాజ విగ్రహాలున్న గట్టుదగ్గర కలుసుకొని, ఒకరి నొకరు చూసుకొని తల పంకించుకున్నారు. లక్ష్మి స్వంతంగా చిన్న నటరాజ విగ్రహాన్ని తనదగ్గర ఉంచుకునేది. దానికి విడిపువ్వులను ఎంతో అందంగా జాగ్రత్తగా అలంకరించేది.

ఆమె తండ్రిగారిల్లు మేడ. నవీనంగా ఉండేది. నగర మధ్యంలో ఉంది. వెడల్పైన వసారానిండుగా మొక్కల కుండీలు, కొట్టవచ్చి నట్టుగా చూపరుల కన్నులను ఆకర్షిస్తూ ఉండేవి. గదులు చాలా పెద్దవి. పచ్చవీ, నారింజరంగువీ, ఊదారంగువీ, మొక్కలలోకి తొంగి చూస్తున్న ట్టుగా ఉండేవి. ఆ ఇంటిలో పంకాలు, బందులు, అన్నీ సవ్యంగా చక్కగా పనిచేస్తున్నట్టుండేవి. పుస్తకాలు చాలా ఉన్నాయి. వాటిలో చాలాభాగం ఇంజనీరింగ్‌కు సంబంధించినవి. అందులోనే చైనా పక్షి బొమ్మ ఒకటుంది. అదంటే ఇద్దరికీ ఇష్టమే. లక్ష్మి తల్లి, అందంగా చూడ ముచ్చటగా, కలకలలాడుతూ ఉండేది. అయితే ఆవిడకి ఇంగ్లీషు అంత బాగారాదు. వాళ్ల నాన్నగారు ఎప్పుడు చూసినా పనితొందరలో ఉండేవారు. తీరికగా ఉన్నప్పుడు మాత్రం ఛలోక్తులు చాలా విసిరే వారు. ఆయనకు లక్ష్మి అంటే ప్రాణం.

జాడీ తరచుగా లక్ష్మిగారి మేడకు వెళ్ళేదికాదు. లక్ష్మి అక్కడ ఉన్నప్పుడు తన్నుచూచి ఆహ్వానిస్తారేమోనన్న ఆశతో చల్లగా కంచెలోనుంచి దూరి అవ్వలివైపున ఉన్న ఇంటి గుమ్మం దగ్గరకు వెళ్ళేది. లక్ష్మి తాతగారిని గురించి ఆమెకు గట్టినమ్మకం కలగలేదు. బహుశా

ఆయనకూడ ఈమె ఉనికిని అంతగా గమనించి ఉండకపోవచ్చు. ఒకటి రెండుసార్లు లక్ష్మి చెల్లెలు సరస్వతి వచ్చింది. సరస్వతి చిన్నపిల్ల. సరళ స్వభావం కలది. వాళ్ళ అన్న కందన్ తరచు వస్తూఉండేవాడు. వాడు వచ్చినప్పుడల్లా అంతా గొడవ గొడవగా ఉండేది. వాడు ఎప్పుడూ ఏదో వాగుతూ హడావుడిగా తిరుగుతూ ఉండేవాడు. లక్ష్మి బుల్లిచెల్లెలు పార్వతి. బెన్‌కంటె కొంచెం చిన్నది. దాని కాళ్ళకు వెండిగజ్జెలు కట్టారు. వాళ్ళతో గంటలు తరబడి ఆడేది. మొదట్లో కొంతకాలం గడిచిన తరువాత జూడీ, బెన్‌కూడ వొడ్డివైపువ ఇంట్లో ఉన్న ఆవిడను స్వంత మనుమలు పిలిచినట్లుగానే అమ్మణ్ణి పాటీ అని పిలిచేవారు. వాళ్ళు అలా పిలవడం ఆవిడకు ఇష్టమైనట్లే ఉంది.

అచిరకాలంలోనే ఆవిడ జూడీతో ఏవేవో కబుర్లు చాల చెప్పేది. ఒకరోజున వసారా గట్టుమీద కూర్చుండబెట్టి తన కథ నంతా చెప్పింది. "మా అమ్మా, నాన్న వట్టి పూర్వాచారపు వాళ్లు. సనాతన సాంప్రదాయాలంటే మక్కువ ఎక్కువ. నేనుకూడా సనాతన బ్రాహ్మణాచారాలు పూర్తిగా పాటించాలనే వారు కోరేవారు. నేను చదువుకుంటానని పట్టుబట్టాను. ఎంతో ఏడ్చాను. ఎంత గానో అరచేదాన్ని. ఓ! నేనెంత చెడ్డ పిల్లగా ఉండేదాన్నని!" అంటూనే తనలో తాను నవ్వుకుంది. "చివరకు ఎలాగైతేనేం నాకు చదువు చెప్పించారు. అది అంతే. నేను కళాశాలకు వెళ్ళాను. అక్కడ ఇంగ్లీషును బోధించే ఆవిడ ఒకతె ఉండేది. ఆవిడ నాకెంత సాయం చేసిందని! నేను నా దేశానికి ఎన్నో విధాల సేవ చేయా లనుకున్నాను. గొప్ప పనులు ఎన్నో చేయాలనుకున్నాను. మీరు-అంటే ఇంగ్లీషువారు - ఇక్కడ రాజ్యంచేస్తున్న రోజులలో మేము దేశ స్వాతంత్ర్యాన్ని కాంక్షించాము. అయితే ఆ కాలంలో నేను ఎన్నో

మంచి మంచి పుస్తకాలు, ఉత్తేజకరమైనవీ ఉదాత్త భావపూరిత మైనవీ ఇంగ్లీషులో చదివేదాన్ని. ఒక సంవత్సరంపాటు నేనూ పాఠాలు బోధించాను. అయితే మాకుటుంబములో అందరూ సనాతన సంప్రదాయాభిమానులని చెప్పానుకదా. అందువల్ల పెళ్ళిచేసుకోమని పట్టు బట్టారు. నేను బాగా చదువుకున్న వాణ్ణితప్ప ఇంకొకణ్ణి పెళ్ళి చేసుకోనని పట్టుబట్టాను. "సరే అల్లాగే లే! నీకు బాగా చదువుకున్న పండితుణ్ణి వరుడుగా వెదకి తెస్తాములే అన్నారు." అని ఆవిడ మళ్ళీ ముసి ముసి నవ్వులు నవ్వుతుంది. "అది అంతా అలా జరిగింది! జూడీ" అంది.

"ఆ తరువాత నీకు పెళ్ళి అయిందా?"

"ఆ! అయింది. ఇందుకోసం నేను ఇంతగా కష్టపడవలసి వచ్చింది. కాని నా కూతుళ్ళుమాత్రం చదువుకోవడానికి అంతగా ఇష్టపడలేదు. వాళ్ళలో ఒక్కగుకూడా బి. ఏ. దాకానైనా చదవలేదు. అందుచేత వాళ్ళందరికీ పెళ్ళిళ్లు చేసేశాము. నాకు చాలామంది మనుమలు పుట్టారు. మా అబ్బాయి కుమార్‌కు మాత్రం చదువుఅంటే ఎంతో శ్రద్ధ. వాడికి సంస్కృత పండితుడుమాత్రం కావాలనిలేదు. సంస్కృత పండితుడు కావడంకంటె నాకుమల్లేనే దేశంకోసం ఎన్నో మహాకార్యాలు సాధించ దలచుకున్నాడు. కనుక వాడు ఇంజనీరు అయ్యాడు. యూరోపు ఖండానికి వెళ్ళాడు. మొదట్లో మేము కొంచెం భయపడ్డాం. కాని వాడు చాలా మంచివాడు. ఇప్పుడు ఈ తరంలో లక్ష్మికూడా అంతే.

"అయితే, అమ్మణ్ణిగారూ! లక్ష్మి పెద్దదైనతరువాత ఏమి అవుతుం దంటావు? నర్తకి అవుతుందా?"

"అదా నృత్యం చేస్తుంది, కాని నర్తకి మాత్రం కాదు. నా అభి ప్రాయం, అది కాలేజీకి వెళ్లి చదువుకుంటుంది. బహుశా పాఠాలు బోధించవచ్చు కూడా."

"లేదా కవయిత్రి కావచ్చు" అంది జూడీ. ఎందుకంటే లక్ష్మి ఒకసారి తాను రచించిన వంటూ కొన్ని పద్య పాఠాలుచదివి వినిపించింది. అవి బాగానే ఉన్నాయనుకుంది జూడీ. "అవునమ్మా జూడీ నిజమే, లక్ష్మి కవయిత్రి కావచ్చు. మరి నీమాట ఏమిటి?"

"నాకేం తెలుసు" అంది జూడీ. కాని నృత్యం చెయ్యడమూ రాదు. పద్యాలు కట్టడమూ రాదు. అనుకుంటాను. అమ్మణ్ణిపాటీ, "మీ ఇంట్లో ఉన్న ఫోటో కాస్త చూపించుమా" అని అడిగింది.

ఆ ఇంట్లో గ్రామఫోనుగాని, రేడియోగాని ఏమీ లేనప్పటికీ లోపలఅంతా, ఎంతో చక్కగా ఉంది. జూడీకి ఎంత చూసినా తనివి తీరలేదు. పరుపులంత పెద్దబల్లలున్నాయి. వాటిమీద మెత్తలున్నాయి. వాటిలో లేసుపని చాలాచేశారు. బిళ్ళపెంకులు పరిచిన నేలమీద తివాచీలు పరిచారు. బాగా నగిషీ చెక్కిన చిన్న చిన్న బల్లలు, బొమ్మలు చాలా ఉన్నాయి. ఇందులో కొన్ని హుందాగా కనిపించేవి. అలాంటి బొమ్మలను పటాలు కట్టినవి. వాటిలో కొన్నింటికి దండలు కూడా తగిలించారు. వీటన్నింటిలోకి జూడీకి బాగా నచ్చినవి రెండే రెండుబొమ్మలు. అందులో ఒకటి పొడు గాటి మస్లిను అంగరకాలు, జరీ తలగుడ్డలు ధరించి చిన్న చిన్న బాణాలతో దేనికో గురిచూసి బాణం వదలుతున్న భారతీయ స్వదేశ సంస్థానాధీశులవి. వారి వెనుక అందమైన రహదారులతో, పువ్వుల మొక్కల మడులతో, వికసించిన పూలచెట్లతో, నెమళ్ళతో నిండిన దృశ్యం రమణీయంగా ఉంది. ఒక అంగుళం ఎత్తు ఉన్న మామిడి

చెట్లు ఉన్నాయి. కాని వాటిని కాసిన పళ్ళను లెక్కపెట్టవచ్చు. రెండవ బొమ్మ సరస్సు ఒడ్డున అద్దం చూసుకుంటున్న అందాల రాణిది. గాలికి ఆమె పమిటికొంగు రెపరెపలాడుతున్నది. ఆ చిన్న అద్దంలో ఆమె ముఖసౌందర్యమంతా ప్రతిబింబిస్తున్నది. సన్నని కాళ్ళతో, పెద్ద పెద్ద కళ్ళతో చక్కని చుక్కల రేఖలు, పొడుగాటి కాళ్ళు, వంకర ముక్కులు కల పక్షులూ ఉన్నాయి. ఈ బొమ్మ అదేదో రాగానికి సంబంధించినదనీ, రోజులో నిర్ణీత సమయంలో మాత్రమే ఈ బొమ్మకు సంబంధించిన రాగాన్ని పాడవలసి ఉంటుందనీ అమ్మణ్ణిపాటీ చెప్పింది. ఈ బొమ్మలు జూడీకి బాగానచ్చాయని తెలియగానే అమ్మణ్ణిపాటీ తాను సందూకు పెట్టెలో దాచిపెట్టిన బొమ్మలు మరి మూడు తీసి చూపించింది. ఒకటి ఈటెలు, బల్లెములు, ధరించిన వేట గాళ్ళు కొందరు చూస్తుండగా తొండాలు పైకెత్తి ఘీంకరిస్తూ ఏనుగులు పోట్లాడుకుంటున్నప్పటిది. రెండోది తన ముంజేతిపై భీకరమైన లేత పసుపురంగు డేగను ఎక్కించుకొని గంభీరంగా సాగిపోతుండే మానిసిది. ఆయన బూడిదరంగు గుర్రం ఎక్కి కారుమబ్బులు కమ్ముకువస్తుండగా ఎక్కడికో వెడుతున్నాడు. ఆ గుర్రపుతోక నల్లగాఉంది. కాళ్ళకు ఎర్రరంగు వేశారు. మూడవది ప్రతి ఈకకు అందంగా రంగువేసిన చిలుకది. ఇందులో ప్రతిదీ తన తండ్రిని సైతం తప్పక మెప్పించగల దని జూడీ అనుకుంది. అవి అన్నీ పాతబొమ్మలన్నీ ఎంతకాలంనుంచో తమ ఇంట్లో ఉంటున్నాయనీ అమ్మణ్ణిపాటి చెప్పింది. అందుకనే వాటిని అంత జాగ్రత్తగా ఆ సందూకు పెట్టెలో పెట్టి దాచాననికూడా ఆవిడ వివరించింది.

ఆ ఇంటిలో ఉన్నది ఇదేకాదు. ఒక గాజుతలుపు బిగించిన పెట్టెలో అందమైన వీణ ఒకటుంది. దానిమీద తీగలు, పువ్వులు,

దంతంతో చెక్కి ఎంతో సున్నితంగా తాపడం చేశారు. అప్పుడప్పుడు అమ్మణ్ణిపాటీ దానిని తీసి వాయిస్తూ ఏవేవో పాటలు పాడేది. ఆవిడ ఎప్పుడు పాడినా విషాద గీతాలే పాడేది. ఆ సమయంలో వేళకాని వేళ అనుభూతిలోకి వచ్చేది. ఆ పాటలు బడిలో ఆడపిల్లలందరూ పాడే సినిమా పాటలకంటె ఎంతో భిన్నమైనవి.

ఆ ఇంటిలో అందమైన పెట్టెలు ఇంకా ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా కొట్టుగదిలో పోపుల పెట్టెలు, బియ్యమూ, పప్పులూవగైరా దాచుకునే భోషాణాలు ఉన్నాయి. పోపుల పెట్టెలో మసాలా దినుసులనుంచి, పళ్ళనుంచి ఎంతో మంచి పరిమళం వెలువడి ఘ్రాణతర్పణంగా ఉండేది. నిజానికి ఆ ఇంటిలో అన్ని గదులూ ఒక ఎత్తు. పూజా మందిరం ఒకఎత్తు. ప్రశాంతమైన చిన్నగది. పట్టి పాదాలతో నడిచే వారికి చల్లగా తగిలే నేలతో ఎంతో పరిశుభ్రంగా, నిగనిగ మెరిసిపోతూ ఉండేది. దానినిండా దేవతామూర్తుల పటాలు చాలా ఉండేవి. ఆ పటాలతోబాటు కుందులూ, సెమ్మెలు, పువ్వులు అక్కడే ఉండేవి. జూడీని అక్కడికి తీసుకు వెళ్ళడానికి అమ్మణ్ణిపాటీకి అంతగా అభ్యంతరమేమీ లేకపోయింది. ఎంతో ఆత్మీయంగా కుటుంబంలోని ఆప్తులలో వలె తన ఇష్టదేవతలను గురించి ముచ్చటించేది. ఆవిడ మాటలు వింటుంటే తానూ, ఆ దేవుళ్ళూ, దేవతలూ అందరూ ఒకేకోవకు చెందినవారమన్నట్టుగా ఉండేది.

4. స్వాతంత్ర్య దినం

శ్రావణ మేఘాలు బాగా ముసురుకొంటున్నాయి. బహుశా వాన కురవక పోవచ్చునని అందరు అనుకొంటున్నారు. దూరాన ఎక్కడో ఉరిమి ఉండవచ్చుననుకొంటున్నారు.

వాన కురిసినట్టయితే కిటికీ తలుపులు మూసివేయవలసిందని జూడీ వాళ్ళ నాన్నగారు వంటమనిషి జార్జికి పురమాయించారు. ఇంకా మరెన్నిపనులో చెప్పారు. జార్జి అన్నింటికి "సరే సరే" అంటూ ఆయన చెప్పినదానికల్లా తల ఊపాడు. కాని వాడి ధోరణే వాడిది. కాని మేఘాలు ఎప్పటికప్పుడు ముసురుకున్నట్టే ముసురుకొని మళ్ళీ అంతలోనే చండభానుని ఎండ వేడికి తట్టుకోలేక పారిపోతున్నట్టుగా అప్పటికప్పుడే విచ్చిపోతున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవంనాడు ఆస్పత్రిలో జరిగే విందుకు మనం తప్పకుండా వెళ్లాలన్నారు, జూడీ వాళ్ళ నాన్నగారు.

అవును అంది వాళ్ళమ్మ. దర్జీవాడు వస్తాడు కూడాను. అంటూ వాళ్ళమ్మ జూడీకేసి చూచింది. ఏనుగుల బొమ్మలు అద్దిన ఖాదీగుడ్డ యింటిలో వుందికదా — "అయితే అమ్మా నేను వళ్ళంతా ఏనుగుల మయం చేసుకోవాలా" అంది జూడీ. అలా అనడంలో జూడీ అసలు అభిప్రాయ మేమిటో వాళ్ళ నాన్నగారు గ్రహించారు. చేతితో వడికి మగ్గంమీద పల్లెటూళ్ళలో నేసిన ఖద్దరు కట్టుకోవడం ఆమె కిష్టంలేదు. అయితే భారతదేశంలో నివసిస్తున్న అనేకమంది నిరుపేదలైన స్త్రీ పురుషుల సంగతి తెలిసినవారు మాత్రంను గ్రామాలలో నివసిస్తున్న వీరందరికి కొంచెం డబ్బూ తిండీ లభిస్తాయన్న నమ్మకంతోనూ, ఆశతోనూ ఖద్దరు కట్టుకొంటున్నారు. భారత ప్రభుత్వంలో అత్యున్నతమైన

పదవులను నిర్వహిస్తున్నవారుసైతం ఖద్దరే కట్టుకొంటున్నారు. ఖద్దరు చాలా ముతకగా వుంటుంది. దానిని చాకళ్ళు రాళ్లు బ్రద్దలు కొట్టడానికి వాడుకొంటారని హాస్యోక్తిగా చెప్పుకొంటారు. చాకళ్ళు గుడ్డలను నీళ్ళలో ముంచి బండకేసి బాదుతూ వుంటారు. దానితో దుప్పట్లు తల గడా గలీబులు చాలాకాలం మన్నవు. చప్పున చిరిగిపోతూంటాయి. అందు చేత మన బట్ట లన్నింటిని యింటిదగ్గర వుతుకుకొనుటే మంచిది. ఖద్దరు కట్టడమంటే జూడీ కంతగా యిష్టంలేదని వాళ్ళమ్మకు కూడా తెలుసు. మన యిష్టానిష్టాల ప్రమేయం లేకుండానే ప్రతివారూ విధిగా కట్టితీరా లని వాళ్ళమ్మ భావిస్తూ వచ్చింది. అంతలో వాళ్ళ నాన్నగారు అంటు కొన్నారు. మీరంతా చేనేతభవనానికివెళ్ళి అక్కడ ఏమేమిఉన్నాయో చూచి రాకూడదా! నేను జూడీకి ఒక కొత్తరకం బట్టలు కొని పెడతాను. 'బలే బాగుందిలే' అంది జూడీ. ఆ ప్రకారం వాళ్లంతా వెళ్లారు. చేనేత భవనానికి వెళ్ళడమంటే జూడీకి చాల యిష్టం. అక్కడ తల్లితో చెప్పి చాలా సరుకులు కొంటూంటుంది. అక్కడ నూలుబట్టలు చేతితో నేసినవేకాని ఖద్దరుకంటె సన్నగా, నాజూకుగా వుండేబట్టలు తానులు అనేక మున్నాయి. అక్కడ అమ్మేవాటిలో చాలభాగం మరనూలుతో నేసినవే. అక్కడే ముడిపట్టు, ముతకగా, బరువుగా, బాగా రంగు అద్దిన బట్టలు చాలా దొరుకుతాయి. అయితే అది ఎండకాలంలో కట్టుకో డానికి పనికిరాదు. జూడీ వాళ్ళ అమ్మను బ్రతిమాలి నలుపు, లేతపసుపు అంచుగల పట్టుగుడ్డలో చీరపావడవు చింపించుకోవాలని చూసింది. అయితే దీనితో దర్జీవాడు ఏం కుడతాడో ఎవరికీ తెలియదు. అయినా ఆరు గజాలు దేనికి? ఎక్కువే. అబ్బో! అనుకున్నారు చివరికివిలాగైతేనేమి! వారు ఎరుపు, లేతపసుపురంగు చారలగుడ్డ నొకదానిని, రెండురకాల నీలం గుడ్డలను కొన్నారు. ఇందులో చారలు పరికిణీమీద నిలువుగానూ

చేతులులేని చొక్కామీద అడ్డంగాను వచ్చేటట్టు కుట్టించాలను కొన్నాను.

దర్జీవాడికి నచ్చ చెప్పడమంత తేలికకాదు. వాడు చాలామంచి వాడు. అప్పుడప్పుడు యింటికివచ్చి ఎవరో ఒకరు కనబడి పలకరించే దాకా రెడ్డిగం వేసుకొని నిశ్శబ్దంగా గుమ్మంలో కూర్చునేవాడు. గుడ్డల నన్నింటిని తన దుకాణానికి తీసుకువెళ్ళి త్వరత్వరగా కుట్టియిచ్చేవాడు. దుకాణమంటే దుకాణమా! అదొక చిన్నకొట్టు గది. వాడు వెంటనే యివ్వలేనంటే లేక ఆలస్యం అవుతుందంటే దాని కర్థం రేపుతప్పితే ఎల్లుండి యిస్తాడన్నమాట. అంతకు దాటనివ్వడు. అది యిచ్చి కుట్ట మంటే అమోఘంగా కుడతాడు. మార్చి కుట్టమంటేమాత్రం అంత బాగా కుట్టలేడు. ఇంక జూడీ నిరుడు వేసవిలోకంటె 3 అంగుళాలు పెరిగింది.

స్వాతంత్ర్యదినం సెలవుదినం. నిన్న సాయంత్రం నుంచే మేళ తాళాలతో మేజువాణీ రాత్రల్లా జరుగుతూనే వుంది. దానిని బట్టే తెలిసింది. ప్రతిచోట అలంకరణ బాగా జరిగింది. భారత పతా కాన్ని ఎగురవేశారు. అది చక్ర చిహ్నితమైన త్రివర్ణాంచిత పతాకం. దీనిలోనున్న చక్రం రాట్నచక్రం. ఇటువంటి దానినే గాంధీ ఉప యోగించేవారు. ప్రభాత భేరీలు, ఊరేగింపులూ, ఉపన్యాసాలు అన్నీ ఉన్నాయి. ప్రతివాడు రెండవవాడికి పూదండ లిచ్చాడు. 1947 లో బ్రిటిషు పాలననుండి భారతదేశం స్వాతంత్ర్యాన్ని సంపాదించిన రోజుయొక్క వార్షికోత్సవమది. అయితే ఆ బ్రిటిషువారు అన్నప్పుడు జూడీ వాళ్ళ తండ్రి, తల్లి వంటివారు కూడా వారిలో చేరుతారన్న సంగతిని ఎవరూ గమనించినట్టే లేదు. నిజమే! స్వాతంత్ర్యము చాలా

దొడ్డ విషయం. జూడీ తల్లీ, తండ్రి చాలా మంచివాళ్ళు కనుకనే వాళ్ళు అంతగా సంతోషించారు. కాకమరేమిటి ?

ఆస్పత్రిలో జెండాలు, రబ్బరు బుడగలు, నినాదాలు అందంగా అమర్చారు. బంట్రోతులు ఆయాలు వారి కుటుంబాల వారందరతో సహా ప్రతివారికి యివ్వడంకోసం చాల తేనీటిని సిద్ధపరచారు. ఆనాడు వారంతా చౌకవే అయినా అందంగా వుండే బట్టలు కట్టుకువచ్చారు. పరిదీనవదనంతో బక్క చిక్కిన ఆస్త్రీలలో కొందరు చేతులకు గాజుగాజులు తొడుక్కున్నారు. మరికొంతమంది ఒక్క వెండి తాయెత్తునో లేక మురుగునో ధరించారు. వాళ్ళకున్న ఆస్తంతా అదే అనుకోవాలి. ఆస్పత్రిలో ఉండే వైద్యులలో ఒకడు యీ అలగా జనం గురించీ, వాళ్ళతోవుండే కులభేదాలను గురించీ, వివరించి చెప్తూ జూడీ తల్లికి ఒక ఉపన్యాసమే యిచ్చాడు. అయితే యీ ఆస్పత్రిలో అట్టి కులమత భేదాలేమీ పాటించడం లేదన్నాడు. 'అలాగా' అంది జూడీ తల్లి.

అక్కడవున్న నర్సులలో కొంతమంది చాలా ఆకర్షణీయంగా ఉన్నారు. జూడీకి ఇంజెక్షన్లు చేసినప్పుడు సాయంచేసిన ఆ నర్సమ్మ మరీ ఆకర్షణీయంగా వుంది. మిగతావారంతా ఆయా వార్డులలో రోగుల కందరకీ తేనీటిని పట్టిస్తున్నారు. ఆరోజున కొన్ని ఉపన్యాసాలుకూడా వున్నాయి. బహుశా అవంటే వాళ్ళకి యిష్టంకాబోలు. పాపం యింతా చేస్తే వాళ్ళకి వార్డులలో రేడియోలు అయినా లేవు. వాళ్ళలో కొంత మందికీ చదవడం, వ్రాయడం వచ్చు. అలాంటి వాళ్ళకి ఉపన్యాసం వినడంకూడా విశేషమే.

జూడీ తండ్రి ఉపన్యాసం యివ్వవలసి ఉంది. అది వినడానికి జూడీకిమాత్రం చికాకుగానే ఉన్నా మిగతావారందరికీ నచ్చినట్టుగానే

ఉంది. వాళ్లు ఆయనకు పెద్ద పూలదండ వేశారు. దానినిండా పచ్చవీ, ఎర్రవీ, తెల్లవీ పువ్వు లెన్నో గుచ్చారు. అవి పరిమళాలను వెదజల్లు తున్నాయి. దండ అంతా చెమికీ పోగులతో మెరసిపోతోంది. అయితే ఆ దండలను అలాగే మెడలో వేసుకుని చాలాసేపు కూర్చోవడం సంప్రదాయం కాదు. ప్రతిచోట పువ్వులూ, రేకలూ చాలాఉన్నాయి. కొంతమంది భారతీయులైన వైద్యులు ఆటల పోటీలు, సంగీతపు కుర్చీలు-చమ్చాలో కోడిగుడ్డు వంటివాటిని - ఏర్పాటు చేశారు. అయితే ఆటల కోసం చక్కని కోడిగుడ్లను పాడుచెయ్యడం ఎవ్వరికీ ఇష్టంలేకపోయింది. అందుకని గుడ్లకు బదులుగా పచ్చని నిమ్మపళ్ళు వాడారు. అవైనా ఆ చెమ్చాలలో నిలపడం కష్టమే. వాళ్ళు అందరూ జూడీ తండ్రిని ఎంత గానో ప్రోత్సహించారు. ఆయన నెగ్గేటట్టు చేయాలనుకున్నారు. జూడీ రబ్బరు బుడగల పందెం గెలిచింది. ఆమె కొత్తగా కుట్టించు కున్న చొక్కా చక్కగా కుదిరింది. దర్జీవాడు కొంచెం పొడుగు పెట్టి సరిపోయేటట్టు కుట్టాడు. అప్పుడు అక్కడ లక్ష్మికూడా ఉంటే ఎంత బాగుండును అనుకుంది. చాలా సరదాగా ఉండేది కదా అనుకుంది. బహుశా లక్ష్మికూడా అక్కడెక్కడో నిలబడి ఊరేగింపు చూస్తోం దేమో! లేదా ప్రతిచోట జరుగుతున్న పార్టీలలో దేనిలో ఒకదానిలో పాల్గొంటున్న దేమో!

వారంతా ఒక పెద్ద చింతచెట్టునీడను కూర్చొని నిమ్మరసం, నారింజపళ్ళరసం త్రాగారు. తెల్లని సూట్లతోనూ, రంగు చీరలతోనూ ఆస్పత్రి ప్రాంగణమంతా ఎంతో శోభాయమానంగా మెరిసిపోతోంది. గంగరావిచెట్లు పూలతో కలకలలాడుతున్నాయి. జూడీ తల్లి ఆ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఇతర వైద్యుల భార్యాలతో మాట్లాడుతోంది. జూడీ తన బడిలోనే చదువుకుంటున్న మరొక డాక్టర్ కుమార్తెకేసి

చూస్తూ ఏవేవో సైగలు చేస్తోంది. లేచి మాట్లాడడానికి లేనంతగా ఎండ తెకతెకలాడిపోతోంది.

ఇంతలో మరొక డాక్టర్ గారు ఎవ్వరోవచ్చి తనభార్యను పరిచయం చేశారు. ఆమె మిగతా అందరికంటె ఎంతో పొడగరి. భుజాలు చాలా ఎత్తు. ఆమె తల ఎత్తుకుని ఠీవిగా నిలబడింది. ఆమె ధరించిన దుస్తులు కూడా మామూలుగా అందరూ ధరించే వాటికంటె కొంచెం భిన్నంగా ఉన్నాయి. ఆమె భుజంమీద పింగాణీ పూతకలిపి బంగారంతో చేసిన చక్కని పువ్వు గుచ్చుకున్నది. ఒక్కనిమిషం గడచీ గడవక మునుపే ఆమె తాము ఈ ప్రాంతంవారము కామనీ, ఉత్తరాదినుంచి వచ్చామనీ తెలియపరచింది. ఆవిడ ఇంగ్లీషు చక్కగా మాట్లాడింది. గృహనిర్వహణ ఇక్కడ ఏమైనా ఇబ్బందిగా ఉన్నదా? అని జూడీ తల్లి ఆవిడను అడిగింది. "తమిళం నేర్చుకోవలసి వస్తోందా?" అని కూడా అడిగింది.

"తమిళమా అబ్బే! ఎప్పుడూ నేర్చుకోను" అంది ఆవిడ తలకాయను అడ్డంగా ఆడిస్తూ. "అసలు మీరు భారతదేశం ఏంచూశారు. మీరు ఉత్తరాదికి వెళ్ళకపోతే అసలు భారతదేశాన్ని చూడనట్లే. ఢిల్లీ, ఆగ్రా! ఓ! ఏం చెప్పమంటారు. అక్కడి కొండల అందం. అబ్బే ఈ దక్షిణాది దానిముందు దిగదుడుపు" అంది.

ఈ మాటలు ఎవరైనా విని బాధపడతారేమోనని జూడీ అనుకుంది. అయితే అలాంటివాళ్ళు ఉన్నా ఆవిడ అంతగా లెక్కచేయదనీ, బహుశా వాళ్లు విని భాధపడాలనే ఆమె అలా చెప్పిందేమోనని జూడీ అనుకుంది. ఈ పెద్దవాళ్లు ఇలా ఉంటారేమిటి? మంచీ మర్యాదా లేకుండా? అనుకుంది. ఇంతలో చక్కని చిన్న కుర్రవాడొకడు చిక్కని తలకట్టుతో అక్కడకు పరుగెత్తుకుంటూ వచ్చాడు. "మా

అబ్బాయి హరిదాసు'' అంది. వాడు కరచాలనంచేసి చిరునవ్వు నవ్వాడు. తల్లులిద్దరూ మాటలు మళ్ళీ మొదలు పెట్టిన తరువాత వారు కూడా మాట్లాడడం మొదలు పెట్టారు. ఇంతలో ఎవ్వరో ఆకునిండా అరటి బొరుగులు తెచ్చారు. అవి బంగాళాదుంప బొరుగులకంటె బాగా ఉంట్యాయి. వాటికోసం ఇద్దరూ చేతులు చాచారు.

ఆ తరువాత త్రాడు లాగుడు పందెం జరిగింది. అందరూ అందులో చేరడం కోసం అటుకేసి పరుగెత్తారు. ఒకటే కలకలం, ఒకటే రొద, గోలగోల! అరుపులూ కేకలూ. ఇలాంటి దెప్పుడూ వినలేదు అనుకుంది జూడీ. వారంతా ఎందుకో ధుమధుమ లాడు తున్నట్టుగా ఉన్నారు. నిజానికి వాళ్ళ నాన్నగారి జట్టు గెలిచినప్పుడు వారంతా ఎంతో సంతోషించారు. ఆ తరువాత చిన్నపిల్లల మధ్య తాడులాగుడు పందెం జరిగింది. ఆడపిల్లలు పమిటి కొంగులు నడుముకు బిగించారు. మగపిల్లలు తాము భీమబలుల మన్నట్టు నటించారు. జూడీ, హరిదాసు ఇద్దరూ తాడుకు ఒకవైపునే ఉన్నారు. ఇద్దరూ జోళ్లు బాగా గుచ్చి తన్నిపట్టారు. తమ యావత్తు శక్తితోను తాడును పట్టి లాగుతున్నారు. అయితే వారిని ఎదటి జట్టువారు మధ్య గీతమీదుగా ఈడ్చినప్పుడు, అవ్వలివైపున ఇద్దరే ఉన్నట్టయితే తాము తప్పకుండా నెగ్గి ఉండే వాళ్ళమే అనుకున్నారు. అలాగే వారు చెమటలో రొప్పు కుంటూ తమ చెట్టువద్దకు వెళ్ళి శీతలపానీయాన్ని సేవించారు. ఇంతలో ఒక్క క్షణంసేపు వాతావరణం అంతా చల్లబడినట్లు అనిపించింది. సూర్యునికి మబ్బు అడ్డం వచ్చింది. ఆ సంగతిని జూడీ గమనించింది. వెంటనే ప్రతివారు తమకోటులను తీసుకుని గబగబా పరుగెత్తి ఆస్పత్రి వరండా లోకి చేరుకున్నారు. అంతలో ఫెళఫెళార్భాటు లతో ఆకాశం ఉరిమింది. వాన ముంచుకు వచ్చింది.

బెన్ కు ఇదంతా నచ్చలేదు. వాడి పెదవి వణికింది. వాణ్ణి ఎత్తుకుని సముదాయించవలసి వచ్చింది. జూడీకి మాత్రం సరదాగానే ఉంది. అంతా అయిపోవచ్చింది అనుకుంది. హరిదాసుకూ ఇష్టంగానే ఉంది. వాడు సంతోషంతో గంతులు వేశాడు. వాడి తెల్లని లాగు అంతా ఎర్రని బురదలో మరకలై పోయింది. ఇంతకీ జరిగిందేమిటంటే వాన కురిసినా వాతావరణం ఆశించనంతగా చల్లబడనేలేదు. మరి ఈ వాన ఎందుకు కురిసినట్టు ? ఇది చల్లని వాన కానేకాదు. వెచ్చని వాన.

వాననీరు చిమ్ముకుంటూ కౌరు రయ్యిమని ఇంటికి వచ్చింది. అక్కడ జార్జి కొన్ని కిటికీల తలుపులే మూశాడు. లోపలికి వెళ్ళి చూచే సరికి జూడీ ప్రక్క చివరలు తడిసి ముద్దఅయి ఉన్నాయి. ఆకాశం ఇంకా ఉరుముతూనే ఉంది. వానకి దోమలూ, రోకలిబండలు ఎన్నో క్రిమికీటకాలు బయటకు వచ్చాయి. వాటిని చూసి బెన్ పూచీలు అన్నాడు. తమిళంలో ఆ మాటకు 'అసహ్యకరమైనవి' అనే అర్థం కాబోలు. చల్లని నీరుకోసం జూడీ ఫ్రిజిడయర్ దగ్గరకు వెళ్ళింది. అక్కడ ఆటలాడి అలసిపోయి చెమటలు కక్కినందుకు విరుగుడుగా వాళ్ళ నాన్న గారు ఆ నీళ్ళలో ఒక్క చిటికెడు ఉప్పువేశారు.

ఆ తరువాత జూడీకి హరిదాస్ తరచుగా కనబడుతూనే ఉన్నాడు. వాడు చక్కనివాడు. వాణ్ణిచూడగానే జూడీకి ఎప్పుడూ జాన్ జ్ఞాపకానికి వచ్చేవాడు. క్రికెట్ అన్నా ఇతర వ్యాసంగాలన్నా వాడికి చాలా ఇష్టం. ఏవేవో చెప్పుకుని వాళ్ళు ఇద్దరూ నవ్వుకుంటూ ఉండే వారు. తన తండ్రికి వాళ్లతండ్రి అంటే ఇష్టమేనని జూడీకి తెలుసు. వైద్యవృత్తికి సంబంధించిన ఉన్నత ప్రమాణాలను పాటించే వాడని జూడీ వాళ్ళనాన్నగారు ఆయనను మెచ్చుకున్నారు. అంటే నిజాయితీ పరుడన్నమాటే అనుకుంది. కాని వాళ్ళ అమ్మమాత్రం హరిదాస్

తల్లిని గురించి ఏమీ అనలేదు. ఆవిడకు మద్రాసు నచ్చలేదనీ, ఉత్తరాది భోజనమే ఉత్తమమైనదనీ ఆవిడ చెప్పకపోతే వచ్చేనష్టం ఏమీ లేదు, అనుకుంది జూడీ. నిజంగానే ఆవిడ ఎంతో స్వాదు మనోహరంగా ఉండే తీపి సరుకులు ఎన్నో చేసింది. ఆవిడ కూరవండితే మద్రాసులో కూరలవలె కారం మండిపోయేదికాదు. వాటిరుచే వేరు. వాటి వాసనా వేరే. ఇంక దక్షిణాది మురికిగా అసహ్యంగా ఉండడం సంగతి ఉత్తరాదిని గురించి మద్రాసు ప్రజలు ఏమిచెప్పుతారో వింటేసరి!

ఒకసారి హరిదాసు వాళ్ళయింటికి వచ్చినప్పుడు కంచెలో కంత గుండా వాణ్ణికూడా తీసుకువెళ్ళితే బాగా ఉండునని జూడీ అనుకుంది కాని మళ్ళీ లాభం లేదనుకుంది. వాళ్ళంతా ఈతలాడు తున్నప్పుడు జూడీ లక్ష్మితోను, ఇతర మిత్రులతోను లేదా హరిదాసుతోను కలిసి నీటిలో మునిగేది. ఈతకొలనుకు వచ్చి నిజంగా ఈదే భారతీయ మహిళలు కొలదిమందిలోను హరిదాసు తల్లి ఒకావిడ అని జూడీ గమనించింది. భారతీయ మహిళలలో చాలామంది తమ పిల్లలతోబాటు ఈత కొలను దగ్గరకు వస్తారు. కాని వారు మంచుముక్కలు తింటూనో, తేనీటిని సేవిస్తోనో కాలక్షేపం చేసేస్తారు. "నాకొక డజనుమంది పిల్లలు ఉన్నప్పటికీ నేను ఇలా ఉండను బాబూ" అనుకుంది లక్ష్మి.

అప్పటికి వానాకాలం బాగా ప్రవేశించింది. ఆకాశం రోజంతా ఉరుముతూనే ఉంది. రోడ్డు అంతా బురద నీటితో నిండి ఉంది. కాని ఆ నీరంతా చరచరా ప్రాకిపోయి ఇసక నేలలో పడి ఇంకిపోయేది. నేల అంతా ఆవిర్లు కక్కుతూ ఉండేది. బెన్‌కు వారంరోజులనుంచి వంట్లో బాగుండలేదు. అందరూ ఆందోళనపడుతున్నారు. అమ్మణ్ణి పాటీ మంచి పండ్లు ఏరి పంపించింది కాని వాడు వాటిని మూచూడనైనా లేదు. వాడికి ఇప్పుడు వంట్లో బాగానేఉంది. కాని పూర్వపు సత్తువ

ఇంకా చేరలేదు. జూడీకి బడికి సెలవులు ఇవ్వగానే అంతా కలిసి పర్వత కేంద్రాలకు వెళ్లడానికి సన్నాహాలు చేశారు.

అందువల్ల కొన్నిరోజులవరకు హరిదాసునిగాని, లక్ష్మినిగాని చూడడం పడనేలేదు. కొన్నిరోజులు తరువాత లక్ష్మిని చూడగానే అదోలా అనిపించింది. లక్ష్మికి తన స్నేహం ఇక అక్కరలేదన్నట్టు అనిపించింది. కాని జూడీకి బెన్‌ను గురించిన బెంగ ఎక్కువైంది. అందుకనే లక్ష్మి విషయం అంతగా పట్టించుకోలేదు. ఏమైందని లక్ష్మిని అడగనూలేదు.

మళ్ళీ కొండలకు తిరిగి రావడం ఎంతబాగా ఉంది! దగ్గరలోనే సరస్సు, పడవలూ ఉన్నాయి. పడవ నడిపితే బాగాఉండును, అని పించింది జూడీకి. అయితే అలాంటి పనిచేయాలనిపించడం అంతగా నచ్చలేదు. పరుగెత్తడం, దూకడం మాత్రం ఏం బాగుంటుంది? అను కుంది. రాత్రివేళ చల్లగా ఉండటం హాయిగానే ఉంటుంది. కంబళిలో దూరి వణకడంకూడా బాగానే ఉంటుంది. మైదానాలలో ఉన్న ప్రజలంతా రోజురోజుకీ ఉక్కతో బాధపడుతున్నారనుకోవడం కూడా సరికాదు. "అయితే నాన్నగారూ, భారతీయులు వేసవికాలానికి బాధ పడతారా?" అని ఒకనాడు వాళ్ళనాన్నగారిని అడిగింది.

"ఎందుకు బాధపడరు? భారతదేశంలోనే కనుక మనోహరమైన శీతోష్ణస్థితి ఉన్నట్టయితే ఇక్కడి పరిస్థితి చాలా భిన్నంగా ఉండేది. ఉక్కలో ఎవ్వరూ సరిగా పనిచేయలేరు కదా!" అని ఆయన జవా బిచ్చారు.

ఆమె భారతీయ మిత్రులు మరికొందరు కూడా కొండలకు వచ్చారు. వారిలో హరిదాసు ఒకడు. పడవ నడపడం బాగా నేర్చు కున్నాడు. చిన్న చిన్న పడవల పందేలన్నింటిలోను అతడే నెగ్గేవాడు.

మరొక పర్వత విశ్రాంతి కేంద్రంలో పాత తపాల బిళ్ళలు పోగుచేసే కుర్రవాడొకడు. బెన్‌కు బాగా ఆరోగ్యం చేకూరింది. అయితే మనిషి వెనుకటంత పుష్టిగా లేదు. అక్టోబరు ప్రారంభంలో పూజరోజు ఒకటి వచ్చింది. ఆరోజున దేవతలు ప్రతి వారినీ ఆశీర్వదిస్తారట. కారుకు దండలు వ్రేలాడ కట్టారు. కొబ్బరికాయ కొట్టారు. పళ్లను నైవేద్యం పెట్టారు. పూలతో పూజించారు. బెన్ త్రోపుడు కుర్చీకి కూడా పూజ చేశారు. వాడి ఆయా మేరీ కిరస్తానీది. అయినా ఇది మానడం ఆవిడకు ఇష్టంకాదు. ఈ పూజంతా చేయించిన పూజారి చాలామంచి వాడు. పెద్దవాడు, పండితుడు. కొన్ని రూపాయలు దక్షిణ పుచ్చుకున్నాడు.

ఆస్పత్రికి కూడా ఈ విధంగానే పూజ చేశారు. అన్ని వార్డులకు ముఖ్యంగా శస్త్రచికిత్సా గారానికి, ఎక్స్-రే కేంద్రానికి పూజ చేశారు. ఆరోజున సెలవు. హిందూ పంచాంగంలో పండగలు చాలా ఉన్నాయి. బహుశా దేశంలో ఇంచుమించు అందరూ నీరవ నిస్సార జీవితం గడుపుతూ ఉండడంవల్ల, ఎంత కష్టపడి పని చేసినా రాణింపూ, ప్రోత్సాహమూ లేకపోవడంవల్ల, చాలామంది ఆదివారంకూడా సెలవు తీసుకోక పోవడంవల్ల ఇలాంటి పండుగలనూ, పబ్బాలనూ కల్పించుకున్నారు కాబోలని జాడీ అనుకుంది. ఇష్టమైనపని చేతినిండా ఉన్నవారికి ఇలాంటివాటి అవసరం ఏమి లేదు. ప్రతివారికీ ఇష్టమైనపని చేతినిండా ఉన్ననాడు వాటిని ఖాతరు చేయరు కూడాను. అయితే ఆ సంగతి తెలుసుకోవడం చాలాకష్టం.

55

5. కంజీవరం

వాళ్ళు తిరిగి వచ్చేటప్పటికి వానలు అంతగా కొట్టి కురవడంలేదు. దేశం ఇంకా బాగా చల్లపడలేదు. వేడిగాలులింకా వీస్తూనే ఉన్నాయి. తొలకరి గడిచిపోయింది. అయితే రెండోసారి జల్లులింకా పడలేదు. బడిలో ఆడపిల్లలందరు వచ్చే దీపావళి సెలవులలో తామేమి చేయ దలచుకున్నారో మాట్లాడడం మొదలుపెట్టారు. దుకాణాలు అప్పుడే దీపావళి బహుమతులతో నిండిపోవడం మొదలు పెట్టాయి. ప్రతి దుకాణంలో యీ దీపావళి బహుమతులను అందంగా ఆకర్షణీయంగా అలంకరించడం మొదలుపెట్టారు. ఇది యూరపులోనూ, అమెరికా లోనూ, క్రిష్టమస్‌నాడు చేసే అలంకరణ మాదిరిగానే వుంది. నిరు పేదలు సైతం ఆనాడు ఏదో విధంగా కొత్తబట్టలు కట్టుకో డానికి ప్రయత్నిస్తారు. డబ్బున్న మహారాజును మరెవరినైనా అడిగి తెచ్చుకునైనా సరే కొత్తబట్టలు కట్టుకుంటారు. జూడీ వానికికి, ఆయాకు, జార్జిభార్యకు పండగకుపెట్టే నిమిత్తం నాలు చీరెలు కొనా. లని వాళ్ళమ్మతో కలసి బజారు కెళ్ళింది. జార్జిభార్య ఎడ పిల్లలనిద్దరిని నడిపించుకొంటూ చంటిపిల్లని చంకను వేసుకొని అప్పుడప్పుడు వీళ్లింటి కొస్తూండేది.

అక్షింతల పూవులచెట్లు కంచెకు ఆవలివైపునున్న పొరుగువారు దీపావళికోసమని హడావుడిగా ఏవేవో సన్నాహాలు చేస్తున్నారు. వారంతా జూడీని పిలిచి ఒక పెద్ద పెట్టెనిండుగా బాణసంచా చూపిం చారు. ఈ ఏడాది తాను నిజంగా బంగారపుగాజు బహుశా చేయించు కొంటానని చెప్పింది. గోడదగ్గరనున్న మరొక పొరుగు కుటుంబంవారు ఆడంబరం కోసమైనా అంతకంటె పెద్ద పెట్టెనిండా బాణసంచా సేక రించారు. బహుశా మిఠాయిలుకూడా చాలా చేసినట్టున్నారు.

ఇంతలో అమ్మణ్ణిపాటి సూర్యకాంతపు మొక్కలనీరాదుగా జూడీని పిలిచింది. కొత్తచీరలు కొనుక్కోవడం కోసం తాను కంజీవరం వెళ్ళుతున్నానని చెప్పింది. ఇక్కడకంటె అక్కడ చాలా అందంగా ఉంటాయి. మీ అమ్మగారు ఒప్పుకుంటే నిన్నుకూడా నాతోబాటు అక్కడకు తీసుకు వెళ్ళుతానంది.

"బలే! బలే!! అయితే లక్ష్మికూడా వస్తుందా?" అని అడిగింది జూడీ.

అమ్మణ్ణిపాటి ఒక నిముషంసేపు ఏమీ మాట్లాడలేదు. అంతలో ఏమితోచిందో ఏమోకాని "నువ్వు లక్ష్మితో దెబ్బలాడలేదు గదా?" అంది.

"అబ్బే! లక్ష్మి నాతోటి ఎప్పుడూ దెబ్బలాడకూడదను కుంటాను." అంది జూడీ.

లక్ష్మినిచూచి చాలారోజులైందే! అనుకొంది. అవును మరి! మొదటి వారమంతా హడావుడేనాయ్! ఏపని చేయడానికీ తీరిక ఉండదు. అయితే యీతకొలనుదగ్గర లక్ష్మి ఎందుకో ఎడమొగం పెడమొగంగానే వుంది. దూరం దూరంగానే ఉంటూ వచ్చింది. జూడీ లక్ష్మికి సరస్సులోని పడవలనుగురించి యీమధ్య తానెక్కడెక్కడకు వెళ్లింది వగైరా ఏమేమో చెబుదామనుకొంది. కాని పడలేదు. అందులో తప్పేమీలేదు అనిపించింది.

అమ్మణ్ణిపాటితో వెళ్ళడానికి వాళ్ళమ్మ సమ్మతించింది. "అయితే ఒక్కమాటమాత్రం మరచిపోకు. గుళ్ళోకి వెళ్ళేటప్పుడు మాత్రం చెప్పులు తీయడం మర్చిపోవద్దు. కంజీవరంలో 108 దేవాలయా లున్నాయి. అమ్మణ్ణిపాటి వాటిలో కొన్నింటికైనా తప్పకుండా

చూడదలచుకుంటుందనే నా నమ్మకం'' అంది ఆవిడ. మర్నాటి పొద్దున్న చాలా పెందలకడనే వెలుగురేఖలు వస్తూండగా వాళ్లు బయలుదేరారు. ఎండెక్కకుండానే గబగబా సెంట్ తామస్ మౌంటును దాటిపోయారు. కారు నడుపుతున్న కుర్రవాడు వారికేదో దూరపు చుట్టమువలె నున్నాడు. రోడ్డు కడ్డంగా ఉన్న ఆవులు, మేకలు దగ్గర నుంచే నడిపించుకుపోయేవాడు. జూడీకి ఎగిరెగిరిపడుతున్నట్టనిపించింది. అస్తమానం బూరాను మ్రోగించేవాడు. దోవలో అక్కడక్కడ కొన్ని కోతులు కనిపించాయి. అవి ఏదో పండుకోసమో మరి దేనికోసమో పెనగులాడుతూ వుండేవి. కారు బాగా దగ్గరసవచ్చేవరకు ఆఖరినిముషం దాకా కదిలేవేకావు. ఇలా వెళ్లగా వెళ్లగా వారికి కంజీవరం దేవాలయాల గోపురాలు కనిపించాయి. ముందుగా శిఖరాలు. ఆ తరువాత దగ్గరకు పోనుపోను అవి ఎంతో ఎత్తయ్యాయి. వాటి వెడల్పు పెరుగుతున్నట్టనిపించాయి. అయితే యివి చర్చి శిఖరంవలె పోనుపోను కొనతేలినవికావు. దేవాలయు ముఖద్వారంపైయీ గోపురాలను ఎంతో ఎత్తుగా నిర్మించారు. వీటిలో కొన్ని ఇరవై అంతస్థులవి, వీటిలో ప్రతి అంగుళము దేవతామూర్తులతో అద్భుతమైన శిల్పసంపద తొణికిసలాడుతూ నయన పర్వంగా కనిపిస్తాయి. ఆ గోపురాలలో జంతువో హస్తవిన్యాసమో నృత్యభంగిమమో ఏదోఒకటి లేకుండా ఒక్కఅంగుళం మేరైనా విడిగా ఖాళీగాలేవు.ఒక్కొక్కసారి ఆ ప్రదేశమంతా నెమలి పింఛాలతో నిండిపోయింది. అక్కడున్న మనోహరమైన నృత్య భంగిమములలో కొన్నింటిని హస్తముద్రలనూ, పదవిన్యాసాలను జూడీ గుర్తుపట్టింది. చెప్పులు గుమ్మందగ్గర వదలి వాళ్లు లోపలికి వెళ్లారు. ఇక్కడ దేవాలయపు ప్రాంగణమంతా రాళ్లుపరచినదే. చక్కగా, గొప్పగా నిర్మించిన దేవాలయం లోనికి వెళ్లడానికి మెట్లున్నాయి. చుట్టూ శిల్పసంపదతో నిండిన స్తంభాలు ఎన్నో ఉన్నాయి. వీటిలో

ఒక్కొక్కదానిది ఒక్కొక్క కథ. అమ్మణ్ణిపాటి విష్ణువుయొక్క దశావతారాలను గురించి చెప్పింది. పక్షిరాజైన గరుత్మంతుని గురించి చెప్పింది. మురళీధరుడైన కృష్ణభగవానుని గురించి చెప్పింది. ఏనుగుతల దేవుడైన గణేశుని గురించి చెప్పింది. లక్ష్మి పార్వతులను గురించి చెప్పింది. ఆ లక్ష్మీదేవి పేరే తన నేస్తానిదిన్ని అనుకుంది, జూడీ. కపాలమాల ధరించిన కాళికాదేవి నిజంగా భీకరంగానే ఉంది. ఆమె నాలుక బయటకు పారజూపింది.

ఆ చుట్టుప్రక్కలున్న ప్రదేశాలమీద భారతీయులందరికీ సుపరిచితమైన పౌరాణిక గాథలన్నింటినీ సుందర శిల్పాలుగా మలచారు. వీటిని చిత్రాలుగా చిత్రించుకున్నారు. ఆ కథలనే పాటలు కట్టి పాడుకుంటున్నారు. గుడిలోపల వేదిక ఉంటుంది. దానిమీద దేవునిదో దేవిదో లేక యిద్దరివీ విగ్రహాలుంటాయి. ఇవి నల్లగా నూనె జిడ్డుతో నిగనిగలాడుతూ దుమ్ముకొట్టుకు పోయినట్టుంటాయి. హారతితో పొగచూరి నట్టుంటాయి. వాటి నొక్కసారి, బంతిపూలతో అలంకరిస్తుంటారు. వాటికే నూలుబట్టలు కట్టబెట్టుతు ఉంటారు. ఆభరణాలు అలంకరిస్తారు. కొన్ని కొన్ని దేవాలయాలలో అమ్మణ్ణిపాటి జూడీని ఒక పురోహితు డెవరికో అప్పగించి తానుమాత్రం లోపలకు వెళ్ళేది. నొసటను విభూతిరేఖలు అలదుకొని కొన్ని పూవులను కొబ్బరి చెక్కలను పుచ్చుకొని బయటకొచ్చేది. లోపలకు వెళ్లి ఏం చేసి వచ్చారని జూడీ అడగదలచుకోలేదు. అడిగినా అమ్మణ్ణిపాటి ఏమనుకుంటుందో, అనుకునేది. ఈ దేవుళ్ళనీ, వారికిచేసే పూజా పునస్కారాలను ప్రతివారు ఒక మైత్రీభావంతోనే గమనించేవారు. అది అంత భయంకరమైన దేమీకాదు. అయితే ఎండ హెచ్చుగా ఉండుటచేత ఎవరుకూడ అంతగా లోపలకు వెళ్ళే వారేకాదు.

ఈ దేవాలయాలలో చాలావాటికి కోనేరులున్నాయి. ఈ కోనేరులు నలుప్రక్కల రాతిమెట్లు కట్టినచక్కని చిన్న చెరువులు. వీటివల్ల అందానికి అందమూ ఉండేవి. చల్లదనానికి చల్లదనమూ లభించేది. ఈలాంటి చెరువులలో ఒకదానికి ఆవలవైపున దూరంగా తిరుమణి తిరుచూర్ణము దిద్దిన ఏనుగు కనిపించింది. దానిని చూచి ఒక్క నిమిషము సేపు అదేదో పాత విగ్రహం కాబోలు ననుకుంది జూడీ. అది మచ్చిక చేసిన చక్కని ఏనుగు. అయితే అడవులలో పెరిగే నిలువెత్తు గడ్డి మధ్య స్వేచ్ఛగా విహరించే అడవిఏనుగంత అందమైనది కాదు.

దేవాలయ గోపురాల నీడలో నిజానికి వాటిక్రింద రకరకాల వస్తువులతో నిండివున్న అంగళ్లు ఎన్నో ఉన్నాయి. వాటిలో మామూలు బొమ్మలు, సెల్యులాయిడ్ బొమ్మలు, దేవతా విగ్రహ మూర్తులు, రాజకీయ నాయకుల చిత్రపటాలు, ఒకటేమిటి అన్నీ కలగాపులంగా నిండివుండేవి. ఈ కొన్నింటిలో చాలా రంగులు కొన్ని ముద్రించారు. కొన్ని సినిమాతారలవి, కొన్ని సినిమాతారలవలె ఉండే యితరులవి. అయితే యిక్కడ ప్రజలందరూ వీటిని గురించి అంతగా పట్టించుకున్నట్టు కనబడరు. ముష్టివాళ్ళ సంగతి సరేసరి. నడుస్తూనో, ఒకచోట కూర్చునో, వచ్చీపోయే వారందరిని ధర్మంచేయవలసిందని అడుగుతూ ఉంటారు.

ఒక దేవాలయంలో శివుడు ఎవరినో తన్నుతున్నట్టుగా ఒక చక్కని బొమ్మ కనిపించింది. పార్వతి పరమేశ్వరుని నృత్యంలో పోటీకి రమ్మని ఆహ్వానించిన కథ నంతనూ అమ్మణ్ణిపాటి వివరించి చెప్పింది. శివుడు తన చెవిపోగును జారవిడిచి దాన్ని కాలిబొటన వ్రేలుతో తీసి చెవికి యథాపూర్వకంగా తొడుగకొని ఆ పందెమును ఎలా గెలుచుకున్నాడో, పార్వతీదేవి స్త్రీ కనుక అటువంటి నృత్యాన్ని ఎందుకు చేయలేకపోయిందో కూడా అమ్మణ్ణిపాటి వివరించింది.

"చూడు! అదుగో, ఆతల్లి శివుణ్ణి ఏలాగ సంతోష సంభ్రమాలతో విలోకిస్తున్నదో, అదిగో మధురమైన ఆ మందహాసం కనపడుట లేదా?" అంది అమ్మణ్ణిపాటి. దేవతలుసైతం యిలాగ సరదాకోసం ఏదోఒకటి చేయడం? అన్నింటినిమించి దేవతలకు సైతం సరదాగా ఆడడం అవసరమని గుర్తించడం బాగానే ఉందనుకొంది జాడీ.

అబ్బ! ఎండ మండిపోతోంది. నీడలో వున్నప్పటికి కారు తలుపుమీద చెయ్యి వేసేసరికి చుర్రుమంది. రా! రా!! అని పిలుస్తూ అమ్మణ్ణిపాటి జాడీని తీసుకొని ఒక చీరల దుకాణంలోకి వెళ్లింది. వీళ్లని చూడగానే కొట్టువాడు రకరకాల చీరలను తెచ్చి విప్పి కన్ను చెదిరేటట్టుగా బల్లమీద పరిచాడు. రెండు గిన్నెలనిండుగా తియ్యని కాఫీనికూడ తెప్పించాడు. ముదురురంగులలో అనేక రకాల జరీ బుటేదారితో నిగనిగ మెరిసిపోయే పెళ్లి పట్టుచీరెలు చూపించాడు. గళ్లవి, చేపల, ఏనుగుల అంచల అంచులు ఉన్న ఇతర పట్టుచీరె లెన్నో చూపించాడు. ఆ పట్టుబట్టలు జాడీకి ఎంతగానో నచ్చాయి. తన పని వాళ్లందరికి అమ్మణ్ణిపాటి నూలుచీరలు తీసుకొంది. లక్ష్మికి లేత అరటి ఆకురంగు పట్టుచీర తీసుకొంది. సరస్వతికి ముదురుపసుపు తీసుకుంది. రెండేళ్లచిట్టి పార్వతికి పరికిణీ కోసమని పువ్వులు అద్దిన పట్టుముక్క తీసుకొంది. తనభర్తకోసం ధోవతులుకొంది. అవి సన్న జరీఅంచు, మెత్తని ధోవతులు. అక్కడ చీరలు కొనడానికి ఎందరో వచ్చారు. రంగులరంగుల చీరలతో నిండిపోయిన ఆ పెద్ద బల్లనిండుగా రకరకాల పూవులు నెప్పపోసినట్టుంది. ఇంతలో అమ్మణ్ణిపాటి హఠాత్తుగా లేచి రా! యింకా మంచి చీరలు ఉన్నాయేమో చూద్దాం అంది."

"అయితే యివి బాగాలేదా? మంచివికావా"? అంది జాడీ. అమ్మణ్ణిపాటి నవ్వింది. 'నువ్వే చూస్తావుగా, నడు' అంది.

ఇంతలో మద్దెల, సన్నాయి వాయిద్యాల మోత వినపడింది. అటుకేసి చూడగానే సింహాసనంవలె అలంకృతమైన కొయ్యా రథంపై శిల్పసంపద వెలార్చే చిన్న ఊయలపై వేంచేసిన దేవతా మూర్తులు రెండింటితో ఊరేగింపు ఇటుకేసే మలుపుతిరగడం కనుపించింది. ఈ కొయ్యారథానికి పెద్దపెద్ద చక్రాలున్నాయి. అవి కిరకిరమంటున్నాయి. దానికి అటు, ఇటు పూన్చిన మోకులను పట్టుకొని ఇరువైపులా వందమంది మనుష్యులు దానిని లాగుతున్నారు. ఈ విధంగా భగవంతుని రథాన్ని లాగడంవల్ల వారికి చాలా పుణ్యం వస్తుందని అమ్మణిపాటీ జూడీకి వివరించి చెప్పింది.

బహుశా ఈపని చేయడమంటే వారందరికీ చాలా సరదా అనుకుంటాను. రథంమీద ఎక్కి కూర్చున్న ఇద్దరు వృద్ధులు వారిని ప్రోత్సహిస్తుండగా ఈ జనమంతా నవ్వుతూ, బిగ్గరగా మాట్లాడుతూ ఎంతో సరదాగా రథాన్ని లాగుతున్నారు.

"బాగుంది. మనచేత తమకు సేవలు చేయించుకోవడమే దేవతలకు ఇష్టం" అంది అమ్మణిపాటీ.

ఇక్కడ వీధులనిండా దుకాణాలే. వాటిల్లో పండ్లు, ఫలరసాలు, సుగంధద్రవ్యాలు ఒకటేమిటి అన్నీ అమ్ముతారు. ఇళ్ళన్నింటికి దిగువ వసారాలు. వాటికి ఇరుకైన కొయ్యతలుపులు, ఆ తలుపులనిండా నగిషీ ఉన్నాయి. వారు ఒక ఇంటిలోకి వెళ్ళారు. అక్కడ దొడ్డినిండా సాలెవారు మగ్గాలతో నేస్తున్నారు. కొన్ని కొన్ని సమయాలలో ఒక మగ్గందగ్గర ఇద్దరు పనివారున్నారు. వారిలో ఒకడు అంచునేస్తే, మిగతావాడు చీరనేస్తాడు. అవి సాదా మగ్గాలు. గోతుల్లోకి బరువులు వ్రేలాడగట్టి ఉన్నాయి. పొడుగాటి పడుగును అజాగ్రత్తగా ముడివేసినట్టు కనబడుతుంది. అయితే అసలు నేర్పు అంతా జిగీ, బిగీ ఉండే

టట్టు, రకరకాలుగా నెయ్యడంలో ఉంది. నేతపనివారు సంతృప్తులుగా కనబడ్డారు. వారు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. వారికి సంపాదన చాలా ఉందని, బహుశా బ్యాంకి గుమస్తాకంటె హెచ్చుగానే వస్తుందని అమ్మణ్ణిపాటి చెప్పింది. చిన్నపిల్లలు సైతం తమతమ తండ్రులతో కలిసి నేతపని చూస్తున్నారు. వారందరికీ ఆ పని బాగా నచ్చినట్లే కనబడింది.

అక్కడినుంచి వారు పాలరాతిగచ్చు ఉన్న ఒక చిన్న గదిలోకి వెళ్ళారు. అక్కడ వారికి ఒక్కచుక్క నిమ్మరసం పిండిన చల్లని కొబ్బరి నీరు త్రాగడానికి ఇచ్చారు. అక్కడ కొందరు బంగారు జరీ పోగులను చక్కగా కండెలుగా చుట్టుతున్నారు. నిజానికి అది వెండి పూతపెట్టిన సన్నని పట్టుదారమే. ఆ తరువాత దానిపై బంగారుపూత పూస్తారు. అమ్మణ్ణిపాటి రెండు విచ్చెలు తీసుకుంది. "ఇదిగో చూశావా జూడీ. ఇవెంతా బాగా మెరుస్తోందో? ఇది ఎంత బరువుగా ఉందో, ఇందులో చాలా బంగారం ఉంది" అంది. అయితే జూడీకి అదేమీ కనబడలేదు. కాని రాజకుమారి జుట్టువలె తళతళలాడే పట్టుకుచ్చులంటే జూడీకి నిజంగా మోజు కలిగింది. బంగారు జరీపోగులను ఎలా తూస్తారో అక్కడి పెద్ద జూడీకి చూపించాడు. చీర ఖరీదు దానిలో ఉన్న బంగారు జరీనిబట్టి ఉంటుంది. నా పాతచీరలన్నీ బాగా చిరిగిపోయినప్పుడు వాటిని కుప్పగాపోసి తగుల పెట్టుతాను. అవి మండిపోయి చివరకు వాటిలో ఉన్న వెండి బంగారాలు మిగిలిపోతాయి.

ఇక్కడ రెండు చీరలున్నాయి. అందులో ఒకటి లేత నీలంరంగు చీర. బంగారు జరీఅంచు నక్షత్రాలు, లతలు వాటిలో చాలాఅందంగా ఉంది. రెండోచీర ముదురు నీలంది. ఇంచుమించు నల్లగానే ఉంది. దానికి వెండి జరీతో నేసిన ఒంటెల అంచుఉంది. చివరకు అమ్మణ్ణిపాటి

ఈ రెండు చీరలూ పుచ్చుకుంది. ఇద్దరు మనుష్యులు వాటిని చక్కగా మడతపెట్టి ఇచ్చారు. మళ్ళీ కారుఎక్కి కిటికీలన్నీ తెరచుకొని రివ్వున వెళ్ళిపోయాము. లోపలికి గాలివచ్చిందికాని చల్లగాలేదు. వారు గబ గబా వీధులన్నీ దాటి, గుళ్ళు గోపురాలుదాటి, దేవుళ్ళను దిగవిడచి మద్రాసు మొగం పట్టారు. వీరు బుట్టలోనుంచి పళ్ళుతీసుకొని వలుచు కొని తిన్నారు. తొక్కలను బయటకు విసిరివేశారు. మేకలో కోతులో వచ్చి వాటిని తినివేస్తాయిలే అనుకున్నారు.

చెట్ల నిండుగా ఎర్ర దుమ్ము కొట్టుకుంది. ఆదోవను పోయే ప్రతిలారీ ఆకాశమెత్తున దుమ్ము లేపుకుంటూ పోతున్నది. ఎద్దుబళ్లు మెల్లగా సాగుతున్నాయి. నేల అంతా పొడారి పోయింది. ముగురు గోధుమ రంగులో ఉంది ఇంకా కొన్నిమాసాలవరకు ఇలాగే ఉంటుంది. ఇక్కడ ఆవులు అన్నీ బక్కచిక్కి ఉన్నాయి. అమ్మణ్ణిపాటిగారి ఆ రెండు ఆవులతో పోల్చిచూస్తే మరీను. ఆ రెండు ఆవులను కావేరి, గోదావరి అని పిలిచేవారు. ఆ రెండు పవిత్ర జీవనదులవలె అవి తమ పాల ప్రవాహాలతో ఇంటిని నింపి వేసేవి. అమ్మణ్ణిపాటి వాటికోసం వట్టిగడ్డి, పచ్చిగడ్డి, జనుము అన్నీకొని మేట్లు వేసేది. ఇవో పాపం! ఆకలికి అల్లాడుతూ ఏకంచెనో, ఏ ఆకునో మేసేవి. గడచిన ఫిబ్రవరిలో వేసవికిముందు మద్రాసు పరిసరాలలో లోతుతక్కువగాఉండే సరస్సులు పెక్కింటిని చూసిన సంగతి జూడీకి బాగా జ్ఞాపకం ఉంది. ఇప్పుడవన్నీ ఎండిపోయాయి. భూమి నెరలు విచ్చింది. ఆ చెరువు గర్భంలో కొన్నిం టిలో పచ్చని పూలతో దోసపాదులు, పుచ్చపాదులు మొలిచాయి. లేత బంగారు రంగుపళ్ళుగూడా దిగాయి. అక్కడక్కడ కొంచెం పచ్చిక ఉంది. తొలకరి తరువాత కొద్దిగా కాయగూరలు, పాదులు మొలచాయి. అయితేనేమి ఎండకు అవిఅన్నీ వడిలిపోయాయి. చివరకు మాడిపోయాయి.

"ఇంతకూ వానలు మళ్లీ ఎప్పుడు కురుస్తాయో ?" అంది జాడీ.

"దీపావళి తరువాత" అంది అమ్మణ్ణిపాటీ. "జాడీ! అదుగో మనఇల్లు వచ్చేసింది. ఇదిగో నాకు నీదీపావళి కానుక. ఇది నీకు నచ్చుతుందనే అనుకుంటాను" అంటూ జాడీ చేతుల్లో ఒక పొట్లం పెట్టింది. అది నీలం ఆకుపచ్చ కలిపిన పట్టుచీర. "ఓ ! ఓ!......" అంది జాడీ.

"అయితే ఒక్క సంగతి జ్ఞాపకం పెట్టుకో. కావాలంటే దీనితో ఏదైనా కుట్టించుకో. కాని దీపావళి ఉదయం వరకు నీవు దీనిని కట్టుకోరాదు" అంది అమ్మణ్ణిపాటీ.

6. దీపావళి

జార్జి మిఠాయిలు తయారుచేయడంలో నిమగ్నుడైపోయాడు. అయితే ఆ ప్రయత్నం హిందువుల ఇళ్ళలో జరిగే దానికంటె భిన్నంగా ఉంటుంది. దీపావళి చాలా సరదాగానే ఉంటుంది. కాని అంతా అలాకాదు. జాడీ కంచెలోనుంచి వెళ్ళినప్పుడు అమ్మణ్ణిపాటీ తయారుచేస్తున్న వంటకాల వాసన ఘ్రాణ తర్పణంగా తోటంతా వ్యాపించి ఉంది. "ఈరోజున బియ్యంతో నేను ఒక ప్రత్యేక ఫలహారం తయారుచేస్తున్నాను" అంది అమ్మణ్ణిపాటి. "ఈరోజు మాకే కాదు. మా ఆవులకు కూడా దీపావళే. నేను వాటికి స్వయంగా నా చేతులతో మేత పెట్టుతాను. ఈ రోజున మేము ఏమితింటే అవీ అదే తింటాయి. బహుశా వాటికి నిరుడు జరిగినదంతా జ్ఞాపకం ఉండవచ్చు. అందుకనే మళ్ళీ దీపావళికోసం ఆశతో, ఆసక్తితో ఎదురు చూస్తూ ఉండవచ్చు."

దీపావళినాడు బడికి సెలవు. ఆరోజున ప్రతివారు మిత్రుల ఇంటికివెళ్ళి అభివందనాలు చెప్పి బహుమతులు ఇచ్చిపుచ్చుకుని వస్తూఉంటారు. రొట్టెలు, మిఠాయిలు, ఇతర భక్ష్యాలు ఇస్తారు. తెచ్చుకుంటారు. మధ్యాహ్నం అంతా నిద్రపోతారు. తెల్లవారునప్పటినుంచి లేచి పనిచూస్తూఉంటారు కదా. ఆ తరువాత బాణాసంచా కాలుస్తారు. టప టపలు, పట పటలు ఒకటే మోత. వచ్చిన చిక్కల్లా ఏమిటంటే బాణాసంచా కాల్చడం ఒకసారి మొదలైనదంటే వాటికి అంతుఉన్నట్టు కనబడదు. ఎవ్వరూ నిద్రపోదలచినట్టు కనబడరు. ఎదుటివారి ప్రమేయం ఎవ్వరికీ పట్టదు. చిన్న పిల్లలందరికి పటాకీలుంటాయి - వాటిని ప్రతిచోట పేలుస్తు ఉంటారు. ఈ బాణా

సంచా కాల్చడం ఆరోజుతో ఆగదు. ప్రజలు కొంతవరకు వాటితో విసుగెత్తి పోయేవరకు అంతే.

ఇంతలో గోడప్రక్కన ఉన్నవారి ఇంటిలో కోలాహలం బయలుదేరింది. వాళ్ళ అబ్బాయి-మోటారుసైకిలు ఉన్నచోట బాణా సంచా మధ్యకు అగ్గిపుల్ల ముట్టించి విసిరాడు. దాంతో అవి అన్ని అంటుకుని, అన్నీ అన్నివైపులకూ చెదరిపోయి మండి పోయాయి. ఇంటికి వచ్చిన అతిధులలో కొందరికి వళ్ళు కాలింది కూడాను. జూడీ తండ్రి వాళ్ళ ఇంటికి వెళ్ళి అందరికీ కట్టు కట్టాడు. ఇద్దరినీ తన కారులో ఆస్పత్రికి తీసుకు వెళ్ళాడు. అయితే జరిగినదానికి వారిలో ఎవ్వరూ కూడా అంతగా బాధ పడినట్టు లేనేలేదు. బెన్ కొంచెం భయ పడ్డాడు. జూడీ తల్లి చికాకుపడింది. తమ బిడ్డలకు కడుపునిండా తిండి పెట్టలేని వాళ్ళంతా తాము సంపాదించినదంతా ఎందుకూ పనికి రాని ఈ బాణాసంచాకోసం తగుల వేస్తున్నారని అంది.

ఆరోజున ముందుగా జరిగిన కార్యక్రమమంతా జూడీకి నచ్చింది. ఆ పట్టుతో ఇంగ్లండులో విందులకోసం కుట్టించుకునే ప్రత్యేక దుస్తులు తయారు చేయించారు. వానికి దానిని ఆరోజు పొద్దుటే బయటకు తీసింది. ఉదయపు ఫలహార సమయంలో జూడీ దానిని ధరించ వలసి ఉంది. ఆ రోజున వాళ్ళ యింటికి చాలామంది వచ్చారు. హరిదాసు వాళ్ళ అమ్మకూడా వచ్చారు. ఆవిడ చెప్పుకు పోతోంది. "హోలీ ఎంత హుషారు అయిన పండుగ ? ఎంత సరదాగా ఉంటుంది ? ఈ దరిద్రపు దక్షిణాదివాళ్ళు హోలీపండుగే చేసుకోరు. ఆ పండుగ మజా చూడా లంటే ఢిల్లీకిరండి. అక్కడే చూడాలి" అంది. హరిదాస్ దగ్గర ఆటబొమ్మ ఒకటుంది. జూడీకి ఇంకొకటి ఇచ్చాడు. వాళ్ళిద్దరిలో

వసారాలోకి వెళ్ళి ఎవరు బాగా ఆడిస్తారో చూద్దామనుకున్నారు. వాళ్లు ఆ గొడవలో పడ్డారు.

దీపావళిని గురించి చెప్పేటప్పుడు రాత్రిపూట వెలిగించే దీపాల సంగతి చెప్పాలి. ఆ అమావాస్యనాడు సాయంకాలం గుమ్మానికి రెండువైపులా రెండు ప్రమిదల దీపాలు వెలిగించారు. ఆనాటినుంచి కార్తీక పున్నమివరకూ రోజూ పదిహేనురోజులపాటు వెలిగించుతారు. చివరకు పూర్ణిమనాడు చాలా దీపాలు వెలిగించుతారు. ఈ దీపాలు చాలావరకు మట్టి ప్రమిదలలో వెలిగించినవే. వాటినిండా నూనెనింపి వత్తులువేసి వెలిగించుతారు. అవి చిన్న చిన్న దీపాలు నిబ్బరంగా నిలిచి కాలుతాయి. అవి పగిలిపోయినా వచ్చేనష్టం ఏమీలేదు. అవి చాలా చౌక. వాటిని రోడ్లవెనుక పాకలలో ఉండే కుమ్మరులు తయారుచేస్తారు. ప్రమిదలు, మూకుళ్లు, పూలకుండీలు ఎంతో అందంగా తయారుచేస్తారు. తాత తండ్రులనుండి వారి కులవృత్తి ఇదే.

ఆ మొదటిరోజు సాయింత్రం జూడీ తండ్రి ఆస్పత్రికి కారులో వెళ్ళారు. తను పొరుగింట జరిగిన సంఘటనలు వంటివి జరిగి కొందరైనా వళ్ళు కాల్చుకుంటారని ఆయనకు తెలుసు. అయితే అలాంటి వాళ్ళందరికీ కట్లుకట్టడానికి అక్కడ డాక్టర్లు ఉంటారో, ఉండరో నని అనుమానం. ఆయన తనతోబాటు జూడీనికూడా తీసుకు వెళ్లాడు. దీపాలతో అలంకరించబడిన వీధులవెంట వెళ్ళడం చాలా సంతోషంగా ఉంది. పూరి గుడిసెలముందు సైతం దీపాలు పెట్టారు. ప్రతివారు ఎంతో ఆనందంగా ఉత్సాహంగా ఉన్నారు.

తాను లక్ష్మినిచూడగలనేమోనని జూడీ ఎంతో ఆశపడింది. లక్ష్మి తప్పకుండా అమ్మణ్ణిపాటీగారింటికి వచ్చిఉంటుందనీ, కొత్తచీర కానుకను స్వీకరించిఉంటుందనీ అనుకుంది. ఆ కొత్తచీర కట్టుకొన్నప్పుడు

లక్ష్మిని చూడాలనిపించింది. బహుశా లక్ష్మి ఆ కొత్త చీరను పుచ్చుకోగానే అక్కడి కక్కడే కట్టుకుంటుంది కాబోలు అనుకుంది. అయితే ఆమెకు అనేకమంది చుట్టాలున్నారు. బహుశా లక్ష్మి వారందరిని చూడ వెళ్ళిందేమో? వాళ్ళకు బహుమతులు ఇవ్వడం, వాళ్ళ దగ్గరనుంచి పుచ్చుకోవడంలో మునిగి ఉందేమో ! వారందరికోసమని ఒక పళ్ళెంనిండా వాళ్ల అమ్మ జీడిపప్పుతో తయారుచేసిన పకోడీలను, పల్చని గుడ్డకప్పి, దానిమీద పువ్వులు అందంగా అమర్చి తీసుకువచ్చింది. భారతీయ గృహిణులు దీపావళి పిండివంటలను బయట కొనడం అపచారమని భావిస్తారు. వారు ప్రత్యేకంగా ఎన్నెన్ని రకాలో స్వయంగా తయారుచేస్తారు. వాటిని చూచి మురిసిపోతారు. గర్వపడతారు.

జూడీ మళ్ళీ లక్ష్మిని కార్తీకంలోనే కలుసుకుంది. అప్పటికప్పుడే ఇళ్ళన్నీ దీపాల వరుసలతో కలకలలాడుతున్నాయి. గుమ్మాలముందు వసారాలలోనూ, కిటికీ బడ్డీలమీదా దీపాల వరుసలు ఉన్నాయి. కొన్ని కొన్నిచోట్ల రంగుబల్బులు అమర్చి విద్యుద్దీపాలు అట్టహాసంగా వెలిగించారు. కాని గాలివాటున ఊగిసలాడుతూ కాంతి తరంగాలను కల్పించే చిన్న చిన్న దీపకళికలంత అందంగానూలేవు, ఆకర్షణీయంగానూలేవు. ఈ దీప తోరణాల శోభలో పూరిగుడిసెలుకూడ కన్నుల పండువుగా కనబడుతున్నాయి. కార్తీకం వచ్చేసరికి సెలవులధోరణి పూర్తిగాపోయింది. బాణాసంచాల హడావుడి అణగిపోయింది. బడులు తిరిగి ప్రారంభమయ్యాయి. పెద్దవాళ్ళంతా తిరిగి తమతమ పనులకు వెళ్ళారు. ఇంక ఆ ఏటికి దీపావళి సంరంభం ముగిసింది.

జూడీ ఒకనాడు వాళ్ల నాయనగారితో కలిసి ఈతలాడ్డంకోసం క్లబ్బుకు వెళ్ళింది. ఈత దుస్తులకోసం హడావుడిగా గదిలోకి వెడు

తుండగా ఐస్‌క్రీమ్ తింటున్న లక్ష్మి కనబడింది. వెంటనే లేచివెళ్ళి పోవలసిందే కాని ముఖము చిట్లించుకుని అటుకేసి ఎటో చూసింది ? "ఏం! అలా ఉన్నావేం ? అసలు ఏం జరిగింది" అని అడిగింది జూడీ.

లక్ష్మి ఏమీ మాట్లాడలేదు. ఆకుపచ్చని క్రొత్తచీర కట్టుకుంది. పాలమీగడ రంగు రవిక తొడుగుకుంది. అంతలో హఠాత్తుగా అడిగింది "అయితే మేమంతా మురికివాళ్ళమా ? దరిద్రగొట్టు దక్షిణాదివాళ్ళమా ! నీ అభిప్రాయం ఏమిటి ?"

ఆమె గొంతుక పొడారిపోయింది. కోపం బాగా కనబడుతోంది. "నీవు అంటున్నదేమిటి ? నాకేమీ తెలియదే !" అంది జూడీ. ఆమె చాలా తికమక పడిపోయింది.

"మీరూ, మీ మిత్రులు" అంది లక్ష్మి. "మీ క్రొత్త ఉత్తరాది స్నేహితులు !"

"హరిదాసు వాళ్ళూనా ?" అంది జూడీ. వెలవెలపోతూ చింతా కులిత స్వరంతో అడిగింది.

"వాడి పేరు ఎవరైతే నాకేం ?" అంది లక్ష్మి.

"వాడా ! వాడు వట్టి చిన్నపిల్లవాడు!" అంది జూడీ.

"వాడు పిల్లవాడా ? అయితే వాళ్ళ అమ్మ పాపం ఆడది ! అనుకుంటాను" అంది లక్ష్మి. జూడీకేసి తన భుజం తిప్పింది.

"ఆవిడమాటా !" అంది జూడీ. "విను లక్ష్మి ! ఆవిడ వట్టి అడ్డగాడిద అని నా అభిప్రాయం. ఉత్తరాది ఈ దక్షిణాదికంటే ఏమంత అందంగా ఉంటుందని నేను ఎప్పుడూ అనుకోలేదు. అయితే అది హరిదాసు తప్పూ కాదు, నా తప్పూ కాదు......"

ఏం చెప్పినా లక్ష్మి వినిపించుకొనేటట్టు లేదు. దాని మనస్సులో ఒక అభిప్రాయం గట్టిగా స్థిరపడిపోయింది. "వాళ్ళకు మేమంటే గిట్టదు. మమ్మల్ని ఢిల్లీనుంచి పరిపాలించాలని చూస్తున్నారు. కాని మేము వాళ్ళ పాలనకు తలఒగ్గను. బ్రిటిష్‌వారు మమ్మల్ని పరిపాలించడమే దురదృష్టం మమ్మాటికిన్నీ. అలాగే ఉత్తరాదివాళ్లు అనుకుంటూఉంటే వాళ్ళకు తెలిసేలా గుణపాఠం నేర్పుతాం. పైగా మమ్మల్ని హిందీ నేర్చుకోమంటారా? వాళ్ళు మీకంటె అధ్వాన్నం!" అంది.

"పిచ్చిపిల్లా" అనుకుంది జూడీ. రాజకీయాలు ఈవిడకుబాగా తలకెక్కాయి అనుకుంది. ఈ కైపులోనుంచి ఈమెను బయటకు తప్పించడం ఎలాగో తనకు తెలియదు అనుకుంది. అంతలో లక్ష్మి తాను కూర్చున్న చోటునుంచి గబగబా లేచింది. ఐస్‌క్రీం అంతా తినకుండానే, పెదవులు బిగబట్టుకుని బిరబిరా వెళ్ళిపోయింది. లక్ష్మి, భరతనాట్యం చేసేటప్పుడు పులివలె ఎంతటి క్రౌర్యాన్ని ప్రదర్శించిందో జూడీకి జ్ఞాపకం వచ్చింది. తనకు లక్ష్మి ఇప్పుడు పులిలా కనిపించింది. జూడీ కనుకొలకులనుంచి రెండు వేడి కన్నీటిబొట్లు బాధగా రాలిపడ్డాయి. వాళ్ళ నాన్నగారు ఈతకుస్తులు ధరించివచ్చే వేళకు జూడీ ఉన్న పరిస్థితి ఇది. జరిగినదంతా ఆయనతో చెప్పింది. ఆయన విని బాధపడ్డాడు.

"ఇలాంటి భావాల వల్లనే భారతదేశం విచ్ఛిన్నమైపోయేది" అన్నారాయన. ఇది అనూహ్యం. భారతదేశం ఏకదేశంగా, సుస్థిరంగా వర్ధిల్లాలి. దేశంనుంచి దారిద్ర్యాన్ని పారద్రోలగానే అలా వర్ధిల్లుతుంది కూడాను. నిజానికి భారతదేశం ఏకదేశం. అయితే భాషల పేరుతో రాష్ట్రాలను విడగొట్టాలని చూస్తున్నారు. అలాంటి వారికి తాము దేశానికి ఎట్టి విపత్తును తెచ్చి పెడుతున్నామో తెలియదు.

హరిదాస్ తల్లి వంటి మూర్ఖులు కూడా అలాంటి విపత్తునే తెచ్చి పెడుతున్నారు.

"పాముల పుట్ట" అంది జూడీ. ఈమాట బడిలో పాఠంలో వచ్చింది. అప్పటినుంచి దీనిని ప్రయోగించటానికి అవకాశం రాలేదు. మళ్ళీ అంది. "అయితే ఈహిందీ విసుగుపుట్టించే భాష."

"అయితే భారతప్రభుత్వం అధికార భాషగా ఆమోదించిన దానిని నిర్లక్ష్యం చేయడం ఎలా?" అన్నారు ఆయన. అంతేకాదు. ఇతర ప్రజల జాతీయ భాషలను చూచి ఈసడించవలసిన అవసరం హిందీ మాట్లాడే వారికేమీ లేదు. వారు అలా చేయరాదు కూడాను. నెహ్రూగారు ఎప్పుడూ అలా చేయరే. "జూడీ నీకు తెలుసా ? ఈ దేశంలో డజన్ల కొలది జాతీయభాషలున్నాయి. కొన్నింటిలో చిర స్మరణీయమైన ఉత్తమ సాహిత్యం, కవిత్వం, వాఙ్మయంఅన్నీఉన్నాయి. తమిళం అలాంటి భాషలలో ఒకటి. మనం కొంత కష్టపడినట్టయితే మనం బహు భాషలను సులువుగా నేర్చుకోవచ్చు."

"నేను నేర్చుకోలేను బాబూ" అంది జూడీ. "భాషలకేం గాని లక్ష్మి మాటేమిటి ? నాకు అదోలా బెంగగావుంది బాబూ !"

"మనమేమి చెయ్యగలుగుతాం ? మనం చేయగలిగిన దాట్టేలేదు అనే నా అభిప్రాయం." అన్నారు ఆయన. "బహుశా దానికే తెలిసిరావచ్చు. హఠాత్తుగా తనకే వివేకోదయం కలుగవచ్చు. ఈ ఎండలకు బహుశా ప్రతివారికి మతిపోయి ఉండవచ్చు. రా ! రా ! లోపలికిరా, మనం వళ్ళు తుడుచుకుంటూ చాక్‌లెట్ ఐస్‌క్రీం తిందాం. ఎలా ఉంది !"

వేడిగా ఉన్న నీటిలో ఈదుతూ చాక్‌లెట్ ఐస్‌క్రీం తినడం హాయిగా ఉంది. కాని జూడీకి ఈ ఆలోచనలు ఇంకా తగ్గలేదు.

"ఉత్తరాది నిజంగా ఎలా ఉంటుంది?" అని అడిగింది.

"ఈ ప్రాంతంకంటె కొంచెం సంపన్నంగా ఉన్నట్టు ఉంటుంది. ప్రజలు ఇక్కడి వారికంటె బట్ట ఎక్కువగా వాడుతారు. అయితే మనం మనదేశానికి వెళ్ళిపోయేలోగా నిన్ను అక్కడికి ఒక్కసారి తీసుకువెళ్లి చూపించుతానులే" అన్నారు ఆయన. "నిజంగానా? మనం వెళ్ళగలమా?" అంది జూడీ. అంటూనే ఆవిషయమై కొంచెం సేపు ఆలోచించింది. అంతలో మళ్లీ అందుకుంది. "నేను ఏరి పెట్టిన కొత్త చీరను దీపావళికి లక్ష్మి కట్టుకుంది."

జూడీ తండ్రి సానుభూతిగా చూచారు. ఆయన అటూ ఇటూ పరకాయించిచూచి జూడీతో రహస్యంగా ఇలా అన్నారు. "బహుశా లక్ష్మి ఇంకొక విషయంతో బాధపడుతోందనుకుంటాను. వాళ్ళనాన్న కుమార్ కొంచెం చిక్కులలో ఉన్నారు. తనుపనిచేస్తున్న ప్రాజెక్టులందు ఒకదానిలో పై అధికారులు అంత నిజాయితీగా ప్రవర్తించడం లేదని ఆయన కనిపెట్టారు. పై అధికారులలో ఒకడు లంచాలు తీసుకుంటు న్నాడు. అందుకని కుమార్‌కు కోపం వచ్చింది. కాని ఆ పై అధి కారికి పలుకుబడి ఎక్కువగా ఉంది. అందుకని ఎలాగో అలాగ కుమార్‌ని బర్తరఫ్ చేయించారు. ఆయనకు మళ్ళీ ఇంకొక ఉద్యోగం దొరికిందో లేదో? దొరికినా ఇంతమంచిది కాకపోవచ్చు. ఇదంతా కుమార్ బ్రాహ్మణుడు కావటంచేత వచ్చిందని కొందరు అనుకుంటు న్నారు. ఇప్పుడు ఈ దేశంలో బ్రాహ్మణులంటే అంతగా గిట్టడంలేదు. అయితేనేం ఆ పైవాడుకూడా బ్రాహ్మణుడే! ఇదంతా లక్ష్మిని బాధ పెడుతున్నదేమో!" "అది చాలా అన్యాయం! దీనిని సరిదిద్దడానికి మీరు ఏమీ చేయలేరా?" అని అడిగింది తండ్రిని జూడీ.

"అబ్బే! నిజానికి ఇందులో నేను చేయగలిగింది ఏమీ లేదు." అన్నారు ఆయన. "చివరకు సత్యమే జయిస్తుంది. అని ఆ విషయం ఎప్పుడూ అలానే జరుగుతుంది. నిత్యజీవితంలోనైనా అంతే జూడీ. నిజం చెప్పు, మనం ఇంగ్లాండుకు తిరిగి వెళ్ళిపోతే నీకు చాలా సంతోషంగా ఉంటుందా?" అని అడిగారు. "జాన్ ను చూడాలని ఉంది" అంది. అలా అంటున్నప్పుడు ఆమెకు జాన్ ను సదా జ్ఞప్తికి తెస్తుండే హారిదాస్ గుర్తుకు వచ్చాడు. హారిదాస్ ను ఇంక కలుసుకోవడం మానివేస్తే ఎలా ఉంటుంది? అనుకుంది. లక్ష్మి - హారిదాస్ ఈ ఇద్దరి మధ్య తనకు ఎవ్వరు కావాలి?

ఇంగ్లండులో మాత్రం ఇన్ని సమస్యలు లేవా? అంటే ఇన్ని కులాలు, ఇంతమంది దేవుళ్ళు — కొందరు నిరుపేదలుగా ఉండడం... అనుకుంటూ ఏవేవో ఆలోచనలతో జూడీ ఒక్క మునుగు మునిగింది. మరొక రకమైన ఆలోచనలతో తనతండ్రి ప్రక్కనే తేలింది. "ఇప్పుడింక ఆ గదిలోపలి స్నానాలంటే నాకు అసహ్యం. మామిడిపండ్లు వేసుకోకూడదు."

"నీవు ఎడమ మోకాలు ఇంకో బాగా వంచు" అన్నారు ఆయన. "లేకపోతే అంత బాగా మునగడానికిలేదు. ఇంటికి వెళ్ళేలోగా నువ్వు దీనిని బాగా నేర్చుకోవాలి. అదుగో అమ్మా, బెన్ ఇటే వస్తున్నారు."

"లక్ష్మి నాకంటె బాగా మునుగుతుంది" అంది జూడీ. అంటూనే నీడలోకి ఈదుకు వెళ్ళింది. "నృత్యంలో వలెనే ఈతలోకూడా నాకు కాళ్లు సరిగా వంగడంలేదు. నాన్నగారూ! మనం ఇంగ్లండుకు తిరిగి వెళ్లిన తరువాత కూడా దీపావళి పండుగ చేసుకోకూడదా?" అంది.

7. వానలు

అక్టోబరులో చాలా భాగం గడచిపోయింది. మళ్ళా వానా కాలం వచ్చింది. మేఘాలు బాగా ముసురుకుంటున్నాయి. రాత్రి అంతా ఉరుముతూనే ఉంది. మళ్లీ వరద వచ్చినా భయం లేనట్టుగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు అన్నీ చేశారనుకుంటాను అంది, జూడీ తల్లి బెరుకు బెరుకుగా. ఆకలికి మలమల మండుతూ ఉండే, నిరాశ్రయులైన నిరుపేదల మధ్య ఆమె తన సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించవలసి ఉంది. కూలీలుగా పనిచేద్దామనే ఆశతో, బరువు బళ్లను త్రోసుకుంటూ, బరువులనుమోస్తూ, కష్టపడుతూ, ఏదో మించిపోతున్నట్టు రొప్పుకుంటూ పరుగెత్తుతూ కాలక్షేపం చేయడం కోసం పల్లెలనుంచి అనేకమంది మద్రాసు నగరానికి వస్తూ ఉంటారు. అయినప్పటికీ వాళ్ళకి చెయ్యడానికి పని ఏమీ దొరకదు. వాళ్ళ భార్యలు పిల్లలు వారి వెనకాలే బస్తీకి వస్తారు. వీరంతా ఉండడానికి ఎక్కడా తావు ఉండదు. అదృష్టవంతులైతే ఏ చెట్టుక్రిందనో, ఏ గోడపంచనో తలదాచుకోవడానికి తావు దొరుకుతుంది. వాన కురిసిందంటే వీరు పొలంలో పశువులలాగా తడిసి ముద్దయిపోతారు. మళ్లీ ఎండకాసి తడిబట్టలు ఆవీ ఆరేవరకూ వీరిపని అంతే.

సంఘసేవికలు తమ సంక్షేమ కార్యక్రమాల సందర్భంగా వీరిలో కొందరికి ఏదోకొంచెం ఉపకారం చేస్తూనే ఉన్నారు. కాని రోజు రోజుకూ వీరి సంఖ్య పెరిగిపోతున్నది. ఈ అభాగ్యులకు ఉపకారం చేయడమంటే, తమవద్ద నిరుపయోగంగా పడిఉన్న సరుకునంతనీ తమకు ఇప్పించవలసిందని ఆయా ప్రభుత్వ శాఖలకు వ్రాయాలి. వ్రాయడానికి ముందు ఆ సరుకు అక్కడ ఉందని తెలుసుకోవాలి. అయితే దానిని మరొకందుకు ఉపయోగించడానికి అనుమతించే అధికారం సాధారణంగా

వారికీ ఉండరు. ఇదంతా పెద్ద యాతన. ఏదైనా కొత్త పని జరగాలంటే ఎంతమందికి టీనీరు ఇవ్వాలి? ఎన్నిసార్లు టెలిఫోన్ చేయాలి? ఎవ్వరి మనస్సూ నొప్పించకుండా ఎంత చక్కగా మాట్లాడాలి? ఎంత కష్టం? అని జూడీతల్లి అస్తమానం ఫిర్యాదుచేస్తూనే ఉండేది. హఠాత్తుగా కావలసివస్తాయేమో నని ఆవిడ ఇప్పుడు బట్టలూ, పాలపొడి, ఇతర వస్తువులూ సేకరించడం మొదలు పెట్టింది.

అయితే ఇలాంటి సంఘసంక్షేమ కార్యక్రమాలు సాగించేది వారొక్కరే కాదు. రామకృష్ణ సేవాసంఘం ఉంది. వీరు యావద్దేశ వ్యాప్తంగా సంక్షేమ కృషిని సాగిస్తున్నారు. వీరు అనేకవేలమందికి అన్నదానం చేస్తున్నారు. ఉచిత ఆస్పత్రులను, పాఠశాలలను నడుపుతున్నారు. "అయితే హిందువులు కానివారు తమతో కలిసి పనిచేయడానికి వారు అంతగా సమ్మతించరు" అంది ఆవిడ. ఇంకా మిగతా మిషన్ సంస్థలున్నాయంటే హిందువులను మతాంతరులను చేయడానికి ప్రయత్నిస్తూ ఉంటాయి. కాని భారతదేశంలో అది సరియైన పనికాదు. అందుచేత వారితో కలిసి పనిచేయడం నాకు ఇష్టంలేదు.

"తెలితక్కువ సంస్థలు" అంది జూడీ.

ఒకరోజు పొద్దుటే జూడీ లేచేసరికి బెన్ ఉత్సాహంగా కేరింతలాడుతున్నాడు. వాడు తన దోమతెర మంచందిగి, మేడదిగి క్రిందకు వెళ్ళాడు. వెళ్లి చూచేసరికి తోటఅంతా చిన్న చిన్న గుంటలతో నీళ్లు నిండిఉన్నాయి. వాడు దిస వంటితో వాటిల్లోపడి తోటమాలిని తప్పించుకొని పరుగెత్తుతున్నాడు. అనగా నిన్నరాత్రి ఉరుములకు బాగా వానకురిసిందన్నమాట. ఆకులు, పువ్వులూ అన్నీ నీళ్లతో బాగా కడిగినట్లు స్వచ్ఛంగా, శుభ్రంగా మెరసిపోతున్నాయి. తోట అంతకీ కొత్త అందం వచ్చింది. అయితేనేమి ఎన్ని ఈగలు! ఎన్ని ఈగలు!!

మబ్బుచాటునుంచి సూర్యుడు బయటికి రాగానే ఎండ తెకతెక లాడిం చడం మొదలు పెట్టింది. ఎర్ర బురద చిమ్ముకుంటూ నడవడం బెన్‌కు మొదట్లో ఎంతో సరదాగా ఉంది. జాడీకీ సరదాగానే ఉంది. అంతలో ఎండ బాగావచ్చింది. దానితో ఉక్క ప్రారంభమైంది. మధ్యాహ్నమయ్యేసరికి నీరంతా ఇంకిపోయింది. బురద మాత్రం మిగి లింది. ఏదోవిధంగా ఇల్లంతా బురద అయిపోయింది. దానినిండా బెన్ అడుగుజాడలే ఉన్నాయి.

ఆ మర్నాడు రాత్రికూడా వాన బాగా కురిసింది. అయితే ముందురోజంతా కురవలేదు. అలాగే ప్రతిరాత్రి వాన దిట్టంగా కురిసేది. ఒక్కొక్కసారి తోటఅంతా చిరుకప్పలతో నిండిపోయేది. నడుస్తుంటే కప్పపిల్లలు కాళ్ళక్రింద పడేవి. అందుచేత జాగ్రత్తగా చూచుకు నడవ వలసి వచ్చేది. క్రమంగా ప్రతీదీ తడిసిపోయేది. వాననీరు రోడ్లమీదుగా ప్రవహించేది. లోగడ త్రాడులాగుడు పోటీ జరిగిన ఆస్పత్రి మైదా నంలో నీరు బాగా చేరింది. మద్రాసులో పెద్ద ఇళ్ళమధ్య పేదలు కట్టు కున్న పూరిళ్ళలో వంటఇళ్లు అన్నింటిలో నీరుచేరింది. తాటాకుదళ్ళతో, తాటాకు కప్పులతో కట్టినఇళ్లు వానను ఆపలేకపోయేవి. ప్రజలు తడిసి పోయి మురికిగా కనబడేవారు. నదులు పొంగుతున్నాయి. పల్లపు ప్రాంతాలన్నీ మునిగిపోతున్నాయి. బర్రెలు స్వేచ్ఛగా తిరుగుతూ కనిపించిన ఆకునల్లా కొరుకుతున్నాయి. మురికి గుంటలలో పడి దొర్లు తున్నాయి. తలలు మాత్రం కనిపించేటట్లు పైకిపెట్టి మిగతా శరీరం అంతా కనిపించకుండా బురదలో మునిగి ఉండేవి.

వానలు బాగా కురవాలని ప్రతివారూ ప్రార్థించేవారు. వానలు కురవకపోతే పంటలు, అందులో అందరికీ ప్రధాన ఆహారమైన వరి పండనే పండదు. అయితే చెమట పట్టకపోయినా తేమగాలి ఎవ్వరికీ హితకారి

కాదు. బాగా కట్టిన ఇళ్ళుకూడా ఈ వానలకు నిలవలేవు. చాలామంది తమఇండ్లను ఎండలకు పనికివచ్చేటట్టుగా అడుసుతో కట్టుకున్నారు. ఎండకాలంలో ఈ అడుసు రాయిలా ఉంటుంది. కాని వరసగా కొన్ని రోజులు వాన కురిసేటప్పటికి కరిగి కారిపోతుంది. ఒకరోజున మోటారు గారేజీలో అడుగు నేల క్రుంగిపోయింది. కారు బయటకు తీసుకురావడంకోసం అడుగున ఇటికలు పరవవలసివచ్చింది. బెన్‌కు మాత్రం ఇదంతా ఒక తమాషాగా కనబడింది. అలాగే జార్జికీ, మాలికీ సరదాగానే ఉంది. వాళ్లకి ఎప్పుడూ ఏదో తంతు జరుగుతూ ఉండాలి.

ఎక్కడికీ, ఇల్లుకదలడానికి లేకపోతున్నది. అమ్మయ్యా! ఇంక ఏమీ టీపార్టీలు వగైరా లేవు అనుకుంది, జూడీ తల్లి. ఒకరోజున మాత్రం వాళ్ళు పట్నానికి వచ్చిన ఒక వైద్యశ్రేష్ఠుణ్ణి భోజనానికి పిలిచారు. ఆయనతోపాటు, ఆయనను కలుసుకోవడానికి వీలుగా ఒకరిద్దరిని కూడా భోజనానికి ఆహ్వానించారు. జూడీ తన దీపావళి దిరీసు వేసుకుని జీడిపప్పులూ అప్పడాలూ, నిమ్మనీరూ, నారింజరసమూ అతిథులందరికీ అందించింది. వచ్చిన వైద్యుడంటే జూడీకి చాలా అభిమానం కలిగింది. ఆయన బెంగాల్ నుంచి వచ్చాడు. ఆయన చల్లని చిరునవ్వు ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఆయన శ్రుతి మధురంగా ఉండే పద్యాలెన్నో చదివాడు. వాటిల్లో ఒక్కమాట అర్థంకాకపోయినా జూడీ విని ఆనందించింది. ఆయన నిత్య ఖద్దరుధారి అన్నవిషయాన్ని జూడీ గమనించింది. వాళ్ళంతా భోజనాలకు లేవబోతుండగా వాన దడదడ మొత్తింది. జార్జి వంటయింటినుంచి కొన్నిగజాలు నడిచి ఇంటిలోకి రావలసి ఉంది. ఆ వచ్చేలోగానే పూర్తిగా తడిసిపోయాడు. నాడు ఎంతోకష్టపడి, ఎంతోరుచిగా తయారుచేసిన కూర అంతా నీళ్ళపాలైంది. ఆ పళ్ళెంనిండా ఎవరో నీరు కుమ్మరించినట్లు అయింది. వానకాలం

వస్తే ఇంకొక చిక్కుకూడా ఉంది. ఉతికిన బట్టలు ఎంతకీ ఆరవు. దుప్పట్లు, తలగడ గలీబులు, బల్లగుడ్డలు పూర్తిగా ఆరినట్లే లేవు. జాడీ కనుక తన చెప్పులను ఒకటిరెండు రోజులు తొడుక్కోకుండా ఉన్నట్ట యితే వాటిమీద పచ్చగా పాచి మొలిచేది. సూదులు, గుండుసూదులు తుప్పుపట్టి పోయేవి. జిగురుపూత ఉన్న కవర్లు అంటుకుపోయేవి. చల్లని పొడిగాలికోసం జాడీ కొట్టుకుపోయేది.

జనం అందరికీ ఎక్స్-రే తీయడంకోసం పల్లెటి ప్రాంతాలకు పంపిన పెద్ద మోటారువ్యాను దోవలో ఒకచోట బురదలో కూరుకు పోయింది. అక్కడకు కొంచెం దూరంలో ముందున్నరోడ్డు కొట్టుకు పోయింది. "నేనుకూడా అప్పుడు అక్కడ ఉంటేనా?" అను కుంది జాడీ. దానితోబాటు వెళ్ళిన యువక వైద్యుడు తిరిగివచ్చి రాత్రి అంతా తాము ఆ బండిలోనే ఎలా కాలక్షేపం చేయవలసి వచ్చిందో వివరించాడు. రాత్రల్లా కుక్కలమొరుగు, నక్కలకూత, తోడేళ్ల అరుపులో ఏవేవో వినబడుతూనే ఉన్నాయన్నాడు. లేదా ఏనుగుల ఘీంకారమైనా కావచ్చునన్నాడు. బహుశా ఏనుగులు అర్ధరాత్రివేళ అడవులనుంచి నిశ్శబ్దంగా వచ్చి వ్యానుచుట్టూ తిరుగుతూ ఉండి ఉండవచ్చుననుకుంది జాడీ. బహుశా అవి ఎవ్వరికీ కనబడి ఉండకపోవచ్చు. తొండాలను ఆడిస్తూ అవి మెల్లగా బుసలుకొట్టు తున్నవేమో ? లేదా ఏనుగుల రాకను పసిగట్టడం సులభమేనేమో ? అనుకుంది.

వానాకాలం రావడంతో బడిలో ఆటలన్నింటికి స్వస్తిచెప్పారు. ఆటస్థలమంతా నీటిలో మునిగిపోయింది. ఎండాకాలంలో చక్కని, చిక్కని నీడ నిచ్చే చింతచెట్లక్రిందకూడా ఇప్పుడు వానచినుకులు పడు తున్నాయి. బడిలో తమ తరగతిపైకప్పు హఠాత్తుగా కారడం మొదలు

పెట్టింది. హిందీ పాఠంలో అదృష్టవశాత్తు జూడీ అందరికంటె కిందుగా ఉంది. హిందీ చెప్పే ఉపాధ్యాయిని తన కళ్ళజోడుతో ఒకసారి, కాకుండా ఇంకొకసారి కప్పుకేసి చూచింది. ఆవిడ సాధారణంగా ఆకళ్లజోడును అందంకోసమే పెట్టుకుంటుందనే అందరి అభిప్రాయమున్నూ. ఆవిడ ఊరికే కంగారుపడిపోవడం మొదలు పెట్టింది. తరగతిలో పిల్లలందరూ ఒక్కసారి గొల్లుమన్నారు. ఆవిడ తన చీర చెరగును చేతబట్టి అటూ ఇటూ హడావుడిగా తిరిగింది. పిల్లలు ఆనాటికి మిగతా పాఠం చదవనేలేదు.

తన సహాధ్యాయిని తార పుట్టినరోజు విందుకు జూడీ వెళ్లింది. ఆ విందు చాలా చక్కగా జరిగింది. అక్కడ ఊదావి, పచ్చవి కేకులు పెట్టారు. వాటిపై వెండిరేకులు అద్దారు. ఆ రేకులను తినవచ్చు. చల్లబరచిన పండ్లముక్కలు, ఐస్‌క్రీమ్ పెట్టారు. వాళ్ల ఇల్లు, చుట్టూ వసారాలున్న పెద్ద భవంతి. ఈ వసారాలకుతోడు పెద్దదొడ్డికూడా ఉంది. దొడ్డిలో కొంతభాగాన్ని కప్పారు. దానిని పూవులచెట్లతోను, కాగితపు పువ్వులతోను అలంకరించారు. దొడ్డిలో ఒక ఇంద్రజాలికుడున్నాడు. వచ్చినవారిలో చాలామంది డాబామీద కూర్చున్నారు మరికొంతమంది స్తంభాలకు ఆనుకుని నిలబడ్డారు.

చాలామంది దొడ్డివైపున ఉన్న వసారాలో మూగారు. వాళ్లంతా దగ్గిరచుట్టాలు. అత్తలు, మామలు, వేలువిడిచిన అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు వగైరా అంతా వచ్చారు. ఇంద్రజాలికుడు కొందరు ఆడపిల్లల జుట్టులోనుంచి కోడిపిల్లలను బయటకు తీశాడు. ఒక పామునుకూడా బయటకు తీశాడు. అయితే ఆపాముకు కోరలు పీకేశారని చాలామంది అన్నారు. ఒక చిన్న చెట్టును చక్కగా అప్పటికప్పుడు మొలిపించాడు. జూడీ జేబులోకి బంగారపు గడియారం తెప్పించాడు. అది బంగారంది

లాగే ఉంది - మళ్లి మాయంచేశాడు. గౌనులోపల చెమటతో వళ్ళంతా చిరచిరలాడుతోంది. జూడీ అక్కడ ఎక్కడికి స్వేచ్ఛగా తిరగలేక పోయింది. లేకపోతే ఆనాడు ఇంకా హాయిగొలిపి ఉండేది. అక్కడ ఎప్పటికీకూడా ఆటలు ఆడాలనిపించలేదు. వసారా దూలాలనుంచి ఒక ఊయల వ్రేలాడుతోంది. దానికి పువ్వులుకట్టి అలంకరించారు. ఊగుతూంటే చల్లగా, హాయిగా ఉంది. వచ్చినవాళ్ళు అందరూ వంతులు ప్రకారం ఊగారు.

జూడీ అప్పుడప్పుడు హరిదాసును కలుసుకునేది. వాళ్ళ తండ్రి మంచి వైద్యుడు. ఆయనతో మాట్లాడడమంటే జూడీ తండ్రికి చాలా సరదా. ఆయన ఎప్పుడూ ఏవేవో చర్చిస్తూనే ఉండేవాడు. వాళ్ళ అమ్మ కనిపిస్తేమాత్రం అదోలా బాధగా ఉండేది. అసలు ఏం జరిగిందో జూడీకి తెలియలేదు. బహుశా ఆవిడ అధిక ప్రసంగం లక్ష్మికీ, ఆమె మిత్రులకూ మనస్తాపం కలిగించి ఉండవచ్చు. అయితే అంతంత పెద్ద వాళ్ళను పట్టుకుని తనేం చేయగలదు? ఒకవేళ తాను ఏమన్నా, హరిదాసుతల్లి పెటుసు పెటుకున సమాధానంచెప్పి తన మనస్సు నొవ్వ జేయవచ్చు. అలాంటిది అంటేనే తనకు అసహ్యం. ఒకరోజున జూడీ వాళ్ళ యింటికి వెళ్ళింది. అక్కడ వాళ్ళు ఉత్తరాది వంటకం 'సింగారా' పెట్టారు. మధ్యకూరపెట్టి చపాతీని నాలుగు ప్రక్కలా మడిచి వేయి స్తారు. సోమాసీవంటిది. రసగుల్లాలు, జిలేబీలు, గులాబ్ జాములు, పప్పులు అమర్చిన హల్వాలు చాలా పెట్టారు. చాలాసార్లు వడ్డించారు. ఈహల్వా చాక్‌లెట్ కంటె చాలా రుచిగా ఉంది. అయితే దానితో పాటు చాలా నీరు తాగితేగాని అది గొంతు దిగదు.

ఈమధ్య చాలాకాలంగా లక్ష్మి కనబడలేదు. అమ్మణ్ణి పాటి. ఏమనుకుందో ? ఏమిటో ? ఇంతలో జూడీకి ఇష్టంలేని పని ఒకటి జరిగి

పోయింది. ఒకరోజున చూచేసరికి కంచెలో కంత మూసేసి ఉంది. అంటే ఇంక ఆ కంతలోనుంచి కూడా చూడడానికి లేదన్నమాట. ఆ మూసింది తమ తోటమాలి కాదు. వాణ్ణి అడిగితే తాను కాదన్నట్టు తల ఆడించాడు. అవతలివైపువారే ఆపని చేయించారని అర్థంవచ్చే టట్టు సంజ్ఞచేశాడు. అందుచేత అమ్మణ్ణి పాటి స్వయంగానే ఆ పని చేయించి ఉండాలి. అయితే ఆవిడ ఎందుకు చేసినట్టు? ఏమో ? నిద్రపోతూ ఆ విషయాన్నే తలచుకొని జూడీ తనలో తానే ఏడ్చింది. ఏంచెయ్యాలో ఏమీ తోచలేదు. ఈ విషాదంతోనే రోజులు గడిచి పోతున్నాయి. చివరకు తనకు దుస్సహమై పోయింది. ఈ బాధ ఇంక భరించలేననుకుంది. ఒకరోజు మధ్యాహ్నం ఎండ ఫెళ్ళున కాస్తుండగా తాను చుట్టూ రోడ్డు తిరిగి సింహద్వారంవెంట వెళ్ళి తోటలో ప్రవే శించింది. అమ్మణ్ణిపాటి అక్కడేఉంది. జూడీ సంకోచిస్తూనే నమ స్కారం చేసింది. అక్కడ ఆవులు రెండింటిలోను అందమైనది కావేరి అప్పుడే ఈనింది. దువ్వాయి ఎంతో అందంగా ఉంది. నల్లని మొగంతో పాలమీగడ రంగులో ముద్దొస్తోంది. అక్కడ ఉన్న ప్రతి వారు దానిని నిమురుతున్నారు. తల్లి కావేరి నురగ నెమరులువేస్తూ అక్కడే నిలబడి ఉంది. "లక్ష్మిని గురించే" అంది జూడీ ఏడ్చుకుంటూ, వెక్కుతూ బాధపడుతూ !

ఆమాట అమ్మణ్ణిపాటికి వినబడినట్లే లేదు. ఆవిడ జూడీవంక విషాద నయనాలతో చూచింది. ఆ తరువాత ఆవిడ కావేరికి గిన్నెడు పరమాన్నం తినిపించడం మొదలు పెట్టింది.

జూడీ ఆవిడచీర చెరగు పట్టుకుంది. అమ్మణ్ణిపాటీ, అంటూ బ్రతిమాలడం మొదలు పెట్టింది. "లక్ష్మిని చూచి ఏళ్ళూపూళ్లు అయి నట్టుంది. దానికోసం కళ్లు కాయలు కాచిపోయాయి. దానికి నా

మీద కోపంవచ్చిందని నాకు తెలుసు. కాని ఉత్తరాదివాళ్లే మంచి వాళ్లని నేనెప్పుడూ అననేలేదు. హరిదాసు తల్లి అంటే నాకేమీ అభిమానం ఎప్పుడూ లేదు. నాకు ఢిల్లీకి వెళ్లడం ఇష్టమే లేదు—" అంది.

హఠాత్తుగా అమ్మణ్ణిపాటీకి చిన్ని చెయ్యి బరువుగా తనచెయ్యిని బిగబట్టుతున్నట్టు అనిపించింది. "నువ్వేచెప్పు" అమ్మణ్ణిపాటీ మెల్లగా అంది. "లక్ష్మి అనుకున్నదంతా నిజంకాదు. వట్టి పిచ్చి ఊహ..."అంది. అంతలో అమ్మణ్ణిపాటీ కళ్లలో గిర్రున నీరు తిరగడాన్ని జాడీచూచింది. "అచ్ఛా. లక్ష్మి ఏమనుకుంటుందో ఏమో! నేను చెప్పనేలేదు. నా మనస్సులో ఉన్నమాటను తనకు చెప్పడానికి నాకు లక్ష్మి అవకాశం ఇవ్వనేలేదు. అమ్మణ్ణిపాటీ నువ్వైనా చెప్పవా ?" అంది జాడీ.

అమ్మణ్ణిపాటీ చీర చెరగుతో కళ్ళు తుడుచుకుంది. "అమ్మా! జాడీ! నువ్వు లక్ష్మికి ఒక ఉత్తరం వ్రాయి. అప్పుడు దానికి నమ్మకం కలుగుతుంది."

"వ్రాయనా ?" అంది జాడీ. "నేను లక్ష్మిని కలుసుకోకూడదా ? మద్రాసులో లేదా ?"

"లేదు" అంది అమ్మణ్ణిపాటీ. "ఏం జరిగిందో చెబుతా విను. లక్ష్మి తండ్రి, మా అబ్బాయి కుమార్ నా బిడ్డలందరిలోకీ ఉత్తముడు. వాడు ఇంజనీరు". జాడీ తల ఆడించింది. అంతలో వాళ్ళ నాన్నగారు చెప్పినదంతా చప్పున జ్ఞాపకం వచ్చింది. "వాడు ఒక గొప్ప ఇంజనీరింగ్ సంస్థలో పనిచేస్తున్నాడు. పెద్ద జీతమే ఇచ్చేవారు. మోటారుకారు అవీ ఉన్నాయి. అంతా బాగానే ఉంది! అయితే ఆ సంస్థలో దుష్టులు కొందరున్నారు. వాళ్ళు కంట్రాక్టులు పుచ్చుకోవడంలో మోసం చేస్తారు. నా బిడ్డ కుమార్‌కు ఇదంతా తెలిసింది. వాళ్ళని ఆపడానికి

ప్రయత్నించాడు. వాళ్లు లంచం పెట్టి మా వాణ్ణి కూడగట్టుకోవడానికి ప్రయత్నించారు. వాడు వద్దన్నాడు. ఇలాంటి ఆటలు సాగనివ్వనన్నాడు ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానన్నాడు. వాళ్ళకి కోపంవచ్చింది. నా బిడ్డకు చిక్కులు తెచ్చిపెట్టారు. వాణ్ణి గురించి పచ్చి అబద్ధాలు కల్పించి చెప్పారు. పైగా అందులో రాజకీయాలుకూడా కలిశాయి. మా కుమార్ పుట్టు బ్రాహ్మణుడు. అందుకని ఈ దుష్ట సంస్థలలో మావాడి ఉద్యోగంకాస్తాపోయింది. అయితే వెంటనే చిన్నపని దొరికింది. కేంద్రప్రభుత్వం తరఫున ఇక్కడికి చాలా దూరంలో ఉన్న ఒక పల్లెటూరిలో పంటకాలువను త్రవ్వించే పనికి ఒప్పుకున్నాడు. మా అమ్మాయి, కోడలు, లక్ష్మి, కందన్, సరస్వతి, బుల్లిపార్వతి అంతా వాడితోపాటే అక్కడికి వెళ్ళారు. అక్కడ వాళ్ళంతా ఒక చిన్న ఇంటిలో ఉంటున్నారు.'' అంటూనే ఆవిడ మళ్ళీ కళ్ళు తుడుచుకుంది.

''అమ్మణ్ణిపాటీ!'' జూడీ అంది. ''ఇలాంటి దారుణమేదో జరిగిందని నేనూ విన్నాను. అయితే ఎల్లకాలం ఒక్కలాగే ఉంటుందా? కలకాలం ఇలాగే కష్టపడుతారా? చివరకు సత్యమే జయిస్తుందనీ, మంచికి తప్ప మంచిరోజులు రాగలవనీ మా నాన్నగారు చెబుతూ ఉంటారు.''

''నాకూ అదే నమ్మకం. అయితే అదెప్పటిమాటో? నా బిడ్డ, వాడి సంతానం అంతాకూడా ఇప్పటికి మాయమైపోయారు. అమ్మా! జూడీ! నువ్వు లక్ష్మికి ఒకఉత్తరం వ్రాయి'' అని చెప్పి ఇంట్లోకి వెళ్ళింది. ఇల్లంతా వెతికి ఒక కాగితం ముక్క తెచ్చింది. చీరకొంగు ముడివిప్పి పెన్సిలు ముక్క తీసియిచ్చింది. ఆవిడ చాలా వస్తువులను అలాగే కొంగున ముడి వేసుకుంటుంది. ఎడ్రసు వ్రాసియిచ్చింది. ''ఇదిగో

నమ్మా ఈ ఊళ్ళోనే ఉంటోంది. ఆ వూరిపేరు ప్పాన్నేరి. చిరునామాలో ఈ వివరాలన్నీ వ్రాయి. మరి చిన్నవూరు కదా!" అంది.

"అలాగే, సరేనమ్మా" అందిజూడీ. "నేనువ్రాస్తా—ఈరాత్రికే వ్రాస్తా. మ...మరి...దయచేసి—".

"అలాగే" అంది అమ్మణ్ణిపాటీ. "కంచెలోకంత మళ్ళీ తెరిపిస్తారే"

8. వరదలు

ఆ రోజంతా తెకతెకలాడుతూనే ఉంది. అంతగా ఉక్కపోసిన తరువాత ఆ రాత్రి పెద్ద పెట్టున గాలీ - వానా ముంచుకు వచ్చాయి. మెట్లక్రింద నేల దిగిపోయి సిమెంటు పగిలిపోయిన దోవ అంతా తడిగా ఉంది. బెన్ ఎంతో భయపడిపోయాడు. ఆ భయంతో మూలిగాడు కూడాను. పిల్లలు ఎలా ఉన్నారోనని వాళ్ళఅమ్మ చూడడానికి వచ్చినప్పుడు జూడీ ఎంతో సంతోషించింది. జడివాన హోరున కురుస్తూంటే ఆ చప్పుడు విని ఎవ్వరు ఎలాఉన్నారోనని భయపడడం సహజం. రాత్రి అంతా వాన అలా కురుస్తూనేఉంది. తెల్లారేటప్పటికి తోటఅంతా ఇదివరకెన్నడూ లేనంతగా వాన నీటితో నిండిపోయింది. ఆ మర్నాడు పొద్దున్నే ఆకాశం కొంచెం తెరపిన పడింది. ఆ సమయంలో జూడీ తమ ఇంటిడాబాపైకెక్కి చుట్టూ కలయచూచింది. ఎదురుగా అమ్మణ్ణి పాటీగారి తోటంతా వాననీటితో నిండి కొల్లేరుగా కనబడింది. ఆనీటినే ఆవులు త్రాగుతున్నాయి. ఆకతల అక్షింతలపువ్వుల కంచెకు అవ్వలి వైపున పిల్లలు ఆసులతో పడవలుచేసి ఆ నీటిలో పడవేస్తున్నారు. బుల్లి రామకృష్ణుడు బుడుంగున నీటిలో కూర్చున్నాడు. మరికొస్త దూరంలో చెట్లమధ్య వాననీరు మడుగుకట్టి నిలిచింది. ఆ నీరు తళతళ మెరుస్తోంది. రోడ్డుకు అటువైపున ప్రతిచోటా ఇంతే. అంతా ఇలాగే ఉంది. మద్రాసు నగరంలోకవచ్చే పెద్దరోడ్డు నీళ్ళలో మునిగిపోయింది. రాకపోకలు నిలిచిపోయాయి. బహుశా జూడీ బడికి వెళ్ళలేకపోయేది.

మరి కొంచెంసేపటికి టెలిఫోన్ గంట మ్రోగింది. వాళ్ళ అమ్మ జవాబు చెప్పింది. ఔను, ఔను అలాగా!...అంటే నీరు ఇంకా తగులుతోందన్నమాట. మట్టం పెరుగుతోందా? సరే! నీవు గుప్పట్లు తీసుకురా. సరిపడినన్ని ఉన్నాయనుకుంటాను. ఉంటే సరే. శ్రీమతి

జ్ఞానమ్మాళ్ దగ్గర పాలపొడిఉంది. ఓ! ఆవిడ అంతర్జాతీయ శిశు సంరక్షణనిధివారు పంపించిన ఆ పాలపొడిని డబ్బాలలో నింపి తీసుకు వస్తోందా? బాగుంది. అయితే దానిని కలిపి పాలు తయారుచేయడంలో మీ రెవరో ఒకరు సాయం చేయండి. ఇంతలో ఆవిడ దేనికోసమో చుట్టూ కలయచూచింది. "నేను జూడీని తీసుకువస్తాను ... రావచ్చు దానికేం! చాలా సాయం చేస్తుంది. అక్కడి దృశ్యాలు దుర్భరంగా ఉంటాయంటారా? దానికేమి? చిన్నదా? చితకదా? పదకొంతేళ్ళు ఉన్నాయిగా! - జూడీ లక్ష్మికి తాను వ్రాస్తున్న లేఖను త్వరత్వరగా ముగించడానికి ప్రయత్నిస్తోంది. అయితే ఆపని అనుకున్నంత తేలికగా లేదు.

ఈ మాట వినగానే జూడీ ఒక్కసారి హుషారుగాలేచి గంతులు వేసింది. ఒక్కసారిగా పెద్దతనం దానిని ఆవహించింది. "అమ్మా, నువ్వనేది, ఆ నదిఒడ్డున నివసిస్తున్న వాళ్ల సంగతేనా?" అంది.

"పాపం! వాళ్లమాటే!" అంది అమ్మ.

"వాళ్ల గుడిసెలన్నీ కొట్టుకుపోయాయట. బహుశా వాళ్లలో కొందరు నీటిలో మునిగిపోయారేమో కూడాను! వాళ్లు నగరం శివార్లకు వెలుపల ఉంటున్నారు. వాళ్ళసంగతి ఎవ్వరికీ పట్టినట్లే లేదు. రామకృష్ణ మిషన్ సాయంచేస్తోంది కాని, వీళ్ళకు కాదు. అయితే వాళ్లు రానున్న ఆపదను గుర్తించి గట్టెక్కి పోవలసింది. అందరికీ ఆ మాత్రం తెలివితేటలుంటాయా? అంతేమరి. మనకోసం కూర, వెన్న పొదిపి కాసిని రొట్టెలు సిద్ధంచేయమని జార్జితో చెప్పు."

"అయితే రోడ్డు అంతా నీటితో నిండిపోయింది కదా, మనం అక్కడకు ఎలా వెళ్ళతాము?"

"వాళ్లు మనకోసం ఇంకొక దోవను మోటారువాను పంపుతున్నారు. రోడ్డుమీద కొన్ని అంగుళాల నీరు నిలిచినప్పటికీ ఫరవాలేదు. కారు దానిలోనుంచి దూసుకుపోతుంది. అక్కడ మనం చాలాపాలు కలప వలసి వస్తుంది. పని అంతా చాలావిసుగుగా ఉంటుంది. అయితేనేం? నీవుకూడా యథాశక్తి సాయంచేయగలవనీ, చేయదలచావనీ నాకు తెలుసు."

"అచ్చే! నేను మందకొడిగా ఎప్పుడూ కూర్చొనే కూర్చొను. అయితే ఈపాలుఅన్నీ మిత్రరాజ్యసమితి రాజ్యాలనుంచి వచ్చినవేనా?"

"అవును!" అంది అమ్మ. "మనకు పెద్దఫ్లాస్కునిండా వేన్నీళ్లు కూడా కావాలని జార్జితో చెప్పు. కాచిన నీళ్లు తప్ప మరేనీరూ తాగకు. వరదలవల్ల నీళ్లు మామూలుకంటెకూడా మురికి అయిపోతాయి.

ఒక అరగంటలో రోడ్డుమీద గుంటలలో నిలిచిన నీటిని చిందించుతూ మోటారువ్యానువచ్చి గుమ్మంలో నిలబడింది. కొంచెం ప్రక్కకు పొరపాటున వెళ్లివుంటే అది వచ్చివచ్చి ఒక "సరస్సు"లో చిక్కుకునేది! జూడీ, వాళ్ల అమ్మా, మెల్లిగా గట్టుతిరిగివచ్చి మోటారు వ్యానులో కూర్చున్నారు. లోపల నీలినూలుచీర, కట్టుకుని శ్రీమతి జ్ఞానమ్మాళ్ పాలపొడిడబ్బాలమధ్య 'కుంచం'వలె కూర్చుంది. ఆవిడ ఎప్పుడూ సంతోషంగా ఉంటుంది. నోటిలో కొన్ని బంగారపుపళ్లు కట్టించుకుంది. వాన కురిసి వెలిసిన మూడు నాలుగు గంటలకు వరదతగ్గింది కాని ఊరిలోని వాన నీరంతా ఏరులుకట్టి వచ్చిపడడంలో నీటిమట్టం పెరుగుతూనే ఉంది. దోవలో తట్టతలపాగా పెట్టుకున్న మద్రాసు పోలీసు ఒకడు మమ్మల్ని ఆపి, ఒకవంతెన మొగదల అంతా వాననీటితో నిండిపోయినందున చుట్టుతిరిగి మరొక దోవను వెళ్ళవలసిందని సలహా ఇచ్చాడు.

ఎలాగైతేనేమి వారంతా వెళ్ళవలసిన చోటుకు చేరుకున్నారు. అక్కడ వరద పరిస్థితి నిజంగా అధ్వాన్నంగానే ఉంది. జనం గుంపులుకట్టి రోడ్డు ప్రక్కన నిలబడి ఉన్నారు. మరికొంతమంది ఒక చోట కూర్చున్నారు. మొత్తానికి వారంతా మూర్తీభవించిన దైన్యం వలె ఉన్నారు. ఎదురుగా చిక్కని వరదనీరు ముదురు గోధుమ రంగులో ఉరకలు వేసుకుంటూ చెట్లమధ్యనుంచి తుప్పల మధ్యనుంచి ప్రవహించిపోతోంది. ఇద్దరు ముందుకు వచ్చి పాలపొడి డబ్బాలను కారులోనుంచి దింపారు. "రా! జూడీ!" అని వాళ్ళ అమ్మ పిలి చింది. వాళ్ళు అందరూ వరదకు అందకుండా ఎత్తుగా ఉన్న మామిడి చెట్ల మధ్య రోడ్డుమీదుగా ముందుకు సాగిపోయారు. ఒకచోట సుడిగుండం కనబడింది. అక్కడ లోతు ఎక్కువ. నీరు చాలా మురి కిగా ఉంది. అందులో నీటిలో మునిగిపోయిన మేక ఒకటి, కొన్ని చచ్చిన కోళ్లు జూడీ కంటబడ్డాయి.

"చూచావా! జూడీ వాళ్ళందరినీ ఆ కనబడే బళ్ళోకి చేర్చాము," అంది వాళ్ళ అమ్మ. ఆ బడి పండుఇటుకల గోడలమీద నిలబెట్టిన పొడుగాటి భవనం. చాలా దిగువకు ఉంది. అయితేనేం ఆపత్కాలంలో తలదాచుకోవడానికి చాలుకదా! అయితే వారిలో చాలా కుటుంబాల వారు కర్రా, కంపా పెట్టి కొంపంటూ ఒకటి ఏర్పరచుకోవాలని తంటాలు పడుతున్నారు. అంతలో దోవకు పక్కనే ఒకావిడ ఎవరో నల్లని తడిచీర కట్టుకొని, కళ్ళు మూసుకుని పడుకొనిఉంది. జూడీ చూసింది. "పాపం నీళ్ళలో మునిగిపోయినట్టుంది. ఆవిడ చుట్టాలు ఎవరో తెలుసుకోవడానికి మనవాళ్ళు ప్రయత్నం చేస్తున్నారు", అని చెప్పింది వాళ్ళ అమ్మ. అయితే ఎందుకోగాని జూడీ ఆమాటను అంతగా పట్టించుకోలేదు. తడిసి ముద్దయి శవప్రాయంగా ఉన్న ఆ

అనాధ బాధపడుతున్నట్టుగాని, అశాంతిగా ఉన్నట్టుగాని లేదు. మళ్ళీచూస్తే ఆవిడ అక్కడలేదు, అంతే. దగ్గరలో కాస్త ఎత్తుగా ఉన్న గుట్టమీద పొయ్యి మండుతోంది. దానిమీద కర్రలతో ఒక పెద్ద కుండను వ్రేలాడకట్టారు. ఇంతలో శ్రీమతి జ్ఞానమ్మాళ్ ఖాళీడబ్బాలు కుండలు, పిడకలు, దాకలు, మూకుళ్ళు, ఒక లేమిటి పాలుపోయడానికి పనికివచ్చేవి ఏవైనా సరే కావాలంటూ హడావుడిగా మనిషిని పంపించింది. "మీ అమ్మ దుప్పట్లకు సంబంధించిన పని చూస్తోంది కనుక నువ్వూ, నేనూ ఒక జట్టుగా పాలపని చూద్దాం" అంది. "నేనేమో వేన్నీళ్ళు పోస్తాను. నువ్వు కర్రతో ఆపాలు కలుపు. బాగాకలుపు" అని పురమాయించింది. అనడమే తరువాయిగా చేతికి అందిన ప్రతిదానిలోను పాలపొడిని దిమ్మరించడం ప్రారంభించింది. జూడీకి ఒక కొయ్య డోకిని ఇచ్చింది. "ఒకదాని పని పూర్తికాగానే నాతో చెప్పు. మరో దానిపని చూడు" అంది.

"సరే" నంది జూడీ. వేన్నీళ్ళను పాలపొడిని బాగా కలుపుతోంది. ఒకదాని తరువాత మరొకటిగా కలుపుకుంటూ వస్తోంది. శ్రీమతి జ్ఞానమ్మాళ్ చీరకొంగు నడుముకు బిగించింది. ఆ కట్టుకోవడం అచ్చంగా లక్ష్మి నృత్యం చేసేటప్పుడు ఎలా కట్టుకునేదో అలాగే బిగించుకుంది. అప్పుడావిడ చూస్తే ఆ ఊరి ఆడవాళ్ళలో ఒకత్తెలాగే ఉందికదా! అనుకుంది జూడీ. ఎటొచ్చీ ఉన్న తేడాఅల్లా హుషారుగా చకచకా పనిచేసుకు పోవడంలోనే అని కూడా అనుకుంది. పిల్లల తల్లులందరినీ ఒక పంక్తిలో కూర్చోపెట్టింది. వాళ్ళందరికీ పాలుపోస్తోంది. మట్టిలో కూర్చున్నవాళ్ళు అలాగే చతికిలపడి జూడీకేసీ, ఆవిడకేసీ అలానిశ్శబ్దంగా చూస్తూ ఉండిపోయారు. కొంచెంసేపు అయ్యేసరికి వాళ్లలో కొంతమందివచ్చి సాయంచేస్తే బాగుండునని జూడీ అనుకుంది. కాని వాళ్లెవ్వరూ ముందుకు రాలేదు. బహుశా వాళ్లెప్పుడూ ఇలాంటి

పని చేయలేదు కాబోలు ననుకుంది జాడీ. "నిత్యం కుడితిలోపడ్డ ఎలుక వలె చేసినపనే చేసుకుంటూ కాలక్షేపం చేసుకోవడమేనని ఎప్పుడైనా పాలు కలిపితేకదా" అనుకుంది. ఇంతలో జాడీ వళ్ళంతా చెమటతో నిండిపోయింది. బాగా అలసిపోయింది. పాలపొడివాసన వెగటు కలిగిస్తోంది. ముఖానికీ, తలకూ ఆ వాసన పట్టిపోయినట్టనిపించింది. ఇది ఇలా ఉండగా చెట్లవెంట, కుంటలవెంట వరదనీరు కొంచెం కొంచెంగా ముందుకు త్రోసుకు రావడాన్ని జాడీ క్రీగంట కనిపెట్టు తూనే ఉంది.

ఎట్టకేలకు ఆపని ముగిసింది. ఫ్లాస్క్ వంచుకుని శీతలపానీయాన్ని తాపీగా తాగింది. ఒక రొట్టెముక్కను తింది. అయితే అంతమంది వరదబాధితులు చూస్తుండగా తినడానికి అదోలా అనిపించింది. ఏదికాస్తా వాళ్లకే పెట్టిస్తే బాగాఉండును అనిపించింది. శ్రీమతి జ్ఞానమ్మాళ్ రెండు గిన్నెల ఇత్తడి కారియర్‌తో అన్నం, కూరా తెచ్చింది. ఆవిడ తన వెంట రొట్టెలు ఏమీ తెచ్చుకోలేదు. మా అమ్మకూడా ఇలా అంచుల పైకి ఎగతిరిగిపోయిన రొట్టెలు తీసుకురాకుండా అన్నం, కూరా అలాంటివి తెస్తే ఎంతబాగుండును, అనుకుంది జాడీ. పైగా తాను తెచ్చుకున్న కూరా, అన్నాన్ని శ్రీమతి జ్ఞానమ్మాళ్ తన చేతితో చక్కగా తింది. తాను తినగా మిగిలినదానిని ఒక ఆకులో పొట్లం కట్టింది. ఇంతలో దానికోసం గుంపులోనుంచి ఎవ్వరో బక్క చిక్కిన చెయ్యిని ముందుకు చాచారు.

వరదకు కొట్టుకుపోయినగ్రామం నదిఒడ్డున నీటికి చాలాదూరంగా ఉండేది. వేసవిలో నది తీసినప్పుడు జనం కొంచెం కొంచెంగా ముందుకు తోసుకువచ్చి నీటికి దగ్గరగా జరిగారు. ఇంతలో అర్ధరాత్రివేళ చీకటి చాటున నదికి ఉవ్వెత్తున ఒక్కసారిగా పెద్ద వరదవచ్చి వారందరినీ

ముంచెత్తింది. వాళ్ల గుడిసెలను, కోళ్లగంపలను, మేకలను, వలలను, ఇతర పరికరాలను అన్నింటినీ తుడిచిపెట్టుకుని పోయింది. వీటిలో కొన్ని నీటిలో మునిగిపోయిన స్త్రీవలె వరదవచ్చినప్పుడు హాయిగా నిద్రపోతున్నాయి. వరదహోరు, వానహోరుకంటె తక్కువే. కనుక ముందుగా కనుక్కోలేకపోయారు. వారిలో కొంతమంది పక్కనీ, బొంతనీ, కొన్ని కుండలనూ, ముంతలనూ దక్కించుకోగలిగారు. మరి కొంతమందికి అవీ దక్కలేదు. అన్నీ పోయాయి. కొంతమంది ఒంట్రుతో సారవంతమైన ఆ ప్రాంతాన్ని కొంతవరకు సాగుచేశారుకూడాను. చేలు నవనవలాడుతూ ఎదిగివచ్చాయి. ఇప్పుడు అవి అన్నీ మునిగిపోయాయి. బహుశా పంటలన్నీ పూర్తిగా చెడిపోయి ఉండవచ్చు. మద్రాసు బస్తీకి వచ్చి కూలీలుగా పొట్టపోసుకునే వారిస్థితి అంత అధ్వాన్నం కాదను కుంటాను. వారిలో ఎవ్వరికీ ఆహారం ఏమీ దక్కలేదు. వాళ్ల భార్య, బిడ్డలు, అంతా ఒడ్డెక్కి కూర్చున్నారు కాని, వారు ఆకలికి మలమల మాడిపోతున్నారు. నిరాశతో కృంగిపోతున్నారు. బహుశా సుదీర్ఘమైన భారతదేశ చరిత్రలో ఇలాంటి పరిస్థితి తరుచుగా దాపురించేదేమో!

జాడీ బాగా అలసి పులుసైపోయింది. అంతకంతకు ఎండముదురుతోంది. ఉక్కకు ఊపిరాడడంలేదు. వాసన దుర్భరంగా ఉంటోంది. పైగా అంతమంది ఒక్కసారిగా అక్కడ చేరితే, అదోరకం వాసన వస్తోంది. అది వెగటు కలిగించే వాసన. కష్టాలవాసన, వరదనీటి వాసన, ఈ అన్నింటిని మించి పాలపొడివాసన జాడీకి దుర్భరమై పోయింది. అయినా ఏమిచేస్తుంది? చెయ్యాక తప్పదాయె! శ్రీమతి జ్ఞానమ్మాళ్ తిరుగుతోంది. కాలూ చెయ్యీకూడా తీసుకోవడానికి ప్రయత్నిస్తున్న స్త్రీనో లేక తన చిన్న తమ్ముణ్ణి ఆడిస్తున్న పాపనుచూచో, ఆమె నవ్వినప్పుడల్లా బంగారపుపళ్లు బయటపడుతున్నాయి.

ఇంతలో అక్కడ రోడ్డుమీదకు ఇంకొక మోటారువ్యాను వచ్చింది. అందులో వచ్చినది ఎవరా ? అని చూస్తే, ఆ వచ్చింది హారిదాసూ, వాళ్ల అమ్మాను. హారిదాసు పరుగెత్తుకుంటూ వచ్చాడు. మనిషినిచూస్తే ఆ ఎండలో సైతం బాగా పరుగెత్తగలిగినవాడి వలెనే ఉన్నాడు. "ఇక్కడేం చేస్తున్నావు, జూడీ ? నేనుకూడా కొస్త సాయంచేయనా ?" అన్నాడు.

జూడీ మెల్లిగా తన్ను తానే ఉత్సాహపరచుకొని చకచక పాలు కలపడం ప్రారంభించింది. "నీకీపని చేతగాదనుకుంటాను" అంది.

"అబ్బే ! అదేమిటి ? నేనూ కలపగలను. ఆ గరిట ఇలా తే!" అన్నాడు హారిదాసు.

"అయితే సరే. కలుపు చూద్దాం. ఇదిగో చూడు, పాలపిండి బాగా పాలుఅయ్యేటట్టు కలపాలి. అంతేకాని ముద్దలు ముద్దలుగా నిలిచిపోకూడదు. ఒకడబ్బా పాలపొడి కలిపి చెయ్యగానే శ్రీమతి జ్ఞానమ్మాళ్ దగ్గరకు తీసుకువెళ్ళు. నేను చూస్తూ ఉంటానుగా!"అంది.

అలా అని జూడీ వెనక్కి జారగిలబడి కూర్చొని హారిదాసు కలుపుతుండగా చూసింది. ముందుగా హారిదాసు ఎంతో హడావుడి పడి పోతున్నట్టు కనబడ్డాడు. కాని హారిదాసు తనంత బాగానూ, త్వరగానూ పాలు కలుపుతున్నాడు. ఇంతకీ ఏమీ చెయ్యకుండా ఇలా చూస్తూ కూర్చుంటే ఎంతబాగుంటుంది. అనుకుందిజూడీ. హారిదాసు తల్లి, జూడీ తల్లికి సాయంచేయడానికి వెళ్లింది. ఆవిడ వట్టి కబుర్లపోగు. అయినా పనిమాత్రం బాగానే చేస్తుందట. జూడీ తన దృష్టిని అంతట హారిదాసు చేస్తున్న పనిమీదనుంచి వరదనీటికేసి మరల్చింది. వరద ఇంకరావడంలేదు. తగ్గుమొహం పట్టినట్టేఉంది. తీస్తూ తీస్తూ కట్టెలను కంపలను, పళ్ల తొక్కలను ఆఖరుకు ఒక చచ్చిన కోతినీ వదలిపెట్టి పోయింది.

"అవేమిటి ? గుడ్డపేలికలనుకుంటూ ?" అందులో పనికివచ్చేది ఏమైనా ఉన్నదేమోనని ఇద్దరు ఆడవాళ్లు వెతుకుతున్నారు. ఇంతలో శ్రీమతి జ్ఞానమ్మాళ్ వచ్చింది. కట్టుకున్న చీరమడతలోనుంచి ఒక పెద్ద జేబు రుమాలు ఒకదానిని బయటకు తీసింది. అది ఎంతో పరిశుభ్రంగా ఉంది. "జూడీ, నీతల దీనిమీద పెట్టుకుని ఒక్క నిముషం సేపు విశ్రాంతిగా పండుకో. నిద్రపోనక్కరలేదులే" అంది.

నిజమే ! వాసనకొట్టే నేలమీద చీమలు కరవకుండా చక్కని జేబురుమాలు పరచుకొని పడుకోవడం బాగానే ఉంది. బహుశా ఒక్క నిమిషంసేపు కళ్లుమూసుకోవాలనిపించవచ్చుకూడా. ఇలా పడుకుంటే ఎలా ఉంటుంది. ఇంతలో హరిదాసు ఇంకొక డబ్బా పాలపొడి కావాలన్నాడు. తాను డబ్బా విడగొట్టుతున్నాడు. అక్కడినుంచి ఆనీడలు దూరంగా కదలిపోయాయి. కన్నుతెరచిచూస్తే వరద చాలా భాగం తీసింది. చాలాసేపు నిద్రపోయాను కాబోలు అనుకుంది.

ఆవేళప్పటికి గ్రామంలో అందరి ప్రాణాలు ఒకమాదిరిగా కుదటపడ్డాయి. పసిపిల్ల లందరికి పాలు పట్టించారు. బయట ఉన్నవారు కర్రలతోటి, కంపలతోటీ, కంబళ్లతోటీ తల దాచుకోవడానికి ఒకరకం నెలవు ఏర్పరచుకున్నారు. బహుశా రాత్రి మళ్లీవాన కురుస్తుందేమో ! ఒక వేళ నదికి ఇందాకటికంటె హెచ్చువరద వచ్చినప్పటికీ చాలా ఎత్తున మిట్టమీద ఉన్నబడిలో వారంతా సుఖంగా ఉండవచ్చు.

తనకుమల్లేనే హరిదాస్‌కు కూడా తలనిండా, చొక్కా నిండా పాలపొడి పడి గడ్డకట్టుకు పోవడాన్ని జూడీ గమనించింది. తాను కూడా అలసిపోతున్నాడు. అందుకనే జూడీ మళ్లీ కలపడానికి వచ్చినప్పుడు చాలా సంతోషించినట్టు కనపడ్డాడు. ఆ సాయంత్రానికి వాళ్లు ఇంకొక్క డబ్బాకంటె హెచ్చు పాలపొడిని ఉపయోగించనే

లేదు. తాము తెచ్చిన బియ్యం, ధాన్యం, అన్నింటినీ అక్కడ అందరికీ పంచిపెట్టారు. అక్కడ వారందరికీ తినడానికి తలా కొంత ఆహారం దొరికింది. వచ్చిన వారంతా మళ్లీ మోటారు వ్యానులలో ఎక్కి బస్తీకి తిరిగి వెళ్లిపోయారు. ఈశాన్యంనుంచి మళ్లీ మబ్బులు కమ్ముకు వస్తున్నాయి. బహుశా వాన మళ్లీ కొట్టి కురుస్తుందేమో. తలదాచు కోవడానికి తగిన తావులేని వారందరినీ గురించి ఆలోచించడం నిజంగానే చాలా బాధగా ఉంది. అయితే ఆపరిస్థితులలో సాయంచేయగలిగామన్న ఆలోచనే ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. వరదలు, ప్రవహించినంత మేరా రోడ్లన్నీ ఎర్ర బురదతో నిండిపోయాయి.

"నేను ఇవ్వాళకు బడికి వెళ్లలేను. నువ్వు వెళ్లగలవా?" అన్నాడు హరిదాసు.

"అబ్బే! నేనూ వెళ్లలేను. అయితే రేపటికి వరద తీసి ఆకాస్త రోడ్డూ బాగుపడ వచ్చుననుకుంటా" అంది జూడీ.

9. జాతీయాభివృద్ధి విస్తరణ ప్రణాళికలు

జూడీ లక్ష్మికి ఒక ఉత్తరం వ్రాసింది. ఉత్తరానికి అన్ని వైపులా ఏవేవో వ్రాసింది. కొట్టివేసింది. కొక్కిరి బిక్కిరిగా ఏమేమో బరికింది. దానినిండా సిరా ముద్దలు ముద్దలుగా పడింది. దీనిని ఈపళంగా ఇలాగే పంపించడంకంటె అందంగా తిరిగి వ్రాస్తే మంచిదని వాళ్ళ అమ్మ సలహా ఇచ్చింది. ఎండ మండి పోతోంది. అందుచేత అంత ఉత్తరాన్ని మళ్ళి చచ్చినట్టు వ్రాయడమంటే మాటలా అనుకుంది జూడీ. లక్ష్మి ఏమి అనుకోదులే అని సరిపెట్టుకుంది. దానిని మడిచి ఒక కవరులో పెట్టింది. అంటించి స్పెన్సర్ భవనంలో ఉన్న పోస్టు ఆఫీసుకు తీసుకువెళ్ళి డబ్బాలో పడవేసింది. తన ఎదురుగుండానే దానిని తీసుకువెళ్లి బిళ్ళమీద తపాలాముద్ర వేశారు. వాళ్ల అమ్మ ఆప్రక్కనే ఉన్న కొట్లో వెన్న బిస్కట్లు, యాస్పిరిన్ వగైరా కొంటూ ఉండగా జూడీ స్పెన్సర్ కెఫేలో నారింజరసం త్రాగింది. ఆ తరువాత ఇత్తడి, రాగి పాత్రలు అమ్మే దుకాణంనుంచి వాళ్ళు కొత్త తేనీటి పాత్రను కొన్నారు. ఆ దుకాణం ఒక సన్నని చిన్న గుహవంటిది. దానినిండా రకరకాల పాత్రలు అనేక వరసలుగా పేర్చిఉన్నాయి. కొన్నికొన్ని గుత్తులు గుత్తులుగా వ్రేలాడుతున్నాయి. అక్కడ ఉన్న వాటన్నింటిలోకి ఇత్తడి పాత్రలు, రాగిపాత్రలు, ముఖ్యంగా నీళ్ళ బిందెలు చాలా అందంగా ఉన్నాయి. అయితే స్టెయిన్‌లెస్‌స్టీల్ గిన్నెలవలె అంత ఉపయోగమైనవి కాదు. ఇప్పుడివి ఈ దేశంలోనే తయారవుతున్నాయి కూడాను. ఈ కొత్తగా కొన్న పాత్రమీద తన పేరు వేయమని వాళ్ళఅమ్మ కొట్టువాణ్ణి అడిగింది. వాడు చిన్న ఎలక్ట్రిక్ మోటారుతో అక్షరాలు గబగబా చెక్కాడు.

ఈ మాత్రం పనికి లండన్‌లో అయితే ఎన్నివారాలో పట్టేది. అంది వాళ్లఅమ్మ. ఎంత చిన్నపని అయినాసరే అంతకు తక్కువ పట్టదు. మాటవరసకు వాళ్లనాన్నగారి కళ్లజోడుకి ఒకపక్క కాడ విరిగిపోయింది. దానిని ఆయన క్షణాలమీద బాగుచేయించుకున్నారు. అన్నిటికంటె ఆశ్చర్యకరమైనది ఏమిటంటే ఆ మరమ్మతు చేసేవాడు ఎంతో సరదాగా చేసినట్లు చేసేవాడు. అక్కడినుంచి వాళ్లు మోటారు కార్ఖానాకువెళ్లి తమకారుకు కొత్తటైరు ఇంకా ఎంతకాలానికి వస్తుందో అడిగి తెలుసుకున్నారు. ఇలాంటివాటికిమాత్రం కొంతలోకొంత ఆలస్యం అవుతూనే ఉంటుంది. పిమ్మట అందరూ కలిసి ఇండియా కాఫీహౌస్‌కు వెళ్లారు. ఒక పాను కాఫీ కొన్నారు. తలో కప్పు కాఫీ తాగారు. ఇంతసేపూకూడా జూడీ తన ఉత్తరం పాన్నేరిలో ఉన్న లక్ష్మికి ఎప్పుడు చేరుతుందా ? ఎప్పుడు జవాబువస్తుందా, అనే విషయమై ఆలోచిస్తూనే ఉంది.

వరదలు చాలావరకు తగ్గిపోయాయి. వాళ్ల అమ్మ శ్రీమతి జ్ఞానమ్మాళ్‌తో కలిసి అక్కడి శిబిరానికి వెళ్లింది. అక్కడి వారందరూ మళ్లీ కలిసికట్టుగా అన్నిపనులు చేసుకుంటున్నారు. వరదనీటిలో మునిగి చనిపోయిన అనాథశవాన్ని ఆమెబిడ్డలు గుర్తించి యథావిధిగా దహన సంస్కారం జరిపించారు. గ్రామస్థులలో చాలామంది బడి భవనంలోనే మరికొంతకాలం మకాం వేస్తే బాగాఉంటుందనుకున్నారు. ఇందుకు కారణం — తమ పూరిగుడిసెలవలె కాకుండా — చక్కని బలిష్ఠమైన కప్పు అయినా ఉంది. అయితేనేమి ? అదెలా కుదురుతుంది ? అక్కడ చదువుకొంటున్న పిల్లలకు ఇంకొకచోటనైనా చదువు నేర్పాలికదా ? అందుచేత వాళ్లందరూ సాధ్యమైనంత త్వరలో కొత్త ఇళ్ళు కట్టుకునే టట్లు చూడడం అవసరం. మామూలురోజులైంది. బహుశా తన ఉత్తరా

రానికి జవాబు రావచ్చునని జూడీ భావించ సాగింది. బహుశా ఉత్తరం చిన్న పల్లెటూరికి చేరుకోవడానికే చాలా రోజులు పట్టవచ్చు. అక్కడ ఎవరికీ నెలరోజులకు ఒక ఉత్తరమైనా రాదు. ఇలా ఆలోచిస్తూ ఉండగా ఒకవారం గడచిపోయింది. ఉత్తరం రాలేదు. ఇంకొకవారం, మరొకవారం. అయినా జవాబు రాలేదు. బహుశా పోస్టుఆఫీసులో తపాలా బిళ్ళలు దొరకలేదేమో అంది వాళ్ళఅమ్మ. నిజంగా లక్ష్మికనుక ఉత్తరం వ్రాయదలచుకుంటే ఎలాగైనా సంపాదించలేకపోయిందా? అనుకుంది జూడీ. నా ఉత్తరానికి జవాబువ్రాయడం లక్ష్మికి ఇష్టం లేదేమో అనికూడా అనుకుంది.

ఈ విషయమై అమ్మణ్ణిపాటీ అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి వెళ్ళింది. అంతా వినివిని అమ్మణ్ణిపాటీ తల ఊచింది. కాని ఏమీ మాట్లాడలేదు. కుమార్ దగ్గరనుంచి ఉత్తరాలు రావడానికే చాలాకాలం పట్టుతుంది. ఒక్కొక్కసారి చాలా ఆలస్యం అవుతుంది. అందుచేత జూడీ కొంచెం ఓపికతో వేచిఉండడం అవసరం. ఓపికపట్టడం నేర్చుకోవడం చాలా మంచిది.

మెల్లిగా వర్షాలు వెనుకపడ్డాయి. ఎండ తీవ్రత తగ్గిందనీ, చెమట అంతగా పట్టడం లేదనీ, జూడీ హఠాత్తుగా గుర్తించింది. నారింజ పళ్ళు రావడం మొదలు పెట్టాయి. మామిడిపళ్ళు అయిపోయినలోటు అంతగా కనబడడంలేదు. నారింజపళ్ళలో అనేకరకాలు, తియ్యనివీ గట్టితొక్కవీ, బోలుగా ఉండేవి, పుల్లనివీ అన్నీ ఉన్నాయి. అంతే కాదు, అన్నిరకాల నిమ్మపళ్లూ వస్తున్నాయి. వానలవల్ల, వరదలవల్ల, రోడ్లమీదపడ్డ గండ్లనీ, గోతులను పూడ్చడం ప్రారంభించారు.

ఎర్రదుమ్ము బాగా ఎగురుతోంది. తోటలో పచ్చిక బాగా కొనలుసాగి గరికపోచలు ఎక్కువయ్యాయి. ఆ పచ్చికను మాలీ రోజూ

పట్టాకత్తితో నరకవలసి వస్తోంది. ప్రతివారిలోనూ నూతన జవసత్వాలు తొంగిచూస్తున్నాయి. నిజంగానే ఎండాకాలం ముగిసింది.

అయితే ఒక్క సంగతి చెప్పవలసి ఉంది. ఈతకొలనులో నీరు బురద బురదగా ఉంది. రాలిన ఆకులతో నిండి ఉంది. దానిని ఇప్పుడే శుభ్రం చేస్తున్నారు. అందుచేత వాళ్ళకు దానిలో ఈదడానికి లేకపోయింది. సముద్రస్నానం చేద్దామంటే సొరచేపలుంటాయని జాడీ వాళ్ళ అమ్మ గొడవ మొదలు పెట్టింది. అయితే ఆసొరచేపలు ఎవ్వరినీ కరవలేదు. ఆఖరుకు పట్టుకున్నట్టు అయినాలేదు. పల్లె వాళ్ళు మామూలుగా రెండు మూడు కొయ్యదుంగలు చేర్చి కట్టిన కట్ట మరాలు ఎక్కి సముద్రంలో చేపలవేటకు వెళుతూనే ఉన్నారు. అలాంటిది అమ్మ ఇలా గొడవచేస్తుంది ఏమిటి? అనుకుంది జాడీ. హరిదాస్ అలలు విరిగిపడే చోటుదాటి ఈదుకుంటూ వెళ్ళాడు. అయితే తనతోకూడా ఒక చాకు తీసుకువెళ్ళాడు. కాని వాళ్ళ నాన్నగారికి కూడా సొరచేపలుంటాయని భయం. అందుచేత అతనినికూడా సముద్ర స్నానం చేయకుండా మానిపించారు. ఇంతజరిగినా ఉత్తరంరాలేదు.

ఏదో ఒకరోజున మనం ఎక్కడికైనా వెడితే బాగుండును! అని వాళ్ళ అమ్మ అంది. "ఇప్పుడు ఎండలు తగ్గాయి. రోడ్లు మరమ్మతులు చేశారు" అనికూడా అంది. వాళ్లనాన్న గారు సరేనన్నారు. "అవును, మనం ఒకరోజున జాతీయ విస్తరణకేంద్రం ఒకదానికివెళ్లి అక్కడ ఏం జరుగుతోందో చూచివద్దమా?" అన్నారు.

జాడీకి ఇదేమీ అర్థంకాలేదు. వాళ్ళ అమ్మ వివరించి చెప్పింది. "భారతదేశ శ్రేయస్సాధనకై గ్రామస్తులకు అవసరమైన పనులుచేయించుకోవడంలో వారికి సాయం చేసే జాతీయవిస్తరణ కార్యక్రమాన్ని గురించి నేను ఇదివరకు ఒకసారి చెప్పాను. జ్ఞాపకం ఉందా? ఈకార్య

క్రమం అమలుజరుగుతున్న ప్రాంతాలలో ఒకదానికి వెళ్ళి అక్కడి కుటీర పరిశ్రమలనీ, పాఠశాలలనీ, కొత్త పంటలనూ అన్నింటినీ చూద్దాం. చాలా సరదాగా ఉంటుంది. అనేక వేల సంవత్సరాలు నిరు పేదలుగా నిద్రాణులైఉన్న ప్రజ ఒక్కసారిగా లేచి తమకు కావల సిన పనులు స్వయంగా చేసుకోవడానికి ప్రారంభించడం ఎంతో ఉత్తేజ కరంగా ఉంటుంది. అక్కడే సరదాగా వనభోజనంచేసి విశ్రాంతి మందిరంలో ఉందాం..."

"బహుశా, అక్కడ ఒక ఏనుగ ఉండవచ్చు" అంది జూడీ. కొండలమీద ఒకసారి విశ్రాంతి మందిరంనుంచి వాళ్ళు ఏనుగనెక్కి వెళ్లి ఆ చుట్టుపక్కల వన్యమృగాలన్నింటినీ చూశారు.

"బహుశా ఉండదేమో ! అయినా ఈ ఇండియాలో ఎక్కడ ఏం కనబడుతుందో చెప్పలేం ?" అంది వాళ్ళ అమ్మ.

ఒక ఆదివారంనాడు అందరం ఒక దూరంగాఉన్నచోటికి వెళ్లా లని నిశ్చయించుకున్నాం, బెన్ను తీసుకొని, అయా ఒక మిత్రుని ఇంట ఉండాలని నిర్ణయమైంది. జార్జి, వెన్న కూరముక్కలు పొదివి రొట్టెలు సిద్ధం చేస్తాడు. ఉన్న థర్మస్‌ఫ్లాస్కులనిండా నీళ్లుపట్టాలనుకున్నారు. తమతో నారింజపళ్లూ, బత్తాయిపళ్లూ, పప్పులూ తీసుకువెళ్ళాలను కున్నారు. లేతకొబ్బరిబొండాలు దోవలో ఎక్కడపడితే అక్కడే దొరుకుతాయనుకున్నారు. జూడీ తనకు రాత్రిపూట కావలసిన వాటి నన్నింటిని జాగ్రత్తగా సర్దుకుంది. అందరూ తలో పక్క చుట్టూ తీసు కున్నారు. బహుశా విశ్రాంతి మందిరంలో ఏటవాలుగా కుట్టిన గట్టి పరుపులుంటాయి. వాటిమీద మెత్తని బూరుగుదూది పరుపు పరచు కుంటే హాయిగా ఉంటుంది.

ఆయాను తోడిచ్చి బెన్ ను ముందురాత్రే మిత్రుని ఇంటికి పంపించారు. మర్నాడు వేకువనే లేచి బయలుదేరారు. పక్షులన్నీ కిలకిల కూస్తుంటే చల్లగా హాయిగా ఉంది. వాళ్ళు త్వరత్వరగా మద్రాసును దాటి వెళ్ళారు. అప్పుడప్పుడే కొన్ని కొన్ని దుకాణాల తలుపులు తెరుస్తున్నారు. ఎద్దుబళ్ళు, మనుష్యులు, పనులలోకి అప్పుడే వస్తున్నాయి. ఇంతలో నగరం శివార్లు దాటిపోయారు. రోడ్డుకు అటూ ఇటూ చేలు బహుదూరంవరకూ వ్యాపించి ఉన్నాయి. వాటిల్లో భూభాగం వేసవి ఎండలకు మాడిపోయి ఉండేది. ఇప్పుడవన్నీ పచ్చిక తివాసీ పరచినట్లు నాట్లు మూనతిరిగి పచ్చగా కలకలలాడుతున్నాయి. చేనుకూ, చేనుకూ మధ్య సన్నని మట్టిగట్టులున్నాయి. కొన్ని చేలల్లో ఊడుపులు ఇంకా జరుగుతున్నాయి. అనేకమంది ఆడా, మగకూలీలు వరినారును చేను నిండుగా వరుసలు తీర్చి తిరిగి నాటుతున్నారు. నాట్లు ముందే అయినచేలల్లో మూన ముదిరింది. ఎటుచూచినా ఇంగ్లండులో వసంతంలోకంటె అనేక మైళ్ళ పర్యంతం నేల సస్యశ్యామలంగా కనబడుతోంది. వాననీరు చేరిన లోతులేని 'సరస్సు' లెన్నింటినో వారు దాటి వెళ్ళారు. ఆ బురదనీరు కలకతీరి ప్రశాంతజలోపరితలంపై ప్రకృతి చక్కగా ప్రతిఫలిస్తోంది. అది అతివిచిత్రంగా ఎంతో మనోహరంగా ఉంది. ఈ చెరువులచుట్టూ మళ్ళీ గుంటలుగుచ్చి, అడ్డుకట్ట బిగించి, ఆ నీటిని మళ్ళీ వ్యవసాయంకోసం చేలకు మళ్ళిస్తున్నారు. వాటి గట్ల మీద చిన్న చిన్న పువ్వులచెట్లు చాలాఉన్నాయి. మధ్యమధ్య చెరుకు తోటలు కనబడ్డాయి. కొన్ని కొన్ని గ్రామాలలో మనుష్యులు తమంత తామే తిప్పుతున్న చెరుకు గానుగలు కొన్నింటిని చూచింది. దూరాన ఒక పెద్ద మర కనబడుతోంది. అటుకేసి కొన్ని బరువుబళ్ళు వెడుతున్నాయి. మిగతా పంటలు కొన్నింటిని వేసవిలో కోసేవారు. ప్రతి

ఆవాలు వగైరా ఆ బాపతువి. ఇప్పుడు మళ్ళీ నారుమళ్ళు పోస్తున్నారు. నాట్లు వేస్తున్నారు.

మేకల మందలను కాచుకుంటున్న పిల్లలను, పల్లెటూరి బజారులను, నూతులదగ్గర నీళ్ళకోసం వేచిఉన్న గ్రామీణస్త్రీలను, వంటచెరకుగా ఉపయోగించుకునే నిమిత్తం పిడకలు తీస్తున్నవారినీ దాటి వారు చాలాదూరం వెళ్ళారు. జబ్బులతో, దెబ్బలతో బాధపడుతున్నవారిని, చాలామందిని దోవ పొడుగునా జూడీ తండ్రి చూస్తూనే ఉన్నారు. అలాంటివాళ్ళు చాలామంది ఉన్నారు. వాళ్ళ బాధ భరింపరానిది. చుట్టుపక్కల అందుబాటులో ఒక ఉచితవైద్యాలయం ఏదోఒకటి లేకపోతే అణాపెట్టి "ఆస్పిరిన్" మాత్ర కొనుక్కోవలసి ఉంటుంది. ఊరు మొత్తానికి ఒక వర్తకుడు ఎవ్వడో ఒక సీసాడు మాత్రలు కొని చాలా లాభానికి అమ్ముతూ ఉంటాడు. పాపం ఈ పేద వాళ్ళలో ఒక్కరుకూడా ఒక సీసాను పూర్తిగా కొనుక్కోలేరు.

అప్పుడప్పుడు రోడ్లు మరమ్మతు చేస్తుంటారు. ఆ సమయంలో అలాంటిచోట్ల చాలామంది మూలుగుతూ ఉంటారు. మోటుచీరలు కట్టుకున్న ఆడవాళ్లు, గోచీలు మాత్రమే ఉన్న మగవాళ్లు కష్టంతో రాళ్ళు మోస్తూ ఉంటారు. కంకర పరవడం చదును చేయడం, వగైరా ఉన్న పనులూ వీరేచేస్తుంటారు. ఈ పనులకే సంపన్న దేశాలలో అనేక యంత్రాలు ఉపయోగపడుతూ ఉంటాయి. ఒకరోజున వారంతా ఒక చిన్న బస్తీద్వారా ప్రయాణం చేశారు. అక్కడ టాక్సీలున్నట్టే లేదు. వాటికి బదులుగా అక్కడ రెండుచక్రాల పొట్టి గుర్రపుబళ్లు ఉన్నాయి. వీటికి గూడు నలుపలకలుగా మడిచినట్టుంది. అటూ ఇటూ తెరలుకట్టుకొని మధ్య మనం సుఖంగా కూర్చోవచ్చు. లోపలవైపున అటూఇటూ గూడా గోడలపై దేవతలబొమ్మలు, కట్టడాలు, సరస్సులు

వగైరా అందమైన చిన్నచిన్న చిత్రాలు చాలా బిగించి ఉన్నాయి. గుజ్జం తరాటు తీస్తుంటే గంటలూ, గజ్జెలూ గల్లుగల్లున మ్రోగుతూ ఉంటాయి. వారు మళుపుతిరిగి ట్రంకురోడ్డుమీదనుంచి ఒక సందులో ప్రవేశించారు. వరదలకు రోడ్డు అంతా చాలాచోట్ల గతుకులు గతుకులుగా ఉంది. మరమ్మతులుచేసినచోట్ల అయినా జాగ్రత్తగానే వెళ్ళవలసి వచ్చింది. వారు మధ్యాహ్న ఫలహారంకోసం ఆగారు. అంతలో కొన్ని కోతులువచ్చి వారు తెచ్చుకున్న రొట్టెలు కొన్ని తినేశాయి. జూడీ వాటిని ఫోటోతీసి జాన్‌కు పంపించాలనుకుంది. జూడీకి ఆ రోజున రొట్టెలంటే చాలా ఇష్టంకాబోలునని వాళ్ల అమ్మకు అనిపించింది. అంతలో "జాతీయ విస్తరణ కార్యక్రమం! అభివృద్ధిప్రాంతం" అన్న పేరు పలక కనిపించింది.

ఆ పరిసరాలలో అలాంటివే చాలా పలకలు కనుపించాయి. చూడగా అక్కడ ఏదో నిర్మాణం కొనసాగుతున్నట్టు కనబడింది. ఒక పెద్ద తాటాకుపాక ఉంది. దానిపేరు సాంఘికకేంద్రం. కొన్ని మడులలో ఏవేవో పంటలున్నాయి. మరికొన్నింటిలో చెరుకు బరువుగా ఏపుగా ఎదిగింది. వాటిలో ప్రతివాటికీ ఏవేవో పేరు పలకలు తగిలించారు. విశ్రాంతి కేంద్రానికి ఎటువైపు వెళ్లాలో తెలియచేసే పేరుపలక కూడా ఉంది. ఆ ప్రకారమే వారంతా వెళ్లి విశ్రాంతికేంద్రాన్ని చేరుకున్నారు. చేరుకున్న తరువాత అక్కడ తమవెంట తెచ్చుకున్న సామానంతా గదులలో సద్దుకున్నారు. వారికోసం ఒక యువకుడు అక్కడకువచ్చి వేచి ఉన్నాడు. మనిషి చాలా ఉత్సాహి. తాను చేస్తున్న పనియందు శ్రద్ధాసక్తులు కలవాడు. మధ్యమధ్య సరియైన ఇంగ్లీషుమాట తట్టక ఉద్రేకం తెచ్చుకుని చేతులు పిసుక్కుని బాధపడేవాడు. తన వెంట ఒక జీపుకారు తెచ్చాడు. ఆ వూరి మహిళలు ప్రభుత్వ

ఋణంపొంది కుట్టుమిషనలు సంపాదించుకున్నారో, కొన్నేళ్లలో వారు సరిగా కష్టపడి పనిచేసినట్లయితే ఎలా ఆ ఋణాన్ని ఎలా తీర్చి వేయగలుగుదురో అంతా వివరించాడు. అప్పుడు ఆ కుట్టు మిషనులన్నీ వారి స్వంతమైపోగలవనికూడా వివరించి చెప్పాడు. ఇక్కడ రెండు గదులలో మగ్గాలు ఉన్నాయి. వాటిమీద మరికొందరు స్త్రీలు బట్ట నేస్తున్నారు. కలంకారీ అద్దకపు శాఖలుకూడా ఉన్నాయి. ఒక గది నిండా అందుకు కావలసిన రంగులూ, లతలూ, పక్షులు చెక్కిన కొయ్య దిమ్మలూ ఉన్నాయి. మరొకవైపున వెదురుతో పెన్సిల్ పుల్లలు తయారుచేస్తున్నారు. ఇక్కడి స్త్రీలు మట్టీ, మెత్తని గ్రాఫైటూ కలిపి త్వరత్వరగా లోపలి ముల్లును తయారుచేస్తున్నారు. పై పుల్లలను మగవారు తయారుచేస్తున్నారు. ఈ పని వంటచేయడం వలెనే ఆడవారికి సులభంగా వచ్చిందని ఆ యువకుడు చెప్పాడు. డెహరాడూన్ లోని అటవీ పరిశోధన సంస్థవారు ఈ పనిని తమకు నేర్పారని ఎంతో కృతజతా పూర్వకంగా వెల్లడించాడు. ఎక్కడికే దారి! అంత దూరాన ఉన్న ఆ సంస్థవారు ఇక్కడ ఉన్న మావంటి బీదలకు ఎంత ఉపకారం చేస్తున్నారు! అన్నాడు.

అక్కడఉన్న పాకలన్నింటిలోకి పెద్దది పంచాయితీ కార్యాలయం. "గ్రామపాలక సంఘం ఇక్కడే సమావేశమవుతుంది. అన్ని పనులూ వారే చేసుకుపోతారు. మేము పైనుండి కాస్త సలహా చెప్తూ తాము అంతే! వ్యవసాయం వారి వంతే. భూములకోసం మేము ఇచ్చిన ఎరువులను వారే పంచిపెట్టుతారు. పన్నులు వసూలుచేస్తారు. అంతా పరిశుభ్రంగా ఉంచుతారు". ఇక్కడ కోళ్ళపెంపకం కేంద్రంకూడా ఉంది. గ్రామంలో కోళ్లు పెద్ద పెద్ద గుడ్లు పెట్టేటట్లు చేయడంకోసం ఇక్కడ మేలిరకం పుంజులను పెంచుతున్నారు. జాడీ తండ్రికి అక్కడి

ప్రభుత్వ వైద్యకేంద్రం అంటే ఎంతో ఆసక్తి కలిగింది. ఆ కేంద్రం ఆ చుట్టుపక్కల పదిహేను గ్రామాలవారికి ఉచిత వైద్య సౌకర్యాలను కల్పిస్తున్నది. ఆరోగ్యంగా ఉండాలంటే ఎలా ప్రవర్తించాలో కూడా వారికి బోధిస్తుంది. ఆయన అక్కడివారిని ఎన్ని ప్రశ్నలో అడిగారు. అక్కడే మరొక కుటుంబంవారు తాటాకుల చాపలు అల్లుతున్నారు. వారంతా గ్రామసహకార సంఘంలో సభ్యులు. మరొకచోట బొమ్మలు తయారుచేస్తున్నారు. ఈ బొమ్మలు అంత మంచివి కాకపోయినా ఏవో కొన్ని అణాలధరకు వాటిని అమ్ముతున్నారు. అయినా ఏకొంచెమో లాభంవస్తూనే ఉంది. ఈనాటికీ పాపం వారు ఒక విద్యుద్దీపపు బల్బు కొనుక్కోలేరు. అయినా తీగెలు ఎంతసమీపంలోనుంచి పోతు న్నాయో చూడండి! అన్నాడు ఆ యువకుడు. అయితే త్వరలోనే అందుకు చాలినంత కూడబెట్టుతున్నారులెండి. త్వరలోనే మా సాంఘిక కేంద్రాలలో మొదటిసారిగా విద్యుద్దీపాలు పెట్టించుకుంటాము. ఈ గ్రామాలలో ఇలాంటి సౌకర్యాలు చాలాఉన్నాయి. ఇవికాకుండా వయోజనవిద్య తరగతులున్నాయి. అక్కడ చదువురాని వయోజను లందరికీ చదువు నేర్పుతున్నాం. మగవాళ్లకు ఒకసాయంత్రం, ఆడ వాళ్ళకు మరొక సాయంత్రం లేదా ఇంకొకసమయంలో తరగతులు నడుపుతున్నాం పిల్లలకు బడి!

ఇంతలో ఎవరో వచ్చి అతనిని ఏదో తమిళభాషలో అడిగారు. అతడు జవాబు చెప్పాడు. తరువాత మాకేసితిరిగి "వీళ్ళు అస్తమానం అదికావాలి, ఇదికావాలి అంటూ ఉంటారు. కాని మేమే చాలినంత చేయలేకపోతున్నాం. కాని ఇంకా ఎక్కువగా చేయాలంటారు. ఔను. మాకు వనమహోత్సవ కార్యక్రమంకూడా ఉంది. అవిగో ఆ గున్న మొక్కలను చూడండి!"

అవి అన్నీ సర్వీ మొక్కలు. అవి పొడి నేలలో ఉంటే వేడి వాతావరణంలో బాగా పెరుగుతాయి. పిడకలకు బదులుగా వీటిని వంటచెరకుగా ఉపయోగించి పేడను చేలకు ఎరువుగా ఉపయోగించవచ్చును.

రాత్రి చీకటిపడేవరకూ ఆ యువకుడు అన్ని సంగతులను గురించి అలా చెబుతూనే ఉన్నాడు. మళ్ళీ రేపుపొద్దున్న ఏడుగంటలకు వచ్చి వరద నిరోధక కార్యక్రమం చూపిస్తానన్నాడు. "ఎనిమిది గంటలకు రండి" అంది జూడీ తల్లి. ఆయనకూడా కొంచెం నిరుత్సాహపడ్డట్టు కనబడ్డాడు. "సరే అయితే పోనీ ఏడున్నరకు!"

విశ్రాంతి మందిరంలో ఉండడం సరదాగానే ఉంది. ఆ రాత్రి రకరకాల రొదలు, సవ్వడులు వినవచ్చాయి. జూడీ నిద్ర లేచేసరికి చిలకలు ఎగురుతున్నాయి. మధ్య - మధ్య కిటికీ బడ్డీమీద వాలి తమలో తాము కీచులాడుకుంటున్నాయి. చెట్ల కొమ్మలమీద వాలి పళ్ళు కొరికి తింటున్నాయి. అవి జూడీని గమనించినట్లే లేదు. అప్పుడు తన దోమతెరలో పడుకొని ఉంది కనుక పంజరంలో ఉంది కాబోలునని అనుకొని ఉండాలి.

వాళ్ళు ఉదయపు ఫలహారం ముగించేసరికి నిన్నటి యువకుడు జీపుకారుతోసహా అక్కడికి వచ్చాడు. వారంతా ఒక గతుకుల రోడ్డుమీద ప్రయాణం చేస్తున్నారు. "ఇక్కడే! అన్నాడు ఆ యువకుడు ఒక పేరు ఫలకచూపిస్తూ. తీరా చూస్తే "పొన్నేరి" అని ఉంది.

"చూడండి! చూడండి!" జూడీ పెద్దగా అరచింది, "ఇదే లక్ష్మి ఉండే ఊరుపేరు ఇదే! ఇదే!"

"అయితే పాస్నేరి పేరు ఉన్న ఊళ్లు చాలా ఉండవచ్చు."

"నాకు తెలుసు అమ్మా!" అంది జాడీ. అంటూండగా ఉడుకు మోత్తనంతో కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. జాడీ ఎంతో ఉద్రేక వివశ అయింది. "ఇదే అయి ఉండాలి." అంటూ మెడ నిక్కించి చూసింది. తల జీపుకు తగిలింది. జీపు చక్రం రాతికి గుద్దుకుంది. దాంతో జాడీ నిజంగానే ఏడవడం మొదలు పెట్టింది.

వాళ్ల అమ్మకు కోపం వచ్చింది. "జాడీ కూర్చో! తెలివితక్కువ పనులు చేయకు." అంది. అయినా వినకుండా జాడీ ఆయువకుని కేసి తిరిగి "సేద్యపునీటిసౌకర్యాల కల్పనకు మీకు ఇంజనీర్లుఉన్నారా?" అని అడిగింది.

"ఆ! ఆ!" అన్నాడు ఆయువకుడు. చాలామంది ఇంజనీర్లు. ఇదిగో ఈ కొత్తకాలవను చూడండి. "దీనివల్ల వరదనీటి బెడద తగ్గి పోతుంది." అని దానిని గురించి వివరాలెన్నో చెప్పుకు పోతున్నాడు.

ఆ కొత్త కాలవనీరు బురదతో గోధుమరంగులో ఉంది. అయినా పల్లెటి పడుచులు అక్కడ బట్టలు ఉతుకుకుంటున్నారు. మోకాలి లోతు నీటిలో నిలబడి బిందెలు తోముకుంటున్నారు. జాడీవాళ్ళ అమ్మను గుంజింది. "అదిగో చూడు! చూడు సరస్వతి!"

"నిజంగానా? నమ్మకమేనా?" అంది వాళ్ల అమ్మ. "గుంజకు తల్లీ. నీకు పుణ్యముంటుంది. పాటలు పాడుకుంటూ, బిందెలు తోము కుంటూ కాలవగట్టున కేరింతలాడుతున్న పిల్లలలో సరస్వతిని ఆవిడ గుర్తుపట్టనేలేదు. అందులో అందరూ ఇంచుమించు ఒకేరకం పాత చీరలు, రవికెలు తొడుక్కున్నారు.

"నాకు తెలుసు. ఆ పిల్ల సరస్వతే! ఆపండి. ఆపండి!" అంది జాడీ గట్టిగా. కాని ఆ యువకుడు జీపును ఆపేటప్పటికి రెండు

ఫర్లాంగులు గడిచిపోయాయి. "నేను దిగి వెనక్కి వెళ్ళుతాను" అంది జూడీ. దుఃఖంతో ఆమెకంఠం రుద్ధమైపోయింది. ఇప్పుడు లక్ష్మిని చూడబోతున్నాననే ఆలోచనతో ఆమె గద్గదిక అయింది.

వాళ్ళు ఆగినచోట కొన్ని గుడిసెలు, కొన్ని నీడనుయిచ్చే చెట్లు ఉన్నాయి. మధ్య ఒక పెద్ద రావి చెట్టుంది. దానినీడను ఒక చిన్న దేవాలయం ఉంది. ఒక పెద్ద కొమ్మక్రింద క్రొత్తగా వేసిన పాక ఒకటి కనుపించింది. "ఇదే పొన్నేరి ప్రాంతానికి సాంఘిక కేంద్రం" అని ఆ యువకుడు వివరించాడు." అక్కడ ఆడవాళ్ళకోసం వయోజన విద్యా తరగతులు నడుపుతున్నాం, చూడండి......"

"సరే అయితే. ఒక్కనిమిషం దిగి తొంగిచూసినట్లే చూసి వెళ్ళి పోదాం" అంది జూడీతల్లి.

జూడీ ఆవేశ వివశ అయింది. కొన్ని అడుగులు ముందుకు వేసింది. అక్కడే ఆగిపోయింది. తన్ను తాను మరచిపోయింది. సాంఘిక కేంద్రం గుమ్మం దగ్గరకు వెళ్ళింది. తెరచిన తలుపుల మధ్యనుంచి లోప లికి చూసింది. లోపలినుంచి సన్నని రణగొణధ్వని వినబడుతోంది. హఠా త్తుగా అటూ ఇటూ, తనతండ్రివంక, తల్లివంక నోటికడ్డంగా వేలు పెట్టు కుని మాట్లాడవద్దన్నట్లు చూసింది. వాళ్ళ నాన్నగారు యువకుని చేతిని పట్టుకున్నారు. మెల్లిగా జూడీ దగ్గరకు వెళ్ళింది.

10. పొన్నేరిలో లక్ష్మి

నున్నగా అలికిన పూరింట మట్టిగోడ చూడడానికి అందంగా ఉంది. అక్షరాలు, బొమ్మలు ముద్రించిన కొన్ని ప్రచార పత్రాలను గోడపై అంటించారు. బల్లలు లేనేలేవు. పట్టినేల. ప్రక్కనే మోటు నల్లబల్ల. లక్ష్మి సీమ సుద్దతో అక్షరాలు మళ్ళీ వ్రాసింది. అందరూ చూడడానికి వీలుగా మెల్లిగా వ్రాసింది. ఆమెబాగా అలసిపోయింది. అప్పుడప్పుడు ఆమె మనస్సు పరిపరి విధాల పోతోంది. ఆమె చెప్పు ఉంగటం తెగింది. గొడారివాడు దానిని సరిగా అతకనే లేదు. అది బొటనవేలును కరుస్తోంది. చాలా బాధగా ఉంది. అయితే పంతులమ్మగా ఆమె చెప్పులను ధరించవలసి ఉంది. అలాంటి చెప్పులు తొడుక్కోవడంవల్ల ఆమె ఈడును మించి పెద్దదానివలె కనబడుతోంది. మిగతా ఎవ్వరికీ చెప్పులులేవు. ఆమె ఎదురుగా కొంత మంది, ఆమెకంటె వయస్సులో ఎంతో పెద్దవారైన స్త్రీలు కూర్చొని ఉన్నారు. వారు లక్ష్మివ్రాసిన అక్షరాలన్నింటినీ మెల్లిగా ఒక్కటొక్కటే చదివారు. ఆ చదవడంలో పెదవులు కదుపుతూ చదివారు. ఏంలాభం ? ఆ చదువు బుర్రకు ఎక్కినట్లే లేదు. అది వారిపాలిటి బ్రహ్మవిద్యే అయింది. వ్రాయడం, చదవడం కొత్తగా నేర్చుకోదలచి పట్టుదలతో పాటుపడుతున్న తరుణులకు అది తలకుమించిన బరువే అయింది. పెద్దవారికికూడా ఈ చదువు కావాలి. కాని అది వారికి కష్టపడకుండా దేవతా ప్రసాదంవలె లభించాలి. ఒక వేళ అలాకాక పోతే అది వారి తప్పుకాదు, అందుకు ఎవ్వరూ ఏమీ చేయలేరు. ఇంతకూ అందుకు అవసరమైన, సరియైన కృషిని సకాలంలో చేయడం వారికి చేతకాదు.

రెండు తరగతులు ఉండడం అవసరమా? అనుకుంది లక్ష్మి. ముందువరసలో తన ఈడుదే వల్లి కూర్చొని ఉంది. వాళ్ళనాన్న తాపీ పనిచేస్తూ ఉంటాడు. ఆమెకే కనుక అవకాశముంటేనా? ఆమెకు అప్పుడే వార్తాపత్రికలో శీర్షికలు చదవడం వచ్చేసింది. తేలికపాటి గ్రంథాలను గబగబా చదువగలుగుతోంది. బడికివెళ్ళి సరిగా చదువు కుంటే ఏదోఒకరోజున కాలేజీలోకూడా చేరగలదు.

అయితే తరగతిని రెండుభాగాలుచేస్తే మిగతా పెద్ద ఆడవాళ్లకు కోపం రావచ్చు. అసలు వాళ్ళల్లో కొందరిని బడికి రావడానికి ఒప్పించ డానికే తాతలు దిగివచ్చారు. లక్ష్మి తాను వాళ్లకంటె పెద్దదైనట్లు నటించింది. కాని సరస్వతి నోరుజారి అసలు వయస్సు బయట పెట్టే సింది. అందుచేత అప్పుడప్పుడు, పాఠం సరిగా రానప్పుడు, ఎందుకు చదవలేదని లక్ష్మి అడిగినప్పుడు, పెళ్ళిఅయిన స్త్రీలు కొందరు ఇలా బొడ్డూడని పసికూనల దగ్గర అన్నీ నేర్చుకోవలసి వచ్చినందుకు సణు క్కునేవారు. గొణుక్కునేవారు.

ఒక్కొక్కసారి ఇదంతా వదిలి పారిపోదామనిపించేది. లక్ష్మి బడినుంచి ఇంటికి తిరిగివెళ్ళింది. అక్కడ పంకాలేదు. త్రాగడానికి నిజంగా చల్లటి నీళ్ళులేవు. ఒంటరిగా కూర్చొని ఏడవడానికైనా అవ కాశంలేదు. వాళ్ల నాన్నగారు ఎలాగో తంటాలుపడి నాలుగు తెరలు, ఒక నీళ్ళజల్లు సంపాదించారు. ఆ ఇంట్లో సౌకర్యాలు అంతే. తండ్రి ప్రోత్సాహమే లేకపోతే లక్ష్మికి అక్కడ బ్రతుకు దుర్భరమై ఉండేది. మట్టిగోడలతో లేపిన రేకుపాకలో కూర్చొని పగలల్లా కష్టపడి ఇంటికి తిరిగిరాగానే ఆయనకు కలిగే ఆనందం ఇది ఒకటే. ఇంటికి రాగానే ఆయన ఆరోజు బడి విశేషాలేమిటని అడిగి, అంతా ఓపికగావిని తగు సూచనలు చేసేవారు. ఆవాడస్త్రీలు ముందుగా లక్ష్మి తల్లిదగ్గరకు

వచ్చి చదువు నేర్పమని అడిగారు. అయితే ఆమె ఎప్పుడూ ఎంతో దిగులుగా బెంబేలు పడిపోయి ఉండేది. పైగా ఆవిడకు ఇంట్లో పనులే తెమిలేవికావు. ముసిలి పనిమనిషి ఒకత్తె ఉంది. కాని లక్ష్మితల్లి ఎప్పుడూ పనిలో మునిగి సతమతమై పోయేది. బస్తీకి, ఇక్కడికి అంత తేడా! ఆవిడ లోగడ ఎప్పుడూ పనిచేసి ఎరుగదు. పూర్వం ఇంటి నిండా దాసదాసీలు ఉండేవారు. ఇప్పుడీ మార్పు ఆవిడకు దుర్భరమై పోయింది. సరస్వతి తనఈడు పిల్లలతో కలిసి ఊరమ్మట తిరిగేది. కాని తన తల్లిని పలకరించే మిత్రులే లేకపోయారు. ఇంక తనసంగతి తనకు కొందరైనా మిత్రులున్నారనుకుంది. తల్లి చదువులోనూ, నృత్యం లోనూ కూడా బాగా రాణించగలదు. ఇంకొక చిన్నపిల్ల ఉంది. ఆమె పేరు మోహిని. వాళ్ల నాన్నగారు పొన్నేరికి పడమరగాఉన్న ఒక చిన్నగ్రామానికి మునసబు. కళాశాల విద్యను అభ్యసించిన సంఘసేవిక లకు ఎప్పుడూ చాలినంత సమయమూ, విరామము ఉండేవేకావు, వారిలో ఎవ్వరూకూడా జాడీకి సరిరారు.

లక్ష్మి పాఠాలు చెప్పడం మొదలుపెట్టింది. సరిగా చెప్పలేక పోతోంది. మెల్లిగా ఒకమాట వ్రాసింది. ఆమె వ్రాస్తూంటే వాళ్లంతా శ్రద్ధగా కళ్లప్పగించి చూశారు. దానిని చూచి వారంతా ఒకరి తరువాత మరొకరు చదివారు. గబగబ చదివిన వారిని మెచ్చుకుంది. మళ్లీ ఇంకొకమాట వ్రాసింది. అంతలో వెనక్కు జారగిలబడి జాడీని గురించి ఆలోచించింది. ఇప్పటికే మించిపోయింది. జాడీ నిజంగా అన్ని పనులూ తనమిత్రులందరికంటె ఎంతో సరదాగా చేసేది. ఇందుకు కారణం అందరూ ఆమె అంటే అనురాగాన్ని విశ్వాసాన్ని ప్రదర్శించ డమే. మనిషి ఘామేదా అయినది. నిండుకుండ, తొణకదు. అలాంటి దానిని చెందనాడుకున్నాను, అనుకుంది లక్ష్మి.

ఆరోజున క్లబ్బులో కలుసుకున్నాం. అప్పుడే ఆమెకు నాబాధ తెలిస్తేనా...? అప్పుడే మానాన్నగారికి మొదటిసారిగా ఈదెబ్బతగిలింది. ఆయన ఈ మార్పుకు అనుగుణంగా తనభార్యా బిడ్డలను సంసిద్ధులు చేయ దలచారు. అయితే మాస్థితి ఇంతగా దిగజారి పోతుందని మాకు తెలి యదు. దానికితోడు జూడీతోకూడా వచ్చిన ఆ ఉత్తరాది ఆవిడ తాను జూడీ తల్లితండ్రులకు బాగా ఆప్తురాలనని గొప్పలు చెప్పుకోవడం, దక్షిణాదివారిని ఈసడించడం, తానే సర్వాధికారినన్నట్టు అందరికీ అన్ని పురమాయిస్తూ ఉండడం! చెయ్యక తప్పలేదు. ఏం చెయ్యను? జూడీకి గుణపాఠం నేర్పడంకోసమే జూడీని నొప్పించవలసి వచ్చింది. జూడీ! సరళహృదయ జూడీ! మా పాటీతో జూడీమీద కొండె ములు చెప్పాను. చాలా బాధపడ్డాను. అయితేనేం, నా అహం దెబ్బతిందిగా! దెబ్బతిందిగామరి! అందుకని.

ఇప్పుడు లక్ష్మి మెల్లిగా సీమసుద్దతో నల్లబల్లమీద భారతదేశం బొమ్మగీసింది. ఆమె తరచుగా గీసింది, ఆమె గీస్తుండడం తరగతిలో అందరికీబాగా నచ్చింది. ఆమె అందులో నదులన్నింటి గుర్తులు గీస్తున్న ప్పుడు వాళ్ళు మెల్లిగా గంగ......కావేరి......గోదావరి...అంటూ అస్పష్టంగా గొణిగారు. పాటీదగ్గర ఆ ఆవులింకా ఉన్నాయా?

ఆ తరువాత కొన్ని రోజులకు ఉత్తరం వచ్చింది. బహుశా పాటీయే జూడీకి నా చిరునామా ఇచ్చిఉండాలి. లేకపోతే ఇంక ఎవ్వరికి తెలుసు. ఇక్కడ మేము ఎంత హీనంగా బ్రతుకుతున్నామో అమ్మణిపాటీకి తెలిసి ఉండకపోవచ్చు. తన తండ్రి, ఆ సంగతి తన తల్లి తండ్రులకు తానై చెప్పడు. ఇంట్లోవాళ్లు ఎవళ్ళూ చెప్పకూడదని కట్టడిచేశాడు. ఎప్పుడు మంచిమాటలతో హుషారైన ఉత్తరాలు వ్రాస్తూఉండేవాడు. "నేను త్వరలో చచ్చిఅయినా పోతాను కాని

మా గురించి ఒక్క మాటకూడా ఎప్పుడూ చెప్పను'' అనుకుంది లక్ష్మి. ఆ సమయంలో గర్వరేఖలు ఆమెముఖంలో మెరిశాయి. అయితే నేను జూడీకి జవాబు వ్రాసినట్టయితే అన్నిసంగతులూ దాచడం కష్టం అవుతుంది. అప్పుడు ఆమెవస్తే రావచ్చు. అప్పుడు నేను అడుక్కు తింటున్నట్టు కనబడవచ్చు. అయినా ఒకప్పుడు మనదేశాన్ని పీల్చి పిప్పిచేసిన ఆంగ్లదేశపు బాలికకా? కుదరదు. కుదరదు అసంభవం. ఇంక ఆమె నుంచి నేను శాశ్వతంగా వైదొలగి పోవలసిందే, అనుకుంది.

లక్ష్మి తన శిష్యులకు పట్టణాలపేర్లను చెప్పడం ప్రారంభించింది. వాళ్లందరికీ బాగా తెలిసిన పేరు కనుక పాన్నేరి అని చెప్పింది. ఆతరువాత మద్రాసుఅంది. ఆతరువాతమిగతా పట్టణాలపేరుచెప్పింది. వారిలో కొందరికి కొన్ని పేర్లు సుపరిచితమైనవే. వారి ఆత్మబంధువులలో కొందరుబ్రతుకు తెరువుకోసం బెంగుళూరు, నాగపూర్ లేదా ఇతరదూర ప్రాంతాలకు, బొంబాయికి, కలకత్తాకు వెళ్లిఉండవచ్చు. అటుపిమ్మట ఆమె వారిని చాలా తేలిక ప్రశ్నలు అడిగింది. "గాంధీజీ గురించిచెప్పు'' అని అక్కడ కూర్చున్న వారిలో కొంచెం వయస్సుముదిరిన ఒతను అడిగింది. ఆమెకు చదవడం అంతబాగా రాదు. ఆమెను అనేక విధాల ప్రోత్సహించవలసి ఉంది. ఆతరువాత మిగతావారందరూ కలాకొస్త చెబుతారు. ఆఖరున తాను తానువిన్నది, కన్నది గ్రంథాలలో చదివినది, తండ్రిగారి వలన తెలుసుకున్నది, మరికొంత చేర్చి చెబుతుంది. వాళ్లకు హిందీ నేర్పడానికి ప్రయత్నించలేదు. వాళ్లల్లో తెలివైనవాళ్లకు అయినా తరువాత ఎప్పుడో నేర్పవలసిఉంది. లేదా హిందీని గురించి, ఉత్తరాదిని గురించి ఆమెకు అంత సదభిప్రాయం లేదా? ఆమె వారికి పాఠాలన్నీ తమిళంలోనే చెప్పేది. వారితో ఎప్పుడూ తమిళంలోనే మాట్లాడేది. ఈలోగా తాను చదువులో బాగా వెనుకపడిన వారిని గురించి

శ్రద్ధవహించవలసి ఉంది. అలాంటివారికి పాఠాలన్నింటిని బాగా నూరి పోయవలసి ఉంది.

ఆమె నృత్యపాఠాలకు మరికొంత మంచిసంగీతం కూడా అమరితేనా ? ఆగుడ్డివాడు మద్దెల బాగానే వాయిస్తాడు. కాని వాణ్ణి అస్తమానం హుషారెక్కిస్తూ ఉండాలి. వాడు ఒక్కొక్కసారి లక్ష్మికి కావలసిన పద్ధతిలో వాయించనే వాయించడు. నిజమే ! వాడికి గొప్ప తెగబలిసి పోయింది. తనంతవాడు లేడనుకుంటున్నాడనేది ఖాయం. వాళ్ళందరికీ ముఖ్యంగా చిన్నపిల్లలకు ఈనృత్యం తరగతులంటే చాలా ఇష్టం. వాళ్ళతల్లులు వచ్చి వట్టిక్రింద మట్టిలో చతికిలబడి నిశ్శబ్దంగా నృత్యాన్ని తిలకిస్తూ ఉండేవారు. వానలు కురిసి వాతావరణం చల్లబడిన తరువాతనే ఈనృత్యపు తరగతులు ప్రారంభ మయ్యాయి. ఇవి ఇంక ఎప్పుడూ ప్రారంభం కావనే లక్ష్మి భయపడింది. కాని వాళ్ళ నాన్నగారు చెప్పారు. సంగీతం ఉన్నా లేకపోయినా రోజూ నృత్యం అభ్యసిస్తూ ఉండవలసిందేనని సలహాచెప్పారు. ఏదో ఒకనాడు...... ఆయన సలహా వినగానే తాను స్వయంగా నృత్యం చేయడం కంటె చిన్నపిల్లలకు నృత్యం నేర్పితే బాగా ఉంటుందని లక్ష్మి భావించింది. ఆమాటే పంళ్ళనాన్నగారితో చెప్పింది. ఆయన విని మెచ్చుకున్నాడు. ప్రోత్సహించాడు. అక్కడ ఉండే సంఘసేవకులలో ఒకరి సాయంతో గుడ్డి మార్దంగికుణ్ణీ, మద్దెలనూ సంపాదించారు. పిల్లలకు కథక్ నృత్యం నేర్ప వలసిందని కొన్ని గజ్జెల జతలు తెచ్చి పెట్టారు.

నల్లబల్ల మీద స్వయంగా వ్రాయవలసిందని తన విద్యార్థులను లక్ష్మి ప్రోత్సహించింది. వయస్సు మళ్ళిన కొందరు ఆపని చేయరని, బహుశా ఎప్పుడూ చేయరని లక్ష్మికి తెలుసు. చిన్న పిల్లలను పిలిచి వ్రాయమంది. వారు చిన చిన్న వాక్యాలు వ్రాశారు. ఒకరు

వ్రాయగా మిగతా వారు వాటిని చదివేవారు. తమలో ఒకరు ఇంత ఘనకార్యం చేయగలిగారన్నట్టు ఒక్కొక్కసారి వారిలో వారు ముసి ముసినవ్వులు నవ్వుకునేవారు. "బాగుంది, వల్లీ" అని మెచ్చుకుంది. ఇప్పుడొక కొత్త వాక్యం వ్రాసి చూపించు. ఇదివరకు ఎప్పుడూ వ్రాయనిది వ్రాసి చూపించుసుమా!

కాని వల్లి ఇదేమీ వినిపించుకోనట్లు ఆమె భుజాల మీదుగా తెరచిన గుమ్మంలోనుంచి వీధిలోకి చూస్తోంది. ఆశ్చర్యంతో దాని నోరు తెరచుకుంది! ఏమిటది? అంటూ కోపంగా లక్ష్మి అటు కేసి తిరిగింది. అక్కడ ఎదురుగా జాడీ ఒంటికాలిమీద రెండుచేతులూ ముందుకుచాచి నిలబడింది. జాడీ! నిజంగానే జాడీ!!

11. జూడీ - లక్ష్మి

"జూడీ, జూడీ! వచ్చావా!!" అంది లక్ష్మి. అంతా బాగానే ఉంది. లక్ష్మి తన గర్వాన్ని కాపాడుకుంది. తాను ఉత్తరం వ్రాయనే లేదు. అయితే నేం జూడీ-చిన్న ఆంగ్లబాలిక - ప్రియమైన జూడీ రానే వచ్చింది.

"ఔను" అంది జూడీ. "ఔను వచ్చాను లక్ష్మీ" అంది అంతే. వాళ్లు ఇద్దరూ పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. ఒకరి బుగ్గను మరొకరి బుగ్గను ఆన్చి గాఢంగా కౌగలించుకున్నారు.

అంతలో లక్ష్మి అంది. "రా! జూడీ. రా, నువ్వు నా తరగతిని చూడాలి! మీ అమ్మనూ, నాన్నగారినీ కూడా పిలు!"

వారంతా సంక్షేమకేంద్రంలోకి వచ్చారు. సంభ్రమాశ్చర్యాలతో నోటమాటలేకుండా ఒక యువకుడు వారికి దోవ చూపించాడు. ఒక ఇంజనీరు కుమార్తె ఎవ్వరో వయోజనవిద్య తరగతులను నిర్వహిస్తున్నదని విన్నాడు కాని, దానిని గురించి అంతగా ఆలోచించనేలేదు.

వారిని చూడగానే తరగతిలో అంతా లేచి నిలబడ్డారు. తమలో తాము గుసగుసలాడారు. లోలోపలే నవ్వుకున్నారు. లక్ష్మి వారందరినీ కూర్చోమంది. అంతట ఇంగ్లండునుంచి తన్ను చూడవచ్చిన ఈ గౌరవనీయులైన అతిథులను పరిచయం చేస్తూ మాట్లాడింది. అప్పుడనుకుంది, తనబడిలో ప్రపంచపటం ఉంటే ఎంత బాగుండును? అని. అప్పటికీ జూడీ చేతులను లక్ష్మి వదిలిపెట్టనేలేదు. అంతట భారతదేశంలో పట్టణాల పేర్లను తన తరగతివారిచేత వ్రాయించింది. కాని వారిలో చాలామంది సిగ్గుపడ్తారు. కొత్తవారిముందు మరీ సిగ్గుపడ్డారు. వారందరిలోకి మోహన్ అంతకుపూర్వం తెల్లవారిని ఎన్నడూ చూడనే

లేదేమో మరీ విపరీతంగా సిగ్గుపడింది. వల్లి బాగానే ఉంది. ప్రక్క వారిని అయితేనేమి ? నల్లబల్లమీద వ్రాసేటప్పుడు చెయ్యి వణికింది. మాట్లాడింది కాని నూతిలోనుంచి వచ్చినట్టుంది ఆమాట. వెనుకనుంచి ఒక వృద్ధవనిత ఏదో చెప్పబోయింది. కాని లక్ష్మి గదమాయించి కూర్చోబెట్టింది. క్రమశిక్షణను కాపాడవలసి ఉందికదా ?

"ఇంక ఇవాళ బడికి సెలవు ఇస్తాను" అంది లక్ష్మి. "నీతో నేను చాలా చెప్పాలి. జూడీ ఇక్కడికి ఎలావచ్చావు ?"

"అదా ! బలే విచిత్రమైన విశేషంలే. అంతా అలా తోసుకు వచ్చింది" అంది జూడీ. "అయితే నీకు నా ఉత్తరం అందిందా ?"

"లక్ష్మి చేయి సలుపుతుంది. ఒక్కక్షణంసేపు ఏమీ మాట్లాడ లేదు. ఏదో నమ్మేటట్టు సులభంగా బొంకేద్దామనుకుంది. తన మిత్రు లతో ఎవ్వరూ ఎన్నడూ అబద్ధమాడకూడదు. "అందింది, జూడీ" అంది కడకు. "అయితే జవాబు వ్రాయడానికి నా అహంకారమే అడ్డం వచ్చింది." జూడీ వినిపించుకోలేదు. "నీకు నామీద కోపంరాలేదు కదా ?" అంది.

"అబ్బెబ్బే ! అబ్బే !" అంది లక్ష్మి. కాని ఈ ఊరిసంగతి ఇక్కడి పరిస్థితి నీకు తెలియకూడదనుకున్నాను.

"ఏం ?" అంది జూడీ. "నువ్వు వయోజనులకు విద్య నేర్పు తున్నావుకదా. బలే తెలివైనదానివి." ఇంతలో వాళ్ళ అమ్మ అడ్డం వచ్చింది. "లక్ష్మీ ఈ అబ్బాయి మాకు ఇంకా ఏవేవో చూపించు తానంటున్నాడు. నీవుకూడా మాతోబాటు విశ్రాంతిభవనంలో భోజనం చేద్దువుకాని. మీ ఇంటికి కబురుపంపమంటావా ?"

లక్ష్మి వల్లిని పిలిచింది. తమ ఇంటిని ఈ అతిథులకు చూపించడం ఇష్టంలేదు. వల్లిచేత కబురుపంపుదామా ? లేక తనే స్వయంగా వెళ్ళి

మంచిచీర - బహుశా క్రిందటి దీపావళికి కొనుక్కున్నది - కట్టుకొని రావడమా? జడలో కాసినిపూలు తురుముకుందామా? అనుకుంది. ఇంతవరకూ ఎలా ఉన్నదీ ఆలోచించనేలేదు. ఇప్పుడుమాత్రం పువ్వులు పెట్టుకుంటే బాగాఉండును అనుకుంది. 'అబ్బే అలాకాదు' ఇప్పుడు జూడీని వదలిపెట్టకూడదు. అనుకుంది.

వారు అందరూ అక్కడినుంచి మరొక స్త్రీల సహకారసంఘాన్ని సందర్శించడానికి వెళ్ళారు. అందరిలోకి లక్ష్మి ఎక్కువగా ఆనందించింది. అందుకుకారణం అక్కడపనిచేస్తున్న ఆడవారందరినీ లక్ష్మి ఎరుగును.ఆడపిల్లలందరూ తెలుసు. ఆమె వారికి ఎన్నో సంగతులు చెప్పింది. అన్నీ చెప్పింది. ఈమె ముగ్గురు పిల్లలూ మశూచికంవచ్చి ఎలా చచ్చిపోయారో చెప్పింది. ఇప్పుడు అందరూ టీకాలు వేయించుకుంటున్నారు, అంది. ఆ పిల్లకు ఇష్టంలేకుండా ముసలిమొగుణ్ణిఇచ్చి కట్టపెట్టారని చెప్పింది. అదుగో, ఆ చుక్కలచీర కట్టుకున్న చిన్నదాని భర్త బలశాలి. యువకుడు. వాళ్ళకు కాడెడ్లు, మూడు ఆవులు ఉన్నాయి. మంచి అభ్యుదయభావాలు కలవాడు. అందరూ పంచాయితీలో సభ్యుడుగా ఉండమని కోరి ఎన్నుకున్నారు. అదుగో ఆ యంత్రం పిడి తిప్పుతూ నవ్వుతున్న ఆవిడ ఒక అవ్వ. ఆవిడ ఆవిధంగా సంపాదిస్తున్న డబ్బు అంతా తన మనుమలకు ఇచ్చేస్తున్నది.

ఆ సమయంలో పనిచేయని ఇతర విభాగాలనుకూడా వారికి చూపించింది. ఇక్కడే వానాకాలంలో ప్రత్తిని ఏకుతారు, అని ఆ చోటు చూపించింది. వాతావరణం పొడిగా ఉండనప్పుడే పని సుళువుగా సాగుతుంది. ఆ తరువాత వడుకుతాము. నూలు వడకడం నేనూ నేర్చుకున్నాను జూడీ, అంది. అయితే మాదేశం మరికొంత సంపన్నమైన తరువాత యంత్రాలతోనే వడకడం, నేయడం అంతా చేస్తామని

మా నాన్నగారు చెప్పారు. అప్పుడు చేతితో వడికినప్పటివలె పురి తక్కువకావడం, ఒకచోట లావుగాను, ఇంకొకచోట సన్నగాను ఉండడంవంటి లోపాలు ఏమీ ఉండవు. అప్పుడు గ్రామాలలో నేత మాత్రమే నేస్తాము. అయితే ఇప్పుడప్పుడే కాదు, ఇప్పుడప్పుడే కాదు.

"అయితే నిజంగా నీ అంతట నీవు నూలు తీయగలవా?" అని అడిగింది జూడీ.

"ఆ! అలా నూలు తీయగలిగిన అనేకమంది భారతీయ బాలికలలో నేనూ ఒక దాన్ని." అంది లక్ష్మి నవ్వుతో ముఖం అదోలా పెట్టి.

ఈ పల్లెటూళ్ళలో ఇళ్లు ఎలాఉంటాయో చూడాలనే కుతూహలాన్ని జూడీతల్లి ప్రదర్శించింది. లక్ష్మి ఆమెను ఒక ఇంటిలోకి తీసుకువెళ్ళింది. ఆ ఇంటికి ఒక వసారా ఉంది. దానివెనుక ఒక గది ఉంది. ఎత్తు తక్కువగా ఉండే బల్లవంటి వెడల్పైన పరుపుఉంది. కొద్దిగా జాడీలు, మరికొన్ని కుండలు, దాకలు ఉన్నాయి. చక్కగా మడతపెట్టిన ముతక, పాతబట్టలున్నాయి. ఆ కుటుంబం ఆస్తి అంతా అంతే! "వాళ్ళేం తింటారు?" అని అడిగింది జూడీ.

"సాయంత్రంపూట వేడి అన్నం, కూరలు తింటారు. పొద్దున్నే రాత్రి మిగిలిన చల్దిఅన్నం ఊరగాయ వేసుకుతింటారు." అంది లక్ష్మి. "ఒక్కొక్కప్పుడు పప్పుకూడా వేసుకుంటారు. అమ్మేది ఏదైనా సరే! అమ్మకం అవుతుంది."

ఇళ్లు వీథులూ ఎంతో శుభ్రంగా ఉన్నాయి. కుప్పలు ఎక్కడా లేవు. రోడ్డువార ఒక చెట్టునీడను చిన్న టీ దుకాణం ఉంది. అంతా సవ్యంగాఉంటే సాయంత్రంపూట ప్రజలు అక్కడికి వెళ్లి ఒక కప్పు టీ త్రాగుతారు. లేదా కొంచెని తమలపాకులు కొనుక్కుని వేసుకుంటారు.

చాలామంది-కనీసం కొంతమంది అయినా - ఏవేవో ఆశలతో బ్రతుకుతూ ఉంటారు.

ఆటవీ పరిశోధనసంస్థవారు సూచించిన ఒక పథకం ప్రకారం అక్కడ మూడుగదుల పూరిపాకలో మరొక పరిశ్రమ నడుస్తున్నది. పాతఅగ్గిపెట్టెలను తెచ్చి రంగువేసి కట్టలుకట్టి సన్నని ముక్కలుగా తరుగుతారు. వాటిని రంగులోముంచి వాటితో చిన్నచిన్న పళ్లెములు, ఇతర పెట్టెలు తయారుచేస్తున్నారు. ఇది చాలా తెలివైనపని అని జూడి అనుకుంది. సరుకు అందంగా లేకపోయినప్పటికినీ, అనికూడా అంది. వాళ్ళ అమ్మ ఒక పెట్టికొంది.

"అదుగో అదే. వడ్డీవ్యాపారి ఇల్లు" అంది లక్ష్మి. తలుపు గొళ్ళెనికి ఎంతెంత పెద్ద ఆలీఘర్ తాళం కప్పలు తగిలించాడో చూడండి! ప్రభుత్వమే కనుక వడ్డీవ్యాపారం చేస్తుంటే ప్రజలకు అంత ఇబ్బంది లేకపోవును."

"ఇంతకూ వడ్డీ ఏమాత్రం పుచ్చుకుంటాడు?" అని అడిగారు జూడీ తండ్రి.

"ఏడాదిలో నూటికి నూరువంతులు వడ్డీ గుంజవచ్చు. లేకపోతే ఇంకా ఎక్కువే పుచ్చుకుంటూ ఉండవచ్చు. కాని అన్యాయం! వాళ్ళు నూటికి పాతికరూపాయిలు పుచ్చుకున్నా కొంతమేలే. ఈ సంగతి ప్రభుత్వానికి ఎవ్వరైనా చెప్పరాదా? కూడదా?"

"కొన్ని పరపతి ప్రణాళికలు ఉన్నాయి......" "ఔను, ఔను" అంది లక్ష్మి. "కాని చాలవు. అయినా ఏంచేస్తాం. ఎక్కడి కక్కడికే సంతోషించాలి. నిజమే. ఆ మేరకే సంతోషిస్తున్నాం."

పరిస్థితి ఇదివరకు మరీ అధ్వాన్నంగా ఉండి ఉండాలి, అనుకుంది జూడీ. లేకపోతే ఇప్పుడింతగా ఎందుకు సంతోషిస్తారు? ఆ యువ

కుడు తన తండ్రికి ఏవేవో లెక్కలు వివరిస్తున్నాడు. అబ్బ ఎంతమంది జనం. ఈ జనాభా కందరికీ సాయంచేయడం ఎలా ?

విశ్రాంతి భవనంలో జూడీ లక్ష్మిని తనగదిలోనికి తీసుకువెళ్ళింది. అక్కడ లక్ష్మి స్నానాలగదికేసి ఎంతో ఆశగా చూడడం గమనించింది. "లక్ష్మి లోపలికివెళ్ళి జల్లుక్రింద స్నానం చేసిరా. అక్కడే నా సబ్బు తువ్వాలు ఉన్నాయి..." అంటూ స్నానాలగది తలుపు తీసింది.

లక్ష్మి ఒక్క నిముషంసేపు సంకోచించింది. అక్కడ సరియైన జల్లు ఉంది. వాళ్ల ఇంటిదగ్గర చేదకు చిల్లులుకొట్టి దానినే వాడు తున్నారు. జూడీ సబ్బు, తువ్వాలు అన్నీ పరిమళాన్ని వెదజల్లు తున్నాయి. "జూడీ తలరుద్దుకోనా !"

"అలాగే. కావలసినంత వ్యవధి ఉంది" అంది జూడీ. వెంటనే వాళ్ళ అమ్మదగ్గరకు పరుగెత్తుకువెళ్లి భోజనాలు కొంచెం ఆలస్యంగా వడ్డించేటట్టు చూడమంది. అంతలో ఏమి జ్ఞాపకం వచ్చిందో హఠాత్తుగా తోటలోకి పరుగెత్తింది. ఎవ్వరూ చూడకుండా పువ్వులు కొనిని కోసింది. కొన్ని లక్ష్మికి. మరికొన్ని లక్ష్మి - మద్రాసులో చేసినట్టు గానే - తన తలలో తురుముతుందనే ఆశతో కోసింది.

లక్ష్మి తడితల ఆరవిప్పుకుని భోజనానికి కూర్చుంది. పూలు పెట్టు కోవడంకోసం వేచిఉండే సమయంలో లక్ష్మి, జూడీ పరస్పరం ఎన్నో సంగతులు చెప్పుకున్నారు. జూడీకి తెలిసిన తనమిత్రుల సమాచార మంతా లక్ష్మికి తెలిసింది. అమ్మణిపాటీ యోగక్షేమాలు తెలిశాయి. బెన్ ఇప్పుడు అరవం బాగా మాట్లాడుతున్నాడని చెప్పింది. వాళ్లుఅంత వేడిగాను, అంత చల్లగానూ లేని తీపి కూరఅన్నం తింటూఉండగా వాళ్ల నాన్నగారు కుమార్ లోపలిక వచ్చారు. ఆయన చొక్కా లోపలికి దోపుకుని పొట్టిలాగు తొడుక్కున్నారు. బాగా చిక్కిపోయి,

ఈడుకుమించిన పెద్దవాడివలె కనబడుతున్నారు. ఆయన గబగబా రెండు మెతుకులు నోటిలో వేసుకుని, జూడీ తండ్రితో కలిసి కాలవవైపు షికారుకు వెళ్లారు. వారు తిరిగివచ్చేవేళకు ఇద్దరూ ఒకరికొకరు దగ్గరగా నడుస్తున్నారు. కుమార్ ముఖం వివర్ణమై ఉంది. జూడీ తన తండ్రి కళ్లజోడు అద్దాలు తుడుచుకుంటూ ఉండడాన్ని గమనించింది.

"వాళ్ళు ఎందుకో ఏడుస్తున్నారు" అంది.

"నిజమే, అయితే ఆ సంగతి మనకు తెలియడం వాళ్ళకు ఇష్టం ఉండదు" అంది వాళ్ల అమ్మ.

"మనం కొంచెం కాఫీ తాగుదాం. కుమార్ మిమ్మల్ని కలుసుకోగలగడం చాలా సంతోషంగా ఉంది. జూడీ లక్ష్మికోసం కొట్టుకుపోతోంది".

జూడీ, లక్ష్మి ఒకరికేసి ఒకరుచూచుకున్నారు. అలా చెప్పకోవడం ఏం బాగాలేదు. నిజమే అయితేమాత్రం కొంచెంసేపు అయిన తరువాత లక్ష్మిఅంది. "జూడీ నా నృత్యం తరగతులకు వస్తావుకదూ ?"

"తరువాత మనం మా ఇంటికి వెడదాం. మా ఆవిడ తేనీరుకాచి ఇస్తుంది" అన్నాడు కుమార్.

"అమ్మయ్యా!" మంచిదే అనుకుంది లక్ష్మి. వాళ్ళకు కొంత వ్యవధి ఉంది. మా అమ్మ సరస్వతి కలిసి చేసినవి బాగానే ఉంటాయి. జూడీ చూసినా ఫరవాలేదు. కాని వాళ్ల అమ్మా, నాన్నగారు చూడకుంటే చాలు—వాళ్ళు మంచివాళ్ళే ......అయినా అంతలో ఆమెను వాళ్ళ నాన్నగారు చూశారు. ఆయన నవ్వాడు. "లక్ష్మి నీకోసం ఇంకొకచీర తెచ్చాను. నీకు తరగతికోసం కావలసి ఉంటుదనుకున్నాను" అంటూ పాత పేపరు పొట్లం అందిచ్చారు. అది విప్పిచూస్తే

అందులో దీపావళి చీర, చోళి వాటికి తగిన బాడీ అన్నీ ఉన్నాయి. అది వాళ్ళ అమ్మది కావచ్చు. ఇప్పుడు లక్ష్మి మళ్ళీ పూర్వోత్సాహాన్ని పొందుతుంది. "నా గదిలోకి వెడతాను జూడీ" అంది లక్ష్మి. స్నానాల గదికూడా ఉందిగా. సబ్బుతో రద్దుకుని పంపుకింద మళ్ళీ కడుక్కుంటే ఎంత బాగుండును.

లక్ష్మికోసం తరగతిలో అందరూ వేచిఉన్నారు. నిజానికి వాళ్ళంతా సంక్షేమకేంద్రానికి తిరిగి వెళ్ళేటప్పటికి మిగతా పిల్లలు చాలా మంది లోపలికి తొంగిచూస్తున్నారు. తరగతి పిల్లలు దానిని తుడిచి శుభ్రంచేశారు. ఎవరో ఈ అవకాశాన్ని వినియోగించుకుని 'కోకా-కోలా' ప్రకటన ఫలకాన్ని వ్రేలాడగట్టారు. జూడీ తండ్రి కుమార్ తోను, జాతీయవిస్తరణ కేంద్రంనుంచి వచ్చిన యువకునితోను కలిసి వెళ్ళారు. ఆయన ముందు నృత్యం చేయడానికి తరగతిలో ఆడపిల్లలు సిగ్గుపడి ఉండేవారు. తన మద్దెలతో గుడ్డివాడు అక్కడికివచ్చి ఉన్నాడు. లక్ష్మికోసం వల్లి చాపసిద్ధంగా పరచి ఉంచింది. ఆ ప్రక్కనే చిరతలూ అవీ సిద్ధంగా ఉంచింది. లక్ష్మి ముందుగా చిన్నవాళ్లను ఒక్కొక్కరినే పిలిచి కథక్ పాటలు పాడించింది. ఎక్కడైనా వారు పొరపడితే తాను సరిదిద్దేది. ఇద్దరు ముగ్గురు తల్లులు నిశ్శబ్దంగా వాటిని తిలకిస్తూ తలోమూల కూర్చున్నారు. తరువాత ఆమె వారందరినీ ఒక్కమేళంగా పిలిచింది. ఎంతో ఉద్రేకంతో వివశ అయినట్టుగా ఉంది. ఇప్పుడు పెద్దపిల్లలవంతు వచ్చింది. ఆమె కట్టుకున్న పట్టుచీరను మృదువుగా పట్టుకొంది. "మీరు మమ్మల్ని అందరినీ వదలిపోవడం లేదుకదా" అని మెల్లిగా లక్ష్మి చెవులో గొణిగింది.

"లేదు" అంది లక్ష్మి చెవులో గొణిగింది.

"లేదు" అంది లక్ష్మి. "లేదు." బహుశా ఏదో ఒక రోజున ఈ కార్యక్రమం ముగియవచ్చు. అదృష్టం తిరిగిపోవచ్చు. వాళ్లను

తప్పనిసరిగా వదలివేయవలసి రావచ్చు. ఇలాంటి ఆలోచనలు తొలి సారిగా ఆమె మనస్సులోకి వచ్చాయి.

తాను నృత్యం నేర్చుకుంటున్నప్పుడు, నృత్యం చేసేటప్పుడు ఎలాంటి ఉత్సాహోద్రేకాలను ప్రదర్శించేదో ఇప్పుడు నేర్పేటప్పుడు కూడా అలాగే ప్రదర్శించాలని, తన యావచ్ఛక్తియుక్తులను కేంద్రీకరించాలని అనుకుంది. ఆ ప్రకారంగానే ప్రతి నర్తకితోను సన్నిహిత సంబంధం ఏర్పరచుకుంది. కాళ్ళతో లయ, తాళాలతో సంబంధం ఏర్పరచుకుంది. ఒకప్పుడు సంతోషం, అంతలో విషాదం ప్రకటించేది. ఇంతలో గెంతేది. అంతలో ఊగిపోయేది. పిల్లలు అంతా ఎంతో సంతోషించారు. ఆనాటి నృత్యంలో కొత్తగా జీవకళ తొణికిసలాడింది.

"అయితే పల్లెటూళ్ళలో వాళ్లంతట వాళ్లే నృత్యం చేస్తారా?" అని ఆఖరున జూడీ తల్లి అడిగింది.

"అవ్వు! వాళ్లంతా గుండ్రంగా కూర్చుంటారు. పాటలు పాడుతారు. వాళ్లు పెద్ద పెద్ద కథలను పాటలుగా పాడుకుంటారు. పురుషులు మాత్రం తమంత తాముగానే నృత్యం చేస్తారు. నేను ఇతర స్త్రీలతోబాటుగా గుడిసెలో నుంచి దూరానవారు నృత్యం చేస్తుండగా చూచాను. బహుశా పొంగలి పండుగ రోజులలో ఎక్కువగా నృత్యం చేస్తారనుకుంటాను. వాళ్లందరూ చాలా సంతోషంగా ఉండే సమయం అది. అదైనా పంటలు బాగా పండితేనే వారు సంతోషంగా ఉండేది." ఆమె లేచి నిలబడింది. తరగతిలో పిల్లలు చాపలు, అవీ తీసేశారు. గుడ్డివాడు తనలోతాను ఏదో గొణుగుకుంటున్నాడు. ఈపాటికి వాళ్ల ఇంటిదగ్గర అంతా సిద్ధంగా ఉంటుందా? కావచ్చు. అదుగో సరస్వతి సంజ్ఞచేస్తోంది. చక్కనిచీర కట్టుకుంది. తలలో పువ్వులుకూడా పెట్టుకుంది.

సరస్వతి పాతబట్టలు కట్టుకొని కుండలు తోలుస్తూ ఉండగా తానుచూచిన సంగతిని జూడీ ఆమెతో చెప్పకుండా ఉండడమే మంచి దనుకుంది. వాళ్ళంతా కలిసి ఇంజనీరు ఇంటికి వెళ్ళారు. ఆ ఇంటిచుట్టూ తోటవెయ్యడం కోసం కంచె కట్టారు. వసారాలోఉన్న కుర్చీలు మద్రాసులో మేడనుంచి తెచ్చిన పాతవి. తేనీటిపాత్రలుకూడ అవే. అయితే లక్ష్మి వాళ్ళని లోపలికి రమ్మనలేదు. వాళ్ళ అమ్మ పిలువలేదు. ఆ ఇంట్లో మూడుగదులు ఉండవచ్చునని, అందులో ఒకటి వంటిల్లు కావచ్చుననీ జూడీ అనుకుంది. ఎవరో-బహుశా శ్రీమతి జ్ఞానమ్మాళా? తను ఇంటివద్ద సామానులు అమ్ముతున్నారని చెప్పింది. బహుశా వారు విలువ అయినవాటిని అమ్మవలసి వచ్చిందికాబోలు. ఆ ఇంట్లో ఉన్నవా టన్నింటిలోకి రేడియో ఒక్కటే విలువైనది. పూర్వం లక్ష్మితల్లి మెడ నిండా నగలుండేవి. ఇప్పుడో ఆవిడమెడ ఒక్క చిన్నగొలుసుతో వెలావెలా పోతోంది. అయితే ఆ సంగతి గమనించినట్టు ఎవ్వరూ మాట్లాడరాదు!

కందన్‌కు వంటినిండా ఏవో దద్దుర్లు, పొక్కులు వచ్చాయి. జూడీ తండ్రి వాటిని పరిశీలించాడు. తాను ఏదో పైపూతమందు పంపుతా నన్నారు. అయితే ఆ విషయమై ఎవ్వరూ అంతగా పట్టించుకున్నట్టు లేదు. చిన్నపిల్ల కాలికి కడియాలు అలాగే ఉన్నాయి. ఆ ఇంట్లో మార్పులేనిది పాపాయిమాత్రమే!

లక్ష్మి, సరస్వతి, కుమార్ ముగ్గురూ రాత్రి భోజనానికి మళ్ళీ విశ్రాంతి భవనానికి వచ్చారు. తేనీటిని చక్కగా తయారుచేసి ఘనంగా ఇవ్వలేకపోయినందుకు బాధపడ్డాడు. కాస్తముందుగా తెలిస్తే బాగా ఉండిపోయేదనుకున్నారు.

"నా తరగతి నీకు నచ్చిందా? జూడీ" అని అడిగింది లక్ష్మి.

"ఆహా! నాకు నీవలె పాఠాలు బోధించడం ఎప్పటికీ చేతకాదు" అంది జూడీ.

"మొదట్లో ఎంతో కష్టం అనిపించలేదు" అంది.

"కష్టం కాకపోవడమేమిటి? ఎంతో ఇదిగా ఉండేది" లక్ష్మి చెప్పింది. "నేను పసిదాన్నని వాళ్ళ అభిప్రాయం. నిజంగా పెద్ద ఉపాధ్యాయిని వచ్చేవరకు తాను తిరిగి బడికిరానని ధిక్కరించిపోయిన ఒకావిడ చటుక్కున లక్ష్మికి జ్ఞాపకం వచ్చింది. అయితేనేం, మిగతా వాళ్ళు వచ్చారు. ఔను. వాళ్ళుమాత్రం నాటినుంచి నేటివరకూ వస్తూనే ఉన్నారు.

"నీవు ఉత్తరాలు వ్రాస్తూ ఉంటావు కదూ!" జూడీ అంది.

"అయినా నేను వ్రాయడానికి ఏముంది? ఇక్కడ అంతా నువ్వు చూశావుకదా" అంతలో లక్ష్మికి విచారం ముంచుకు వచ్చింది. జూడీ తిరిగి వెళ్ళిపోతుంది. ఇక్కడ తాను ఒక్కత్తే మిగిలిపోతుంది.

"అయితే నీబడి ఎలా నడుస్తోందో" అప్పుడప్పుడు వ్రాస్తూ ఉండు. "అమ్మణిపాటితో బడి సంగతి చెబుతా!"

"ఆమెతో మాత్రం చెప్పకు. నీకు పుణ్యముంటుంది." లక్ష్మి బ్రతిమాలింది "జూడీ, దయచేసి చెప్పకు. నేను పాతచీర కట్టుకుంటున్నానని, మాయింటిలో స్నానానికి జల్లులేదని, మానాన్నగారు చిక్కిపోయినట్టు కనబడుతున్నారని......"

"అలాగే. నాకు అర్థమైంది. మిగతా మన మిత్రులకు కూడా ఏమీ చెప్పను! అయితే నువ్వు బలే తెలివైనదానివని నా అభిప్రాయం. పాఠాలు బాగా చెబుతున్నావు" అంది జూడీ.

విశ్రాంతి భవనంలో బల్లమీద జూడీ గల్లి వస్తువులు కొన్ని ఉన్నాయి. అందులో ఆవిడ నల్లద్దాల కళ్ళజోడు ఒకటి. ఆవిడ

ఎప్పుడూ తనతో తెచ్చుకుంటూ ఉంటుంది. కాని పెట్టుకోదు. జాడీ వాటిని తీసి పెట్టుకుంది. వాటిమీదుగా లక్ష్మికేసి చూసింది. తరువాత లక్ష్మి పెట్టుకుంది. అంతలోనే అంది. "ఈ కళ్లజోడు పెట్టుకుంటే నేను ముసిలిదానిలా ఉన్నానుకదూ" అంది. "ఔను" అంది జాడీ తల్లి. "నువ్వు నిజంగానే ముసలిదానివలె కనబడుతున్నావు. నీకీ దౌర్భాగ్యపు కళ్లజోడు కావలిస్తే తీసేసుకో లక్ష్మి! నేను వాటిని ఎప్పుడూ పెట్టుకోనే పెట్టుకోను."

"రా! నీవు ఎలా ఉన్నావో చూసుకో!" అంది జాడీ. సరస్వతి వాటికోసం జాడీ గదిలోకి పరుగెత్తింది. వాళ్లంతా నవ్వారు.

"కుమార్! ఆమె నీ బిడ్డలందరిలోకి ఉత్తమురాలు. ఆమెవంటి వాళ్లు మరికొందరున్నట్టైతే భారతదేశం బాగుపడిపోను" అన్నారు జాడీ తండ్రి. .

కుమార్ నిజంగానే ఆ మాటలకు చాలా సంతోషించినట్లు కనబడ్డాడు. కాని ఇలా అన్నారు. "ఆ మాట నిజమే. మనం గ్రామాలను బాగుచేయడానికి సాయంచేయాలికదా! మిమ్మల్ని అందరినీ మళ్లీ చూడడం మేలే అయింది. మమ్మలిని అందరూ మరచిపోయారనుకున్నాం. మేము లేనివాళ్లలో జమ అయిపోయామని అనుకున్నాం" అన్నారు.

"అచ్చే! ఎంతమాట అన్నారు. అలా అనుకుంటే ఎలా?" అంటూ జాడీ తండ్రి కుమార్ చేతిలో చేయి వేశాడు.

ఇంతలో పిల్లలు పరుగెత్తుకుంటూ వచ్చారు. "సరే ఈ సులోచనాలను ఉంచేసుకుంటాను," అంది లక్ష్మి. నేను ఎంతో తెలివైనదానివలె కనబడుతున్నానని జాడి అంది. "నేను బహుశా ఆమె హిందీ ఉపాధ్యాయినివలె ఉన్నాను కాబోలు. ఏమైనా ఈ దెబ్బతో నా బడిలో పిల్లలందరూ ఎంతో మన్ననచేస్తూ మర్యాదగా ప్రవర్తిస్తారు!"

12. క్రిస్మసు - పొంగల్ (సంక్రాంతి)

పెన్సిల్ అంకెలతో నిండిన కాగితాన్ని కుమార్ ప్రక్కగా పెట్టాడు. అక్కడికొపని పూర్తిఅయిందన్నమాట. అంతలో విషాదంతో ఆయన క్రుంగిపోయాడు. తలను రెండుచేతుల మధ్య ఆన్చి బల్లక్కు తాటించాడు. లక్ష్మి ఆప్యాయంగా ఒకచేతిని మెడమీద వేసి రెండవచేతితో వీపు నిమురుతోంది. "నాన్నా! నాన్నా! ఇదేమిటి? అలా ఉన్నారేం?" అంది.

ఆయన తలఎత్తి పైకి చూచాడు. జుట్టులోనికి వేళ్లు పోనిచ్చి తలనిమురుకున్నాడు. కాగితంమీద వేళ్ళతో తాళంవేశాడు. హీన స్వరంలో చెప్పడం మొదలు పెట్టాడు. "ఇదేనా? చాలా తేలిక. దీని పని మొదలుపెట్టినపుడల్లా నా మనస్సు పరిపరివిధాల పోతోంది." ఆరవంలో మాట్లాడడం మొదలు పెట్టినవాడల్లా తన భార్యకు తాము ప్రస్తావించుకుంటున్న విషయం తెలియరాదని చటుక్కున ఇంగ్లీషులో మాట్లాడడం మొదలుపెట్టాడు. లేకపోతే ఆవిడ మరింత బాధపడి పోతుంది. "లక్ష్మి, ఇది చూచినప్పుడల్లా నా మనస్సు వికలమైపోతోంది. ఇంత చదువుకున్నాను. ఇంత ఉన్నత శిక్షణ పొందాను. అయితే కొంతగుమాస్తాపని, కొంత కూలిపనిచేస్తూ అంతంతమాత్రం జీతంతోనే బ్రతుకును ఈడవవలసి వస్తోంది. మన బ్రతుకంతా ఇంతే కాబోలురా అనిపిస్తూ ఉంటుంది. అలాంటప్పుడు ఎవరెలాపోతే మనకేం? అని ఎందుకు ఊరుకోకుండా పాడైపోతున్న వాళ్ళని బాగుచేయడానికి ఎందుకు ప్రయత్నించాను? అనిపిస్తుంది. ఒకవేళ ఆ కంపెనీ సొమ్ము పాపిష్టిదే అనుకున్నప్పటికీ నా తెలివితేటలను చూపించడానికి వీలయ్యేది కదా!" అనిపిస్తూ ఉంటుంది.

"నాన్నా ! మీరు నిజంగా దానినిగురించే ఆలోచించడంలేదు!" అంది లక్ష్మి. అస్తమానం అదే ఆలోచన! అసంభవం "అబ్బే దానినిగురించికూడా అప్పుడప్పుడు ఆలోచిస్తూ ఉంటాను. క్రిందటి నెల జాడీ, వాళ్ళ నాన్నగారూ, అమ్మా వచ్చివెళ్లారు కదా. మళ్ళీ పూర్వపు మనిషిలా ప్రవర్తించవలసి రావడం కష్టమే. ఈపాటికి వాళ్లు నన్ను మరచిపోయి ఉండవచ్చు." "అబ్బే. వాళ్లు మిమ్మల్ని ఎందుకు మరచిపోతారు. ఎన్నటికీ మరచిపోరు. అలాగే మీఅమ్మా, నాన్నాను" "ఇంతకీ ఇక్కడ ఎంత నికృష్టంగా ఉందో వాళ్లకి తెలియదు. అందుకే సంతోషిస్తున్నాను" అన్నారు కుమార్. "ఇవ్వాళ పొద్దున్న మా పెద్ద ఇంజనీరు వచ్చాడు. ఆయన చేతిక్రింద నేకదా నేను పనిచేస్తున్నది ? ఆయనవచ్చి కాలువను గురించి ఏమేమో చెప్పాడు. నాకు తెలుసు. ఆయన చెప్పిన పద్ధతి సరికాదని. ఆ ప్రకారం పనిచేశామా, అయినట్టే. వట్టి డబ్బుదండగపని. పన్నులు రూపంలో ప్రజలదగ్గరనుంచి వసూలుచేసిన డబ్బు అంతా వృధాగా ఖర్చు అవుతుంది. కాని ప్రయోజనం ఏమీ ఉండదు. కాని ఆమాట ఎలా చెబుతాను ? ఏమని చెబుతాను ? ఆయనచేతిక్రింద పనిచేస్తున్నానాయె. ఆయన ఆజ్ఞలను శిరసావహించి అమలు జరుపవలసి ఉందాయె. పైగా ఆయనకేమీ రాదు కూడాను. మనకున్న పరికరాలతో, సాధనసామగ్రితో మనం ఏమేమి చేయగలమని నేను ఆలోచిస్తూ ఉంటాను. లక్ష్మీ ! మనం ప్రతిగ్రామానికి గొట్టపు బావులు తవ్వవచ్చు. అదీ మనం చెయ్యవలసిన పనే అనుకుంటాను. కాని ఆపనిని వాళ్లు నాకు అప్పగించనేలేదు." అంటూ ఆయన ఆమెకేసి అలా రెప్పవాల్చకుండా చూశారు "నాన్నా ! ఏం ? ఎందుచేత ? నూతులు దేనికి త్రవ్వడం లేదు ? త్రవ్వితే చాలా బాగుంటుందికదా !" అంది లక్ష్మి.

"అబ్బే! మరేమీలేదు. ఆ పని తల పెట్టితే అందులో లాభాలు అట్టేరావని కొంతమంది అభిప్రాయం. అలాగే మలేరియా రాకుండా మందు చల్లడం సంగతిన్నీ. మనం ఆరోగ్యశాఖ ఉద్యోగులతో సహాక రించవలసి ఉంది. వాళ్లు మంచివాళ్లే. బాగా కష్టపడి పనిచేస్తు న్నారు. కాని మనం సహాకరించం. అంతే! కాగా ఏవో కొన్ని ప్రాంతాలలో మాత్రమే మందుచల్లుతున్నారు. మళ్లీ దోమలు యథా ప్రకారమే పుట్టుకు వస్తుంటాయి. తెలిసిందా?"

"ఔను" అంది. తరువాత "వల్లి తమ్ముడికి మలేరియా వచ్చింది."

"అబ్బే! అతనికి రావలసిన పనేలేదు" కుమార్ పెద్ద గొంతు కతో అంటున్నారు. అయినా వచ్చిందంటే మందుచల్లడంలో అవినీతి ఉందనను కాని బద్ధకించి ఉంటారు. బద్ధకం అవినీతి అంత చెడ్డదికాదు. "నాన్నా! మీమట్టుకు మీరు ఎంత కష్టపడుతున్నారు? ఎంతపని చేస్తున్నారు!"

"బహుశా నేను ఆశించినంతగా కాదు" అన్నారు కుమార్. "అయినా ఫరవాలేదు. కాని లక్ష్మీ! మళ్లీ ఈ మాటలు ఎక్కడా అనబోకు."

"నాన్నా!" లక్ష్మి అంది. "పురాణకథలలో చెప్పినట్లు ఇది మనకు పరీక్షా సమయం. కథానాయకుడు వనవాసానికి వెళ్లినప్పుడు పులులను క్రూరమృగాలను ఎదుర్కొని ఎదిరించి పోరాడవలసి ఉంటుంది కదా. అయితే ఇక్కడ పెద్దపులి అంటూ ఏమీలేదు. ఉన్నదల్లా పెద్ద ఇంజనీరు మాత్రమే."

'అబ్బే! ఆయనతో పోట్లాడడానికి నాకు అవకాశం ఉంటేగా?' అన్నారు కుమార్. "అయితే ఉన్నవాళ్లలోకి ఆయనే కొంచెం సులభసాధ్యుడు."

అంతలో గ్రామస్తులలో ఎవరో వాళ్ళని పిలిచారు. కుమార్ క్రిందకు వెళ్లి ఒక పెద్ద కాగితపు బంగీతోను, ఉత్తరంతోను తిరిగి వచ్చారు. "ఇవి నీకే! లక్ష్మి" అన్నారు.

లక్ష్మి ముందుగా కవరు చింపింది. అది జూడీ పంపిన క్రిస్మసు అభినందనాలు. ఆంగ్లంలో ఉంది. చుట్టూమంచు, మధ్య ఎర్రటి దుప్పటి కప్పుకున్న తెల్లగడ్డం తాత ఉన్నాడు. ఈ తాతనే ఇంగ్లీషు వారు క్రిస్మస్‌తాత అంటారని లక్ష్మికి జ్ఞాపకం వచ్చింది. జూడీ తన ప్రేమను వెల్లడించింది. బడిపిల్లలకు తమ తండ్రీ, తల్లీ ఏవేవో పంపు తున్నారని వ్రాసింది. "బహుశా ఈ బంగీ అదేకావచ్చు" అంది లక్ష్మి. ఎంతో ఉద్రేకంగా, "జాగ్రత్త" అంది లక్ష్మి ఎంతో ఉద్రేకంతో. జాగ్రత్తగా దానికి కట్టిన దారాన్ని విప్పింది. కాగితం ఊడదీసింది. మధ్యలో ఉన్న అట్టలను తీసి చూచింది. "ఓ! చూడండి. రెండు దేశపటాలు. ఒకటి భారతదేశపు పటం. ఇంకొకటి ప్రపంచపటం"

"అయితే వీటికి బదులుగా మనం వాళ్ళకు మళ్ళీ ఏం పంపగలం?" అన్నారు కుమార్ విచారంతో. "లక్ష్మి! వాళ్ళు మంచివాళ్ళే. కాని మనం వాళ్ళు పంపిన బహుమతులు పుచ్చుకోజాలము!"

లక్ష్మి ఆ పటాలు రెండింటిని రెండుచేతులతో పట్టుకుంది. "నా బడికోసం నేను ఎవరు ఏమి ఇచ్చినా పుచ్చుకుంటాను" అంది.

కందన్‌కూ, సరస్వతికీకూడా క్రిస్మస్ కార్డులు వచ్చాయి. పార్వతికి సైతం ఒకకార్డు వచ్చింది. అందరికీ అన్ని కార్డులనూ జూడీయే పంపించింది. స్పెన్సర్స్ దుకాణంలో వాటిని కొనడం బలే సరదాగా ఉంటుంది. అక్కడ ఆ నేకరకాల పక్షులతో, మంచుతో, ఇతర వస్తువులతో నిజమైన క్రిస్మసు కార్డులతో నిండిన పెద్ద పెట్టి ఉంటుందని జూడీ చెప్పింది. నిజానికి కొంతమంది ప్రజలుమాత్రం క్రిస్మస్ విష

యమై శ్రద్ధవహిస్తున్నారు. యూరోపియనులు, మద్రాసులో క్రైస్తవులు మాత్రమే. క్లబ్బులో ఇంద్రజాల ప్రదర్శనంతోసహా విందుజరిగింది. ఇతరత్రాకూడా విందులు జరిగాయి. ఇంగ్లండునుంచి బంగీలు వచ్చాయి. ఆ సందర్భంలో జూడీ తాతమ్మలలో ఒకామె ఇంగ్లండునుంచి చాక్లెట్లులు పంపించింది. అయితే తపాలుద్వారా వచ్చేటప్పుడు వేడెక్కి మెత్తబడిపోయాయి. అందుచేత అవి 'బెన్' తినడానికే బాగున్నాయి.

జాన్ దగ్గరనుంచి ఈలోగా ఒక ఉత్తరం వచ్చింది. అందులో డబ్బుదాస్తున్నానని వ్రాశాడు. ఇంగ్లండుకు తిరిగివచ్చిన తరువాత అద్భుతమైన బహుమానం ఏదో ఇస్తానని వాగ్దానం చేశాడు. అప్పటికి ఈస్టర్ సెలవులు వస్తాయి. అప్పుడు తన ఖర్చుమీద జూడీని సినిమాకు వచ్చే మూడు మంచి చిత్రాలకు తీసుకువెళ్ళుతానని వాగ్దానం చేశాడు. ఇంటిదగ్గర ఉన్నప్పుడు సినిమాచూచి చాలారోజులైంది. అవును చాలా పరీక్షలున్నాయి. అయితే హిందీమాత్రం ఉండదు. మళ్ళీ భారత దేశానికి రావడమూ ఉండదు. అంతలో కొంత ప్రయత్నంచేసి అయినా మరికొంత హిందీ నేర్చుకుంటే బాగుండుననుకుంది. అయితేమాత్రం! మళ్ళీ భారతదేశానికి రాకుండా ఉండడం అసలు సాధ్యమా? అసంభవం. అయితేమాత్రం తప్పుతుందా! కాని హఠాత్తుగా స్నేహాన్ని వదులుకోవడం ఎలా? ఆ బుల్లిని ఇంక ఎప్పటికీ చూడడానికి లేదుకదా!

వారంతా ఎంతో సరదాగా అలంకరించుకున్నారు. రంగు కాగితాలతో కత్తిరించిన నక్షత్రాలూ, అవీ తమ తెల్లగోడలమీద అంటించారు. పెద్ద సర్వే కొమ్మ తెప్పించారు. అది దూరాన్నుంచి చూడడానికి నిజమైన క్రిస్మసు చెట్టులాగే ఉంది. తోటలో ఒకమూల గొయ్యి త్రవ్వి దానిని నిలబెట్టారు. ఇదివరకు కొంతకాలం, మద్రాసులో క్రిస్మసు పార్టీలు పెడచేసిన నగరంలోనూ, చల్లని సాయం సమయాలలో ఆరు

బయటే జరుగుతాయి. ఆ తరువాత వాళ్ళు రావలసిన పిల్లల జాబితా వ్రాసుకుంటారు. వాళ్ళలో కొంతమంది బెన్ వలె మూడు-నాలుగేళ్ళ వాళ్లు. వాళ్లకి 'కీ' ఇస్తే పరుగెత్తే బొమ్మలు కావాలి. జీపులు, టాక్సీలు, బర్రెలనుమింగే పులులు, ఎలుకలనుమింగే నాగుబాములు, ఇంకా ఏవేవో ఉన్నాయి. కాని బెన్‌కు అవిఅంటేనే చాలా ఇష్టంగా ఉంది. అయితే అక్కడ రబ్బరు బుడగలుకూడా చాలా పెట్టారు. అవి అన్నీ అనేకరకాలుగా ఉన్నాయి. తేనెటి గిన్నెలు, పువ్వులు, దీపాలు, అనేకరకాలుగా ఉన్నాయి. వాటిమీద వేళ్ళతో వ్రాసినప్పుడు కీచుమనేవి. అలా చేయడం బెన్‌కు బలే సరదాగా ఉండేది.

జూడీకి తారతో సహా కొంతమంది సహాధ్యాయినులైన మిత్రులున్నారు. ఈ తార పుట్టినరోజు పండుగకేకదా చాలాసరదాగా విందు జరిగింది. ఈ సమయంలో లక్ష్మి మద్రాసులో ఉంటే ఎంత బాగుండును అనుకుంది! ఈ పెద్ద పిల్లలకు బొమ్మలో, పిల్లల పుస్తకాలో ఇవ్వాలని తన తల్లి భావించింది. అయితే వారంతా ఇవేవీ అవసరం లేని పెద్ద పిల్లలని జూడీ అనుకుంది. అందుకని వాళ్ళకు ఇవ్వడంకోసం డబ్బు సంచీలు, చేతిరుమాళ్ళు, నోటుపుస్తకాలు, చిన్నచిన్న అత్తరు సీసాలు కొన్నది. పాతతపాలా బిళ్లలు పోగుచేసే కుర్రవాడున్నాడు. వాడిప్పుడు అగ్గిపెట్టెలు పోగుచేస్తున్నాడు. భారతదేశంలో అనేక వందల రకాల అగ్గిపెట్టెలు ఉన్నాయి. అన్నింటిమీద అన్నిరకాల బొమ్మలూ ఉన్నాయి. వాడికోసం జూడీ ఒక సిరా పెన్సిలు కొంది. దీనితో జాబితాలు తయారుచేయడం తేలికకదా. అలాంటిదే మరొక మర పెన్సిలు హరిదాసుకోసం కొంది. పర్వత విశ్రాంతి కేంద్రంలో బడులలో ఇద్దరు ఆంగ్లబాలికలు, ఒక స్విస్ ఉన్నారు. వాళ్లకోసమని భారతీయ చేతివృత్తుల దుకాణంనుంచి మరికొన్ని కొంది.

అంతా ఎంతో సరదాగా ఉంది. అలంకరణ అంతా పూర్తి అయిన తరువాత ఆ చెట్టును వచ్చి చూడవలసిందని అమ్మణ్ణిపాటీని ఆహ్వానించింది. దానినిచూచి అమ్మణ్ణిపాటీ ఎన్నో సంగతులు అడిగింది. చిటారు కొమ్మను ఆ నక్షత్రం దేనికి ? అంది. అంతట జూడీ అమ్మణ్ణి పాటీకి క్రిస్మస్ కథ అంతా చెప్పింది. గొర్రెల కాపరులు, ముగ్గురు రాజులు—అందులో ఒకడు తూర్పుదేశంనుంచి వచ్చాడు కూడా—బెతల్ హామ్‌కు, గడ్డి తొట్టెలోఉన్న శిశువును వెదకుకుంటూ ఎలా వచ్చారో వివరించి చెప్పింది. అమ్మణ్ణిపాటీకి ఆ కథంతా నచ్చినట్లే కనబడింది. ముఖ్యంగా ఆవులూ, గాడిదా ఎలాచూచాయో వివరించే ఆభాగం బాగా నచ్చింది. "మిగతా క్రైస్తవ గాథలకంటె ఇది బాగా ఉంది" అంది. ముఖ్యంగా వాడు మగపిల్లవాడైనప్పుడు, వాడి కథ త్యాగపూరితమైనప్పుడూ చాలాబాగా ఉంటుంది, అంది జూడీ. ఇంకా ఏదో వివరించబోతున్నది. ఇంతలో బెన్ గొంతెత్తి ఒక క్రిస్మస్ పాట పాడుకుంటూ తోటలోకి పరుగెత్తుకు వచ్చాడు. వాడు బాగా పాడలేడు. అసలు వాడికివచ్చిందే ఒక్కపాట. "నోయల్! నోయల్"అంటూ ఒక్కచరణమే పాడుతూఉంటాడు. వాడితోబాటుగా జూడీకూడా ఆ పాట పాడింది. ఆపాట తనకెంతో నచ్చిందని అమ్మణ్ణిపాటీచెప్పింది. అంతలో ఆవిడ అంది. త్వరలోనే పొన్నేరిలో వారు సంక్రాంతి సెల పడతారు. లక్ష్మిదగ్గరనుంచి నాకొక మంచి ఉత్తరం వచ్చింది. పాపం పండుగ దానికి సరదాగానే ఉంటుంది. ఔను! గ్రామాలలో ఉండడమే మంచిదని ఒక్కొక్కప్పుడు అనిపిస్తూ ఉంటుంది.

"ఔను" అంది జూడీ. పొంగల్ నిజంగానే సరదాగా ఉంటుందనుకుంటాను. ఆ గ్రామం అంటే అమ్మణ్ణిపాటీ ఏమనుకుంటుందో ? ఏమిటో ? తనైనా ఏమీ తక్కువగా చెప్పలేదు. ఒడినిగురించే చెప్పింది.

మిగతా ఏమీ చెప్పకుండా జాగ్రత్తపడింది. ఈ సమయంలో అమ్మణ్ణి పాటీతో ఇంకొక చిన్నపిల్లవాడుకూడా ఉంటున్నాడు. వాడు ఆమె రెండో కూతురు కొడుకు. గారంవల్ల చెడిపోయాడు. అస్తమానం అవీ, ఇవీ కావాలని ఏడుస్తూ ఉంటాడు. వాణ్ణి క్రిస్మస్ చెట్టుక్రింద జరిగే విందుకు రావలసిందని పిలిచారు. అక్కడ ఉన్నంతసేపూ వాడు ఇంకొకరికి ఇచ్చిన బహుమతి తనకు కావాలని మారాం చేస్తూనే ఉన్నాడు. ప్రక్కయింటి మంచిపిల్ల వారంటి తన బొమ్మను వాడికి ఇచ్చింది.

ఈ విందులన్నీ చాలావరకు సరదాగానే ఉన్నాయి. ఇందుకు కారణం చల్లగా, హాయిగా ఉండడం. నిజానికి అది నడిశీతాకాలమే అయినా పువ్వులు చాలా ఉన్నాయి. ఆకులు ఎప్పుడూ రాల్చని చెట్లనుచూస్తే కొంత విసుగు వస్తుంది. వాటిల్లో కొన్నిమాత్రం హఠాత్తుగా రాల్చివేస్తాయి. అదైనా కొన్నిరోజులు మాత్రమే. ఆ వెను వెంటనే కొత్తచిగుళ్ళు మొలకెత్తుతూనే ఉంటాయి. పంకాలను తిప్పడం మానేశారు. ఒకొక్కరాత్రి ఎంతచల్లబడిపోయేదంటే జూడీ కప్పుకోవడానికి దుప్పటీ కావాలనుకునేది. అయితే చలిఅంతగా ముదరలేదు.

క్రిస్మస్‌రోజున పనివాళ్ళు పూలదండలు తెచ్చారు. ప్రతివాళ్లూ ప్రతివారి ఛాయాచిత్రం తీసుకున్నారు. ముఖ్యంగా జార్జి ముగ్గురు పిల్లలదీ; వానికి ఇద్దరు పిల్లలని - వాళ్లు అక్కడికివస్తే - ఫోటోలు తీశారు. జూడీ తండ్రి ఆస్పత్రిలోనే ఉండిపోయారు. ఆరోజున పంచదార చల్లి మామగారు భద్రపరచిన మీగడ తరకలు తిన్నారు.

కొంతమంది స్కాట్లండు దేశీయులు జింఖానాక్లబ్బులో నూతన సంవత్సరాది విందు చేసుకున్నారు. వాళ్ళంతా అస్తమానం విస్కీ తెగ త్రాగారని చెప్పి జూడీ తల్లి వాళ్ళతో పోట్లాడింది. అలా త్రాగడం

తప్పు అని ఆమె అభిప్రాయం. మద్రాసురాష్ట్రంలో మద్యనిషేధం అమలులో ఉంది. విస్కీవంటి మత్తు పానీయాలు సేవించాలంటే ముందుగా అందుకు ప్రభుత్వం అనుమతి సంపాదించుకోవాలి. అది ఏడాదికొకమారే లభిస్తుంది.

ఇంతలో సంక్రాంతి ప్రారంభం అయింది. మద్రాసువంటి మహా పట్నంలో మగపిల్లలకు పరుగెత్తుకువెళ్ళి ప్రక్కయింటివారి సామానులను పగులగొట్టడానికి ఇది అదను. కాని దేశం మొత్తంమీద ఇది పంటల పండుగ. సారవాపంట అంతా పొలాలనుంచి ఇంటికి చేరిపోతుంది. అయితే నడిశీతాకాలంలో సూర్యుని పురోగమనాన్ని కాంక్షించుతూ భోగిమంటలు వేస్తుంటారు. ప్రపంచంలో అందరూ అలాగే చేస్తారు కదా. లక్ష్మి తన బడికి సెలవులు ఇచ్చింది. ఇవ్వకపోయినా ఎవళ్ళూ వచ్చి ఉండేవాళ్ళుకాదు. అయితే అప్పుడే ప్రభుత్వోద్యోగులలో ఒకరెవరో జాతీయవిస్తరణ కేంద్రానికి వచ్చారు. అక్షరాస్యత వ్యాప్తికి నడుపుతున్న బడిని ఒకదానిని తాను చూడదలచానని అన్నాడు. ఆయన ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చాడు. అక్కడ వారికి సంక్రాంతి పండుగ లేదు. దానికిబదులు ఇంకొక పండుగ ఏదో ఉంది. లక్ష్మికి ఈ నగర వాసుల అజ్ఞానంచూస్తే వళ్ళు మండిపోయింది. వాళ్ళు అస్తమానం జాతీయ విస్తరణ కార్యక్రమాన్ని గురించి మాట్లాడుతూ ఉంటారు కాని నిజంగా గ్రామాలను గురించి ఆలోచించనే ఆలోచించరు. వాళ్ళ నాయనగారు కొంచెంగా నవ్వారు. ఆ మాటతో సగం అంగీకరించారు. తరచుగా బస్తీలనుంచి ఎవరో ఒకరు వస్తూఉండేవారు. వారిలో కొంత మంది ప్రవీణులుకూడాను. వారు అన్నింటా ప్రవీణులు-అది అసలు సాధ్యమా ? వాళ్లు తెలిసితక్కువగా చెప్పే సలహాలను గ్రామస్థులు పట్టించుకునేవారేకాదు. పల్లెటూరి ప్రజలేం తెలివితక్కువవారుగాదు. తమసంగతి వారికి బాగా తెలుసు.

"గాంధీజీ మనందరం పల్లెటూళ్ళలో నివసించాలని ప్రబోధించారు" అన్నారు కుమార్. "నిజమే మనమంతా తప్పక నివసించవలసిందే. కాని మనం మనమిత్రులతో కలిసి సరియైన పని చేయించాలి. మన శక్తి యుక్తులనూ, కాలాన్నీ వృథాచేయరాదు!"

నిజానికి లక్ష్మికంటె ఆయనకే ఎక్కువ బాధగా ఉంది. ఇందుకు కారణం ఆయన అటు పెద్ద ఇంజనీరుకీ, ఇట గ్రామస్థులకీ మధ్యన ఉన్నాడు. ఆ పెద్ద ఇంజనీరు తాను చాలా గొప్పవాణ్ణని అనుకుంటూ ఉంటాడు. ఆయన తరచుగా తన కారులో మద్రాసుకో, మరే బస్తీకో వెడుతూ ఉంటాడు. కనుక ఆయనకు నిజమైన మిత్రులెవరూ లేరు. కాని లక్ష్మికి అలా కాదు. తన బడిలో కొందరు మిత్రులున్నారు. వారంతా కలిసి పొంగల్ ఆట ఆడుకున్నారు. ఆనాడు వారంతా పాత కుండలు మూకుళ్లు పగలకొట్టి కొత్తవి కొనుక్కు తెచ్చుకున్నారు. అవి చాలా చౌక. అందువల్ల కుమ్మరులకు లాభం. ఇళ్ళు శుభ్రంగా బూజులు దులిపేవారు. పాత తుక్కు అంతా భోగిమంటలో పడవేసేవారు. సంక్రాంతి పాటలు పాడేవారు.

పండగ రెండోరోజున పాలు, కొత్తచెరుకురసం, కొత్తబియ్యం కలిపి పాయసం వండుకు తినేవారు. అది మామూలుగా పరమాన్నంకంటె ఎంతో రుచిగా ఉంటుంది. మూడోరోజున పశువులకు ఆదేమేపేవారు. ఆరోజున ఆవులను బాగా కడిగి కొమ్ములకు రంగు వేసేవారు. కుమార్ వాళ్ళకు బక్కచిక్కిన ఆవు ఒకటుండేది. ఆయన, లక్ష్మి, మిగతా పిల్లలూ కలిసి దానిని కడిగారు. కొమ్ములకు రంగు పూత మొదలు పెట్టారు. ఆయన భార్య చిరకాలం మేడల్లో, మిద్దెల్లో, మసలడానికి అలవాటు పడిందేమో, కొమ్ములకు రంగుపూసే పని మరచిపోయింది. ఇష్టంవచ్చినట్టు పూస్తున్నారు. ఇంతలో వల్లి తండ్రి వడ్రంగి-వచ్చాడు.

ఆ పనిలో సాయంచేసాడు. చివరకు ఒక ఎర్రకొమ్ము, ఇంకొక పచ్చ కొమ్ముపైన పువ్వులతో, ఆ గోవు మాంచ్చిమి పొన్నేరిలో చాలా అందంగా అలంకరించబడిన వాటిల్లో ఒకటిగా తయారైంది.

నృత్యంకూడా ఏదో జరిగింది కాని చాలా మోటుగా ఉంది. లక్ష్మి అలాంటి నృత్యాన్ని ఎన్నడూ చూడలేదు. ఒకటే అరుపు. కంఠశోష ఎక్కువ. పల్లెటూళ్లు అన్నింటిలోనూ అదిఅంతే. భోగినాడు రాత్రి ఆమంటలు తూర్పుమైదానంలో చాలాదూరంవరకూ కనిపించేవి.

"అమ్మణ్ణిపాటిగారి ఆవులను చూడాలని ఉంది" అంది సరస్వతి. ఇదివరకు ఏటేటా వాళ్ళు అక్కడికివెళ్ళి వాటిని చూస్తూనే ఉండేవారు. కాఫీ, మిఠాయిలు ఇంకాఏవేవో బహుమతులు వారికిలభిస్తూ ఉండేవి.

"జూడీ వెళ్ళి వాటిని చూస్తుంది. బహుశా వాటినిగురించి నాకు ఉత్తరం వ్రాయవచ్చు" అంది లక్ష్మి. సరిగ్గా అలాగే జరిగింది. ఆరోజున జూడీ, బెన్ కంచెమీదుగా కావేరిని, గోదావరిని చూస్తూనే ఉన్నారు. అప్పుడే కొంచెంగా కొమ్ములు వస్తున్న దూడను బాగా కడిగి, దువ్వి ఎంతో అందంగా కనిపించేటట్లు చేశారు.

మద్రాసు వీధులన్నింటిలోనూ ఆనాడు ఇలాంటిదృశ్యాలే కనబడ్డాయి. ఆరోజున ఆవులూ, ఎద్దులూ, బర్రెలూ వాటి కొమ్ములన్నింటికీ రంగువేశారు. ఒక కొమ్ముకి ఒక రంగు. రెండోకొమ్ముకి ఇంకొక రంగు. తరచుగా వాటికి ఇత్తడి కలశలు తగిలించేవారు. పూలదండలు చుట్టేవారు. మద్రాసులో ఏమివచ్చినా పూలు బాగా వాడుకచేస్తారు. స్వయంగానైనా గుచ్చుకుంటారు. లేదా బజారులో దండలుగుచ్చి వ్రేలాడగట్టి అమ్ముతారు. లేదా సాయంత్రం రోజూ పూలమనిషి ఇంటికివచ్చి పువ్వులు ఇచ్చిపోతాడు. మద్రాసులో పువ్వులు చౌక. స్వదేశానికి తిరిగి వెళ్లిన తరువాత జూడీకి ఈ పువ్వులూ, ఈ రంగులూ ఇంక కనబడవు.

13. ఉత్తరాది

ఏదో సభలో పాల్గొనడంకోసం ఢిల్లీకి వెళ్ళాలని జూడీనాన్న గారు అన్నారు. బహుశా ఢిల్లీలో ఆయన ఎవరో మిత్రులతో మకాం చేసారట. మద్రాసుకు తిరిగివచ్చేలోగా ఉత్తరాన పర్వతప్రాంతంలో ఉంటే మరికొందరు మిత్రులను చూచివద్దామనుకుంటున్నారు. ఈలోగా తను సామానులన్నింటిని సర్దించేస్తున్నారు. కాని జూడీ ఈ విషయం అంతగా పట్టించుకోలేదు. మళ్ళీ ఒకసారి పొన్నేరి వెళ్లుదామనుకుం టోంది. అక్కడికి వెళ్ళాలంటే పెద్దయాత్రకు చేసినంత సన్నాహం చేయాలి. తనకూ వెళ్ళాలని ఉందని అమ్మణ్ణిపాటికూడా తరచు చెప్పేది. ముందుగా ఆవిడ కుమార్తెలలో ఒకామె వచ్చింది. ఆతరువాత కారును చెట్టుకు గుద్దివేసిన చుట్టం ఒకాయన వచ్చాడు.

“లక్ష్మి తండ్రికి ఎవ్వరూ ఏమీ ఉపకారం చేయలేదా ?” అని అడిగింది జూడీ. వారంతా మళ్లీ జింఖానాక్లబ్బుకు వెళ్లారు. లక్ష్మి మిత్రులలో కొందరు, కొంచెం పెద్దపిల్లలు దూరంగాఉన్న ఒక బల్ల దగ్గిర పానీయాన్ని సేవిస్తూ బంగాళాదుంప బొరుగులు నములుతున్నారు. ఈ శీతకాలపు చలిలో ఈదలేమని చాలామంది అన్నారు. పైగా వారిలో చాలామందికి వయస్సు వస్తోంది. బాల్యం వదలి యౌవ్వనం ప్రవేశిస్తోంది. అందుచేత ఆటలతోపాటు ఇతరవిషయాలమీదకుకూడా వారిదృష్టి మళ్లుతోంది.

“నాకు తెలియదు జూడీ” అన్నారు వాళ్లనాన్నగారు కోపంగా. “నేను ఆయన విషయమై చాలామందితో మాట్లాడాను. దానికి గట్టి సిఫారసు కావాలి. అందుకు తగినవాళ్లు ఎవళ్లూ దొరకలేదు. బహుశా ఆపని మద్రాసులో సాధ్యంకాదేమో అనుకుంటూను.”

ఇంతలో హరిదాస్ తువ్వాలుపట్టుకొని పరుగెత్తుకుంటూవచ్చాడు. వాడి వెనకాలే వాళ్ళ అమ్మకూడా వచ్చింది. వచ్చి వీళ్ల బల్లదగ్గర నిలబడింది. "మీరు ఢిల్లీ వెళుతున్నారన్నమాట. నాకు చాలా సంతోషంగా ఉంది. మీరు అక్కడే నిజమైన భారతదేశాన్ని చూడగలుగుతారు. శుభ్రంగా ఉంటుంది. నిత్యహరితంగా పచ్చగా కలకలలాడుతూ ఉంటుంది. ఆకర్షణీయంగానూ ఉంటుంది. చక్కని బలిష్ఠులైన పురుషులు. అందమైన ఆడవాళ్లు. ఇంక దుకాణాలసంగతి చెప్పనే అక్కరలేదు......". "అయితే మద్రాసులో మీకు కావలసినవి దొరకడం లేదా?" అని జూడీ తండ్రి అడిగాడు. పరధ్యానంగా, దాంతో ఆవిడ మద్రాసులో కొందామన్నా సరకులు మంచివి ఎలాదొరకవో ఏకరువు పెట్టింది. జూడీ కేసి తిరిగి "మీ స్నేహితురాలు లక్ష్మి ఎక్కడ? ఆవిడకూ చలేనా? ఒరే. హరిదాసూ, బట్టలు మార్చుకొని త్వరగా రారా! అయితేమీకు ఇద్దరికీ ఇప్పుడు స్నేహం లేదా?"

"అబ్బే. లక్ష్మి ఇప్పుడు మద్రాసులో లేదు." అంది జూడీ కోపంగా.

"ఔనౌను. వాళ్లనాన్నగారిని పనిలోనుంచి తీసేశారుగా. ఔను కదూ?" అంది. అంతలో ఆవిడ జూడీ తండ్రికేసి తిరిగింది. స్నానంచేయడానికి వేళ అయిందని ఆయన కంగారుగా అన్నారు. జూడీని, జవాబు చెప్పేలోపుగానే అక్కడినుంచి తీసుకుపోయారు.

ఆతరువాత కొంచెం సేపటికి బెన్, వాళ్ళ అమ్మ అక్కడికి వచ్చారు. "మనం ఎదురుచూస్తున్న ఉత్తరం ఇదిగో వచ్చింది." అంది ఆవిడ. ఆయన దానిని చదివారు. "జూడీ, రావుదంపతులు నిన్నుకూడా రమ్మని ఉత్తరం వ్రాశారు. మనం ఎల్లాగా త్వరలోనే మనదేశానికి తిరిగి వెళ్ళిపోతున్నాం. అందుచేత బడికి వెళ్లనక్కరలేదు. మనం అందరం వచ్చేవారం ఢిల్లీకి కలిసేవెళ్లుదాం."

"అయితే నాన్నా" అంది జూడీ. ఏదో చెప్పబోదామనుకుంటూ ఉండగానే వారిదాను తల్లి మండిపడుతూ అక్కడికి వచ్చింది. "నాకు ఢిల్లీ ఏమీ నచ్చదు. అందుచేత నేను ఢిల్లీకి రాను. రావాలని లేదు." అంది జూడీ.

వాళ్ళ నాన్నగారికి అంతా అర్థమైపోయింది. "బహుశా ఆ తెలివితక్కువ ఆవిడ మాటలు పట్టుకునేనా నీవు ఇలా అంటున్నది! ఆవిడ మాటలన్నీ నిజమే అనుకోవడంలేదుకదా జూడీ?" అన్నారు ఆయన.

"సరే అలాగే అనుకోండి" అంది జూడీ. అది దేశానికి రాజధాని. అక్కడే పార్లమెంటు ఉంది. మనం చూస్తున్న భారతదేశంకంటె భిన్నమైనది. అయితే అది అంత మంచిది కాకపోవచ్చు. అయినా నీవు తప్పక చూడాలి" అన్నారు వాళ్ళ నాన్నగారు.

"అయితే నీకు కొన్ని ఉన్న బట్టలు కావాలి" అంది వాళ్ళఅమ్మ. "కాని ఏప్రిల్ లో ఇంగ్లండులోనూ కావాలి."

జూడీకోసం వాళ్లఅమ్మ ఊలుతో జెర్సీ అల్లింది. చేతులు లేని స్వెటర్ అల్లింది. అయితే జూడీ వాటిని అసలు తొడుక్కుంటుందా అనేది వేరేసంగతి. దర్జీవాడు ఆమెకోసం ఒక దళసరిగౌను కుట్టాడు. నీకు ఇంక ఊలుమేజోళ్లు కావాలి. ఒక వానకోటు... కావాలి.

"అది సరే. అయితే ఇది భారతదేశం!" అంది జూడీ అసమ్మతి సూచకంగా. చలి గజగజలాడించే కొండలలోకూడా మేజోళ్లు తొడుక్కోవాలనుకోలేదు! అయితే నేమి. అన్నీ తయారైనాయి.

"నీకు వచ్చిన హిందీలో ఉత్తరాది వారితో మాట్లాడవచ్చు" అంది వాళ్లఅమ్మ. జూడీ ఏమీ మాట్లాడలేదు. ముఖం అదోలా పెట్టింది.

వెళ్లబోయేముందు వాళ్ళు మైలాపూరులో జరుగుతున్న తెప్పోత్స వాన్ని తిలకించారు. అందమైన తెప్పను నిర్మించి దానిమీద దేవుణ్ణి ఊరేగిస్తూ చెరువులో చుట్టూ తిప్పుతారు. ఆ తెప్పచుట్టూ విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా అలంకరిస్తారు. దీనిని చూడడానికి జనం విపరీతంగా వచ్చారు. ఇసుకవేస్తే రాలకుండా ఉంటుంది. ఆ జనంలో కారును నిలపడానికే చోటు దొరకదు. చెరువుచుట్టూ తిరునాళ్ళు జరుగుతుంది. జనసందోహపు రాకపోకలు, అంగళ్ళో అమ్మేవాళ్ల కేకలు, రంగులరాట్నాలు, బొమ్మలు, పాత్రసామానులు, గాజులలమలారాలు, ఆచోటంతా ఆక్రమించుకొని ముందు గుడ్డలు పరచుకొని కూర్చున్న బిచ్చగాళ్ళు, చెరువుచుట్టూ సిమ్మెంటు దడిపై ఒకరికొకరు ఆనుకు కూర్చున్న వేలకొలది జనం అంతా మహా కోలాహలంగా ఉంటుంది. వీరంతా చెరువుచుట్టూ మెల్లగా ప్రదక్షిణాలుచేసే తెప్పను ఎంతో ఆసక్తితో చూస్తూఉంటారు. ఇప్పటినుంచి ఇంక ఆరువారాలలో తాను ఇంగ్లండులో ఉంటానని జూడీ అనుకుంది.

ఇండియాలో రైళ్ళు సుఖంగానే ఉంటాయికాని నెమ్మదిగా ప్రయాణం చేస్తాయి. అయితే అంత పరిశుభ్రంగా ఉండవు. దూరప్రయాణం విసుగుపుట్టుతుంది. ఇప్పుడు చాలామంది విమానాలలో ప్రయాణం చేస్తున్నారు. జూడీ, ఆమెతండ్రి ఇద్దరూ కూడా విమానంలో వెళ్లారు. అయితే పగటి ప్రయాణానికి రేట్లు ఎక్కువ. రాత్రి విమానంలో వెళ్ళారు. దానిలో కూడా సుఖంగా కూర్చొనడానికీ, వెనుకకు వాల్చుకుని హాయిగా నిద్రపోవడానికి వీలుగా మెత్తలు అమర్చారు. జూడీ కొంచెంసేపు నిద్రపోయింది. నాగపూర్ సమీపించుతున్నదని, అక్కడదిగి విమానాలు మారాలని ఎయిర్ ఇండియా హోస్టెస్ వారిని మేలుకొలిపింది. "నాగపూర్" అంటే "పాముల

పట్టణం" అని అర్థం, అని వాళ్లనాన్నగారు అన్నారు. అక్కడొక సినిమాకూడా ఉంది. అందులో చక్కని డాక్యుమెంటరీ చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. శుచిగా ఉండే స్వాదుయోగ్యమైన భోజనం, ఫలహారం ఏవి కావాలంటే అవి లభిస్తాయి.

వాళ్ళు వెళ్లేటప్పటికి ఇంకా చీకటి బాగాఉంది. బాగా చలిగా ఉంది. అందుచేత ఎయిర్ ఇండియా కంపెనీవారు ఇచ్చిన దుప్పటి కప్పుకొని జూడీ ఎంతో సంతోషించింది. ఆ తరువాత కొంచెంసేపటికి సూర్యోదయం అయింది. విమానం వెడుతుండగా క్రిందనున్న మైదానాలు, కొండలు, అడవులు, పంటచేలు, గ్రామాలు గడచిపోయాయి. అయితే చాలా పెందలకడనే విమానం అందమైన భవనాలు, వెడల్పైన వీధులుగల సుందరనగరం ఢిల్లీ విమానాశ్రయాన్ని చేరుకుంది. "బలే చలిగా ఉందే!" అనుకుంటూ జూడీ చాలాకాలానికి తరువాత తన ఊలు మేజోళ్లు తొడుగుకుంది.

"అరుగో, రావుదంపతులు వచ్చారు" అంటూ జూడీతండ్రి వారి వైపు చేయి విసిరారు. ఆ తరువాత కునికిపాట్లు పడుతూ, నిద్రమత్తులో తూగుతూనే వారు ఒక కారులో ఎక్కారు. ఆ కారు సందులు, వీధులు తోటలు, పేటలుదాటి నిజంగా శీతాకాలం లేదా వసంతచ్ఛాయలు అనిపించే చలిలోనుంచి దూసుకుపోతూ తమగమ్యం చేరుకున్నారు. ప్రజలు ఉన్నినూట్లు ధరిస్తున్నారు. లేదా కంబళ్ళు కప్పుకుంటున్నారు. అక్కడ ఎలుగుబంటిని ఆడిస్తున్న వాడొకడు కనబడ్డాడు. ఎలుగు చాలా మురికిగా ఉంది. అయితే నేమి, దాని వంటినిండా ఒత్తుగా బొచ్చు ఉంది!

వాళ్ళ నాన్నగారు తానువచ్చిన పనిమీద సభకు హాజరుకాగా జూడీ ఆసమయంలో ఊరు చూడబోయింది. రావుదంపతులకు పిల్లలు చాలామంది ఉన్నారు. తొలిసిగ్గు వదలగానే వారంతా జూడీతో

ఎంతో ఇదిగా మాట్లాడారు. పెద్దపిల్లలు అందరూ బడిలో ఇంగ్లీషు చదువుకుంటున్నారు. వారి బిడ్డలలో దిలీప్ పెద్దవాడు. ముమ్మూర్తులా తండ్రిపోలికే. ఇంద్ర అని వాళ్లకో అమ్మాయిఉంది. ఈ ఇద్దరూ వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు. అయితే అందుకు అవసరమైన ప్రత్యేక విద్యను ఇంకా అభ్యసించడంలేదు. వారి చిన్నపిల్లవాడికి బంతి ఆట అంటే బలేసరదా. వాడికి నిద్రాహారాలు అక్కరలేదు. తోట బాగానే ఉంది. అందులో చక్కని పచ్చికమైదానం ఉంది. చక్కని పూల మొక్కలూ ఉన్నాయి. ఇంగ్లండులో వేసవిలో పూచే పూలమొక్కలన్నీ ఇక్కడ వీరితోటలో చక్కగా ఏపుగా ఎదిగి పూలతో కలకలలాడుతున్నాయి. త్వరలోనే ముద్దబంతిపువ్వులూ తదితర రకములెన్నో పూవులు విడువబోతున్నాయి. వడ్రంగిపిట్టలు, ఇతర రకములపక్షులూ ఎన్నోఉన్నాయి. అయితే ఇక్కడ కోతుల బెడద చాలాఎక్కువ. అవి మాటిమాటికి లోపలికివచ్చి అన్నింటినీ దొంగిలించుకుపోతుంటాయి. ప్రయాణంలో బాగా అలసిపోయిందేమో మొదటిరాత్రి జూడీ వళ్ళు తెలియకుండా నిద్రపోయింది. రెండోరాత్రి మాత్రం సగంనిద్రలో ఏదో ఊళ విని ఉలిక్కిపడి లేచింది. బహుశా భయపడిపోయినట్లుంది. ఆమె రావు దంపతుల పెద్దపిల్ల ఇంద్ర గదిలో పడుకుంది. పిలుపు విని ఇంద్ర నిద్రలేవకుండానే భయపడవలసినపనిలేదని, కేవలం నక్కలు ఊళ పెట్టుకున్నాయని సర్ది చెప్పింది. తోడేళ్ళుకూడా మందలు మందలుగా తిరుగుతూ ఉంటాయని దిలీప్ చెప్పాడు. కాని జూడీ ఆ మాటలను పూర్తిగా నమ్మినట్టులేదు.

మధ్యాహ్నం ఎండ కరకరలాడుతూ వచ్చింది. ప్రకాశవంతంగా ఉన్న ఆ ఎండలో ప్రతిది మెరుస్తున్నట్టే ఉంది. అప్పుడు వారంతా పాతఢిల్లీకి వెళ్లారు. అక్కడ పూర్వం ఎప్పుడో కట్టిన ఎత్తైన గోడలను, ఒకప్పుడు నగరంలో మూతపడిపోయిన శాతిద్వారాలను, ఎర్రకోటనూ

చూచారు. ఈ ఎర్రకోటలో తెల్ల పాలరాతితో మొగలు చక్రవర్తులకు, వారి అంతఃపురాంగనలకు అందమైన చిన్న చిన్న గదులెన్నో కట్టారు. రంగురంగుల రాళ్ళు, రత్నాలు పరచి ఉద్యానవనాలను ఏర్పరచారు. ఇక్కడి ప్రదర్శనాలలో అమ్మణ్ణిపాటి బొమ్మలవంటి బొమ్మలున్నాయి. విషం పోసినప్పటికీ రంగు మారని గిన్నెను రావుగారి పిల్లలు జాడీకి చూపించారు.

అనంతరం వారు కుతుబ్ మీనార్‌కు వెళ్లారు. ఎర్రని ఆగోపురంపై అరబిక్ అక్షరాలతో అందమైన అక్షరమాలను ఎన్నింటినో చెక్కారు. ఇక్కడే ఒక ఇనుప స్తంభముంది. "విష్ణుదేవుని ధ్వజం" అని దానిపై చెక్కి ఉంది. దానిని ప్రాచీన వైభవానికి, అధికారానికి చిహ్నంగా భావించుతారు.

"తననుండి ప్రసరించు పరిమళ వాయువులవల్ల దక్షిణ మహాసముద్రమునకు సుగంధ లాభము నేటికిన్నీ కలుగుతున్నది......"

ఈ భవనాలన్నీ రాతితో మహావైభవముగా కట్టినవి. ఇవి నిరస్త భూషలై నిసర్గ సౌందర్య విలసితములైనవి. వీటిపై దేవతామూర్తులూ లేవు. కర, పదముద్రలూ లేవు. మొత్తానికి ప్రశాంతంగా ఉన్నాయి. వారు అంతా కలిసి కుతుబ్‌మీనార్ పైకి ఎక్కారు. రావుగారి పిల్లలు తమ ప్రజ్ఞను చూపడంకోసం గబాగబా మెట్లు ఎక్కారు. జాడీకూడా వాళ్ళతోపాటు మొదటి ఇరవై మెట్లు పరుగెత్తుకుంటూ ఎక్కిందికాని ఆ తరువాత ఆయాసంవచ్చి అడుగులు తడబడడం ప్రారంభించాయి. ఇంద్ర చీరకట్టుకోలేదు. కాని అక్కడి బడిపిల్లలందరివలె కమీజు, షల్వారు తొడుక్కుంది. ఇవి తెల్లగా ఉంటాయి. ప్రతిరోజు వీటిని ఉతికి ఆరవేస్తారు. చొక్కా మోకాళ్లదాకా వస్తుంది. ఇంద్ర ఆనాడు నీలం దుస్తులు తొడుక్కుంది. వాటిమీద చలివేయకుండా ఉన్ని బనీను తొడుక్కుంది.

ఎలాగైతేనేం వారు కుతుబ్ మీనార్ మొదటి అంతస్తు ఎక్కారు. అక్కడ బయటఉన్న గుండ్రని పిట్టగోడదగ్గరకు వచ్చారు. ఆ పిట్టగోడ మీదకు ఆనుకుని నిలబడ్డప్పుడు జూడీకి తలతిరుగుతున్నట్టు అనిపించింది. క్రిందనున్న తోట, దానిలో తిరుగుతున్న మనుష్యులు, చిన్నగోధుమ రంగు ముఖాలతో పైకిచూస్తున్నారు. ఇంతలో దిలీప్ పైనుంచి అర చాడు. వాళ్ళు వెళ్ళవలసి వచ్చింది. పై అంతస్థులలోకి పోయిన కొలది జూడీకి కళ్ళు ఇంకా తిరగడం మొదలు పెట్టాయి. అక్కడినుండి చూస్తే పాత మొగలు చక్రవర్తుల గోరీలు, పునాదులు, గోపురాలు, కొన్ని పడిపోయినవి, కొన్ని బాగాఉన్నవి అన్నీ కనబడుతాయి. దూరాన ఢిల్లీనగరం విస్తరించి ఉంది.

తనకు ఇష్టంలేకపోయినా న్యూఢిల్లీనగరం పరిశుభ్రంగా ఉంటుం దని జూడీ అంగీకరించవలసి వచ్చింది. స్వేచ్ఛగా ఎక్కడికిపడితే అక్క డకు వెళ్ళవచ్చు. హాయిగా కావలసిన సరుకులు కొనుక్కోవచ్చు. ఇంక మిఠాయిల సంగతి సరేసరి! బిచ్చగాళ్ళు ఉండరు. రోడ్లమీద అల్లరిచిల్లరగా తిరిగే ఆవులు, గేదెలు కనబడవు. అలాగే బక్క చిక్కిన బడుగు మానసులు రొప్పుతుంటూ తొక్కేరిక్షాలు కనిపించవు. వీటికి బదులు నలుగురు కూర్చోడానికి వీలుగా ఉండే మూడుచక్రాల మోటారు సైకిలు రిక్షాలు ఉన్నాయి. మామూలు టాక్సీలు మోటారుకారులు చాలా ఉన్నాయి. ఒకసారి జూడీ రావుగారిభార్యతో కలిసి ఎక్కడికో వెళుతుండగా ప్రభుత్వంవారి కారు ఒకటి రోడ్డుకు అవ్వలివైపున పెద్ద క్రిందబారుకప్పుకల భవంతి ముందు ఆగింది. దానిలోనుండి పొడుగాటి ముదురు గోధుమరంగు కోటు తొడుక్కొని ఎర్రగులాబీపువ్వును అలంక రించుకొని ఒకాయన బయటకు దిగివచ్చారు. "ఆయనే ప్రధానమంత్రి" అంది రావుగారిభార్య. అంతలో తాను అనుకుంది "భగవంతు డాయనను

కాపాడుగాక" అని తనలో తాను గొణుగుకొంది. "నెహ్రూ అంటే ఈయనే అన్నమాట" అనుకుంది జూడీ. ప్రధాని నెహ్రూను గురించి తనతండ్రి ఎంతో చెప్పారు. ఆయన ఎంతో అందంగా ఉన్నాడు. అయితే విచారభారంతో క్రుంగిపోతున్నట్టు కనబడుతున్నాడు. మొత్తానికి కరుణార్ద్ర హృదయుడుగా కనబడుతున్నాడు. దోవతప్పిపోతే దోవచూపవలసిందని, ఇట్టివారినే అడగబుద్ధి అవుతుంది. సైనికదుస్తులు ధరించిన ఒక మనిషి ఆయనకు చేయెత్తి నమస్కరించాడు. ఎర్రగులాబి ధరించిన అవ్యక్తి లోపలికి వెళ్ళారు.

ఆ తరువాత ఆదివారంనాడు జూడీ, ఆమెతండ్రి డాక్టర్ రావు గారి కారులో ఎక్కడికో వెడుతున్నారు. కారును డాక్టర్ రావు స్వయంగా నడుపుతున్నారు. అప్పుడు జూడీతండ్రి అన్నారు. "జూడీ, లక్ష్మితండ్రి కుమార్‌కు కొంచెం ఉపకారం జరిగేటట్టు కనబడుతోంది. ఇక్కడివారికి ఆయన సంగతి కొంత తెలిసినట్లుంది. ఇక్కడ కేంద్రంలో ఆయన శత్రువులకు అంత పలుకుబడి ఉన్నట్టులేదు."

జూడీకి ఆయన చెబుతున్నదేమిటో అర్థంకాలేదు. అయితే సర్వమూ చక్కబడుతున్నట్టే అనిపించేది. "నేను వెళ్ళేలోగా లక్ష్మిని ఇంకొకసారి చూడవచ్చునన్నమాట" అంది.

"ఆహా! అలాగేలే అమ్మా!" అన్నారు ఆయన. ఆ తరువాత డాక్టర్ రావుతో చెప్పారు. ఢిల్లీ ఆ పాతకళాశాలను, స్మారకమంది రాలు, ఆ చెట్టుక్రింద నున్నటిరాళ్ళు, ప్రశాంత వాతావరణం అంతా నాకు ఆక్స్‌ఫర్డ్ ఆశ్రమానం జ్ఞాపకం వస్తోంది.

"అవును" అన్నారు డాక్టర్‌రావు. ఆయనకూడా ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకున్నారు. ఈ తోటలన్నింటిని పుస్తకాలు చేతబట్టుకుని పనికి వచ్చే విద్యార్థులు పూర్తిగా వినియోగించుకుంటున్నారు.

ఇంతలో జూడీ తండ్రి వచ్చిన సమావేశం ముగిసింది. అక్కడి నుంచి వారు ఆమె తండ్రికి మరొకమిత్రుని ఇంటికివెళ్ళారు. ఆటవీశాఖ ఉద్యోగి, వారు ఒక పెద్ద బస్సులో ఎక్కి ప్రయాణం చేశారు. దోవ అంతా బస్సు కుదుపుతోంది. దానినిండా మైత్రీ భావంతో కూడిన వారే తోడిప్రయాణీకులు. జూడీతోసహా ప్రయాణీకులందరూ వేయించిన బటాణీలు, నారింజపళ్ళు తిన్నారు. రోడ్డుపొడుగునా ఒంటెలు కనిపించాయి. బర్రెలుచాలా ఉన్నాయి. సవారీ గుర్రాలు స్వల్పంగా ఉన్నాయి. ఈ ఒంటెలు చాలాభాగం పంచదార ఫ్యాక్టరీలకు చెరుకును చేరవేసే బళ్ళను లాగుతున్నాయి. ప్రతిచోట పచ్చని చేలు, గోధుమచేలు అప్పుడే కంకులువేశాయి. అనేకవందల ఎకరాలలో ఆపరాలు, బటాణీలు చల్లారు. పైరుఏపుగా నవనవలాడుతూ దట్టంగా పెరుగుతోంది. గ్రామాలలో దిట్టంగా కట్టిన మట్టిఇళ్ళు ఉన్నాయి. ఇక్కడి చలికి కొబ్బరి తాటిచెట్లు పెరగవు. చెట్లుచాలా ఉన్నాయి. కొన్నికొన్ని చెట్లను నరికి దుంగలు పోగుపెట్టారు. ఇంతలో బస్సులు ఆగేచోటు వచ్చింది. ఆమె తండ్రిగారి మిత్రుడు ఆ అటవీశాఖోద్యోగి వచ్చాడు. సన్నగా, బక్కపలచగా చామన చాయగా ఉన్నాడు. వీరిని చూడడానికి ఎంతో సంతోషించిన వాడులా కనబడ్డాడు. ఆయనా దక్షిణాది నుంచి వచ్చినవాడే. మద్రాసు కబుర్లు వినడానికి ఎంతో కుతూహలం చూపించాడు. వారంతా కలిసి కారులో కొండపైకి వెడల్పైనబాట వెంట ఎక్కారు. "పాళి" చెట్లు చాలాఏపుగా అందంగా ఎదిగాయి. అబ్బే వాటి దేముంది, నాటేకు తోటను చూడాలి గాని అన్నాడు ఆయన.

ఆయన భవంతి అనేకమైన చెట్లు పొదలుఉన్న పెద్ద తోట మధ్య ఉంది. వాటిల్లో చాలాభాగం ఇంకా పూతవేయలేదు. కాని

ఒక బూరుగుచెట్టుమాత్రం ఎర్రటి పువ్వులతో చూడముచ్చటగా ఉంది. ఆ తరువాత దానినుంచి రాలిపడిన వాటిని పక్షులు పొడుచుకొని తింటూ ఉండడాన్ని జాడీ గమనించింది. పెద్దగదిలో ఇటికల పొయ్యిమధ్య చక్కని పరిమళం వెదజల్లుతూ మండుతున్న పొయ్యిలో వేసిన కట్టె లేమిటో తెలుసుకోవాలని జాడీ అనుకుంది. జాడీ భవంతిచుట్టూ దొడ్డి అంతా పరుగెత్తింది. అక్కడ వెనుకవైపున రెండు ఏనుగులున్నాయి. అవి చెవులతో నెమ్మదిగా విసురుకుంటున్నాయి. తొండాలు పైకెత్తి తమ ముందున్న పచ్చగడ్డి నోటినుంచి కట్టలు తీసుకు తింటు న్నాయి. జాడీ దగ్గరకు వెళ్లి చూసింది. వాటి రెండు కాళ్లకు గొలుసులు వేశారు. తేలికగానే వేశారు, ఎక్కడికీ కదలరాదని వాటికి గుర్తుగా. పెద్దవేపచెట్టు నీడను అవి ఎంతో హాయిగా, ఠీవిగా నిలబడి ఉన్నాయి. వాటి ముఖాల మీద ఏవో గుర్తులు వేశారు కాని దేవాలయపు ఏనుగులవలె కాదు. వాటి కళ్లచుట్టూ కాటుకవలె కనుపించే నల్లనిపూత ఏదో పెట్టారు. వాటినుదురుమీద ఏనుగులజాతి పెట్టుకునే బొట్టువలె ఎర్రని నక్షత్రపు గుర్తులున్నాయి. వాటితలమీద చక్కని నల్లని టోపీలు అలదారు. జాడీ పెద్దగా ఊపిరి తీసుకుంది. గట్టిప్రయత్నం మీద హిందీ పాఠాలను జ్ఞాపకం చేసుకుంది.

మావటివాడు ఎంతో సంతోషించినట్టున్నాడు. ఎన్నెన్నో సలాములు పెట్టాడు. ఏదో కొల్లేటి చాంతాడువంటి పెద్ద వాక్యం చెప్పాడు. కాని అందులో కొన్నిమాటలే జాడీకి అర్థం అయ్యాయి. మొత్తానికి వాడికి వచ్చిన ఇంగ్లీషుతోను, ఆమెకు వచ్చిన హిందీతోను వారుభయులూ బాగానే కాలక్షేపం చేశారు. వాడు వాటిల్లో పెద్ద ఏనుగకు హౌదా బిగించాడు. తాళ్లు బిగించేటప్పటికి అది మోకరించి కూర్చుంది. జాడీ దానిపైకెక్కి కూర్చుంది. తోకపట్టుకుని వెనుక కాలు మీదుగా పైకెక్కింది. ఆ ఎక్కేటప్పుడు ఏనుగను మృదువుగా

తట్టింది. ఏనుగ దానిని పట్టించుకోదనుకుంది. అంతట ఆ ఏనుగ లేచింది. అది లేచేటప్పుడు హౌదా పడకలా ఊగిపోయింది. దాని స్తంభాన్ని ఆనుకుని ఆకులకూ, పత్తులకూ, అందుబాటులోకి వచ్చి నందుకు జూడీ ఎంతో సంతోషించినట్టు కనబడింది.

ఉత్తరాదిని అందరూ ప్రతిరెండేసి గంటలకూ తేనీటిని సేవిస్తూ ఉంటారు. అలాంటి తేనీటినే తనతండ్రి, అటవీశాఖోద్యోగి సేవిస్తూ ఉండగా ఏనుగనెక్కి జూడీ అటువైపు వసారాకు దగ్గరగా వెళ్ళింది. ఆమెతండ్రిమాచి పకపకా నవ్వాడు. ఇంతలో అటవీశాఖోద్యోగి వచ్చి జూడీ ఎక్కినది ముసలి ఆడఏనుగఅనీ, దానికి నూరేళ్ళు వయస్సు అని చెప్పాడు. కొలంనాడు అది గొప్ప షికారి ఏనుగ అని చెప్పారు. కావలిస్తే చూడండి, అంటూ దాని మెడమీద పులిగోళ్ళ గుర్తులు చూపించాడు. ఏనుగ ఆయనకేసి తిరిగి తనతొండాన్ని అందించింది. "చూడండి నాపని అస్తమానం తనకు కావలసింది సమకూర్చడమే అనుకొంటోంది ఈ ఏనుగు" అన్నాడు ఆయన ఆప్యాయంగా. లోపలికి ఎవరినో పంపించి కొబ్బరికాయ తెప్పించాడు. దానిని ఏనుగ ఆపళంగానే, ఏకంగానే నోట్లో పెట్టుకొని పటపటా నమిలివేసింది. సవారీ అయిన తరువాత ఆయన జూడీకి పెద్ద చెఱుకుగడను ఇచ్చాడు. ఏనుగకు ఇదంటే చాలా ఇష్టం.

ఈ ఏనుగ పని అడవిలో దుంగలను ఈడ్వడం, మోసుకురావడం. అయితే ఎల్లప్పుడూ ఇలాగే జూడీని వీపుమీద ఎక్కించుకొని ప్రత్యేక బహుమతులు పొందడమే దానికి చాలా ఇష్టమనిపించింది. ఈ ఏనుగ ఇతర అడవి ఏనుగులవలెనే ఎంతో హాయిగా ఉందని జూడీ అనుకుంది. అంతా అయ్యేసరికి ఈ ఏనుగ తన్ను గుర్తుపట్టిందనే అనుకుంది. అంతే కాదు. హిందీ మాటలు కొత్తగా చాలా నేర్చుకుంది. అవి అన్నీ ఏనుగలను గురించే.

14. వీడ్కోలు కాదు

పాన్నేరిలో పరిస్థితులు ఎన్నటికీ మారనట్టే అనిపించేది. జాడీ ఎవ్వరితోనూ ఏమీ చెప్పనని వాగ్దానం చేసినప్పటికీ, అమ్మణిపాటితో ఉన్నదున్నట్టుగా అన్నీ చెప్పే ఉంటుందేమోనని లక్ష్మి అప్పుడప్పుడు అనుకునేది. తనబడిని మామూలుగానే సాగించేది. కాని తాకీపనివాని కుమార్తె అయిన వల్లికి పెళ్ళిఅని నలుగురూ చెప్పుకున్నారు. పెళ్ళి అయిన తరువాత ఆమెను భర్త ఇంక ఇక్కడ ఉంచడని కూడా అనుకున్నారు. చదువుకోవడానికి కొంచెం మంచి పుస్తకాలు ఉంటేనా? అందుకొరకు సంఘసేవకులను పుస్తకాల కోసం అడిగింది. వాళ్ళు ఏవో పుస్తకాలు ఇచ్చారు. కాని చాలా కఠినమైనవి. ఆమె తరగతికి మించినవి. ఎలాంటి వైతే వారు చదవడానికి ఇష్టపడతారో లక్ష్మికి తెలుసు. ఒక సారి విద్యావిషయికమైన చలనచిత్రం ఒకదానిని ప్రదర్శించారు. అందరూ వచ్చారు. నేలమీద చతికిలబడి చూచారు. తమలో తాము ఏవేవో మాట్లాడుకుంటూ ఎంతో ఆసక్తితో, ఆనందముతో దానిని చూచారు. బహుశా వయసుమీరిన ఆడవాళ్ళను ఆకర్షించడానికి అదొక్కటే ఉపాయం అనిపించింది.

పొంగలిపండుగనాడు ఆవులకు, ఎద్దులకు కొమ్ములకు పూసిన రంగులు వెలిసిపోయాయి. అప్పట్లో వాటికి కడుపునిండా మేత పెట్టామన్న సంగతినే ప్రజలు మరచిపోయారు. ఆ తరువాత వరిచేలు కోశారు. కుప్పనూర్పులుకూడా అయిపోయాయి. గడ్డిమేట్లు వేయించుకున్నారు. లేకపోతే నడివేసవిలో పశుగ్రాసం దొరకడం కష్టంకదా. పంటకాలవల వెంట నీరు కొంచెం వస్తోంది. కాని అదిచాలదు. పూర్వంలాగే రైతులు పొద్దుపొడిచింది లగాయతు పొద్దుకూకేవరకు పొలంలో పాటుపడుతూనే ఉన్నారు. ఆడవాళ్ళు సేడపోగుచేసి పిడకలు తరచి, ఎండబెట్టి గూళ్ళ

కడుతూనే ఉన్నారు. కుటీర పరిశ్రమలనుండి కొంచెంగా డబ్బు గిడుతూనే ఉన్నది. ఒకవేళ కరువేవస్తే ప్రజలు నెమ్మది నెమ్మదిగా చచ్చిపోయేవారు. కొంతమంది ఆడవాళ్ళకు మరికొన్ని వెండిగాజులు ఉండేవి. మరికొన్ని ఇళ్ళల్లో కొంచెం బట్టలు ఎక్కువగా ఉండేవి. ఒకటిరెండు కుండలు, దీపాలు ఎక్కువ ఉండేవి. మూడవ పంచవర్ష ప్రణాళిక ముగిసే సరికి వీరు మరింత సంపన్నులు కాకపోయినా, వీరి దారిద్ర్యమైనా కొంత తొలుగుతుంది, అని ఆశించవచ్చునా?

ఇంతలో పాపం సరస్వతికి జబ్బుచేసింది. వాళ్ల అమ్మ ఇంట్లో ఉన్న మందులన్నీ వాడి చూసింది. కాని అది సామాన్యజ్వరమా? వెంటనే తగ్గడానికి. ఆ మురికి కాలవ నీళ్ళలోదిగి బట్టలుదికి, కుండలు, మండలు కడగడం, మిగతా పిల్లలతో కలిసి చాలా సేపు నానడంవల్లనే అది వచ్చి ఉంటుందని వాళ్ళఅమ్మ అంది. సరస్వతి ఎంతో బాధపడుతూనే, కావచ్చునంది. పాపం ఇలాంటి పనులు ఎప్పుడైనా చేసిందా? ఏమన్నానా? వారు ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్ళారు. అక్కడ పరీక్షచేసి ఏవో కొన్ని మాత్రలు ఇచ్చి పంపించారు. వాటి ఖరీదు ఎంతో చెబితే తప్పక ఇచ్చివేస్తానని ఆవిడ పట్టుబట్టింది. ఊరికే ఇచ్చే వాటికంటె తప్పక మంచివై ఉంటాయికదా! కాని సరస్వతి జ్వరం తగ్గడానికి బదులు ఆరోజుకారోజు ఎక్కువై పోయింది. చివరకు లక్ష్మి ఒకనాడు వాళ్ల నాన్నగారితో అంది. "మనం ఇలా అహంభావంతో ఎంతకాలమని ఉంటాం! అందువల్ల చెల్లాయి చచ్చిపోవడంతప్ప మరేమి అవుతుంది? మీరు అమ్మణిపాటీకి ఉత్తరం వ్రాయండి. మీరు వ్రాయక పోతే నేనైనా వ్రాస్తాను. సరస్వతిని తక్షణమే మద్రాసుకు తీసుకు వెళ్ళి జూడీతండ్రి పనిచేస్తున్న ఆస్పత్రిలో చేర్పించండి".

కుమార్ తన కుమార్తె ముఖంలోకి చూచాడు. ఆమె తల్లి తరఫున మాట్లాడుతోందని తెలుసుకున్నాడు. వాళ్ళు చెప్పిన సలహా సరియైనదే నని, తాను ఓడిపోయానని తెలుసుకున్నాడు.

"అలా ఉత్తరం వ్రాస్తే అమ్మణ్ణిపాటీ మిమ్మలిని అందరినీ తక్షణం అక్కడికి పంపించి వెయ్యమంటుంది. నాకు తెలుసు. అమ్మా, నువ్వు అంతా వెళ్ళాలి.

"మరి మీ మాట ఏమిటి ?"

ఆయన దూరంగా శూన్యంలోకి చూశాడు. "నేను ఇక్కడే ఉండాలి. నాకు ఉన్నపని ఇది ఒక్కటే. నేను ఓపినంతవరకు మీకు నెలనెలా డబ్బు పంపుతాను. ఇక్కడ ఉండటమంటే మీ అమ్మకు మొదటినుంచీ అసహ్యమే. ఆమె ఇప్పుడు బాగా వయస్సుమీరినదాని వలె కనబడుతోంది. ఇప్పుడు అసలు పాడటమే మానివేసింది."

"మరి మీరు ఒక్కరూ ఉంటారా ?" లక్ష్మి అంది "మీకు వంట ఎవరుచేసి పెట్టుతారు ?"

"నేనా ? నా తిప్పలు నేను పడతాను. ఎలాగో గడుపుకుంటాను. ప్రేమించిన వాళ్ళను బాధపెట్టడంకంటె ఒంటరిగా బాధపడడమే మంచిదికదా ?"

"నాన్నా, మీరు చేసినదాంట్లో తప్పేమీలేదు. మీరు ఉంటే నేను ఉండిపోతాను" అంది లక్ష్మి.

"అమ్మలేకుండా నీవు ఉండలేవు. కనీసం మరొక ఆడతోడు అయినా ఉండాలి......"

కాని లక్ష్మి ఆయన సంకోచిస్తూ ఉండడాన్ని గమనించింది. తన చీరెను చక్కగా కుచ్చిళ్ళు పెట్టుకుని సర్దుకుంది. "నాన్నా నేను తప్ప

కుండా ఉండగలను. నేను ఆధునిక యువతిని. తెలివైనదానిని. నేను ఆధునిక భారతనారిని కావలెననే కదా మీ ఆశ. పైగా మిగతా వాళ్ళవలె నేను వెళ్లడం అంటే మాటలుకాదు. నేనూ ఇక్కడ పని చేస్తున్నా కదా!"

"నీ కెంత ధైర్యం బిడ్డా!" అన్నారు కుమార్. "నీ ధైర్యం మెచ్చుకోదగిందే. కాని ఆలోచించు నీవు కనుక మద్రాసు వెళ్ళగలిగి నట్టయితే మళ్ళీ బళ్ళోచేరి చదువుకోవచ్చు. మళ్ళీ నృత్యం నేర్చుకో వచ్చు. జూడీతోసహా మీ మిత్రులందరినీ మళ్ళీ కలుసుకోవచ్చు..."

"అన్ని సంగతులూ బాగా ఆలోచించే మాట్లాడుతున్నాను" అంటూ లక్ష్మి తనతండ్రి కళ్లలోకి నిశితంగా చూసింది. వెంటనే కాగితం, కలం తెచ్చి ఆయన ఎదుట పెట్టింది.

ఆయన నెమ్మదిగా వ్రాయడం మొదలుపెట్టాడు. ఏవో నాలుగు పంక్తులు బరికాడు. తరువాత చాలాసేపు వ్రాశాడు. వ్రాతముగించి ఉత్తరం లక్ష్మికి ఇచ్చాడు.

"నా అహంకారాన్ని చాలావరకు చంపుకున్నట్టేకదూ!" అన్నాడు.

లక్ష్మి ఉత్తరం అంతా చదివింది. "ఔను" అంది. సరస్వతి పడుకున్న గదికేసి చూసింది. అయితే నాన్నా, మీరు ఒక టెలిగ్రాం పంపమని వ్రాయవలసింది. అప్పుడు మనం ఒకబండిని కిరాయికి కట్టించుకొని "హూడలి" వద్దకు వెళ్ళేవాళ్లం. అమ్మకు ప్రయాణాలు చేయడం అట్టే చేతకాదు. మనం వాళ్లను ఆడవాళ్లకోసం ప్రత్యేకించిన రెండవతరగతి బండిలో పంపించుదాం. వాళ్లను చూస్తూ ఉండమని గార్డుతోకూడా చెప్పుదాం. అంతా బాగానే జరిగిపోతుంది. నేనుకూడా నా మనస్సు సరిపెట్టుకుని జూడీకి ఒక ఉత్తరం వ్రాస్తాను. అందులో

వాళ్లనాన్నగారు సరస్వతిని వెంటనే చూసేటట్టు చూడవలసిందిగా కోరుతాను.''

ఢిల్లీనుంచి తిరిగివచ్చేటప్పటికి లక్ష్మి వ్రాసిన ఆలేఖ జాడీకోసం వేచిఉంది. రాత్రి విమానంలో తిరిగివచ్చిన తరువాత ప్రొద్దుటే ఫలహారం చేస్తూ జాడీ ఆ ఉత్తరాన్ని చదువుకుంది. బొప్పాసిపండు ముక్కలు, నిమ్మకాయ, గోవా వడ్డించారు. కాని గోవాలు ఢిల్లీలో ఉన్నంత పెద్దవిగా లేవని జాడీ అంది. ఢిల్లీలో నిజంగానే చలి ఎక్కువగా ఉందని వాళ్ళఅమ్మకు వివరించి చెబుతోంది. ఏనుగులనుగురించి, ఒంటె మృగాలను గురించికూడా చెప్పింది.

లక్ష్మి తన ఉత్తరాన్ని ఎంతో హుషారుగా మొదలుపెట్టింది. ముఖ్యమైన సంగతి సరస్వతిని గురించి తరువాత వ్రాసింది. అందుచేత మొదట్లో ఆ ఉత్తరం ఎంత ముఖ్యమైనదో జాడీ గ్రహించలేక పోయింది. జాడీ ఆ ఉత్తరాన్ని తన తండ్రిగారికి అందించింది. ఆయన కాఫీ త్రాగుతున్న వాడల్లా మానివేసి, భారతదేశంలో పారిశుద్ధ్యపు ఏర్పాట్లనుగురించి ఆసహ్యించుకోవడం మొదలుపెట్టారు.

ఇంతలో హఠాత్తుగా ఎవరో లోపలికి వచ్చారు. తల ఎత్తి చూస్తే అమ్మణ్ణిపాటీ. ఆవిడ జాడీతండ్రికి నమస్కారం చేసింది. జాడీతల్లి ఆమెకు ఒక కప్పు కాఫీ అందించింది. ఆవిడ వాతావరణాన్ని గురించి కొంచెం ఆదుర్దాగా ప్రసంగించడం మొదలుపెట్టింది. ఇంతలో జాడీ అంది "నాకో ఉత్తరం ఇప్పుడే వచ్చింది. ఇంతకీ వాళ్ళు వచ్చారా!''

"ఔను.'' అంది అమ్మణ్ణిపాటీ. "పాపం. మా మనవరాలు సరస్వతికి ఒంట్లో బాగాలేదట.''

"ఇప్పుడే వస్తాను" అన్నారు జూడీ తండ్రి. కొంత హడా వుడి అయిన తరువాత సరస్వతిని ఆస్పత్రిలో చేర్చారు. త్వరలోనే ఆమెకు వచ్చిన జబ్బేమిటో తెలుసుకున్నారు. జూడీ సరస్వతిని చూడడంకోసం ఆస్పత్రికి వెళ్ళింది. ఆమెకోసం పిప్పరమెంటు బిళ్ళలు తీసుకు వెళ్ళింది. కొన్ని బొమ్మల పుస్తకాలు పట్టుకువెళ్ళింది. పాపం సరస్వతి చాలా చిక్కిపోయి క్రుంగిపోయింది. కాని అక్కడ వర్సులుమాత్రం ఆమెను ఎంతో ఆపేక్షగా చూస్తున్నారు. త్వరలోనే అంతా నయమై పోతుందన్నారు. "అక్కడ లక్ష్మి ఒక్కర్తే తన తండ్రితో ఉండిపోయింది." అంది అమ్మణ్ణిపాటీ. "కాని అలా ఉండ డం భావ్యంకాదు......"

ఇంట్లో అందరూ వెళ్ళిపోయిననాడు సాయంత్రంపూట లక్ష్మి కొంచెంగా ఏడ్చింది. స్టేషనులో తనతల్లి అంతగా ఏడ్చింది కనుకనే లక్ష్మికీ ఏడుపు వచ్చింది. రైలుకదిలేటప్పుడు కూడా కిటికీదగ్గర కూచుని ఆవిడ కళ్ళ నీళ్లు పెట్టుకుంది. కుమార్, లక్ష్మి ఇద్దరూకూడా హుషా రుగా ఉండడానికి ప్రయత్నించారు. కాని ఇంటికి వెళ్ళేటప్పుడు దుఃఖం ఆపుకోలేక పోయారు. అంతేకాదు, వాళ్ళనాన్నగారు అనుకున్నట్టే అయిందనుకుంది. ఒకవిధంగా చూస్తే లక్ష్మి తప్పకుండా మద్రాసు తిరిగి వెళ్ళాలనుకుంది. పాత జీవితాన్ని కోరుతుంది. పాత మిత్రుల సాంగత్యాన్ని మనసారా వాంఛించింది. మళ్ళీ నృత్యం నేర్చుకోవడానికి కావలసిన డబ్బును అమ్మణ్ణీపాటీ ఎలాగో అలాగ సంపాదించేది. అయితే ఆపనిచేయడం ఎంతవరకు సమంజసం? ఆరుమాసాలక్రితం నేను డబ్బునుగురించి ఇలా ఆలోచించేదాన్నేనా? అయితే ఇప్పుడు నేను పెద్దదాన్ని అవుతున్నానుకదా. ఇప్పుడు అనేకసంగతులు నాకు అర్థం అవుతున్నాయి.

ఇంతలో ఆమె ఆలోచన ఇంకొకదానికేసి మరలింది. ఆలోచించడానికి ఇతర విషయాలు ఎన్నిఉన్నాయో ఆమెకు తెలిసివచ్చింది. వంట అంతా తనే చేసింది. వాళ్ల అమ్మ ఉన్నప్పుడు అన్నీ ఆవిడే చేసేది. తమ్ము ఎవ్వరినీ ఏమీచేయనిచ్చేదికాదు. వాళ్లంతా ఆవిడ ఆశించినంత మంచిగా ఉండేవారుకాదు. కాని వాళ్ల నాన్నగారు మాత్రం అన్నీ బాగానే ఉన్నాయనేవారు. సాయంత్రంవేళ ఇప్పుడు ఆయన తన పనిని గురించి, ఆమె బడిని గురించి మాత్రమేకాక ఇతర విషయాలను గురించికూడా మాట్లాడేవారు. ఒక్కొక్కసారి తాను యూరప్‌లో నేర్చుకున్న విషయాలనుగురించి, చరిత్రనుగురించి, రాజకీయాలనుగురించి మాట్లాడేవారు. ఒకటి రెండువారాలలో ఆయన లక్ష్మికి బీజగణితాన్ని, చాలవరకు క్షేత్రగణితాన్ని నేర్పారు. ముఖ్యంగా బడిలో ఆమె సహాధ్యాయు లెవ్వరూ నేర్చుకోజాలనంత హెచ్చుగా నేర్పారు. ఒకటి రెండుసార్లు సాంఘికసంక్షేమశాఖకు చెందిన కార్యకర్తలు ఒకరిద్దరు తేనీటి సేవించడంకోసం వచ్చారు. లక్ష్మి వారిని గ్రామసేవిక పొందవలసిన శిక్షణను గురించి, అందుకు ఉత్తీర్ణులు కావలసిన పరీక్షను గురించి అడిగింది.

ఒక్కొక్కసారి ఆమెకు తన వయోజన తరగతులతో పేచీ వచ్చేది. కేవలం పేచీపెట్టడంకోసమే అన్నట్టుగా ఒక ఆవిడవచ్చేది. అయితే ఆ సంగతి లక్ష్మి ఎప్పుడూ ఆ సంఘ సేవకులకు చెప్పేదేకాదు. పొరుగూరినుంచి వచ్చే మోహిని తల్లి, ఆమె మేనత్త ఇద్దరూకూడా మంచి పట్టుదలతో, ఎప్పుడూ హుషారుగా ఉండేవాళ్ళు. వాళ్ళు ఇద్దరూ వచ్చి ఈగయ్యాళితో మాట్లాడి వెళ్లారు. ఆ తరువాత ఆగయ్యాళి మళ్లీ బడికి రాలేదు. బడిలో మిగతా పిల్లలు అందరూ మంచివాళ్ళు. రోజూ శ్రద్ధగా బడికివచ్చి చక్కగా నేర్చుకొనేవారు.

మోహిని లక్ష్మి జడలోకని పువ్వులు తెచ్చేది. ఒకసారి కొన్ని తీపి పిండివంటలుకూడా తెచ్చింది.

ఇలా ఉండగా ఒకనాడు ఎండలో మధ్యాహ్నంవేళ ఒకకారు పొన్నేరికి వచ్చింది. అందులోనుంచి ఇద్దరు తెల్లనిదుస్తులు ధరించిన వారు దిగారు. వారిలో ఒకరిచేతిలో ఒక తోలుసంచికూడా ఉంది. వారు కుమార్ కోసం వెళ్ళేటప్పటికి ఆయన సర్వేకర్ర చేతిలో పెట్టుకుని, మేస్త్రీమీద కోపంగా కేకలు వేస్తున్నారు. ఆయన కాళ్ళనిండా చేతులనిండా కాలవబురద అంటుకొనిఉంది. ఆ వచ్చినవారు తాము ఎవ్వరో తెలియపరచి ఆయనతో కరచాలనం చేశారు. ఆయనతో కలసి ఆఫీసుకు వెళ్లారు. ఆ వచ్చినవారిలో ఒకడు అక్కడికి పెద్ద ఇంజనీరుతో ఏమేమో మాట్లాడాడు. ఆయన వీరిని చూడగానే లోలోపల కొంత మధనపడ్డారు. వెంటనే టీ, బిస్కట్లు, దస్త్రాలు, ప్రణాళికలు అన్ని తెప్పించి గబగబా మాట్లాడడం మొదలుపెట్టాడు.

ఆ తరువాత వాళంతాకలిసి కుమార్ ఇంటికి వెళ్లారు. ఆ వచ్చిన వారిద్దరూ లక్ష్మికి ఎంతో వినయంగా నమస్కారం చేశారు. కుమార్ అన్నాడు. "వారిద్దరూ తమతో నన్ను వెంటనే మద్రాసుకు రమ్మంటున్నారు. తక్షణమే బయలుదేరాలట. అయితే నువ్వెక్కడికి వెళ్లతావు? నిన్ను ఒంటరిగా వదలి వెళ్లజాలను."

లక్ష్మి తనచేతితో గొంతుక పట్టుకుంది. ఆమె గుండెలు నొక్కివేస్తున్నట్టు అనిపించింది. "నాన్నా, నిజమా? నిజమా? మీరు పులులతో పోరాటం సాగించారు?"

"నేనా? నా మిత్రులా?" ఆయన అన్నారు. "వారి గుండెలలో బాణాలు ఉన్నట్టు ఉన్నాయి. కాని నీవో - నేను ఒకటి రెండు రోజులలో......"

లక్ష్మి తన పెదవిని కొరుక్కుంది. తాను ఆఇంటిలో ఒకతే ఉండ దలచుకోలేదు. ముఖ్యంగా రాత్రి పూట అసలే ఉండలేదు. పైగా తన తండ్రి అక్కడ చాలామందితో వైరం తెచ్చుకున్నారు. వారంతా అవకాశం చిక్కితే పగతీర్చుకోవాలని పొంచి ఉన్నారు. అంతలో ఆమెకు మళ్ళీ ఇంకొక ఆలోచన వచ్చింది. 'నాకేంభయం' నాకు అనేక మంది స్నేహితులున్నారు. నేను వల్లి ఇంటికో, మోహిని ఇంటికో వెళ్లు తాను—ఓ. నేను కావాలంటే వెళ్లడానికి చాలాచోట్లు ఉన్నాయి!"

"పోనీ రెస్టుహౌసుకు వెళ్ళరాదా?" ఆ వచ్చినవారిలో ఒకడు సూచించాడు. లక్ష్మి తల ఎగురవేసింది.

ఆమె ఆ గ్రామంలో ఒక భాగం. ఆమెతండ్రి, స్నానంచేసి, దుస్తులు మార్చుకుని, తనకాగితాలన్నింటిని సంచిలో పెట్టుకొనేలోగా ఆమె తనబడికివెళ్ళి వారిని అడిగివచ్చింది. వారిలో చాలామంది తమతో ఉండమని ఆహ్వానించారు. చివరకు లక్ష్మి మోహినితో కలిసి పొరుగూరికి వెళ్ళడానికి నిశ్చయించుకుంది. మోహినితల్లి, మేనత్తల దగ్గర తాను ఎంతో సురక్షితంగా ఉంటాననుకుంది. తానుకూడా ఒక చిన్న పెట్టి సర్దుకుంది. తనకు విలువైనవి అన్నీ అందులో పెట్టుకుంది. మరి కొన్నింటిని మెడలో వేసుకుంది. ఇంకొనిని చేతులకు పెట్టుకుంది. వాళ్ళ ఇంటికి గొళ్ళెం పెట్టి తాళంవేసి బయలుదేరారు. కారులో లక్ష్మిని మోహిని తండ్రిగారి రెండుగదుల ఇంటివద్ద దించి వారు ముందుకు సాగి పోయారు. కుమార్ ఆమెకేసి చాలాదూరంవరకు చేయి ఊపుతూనే ఉన్నాడు.

ఒకటిరెండు రోజులు గడిచాయి. ఒక సాయంత్రం ఒక మనిషి ఎవరో టెలిగ్రాం తెచ్చిపెట్టాడు. అందులో "పులులు తిరుగు తున్నాయి" అనిమాత్రమే వుంది. లక్ష్మి ఎంతో ఉద్రేకం పరవశ అయి

పోయింది. తన తండ్రికి ఏమి జరిగిందో మోహిని తండ్రికీ, తల్లికీ తెలిస్తే ఎంత అప్రతిష్ఠ అనుకుంది. మద్రాసులో తన తండ్రిపై కత్తికట్టినవా రెవ్వరో వారికి తెలుసు. ఆ పేర్లను ఆమె ఎప్పుడూ వినలేదు. పెద్ద ఇంజనీరువచ్చి ఆమెకు ఒకపట్టుచీర, చాకలెట్ల పెట్టి బహుమతిగా ఇవ్వ బోయాడు. కాని లక్ష్మి వాటిని వినయపూర్వకంగా తిరస్కరించింది. తనతండ్రి దగ్గరలేనప్పుడు ఏమీ తీసుకోజాలనని చెప్పింది. ఆయన వెళ్ళి పోయిన తరువాత, గ్రామస్థులు వాటిని పుచ్చుకోకపోవడంలో లక్ష్మి మంచిపనే చేసిందని అన్నారు. తామే స్వయంగా లక్ష్మికి వెయ్యడా నికి పూలదండలు తెచ్చారు.

కాని మోహినిమాత్రం కొంచెంగా చింతించింది. రాత్రి వాళ్ళు ఒక్కప్రక్కమీదనే పడుకున్నారు. ఒకరాత్రివేళ మోహిని అంది. "లక్ష్మి, నీవు మళ్ళీ మీ ఊరుకు వెళ్ళిపోతావు. నీవు మళ్ళీ నాకు ఎన్నడూ కనబడవు"

"అబ్బే అలా ఎన్నటికీ జరగదు" అంది లక్ష్మి. "మిమ్మలిని ఎన్న టికీ వదలి పెట్టను". తను తప్పక తిరిగివస్తానని లక్ష్మి తన తల్లితండ్రుల మీద ఒట్టువేసి మోహినికి వాగ్దానం చేసింది.

నాలుగోరోజున మరొక కారు వచ్చింది-అది వాళ్ల చుట్టాలది. దానిని కుమార్ స్వయంగా నడుపుకుంటూ వచ్చారు. వెనుక సీటులో అమ్మణిపాటీ కూర్చొని ఉంది. ఆవిడ కిటికీ పట్టుకు కూర్చొంది. ఆవేశంతో ఆవిడనోరు ఆలాగే తెఱచుకు పోయింది. లక్ష్మి బయటకు పరుగెత్తుకు వచ్చింది. "పులులు పారిపోయాయి" అన్నారు కుమార్. "ఒకటి రెండు చిక్కాయి. మరొకటి కుంటుతోంది" ఆయన ఇంకా నీరసంగానే ఉన్నాడు. తల సరిగా దువ్వుకోలేదు. కొత్త చొక్కా తెచ్చుకోవడానికైనా ఆయనకు వ్యవధిలేక పోయింది. అయితేనేమి,

ఆయన ఉత్సాహంతో వెలిగిపోతున్నాడు. అప్పుడే బడివదలిన పిల్లవాడి వలె ఉన్నాడు.

"ఇప్పుడుమరి" అంది లక్ష్మి.

"ఇప్పుడు మనం సామానులు సర్దుకొని వెళ్ళిపోదాం! తరువాత ఈ కౌలుకు సరిగా త్రవ్వడానికి, గ్రామస్తులకు గొట్టపుబావులు రావడానికి నేను అన్ని ఏర్పాట్లు చేస్తాను" అన్నాడు ఆయన.

"నేను మీకు సాయంచేయడానికి వచ్చాను" అంది జాడీ. "ఒకగంటసేపు నీవు నాచోటులో మా నాన్నగారికి కుమార్తెవలె సాయంచేయి. నీవుకూడా వెళ్లి సామాను సర్దడానికి సాయంచేయి. నేను ఈలోగా నా బడికి వెళ్ళి పిల్లలందరిని పోగుచేసి వెళ్ళివస్తానని, మళ్ళీ తప్పక వస్తానని చెప్పివస్తాను".

"అయితే లక్ష్మీ" అంది అమ్మణ్ణిపాటి. "ఇప్పుడింక నీవు మద్రాసులో మనయింటికి వచ్చేస్తున్నావు. నా పాతజీవితం నాకు రాబోతున్నది. ఈ సంగతి నాకు తెలిస్తే నిన్ను అసలు వెళ్ళనిచ్చేదాన్నే కాదు. వాడున్నాడే! వాళ్ళఅమ్మకుకూడా ఏసంగతీ చెప్పని అహంకారి! ఏమైతేనేమిలే, అంతా అయిపోయిందిగా. నీవు ఇంక ఎప్పుడూ తిరిగి రావలసిన పనిలేదు".

లక్ష్మి ఏమీ అడ్డుచెప్పలేదు. కాని అంతా వినివిని నెమ్మదిగా ఇలాఅంది. "కాని అమ్మణ్ణిపాటీ, అంతా నువ్వు చెప్పినట్లే కాదు. గాంధీజీ చెప్పినట్లు గ్రామాలలో మన అవసరం చాలా ఉంది. నేను అందుకు ఎన్నుకోబడటం మంచిదే. బహుశా నేను బడిలో చదువు ముగించుకొని, కాలేజీ చదువుకూడా ముగించుకొని మళ్ళీవస్తాను. ఆ మేరకు నేను వాగ్దానం చేశాను కూడాను".

అమ్మణ్ణిపాటి లక్ష్మినొకసారి, ఆమె తండ్రి నొకసారి చూచింది. "నీవేమంటావు కుమార్" అంది.

ఆయన అన్నారు "భారతావనిలో అజ్ఞానమే ఒక పెద్దపులి. లక్ష్మికి కూడా పులులను వేటాడడం అంటే ఇష్టమే అనుకుంటాను. అలాంటిదానికి నాబోటివాడు వద్దని ఎలా చెప్పగలడు?"

"లక్ష్మి, నీవు నిజంగా తిరిగి రాగలనని వాగ్దానం చేసినట్టయితే రాక తప్పదు. ఎప్పుడో ఒకప్పుడు నేను పెద్దదాన్ని అయిన తరువాత భారత దేశానికి తిరిగి రాగలనని వాగ్దానంచేసి, ఆ ప్రకారం తిరిగివస్తే నా వలని ప్రయోజనం ఏమైనా ఉంటుందా?" అంది జూడీ. "లేకపోయి నట్లయితే మా దేశానికి తిరిగి వెళ్ళి పోయి నిన్ను ఎప్పటికీ చూడకుండా ఉండగలనా? అనే ఆలోచనే నన్ను క్రుంగదీసేస్తూ ఉంటుంది!"

"ఆహా! నీవు కావాలి మాకు" అన్నారు కుమార్. "ఇప్పుడింక బయలుదేరు. నాకుమార్తెగా ఉండు. ఇంటితలుపు తాళంతీసి అవసరమైనవేమో సర్దేద్దాం. మిగతావి ఇక్కడ స్నేహితులకు ఇచ్చేద్దాం"

అమ్మణ్ణిపాటి జూడీ చేయిపుచ్చుకుంది. ఇద్దరూ కలిసి తాళం వేసిన ఇంటిదగ్గరకు వెళ్ళారు. లక్ష్మి మాని చేయి ఊపింది. రోడ్డువెంట సాంఘిక సంక్షేమ కేంద్రానికి వెళ్ళింది. గ్రామాలలో స్త్రీలు, ఆడ పిల్లలు ఒక్కరొక్కరే వచ్చి తాత్కాలికంగా సెలవు తీసుకుని వెళ్లారు.

YDROIC 363
164

నయోమీ మార్గరెట్ మిచిసన్ ఆచార్య జె. బి. ఎస్. హాల్డేన్‌కు సోదరి. ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకుంది. సోదరుని వలె తానూ వైజ్ఞానిక వ్యాసంగం సాగించాలనుకుంది గాని చివరకు నవలలూ, ప్రాచీనకాలపు కథలూ వ్రాయడంలో బాగా పేరు సంపాదించుకుంది.

జూడీ-లక్ష్మి నవలకు ప్రాతిపదిక నేటి భారతదేశపు వాతావరణమే. మద్రాసులో కొంతకాలం ఉద్యోగరీత్యా ఉండవలసివచ్చిన ఒక బ్రిటిష్ వైద్యుని కుమార్తె జూడీ. ఆమె సహాధ్యాయిని లక్ష్మి దీనికి కథానాయికలు. వీరి ఉభయుల జీవితంలో ఒక ఏడాది సంఘటనలు దీని ఇతివృత్తం.

నయోమీ మిచిసన్ 1958 లో భారతదేశాన్ని సందర్శించింది. ఈదేశంలో కొన్నిమాసాలుండి ఇక్కడి పరిస్థితులను బాగా ఆకళింపు చేసుకుంది.

జూడీ భారతీయుల వేడుకలన్నింటిలోను ఎంతో సంతోషంగా పాల్గొంటుంది. భారత స్వాతంత్ర్య దినోత్సవం, దీపావళి, సంక్రాంతి పండుగల సంబరాలన్నింటినీ తిలకించి, వాటిల్లో స్వయంగా పాల్గొని ఎంతో ఆనందించుతుంది. వరద బాధితుల సహాయకృషిలో పాల్గొంటుంది. ఈదేశంలో వ్యాప్తిలోఉన్న ఉత్తరాది దక్షిణాది వాదాలను గురించి, పరస్పరం అపోహలను గురించి స్వయంగా తెలుసుకుంటుంది. ఇట్టి అపోహలవల్లనే లక్ష్మితో ఆమెమైత్రి చాలావరకు ధ్వంసమైపోతుంది. కథానాయికలైన ఈబాలికలిద్దరిమధ్య సమాన లక్షణాలు ఎన్నో ఉన్నప్పటికీ ఎవరికి వారేగా ఉండిపోతారు. ఎన్ని చెప్పినా జూడీ ఈ దేశానికి పరాయిదేకదా.

నయోమీ మిచిసన్ రచనలలో ఒకవిధమైన ఆప్యాయత, తన్మయమైన సానుభూతి కానవస్తాయి.

నిజానికి జూడీ-లక్ష్మికథ ఆలోచనామృతం. కథనం ఆపాతమధురం.

Check List

Book Number	YDROI C363	Date	29-4-23
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	cl, iv, vi, 162, 163.		
Missing Pages	NO		
Prepared By	ch. Rohith	Cutting By	Rohith
Scanned By	p. pragathi	Pages	173
Quality Checking	prathyu		